
రజనీ
ఆత్మకథా విభావరి

రజనీ

ఆత్మకథా విభావరి

రజనీ ఆత్మకథా విభావరి

ముద్రణ : 2012

కాపీలు : 500

ప్రతులకు :
సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్
బృందావనము, డో.నెం. 49-28-5,
మధురానగర్, విశాఖపట్నం - 16.
ఫోన్ : 0891-2735878, 9849996538

వెల : రూ. 200/-

ముద్రణ :
సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్
బృందావనము, డో.నెం. 49-28-5,
మధురానగర్, విశాఖపట్నం - 16.
ఫోన్ : 0891-2735878, 9849996538

రజనీ ఆత్మకథా విభావరి

విషయ సూచిక

1. కృతి సమర్పణ 1
2. పిఠాపురం - కుతుకులూరు 5
3. కుతుకులూరు 7
4. వాధూలస గోత్రస్థులు 9
5. తణుకు - బి.వి. రావు బ్రదర్సు 9
6. తణుకు - 1911 - ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయ స్థాపనము 12
7. ఆంధ్ర ప్రచారిణీ ప్రగతి (తణుకు నుంచి నిడదవోలు) 13
8. రజనీ జననం కథ 16
9. రాజమండ్రి - కాకినాడ 19
10. చెల్లాయి పుట్టుక - అమ్మ చుక్కల్లోకి 20
11. విరహ సంగీతం (1922) 21
12. కాకినాడకు మార్చిన కార్యస్థానమూ - కాపురము 23
13. ప్రణయగీతం 'ఏకాంతసేవ!' (ఏకాంత సేవ - 1) 24
14. మైమరపించిన 'ఏకాంతసేవ' (ఏకాంతసేవ - 2) 26
15. ఏకాంత సేవ - 3 28
16. ఏకాంత సేవ - 4 30
17. పిఠాపురం కాకినాడల మధ్య నా పెరుగుదల 32
18. పిఠాపురం కాపురం - ఆంధ్ర ప్రచారిణీ 34
19. అక్షరాభ్యాసం - ప్రాథమిక పాఠశాలలో చదువు 34
20. నా ఉన్నత పాఠశాల చదువు 35
21. పిఠాపురం నుండి గుంటూరు - మళ్ళీ పిఠాపురం 36
22. మారాజు మామయ్య - కుటుంబము 39
23. పిఠాపురం - జాన్సన్స్ క్లబ్ 42
24. అలనాటి పిఠాపురం - కొందరు కవిపండితులు 44
25. ఆంధ్ర ప్రచారిణీ విభజన 47
26. మా పెద్ద చెల్లాయి (కనకదుర్గ ఉరఫ్ అనురాధ) ఆలమూరు నుండి రాక 48
27. వరమ్మ జననం 49

28. ఆంధ్ర ప్రచారిణీ నిలయం మార్పు , మాయిల్లు 'పెళ్లివారి విడిది' 50
29. ఆంధ్ర ప్రచారిణీ సంక్షిప్త ఇతిహాసం (పరిచయం) 51
30. భ్రమర కీట న్యాయం 52
31. పిఠాపురంలో బందావారి నాటకాలు, పాటలూ 54
32. "అవీధి"లో అర్ధంకి వారికి అతిథిని నేను 55
33. అప్పుడప్పుడు జల్లంకివారి అతిథులం నేనూ అన్నయ్యా 56
34. అసెంబుల్డ్ రేడియా - 1 56
35. పిఠాపురం నుంచి కాకినాడ 57
36. అసెంబుల్డ్ రేడియో - 2 58
37. కాకినాడ నుండి వాల్తేరు (నేటి విశాఖపట్నం) 59
38. బెజవాడ గోపాలరెడ్డి గారి పెళ్లి, నవ్యసాహిత్య పరిషత్ కవులతో నా మద్రాసు ప్రయాణం 62
39. సాహిత్య కళా విద్వద్బంధువు : శ్రీ బెజవాడ గోపాలరెడ్డి 64
40. 7, అరుళమ్మాళ్ వీథిలో 67
41. బుద్ధవరపు వెంకట సుబ్బారావు మావయ్య స్మృతి 68
42. పాపాయికి భద్రానికి పెళ్లిముహూర్తాలు 69
43. ఆచార్య విస్సా అప్పారావు 71
44. "మా అబ్బూరి మాస్టారు - ఛందస్సుల్లో కొత్త మెలికలు" 72
45. బి.ఏ. ఆనర్స్ పరీక్ష - ఫస్టుక్లాస్ - మా వివాహము 75
46. నా తొలి ఉద్యోగం 77
47. మా చిన్నబావ (సాంబం) కుటుంబం 78
48. మద్రాసు ప్రయాణం - పాఠ్యగ్రంథ వ్యవహారం 79
49. జపాన్ బాంబు 81
50. మా అన్నయ్య నళిని పెళ్ళి - 1948 82
51. మా చిరంజీవులు - 1 83
52. మా సత్యం అన్నయ్య సన్యాసాశ్రమ స్వీకారం (1953) 84
53. మా చిరంజీవులు - 2 86
54. ఆనాటి మద్రాసు రేడియో - తెలుగు త్రిమూర్తులు 88
55. రేడియోలో నా మొదటి కార్యక్రమం 91
56. "కృష్ణదేవరాయ వైభవం" 92
57. అలనాటి మద్రాసు రేడియో డైరెక్టర్లు 94

58. అలనాటి మద్రాసు - రేడియో డైరెక్టర్లు - 2 97
59. రేడియోలో నా మొదటి నాటకం : చండీదాసు 100
60. శివరాత్రి - శ్రీశైలం 103
61. శ్రీగోపీచంద్ 105
62. సాలూరి రాజేశ్వరరావు 106
63. కున్నన్ రాజా 106
64. చెన్నపురి ఆంధ్ర మహాసభ స్త్రీల శాఖ 107
65. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, యక్షగానలకు ఆంధ్రమహిళా సభలో ప్రోత్సాహం.. 108
66. డా॥ చింతామణి దేశ్‌ముఖ్ 111
67. బాహిరాంగణ ప్రసారాలు 112
68. కృష్ణ - రజని 113
69. "కృష్ణరజని" - యక్షగానాలు 116
70. అడ్‌హాక్ ఎంపికలలో ఎక్జిక్యూటివ్‌లు 119
71. నా సినిమా వ్యాసంగం - 1 122
72. నా సినిమా వ్యాసంగం - 2 124
73. నా సినిమా వ్యాసంగం - 3 126
74. స్వాతంత్ర్య దినోత్సవం 129
75. నా ఢిల్లీ పయనం 130
76. డా. ద్వారం వెంకట స్వామినాయుడుగారి షష్ఠిపూర్తి 131
77. బళ్లారి రాఘవ 132
78. నా సకుటుంబ మైసూరు యాత్ర 133
79. లలిత సంగీత శాఖ నిర్మాణం 134
80. ఆప్యాయన హితవరులు : రావు బాలసరస్వతీ దేవి, వసుంధరాదేవి 136
81. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 138
82. రేడియో కేంద్రాలలో లలిత సంగీత సృష్టి 139
83. భక్తి "రజని" (భక్తి రంజని) 140
84. ఆదర గౌరవపాత్రులు రెవరెండ్ సోల్మన్ రాజు 142
85. ఆకాశవాణిలో మా పింగళి మాస్టారు 143
86. వేంకట పార్వతీశ్వర కవులలో పార్వతీశంగారి స్వర్గయాత్ర (1955) 145
87. శ్రీశ్రీ రేడియో నాటికలు 147

88. "గోరాశాస్త్రి విశిష్ట 'కలం' కారిత్వం" 149
89. ఢిల్లీ నుంచి మద్రాసు ట్రాన్స్‌మిటర్ ప్రసారాలు 152
90. ఆనాటి పిఠాపురం మహారాజా 155
91. ఆనాటి పిఠాపురం యువరాజా 159
92. డా॥ రాధాకృష్ణన్ 162
93. కేరళయాత్ర - 1, 2, 3, 4 163
94. హైదరాబాదు ఆకాశవాణి నాటక ప్రయోక్త నటకావతంస స్థానం నరసింహారావుగారికి గజారోహణోత్సవం 166
95. గాంధీజీ జీవితంపై ధ్వని ప్రకాశిని 167
96. వోలేటి 170
97. మానాన్నగారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీలో విశిష్ట సభ్యత్వ ప్రదానం ... 171
98. 1967 లో డార్జిలింగ్ జిల్లాలోని కర్షియాంగ్ ప్రయాణం 174
99. స్వామి ప్రజ్ఞానానంద 179
100. మానవల్లి రామకృష్ణకవి - లీలావతీ పరిణయం 179
101. మానవల్లి రామకృష్ణకవి - చతుర్భాణి 181
102. ఆంధ్ర ఉద్యమం (1971) 182
103. చలం కలం వెలుగులు (1971) 183
104. "రాగాలాపనా - వర్ణచిత్రవిలేపనా" 184
105. రా. సత్యనారాయణ 187
106. తిరుపతి వేంకటేశ్వర కళాపీఠ సారధ్యం నుండి ఆకాశవాణి, దూరదర్శన్‌లకు "ప్రొడ్యూసర్ ఎమెరిటస్"గా 187
107. మూసీపై వలపు వంతెన 188
108. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు (గోదావరి గుర్బి) 189
109. 'విశ్వనాథ' గురించి నా జ్ఞాపకాలు 191
110. శ్రీ బాలాంత్రపు వెంకటరావుగారి నిర్యాణం 193
111. పిచ్చివాళ్ళ పంచాయితీ 195
112. విశ్వనాథ కవితా వాహిని 196
113. ఆంధ్రీ కల్యాణి 196
114. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి 198
115. నా విదేశీ పర్యటన - ఇంగ్లాండ్ 199

116. నా అమెరికా యాత్ర 202
117. ప్రభంజన గీతి (తుఫాను పాట) 206
118. తన 78వ ఏట అనుకోకుండా మా అవిడ సుభద్ర కనుమూత 207
119. మా అన్నయ్య 'నళిని' - మహాప్రస్థానం 208
120. బి. నటరాజన్ (1988) 211
121. యక్షగాన ప్రక్రియ - ఆధునిక ప్రగతి 211
122. డా॥ పి.యస్.ఆర్. అప్పారావు 218
123. జంతునేస్తాలు 219
124. మా జంతునేస్తం - సీజర్ 220
125. శ్రీపాద పినాకపాణి - మధురపానక పాణి 222
126. వాగ్గేయకార సార్వభౌముడు - బాలమురళి 223
127. నవ్యసంగీతోద్యమం (లలిత సంగీత వికాసం) 225
128. సాహిత్య దృక్పథం - సారస్వతం 228
129. యంత్రమంత్రపూజనా, హఠయోగ సాధనా 230
130. అద్భుత ప్రాణిక (యౌగిక) చికిత్స 234
131. డా॥ వైజయంతి తో సంభాషణ 'నాది రజనీ కవిత్వం' 235
132. విశిష్టమైన రచనలు, సభలు, నృత్యగేయనాటికల ప్రదర్శనలు 239
133. సత్కారాలు - పురస్కారాలు 240
134. అపూర్వ సన్నివేశములు 243

రజనీ ఆత్మకథావిభావరి అనే పుస్తకానికి సంపాదకుడుగా పని చేస్తున్న మా బావ ఆచార్య దుగ్గిరాల విశ్వేశ్వరానికి నా కృతజ్ఞతా పూర్వక ఆశీస్సులను తెలియజేయడం నా విధ్యుక్త ధర్మంగా భావిస్తున్నాను.

బాలాంత్రపు రజనీ కాంతరావు

రజనీ ఆత్మకథావిభావరి అనే ఈ పుస్తకం సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్ వారిచే ముద్రింపజేసి వెలుగులోకి తీసుకురావడానికి ముఖ్యకారకులు ఆచార్య శ్రీ అయ్యగారి ప్రసన్నకుమార్ గారికి నా కృతజ్ఞతలు ఎంత చెప్పినా తక్కువే

బాలాంత్రపు రజనీ కాంతరావు

రజనీ ఆత్మకథా విభావరి

1. కృతి సమర్పణ

కృతికర్త : కళాప్రపూర్ణ బాలాంత్రపు రజనీకాంతరావు

కృతిభర్త : సాంఖ్యకీ భూషణ్ వక్కలంక రామచంద్రరావు

ఆత్మకథను వ్రాస్తున్నా, అష్టాశీతివయస్సున (88)
అదే వయస్సుగల మిత్రులయందు నాకు అనుగుడైన
ఆత్మబాల్యసఖుడవు నీవగుపించితి మనసందున
ఆ భావమ్ము మధించిన క్షీరసాగరపు పొంగులు

అన్నగ నా మామయ్యను
మన్నించిన సుబ్బరాయ మాన్యుడు నీకౌ
నన్న పెత్తలి కొమరుడు
తన్నే మా అమ్మ పిలిచె తమ్ముడ అనుచున్

నా పుద్యోగం ఖాయం
కావలెనని నిర్ణయించు 'కమిటీ' పిలువం
గా వచ్చి లోడి రోడ్డున
నీ వద్దకె తొలుత ఢిల్లి నే చేరితిగా !

ఢిల్లీ ప్రథమ దరిసెనం
బల్లక్ష్మన, మాచిరాజు, అల్లననీవున్

తొల్లి సహదర్శకులుగా
బిర్లా టెంపిల్ కుతుబ్మినార్లన్ గనమే !

ఢిల్లీ బదిలీకాగా
పిల్లలును సుభద్రనాదు వెంటను రాగా ,
ఇల్లు కరోల్ బాగ్ పడమటి
ఎల్లను కుదురంగ జేసితిమి కాపురమున్

లలితయును పిల్లలును మీ
యిలు పూసా మార్గమందు వెలయగడవరే !
లలితప్రకృతి దృశ్యమ్ముల
కలాలేపనముల నలువచెలువ కొలువదే!

ప్రణాళికా సమితికధిపతివి!
ప్లానింగ్ కమిషన్ సంధాతవు,
విదేశీరాయబార సభాపతివి,
భారత ప్రభుత్వ విధాన వచస్వివి!

నీపదవి 'ప్రొటొకాల్' నిజస్థితిని
నేనశక్నుఁడ, మాతృభాష నెరిగింప
వంకాయలపాటి వారి దౌహిత్రులు
రామమూర్తి ద్రోణంరాజు పౌత్రులు.

బాపిరాజుగారి ముగ్గురు పుత్రులు,
జ్యేష్ఠుడు వేంకటేశం రక్షణ తత్పరగూఢచారి!
మధ్యముడు బ్రహ్మకుమారి, బ్రహ్మచారి, బంగార్రాజు
తృతీయుడు హాల్డేన్ శిష్యుడు కృష్ణా ద్రోణంరాజు!
తాతయైన బంగార్రాజు కుమార్తె కామేశ్వరికి   పుత్రజ్యేష్ఠుడు
ప్రసారభారతి విశ్రాంత డైరెక్టర్ - అప్పారావు వఝ్ఝాది,
రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య సాంస్కృతిక పీఆర్వో
త్యాగయ్య తృతీయ సినీచిత్ర నిర్మాత - రమణమూర్తి!
ఈనాడు, (ఇటీవల అంతర్ధానమైన) అకాడమీలకు
ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధ్యక్షుడు!

విక్రమ్ సారాభాయి రోదసీ కేంద్ర విజ్ఞాని
రాధాకృష్ణ చాగంటి - ఒక అక్కయ్య కొడుకు
శంభుప్రసాద్ ఛామర్తి - మరో అక్కయ్య కొడుకు
భాభా అణుశక్తి కేంద్ర విజ్ఞాని
అంతా మావయ్యా అనే పిలిచేవారు - నిన్నూ, నన్నూ!

అన్నవరపు రామస్వామి అపూర్వ కితాబు
లందుకొన్న అభిరుచి సంగీత సభల
నందించిన నిజామాబాద్ / కరీంనగర్ డాక్టర్‌గా
మ్యూజిక్ థెరపీకి ఇష్టపడిన
అకాల కీర్తిశేషుడు - తమ్ముడు శేషు
రాంగ్ సోదరుడుగా మీ యింట జన్మించిన అర్విల్ రైట్,
విమాన నిర్మాణ పరిశోధకుడయిన శివరావు
వట్టినే కీర్తింపబడరు ఎవ్వరూ సెలెబ్రిటీస్‌గా!
వి.ఆర్.రావు సతీమణి శ్రీమతి వక్కలంక లలితా
ఆమె అక్క తిరుపతి కళాశాలాచార్య చాగంటి శారదా,
(ఆచార్య సి.ఏ.పీ. మూర్తి సతీమణి)
వారిద్దరి చెల్లెలూ, హైదరాబాద్ దూరదర్శన్
న్యూస్‌రీడర్ శోభాశంకరూ
ముగ్గురూ, ఫోలిక్ ఏసిడ్, హెట్రాజాన్, ఆరియోమైసిన్‌ల ద్వారా
ప్రపంచ ఖ్యాతి నందిన విజ్ఞాన శాస్త్రవేత్త
యెల్లాప్రగడ సుబ్బారావుగారికి తమ్ముడైన
న్యాయమూర్తి సత్యనారాయణ గారి కుమార్తెలే!
నీమట్టుకు నీవు సామాన్యుడవా రాముడూ
భారత కేంద్ర ప్రభుత్వ సాంఖ్య విద్యాసంస్థద్వారా
రెండువేల సంవత్సరాన, నవంబర్ మాసాన
అందుకొంటి వాజీవిత విశిష్ట గౌరవపురస్కృతి
సాంఖ్యభూషణ బిరుదముతో సన్మానితుడవయినావు

కృషివిద్యకు నీ ద్వారా లభించెను మహత్వపూర్ణ
సాంఖ్యయోగ గురుఘనత!

విశ్రాంతులకు మనకు తుది
నశ్రాంతము కలుగు వసతి యాలంబనమౌ
అశ్రమముగ వానప్ర
స్థాశ్రమ మొదవినది హైదరాబాదువనే।

(షష్ట్యంతం)

లలితా ప్రియవల్లభునకు
కలిత ధనువు చేతికర్ర (వాకింగ్ స్టిక్) కాకుస్థునకున్
అల శ్రీనివాస కులపిత,
కలశ్రీధర లవకుమార ప్రియజనకునకున్

అంకితమిత్తు నీకిదె మదాత్మ చరిత్ర కథావిభావరిన్
కొంకొక యింత లేక గయికొగదె, స్వీకృతి పక్కలంకవం
శాంకుర రామచంద్రుడ, విశాఖపురీ పరిరక్షకాత్మజా!
వంకలు లేని విద్య సహపాఠివి, పీఠపురిగా విశాఖలోగా!

- రజని

సర్వజిత్
మాఘపూర్ణిమ

హైదరాబాద్
(21-02-2008)

౨. పిఠాపురం - కుతుకులూరు

సీ॥ ఏ పట్టనము మ్రోల నేలేరు ప్రవహించు పృథివికి ముత్యాల పేరువోలె
మున్నూట యరువది మూర్తి భేదములతో విహరించు నే వీట వేల్పుపిండు
పీఠాంబ చెలి యోగపీఠి హుంకృతిదుర్గ ననిచి కాపుండు నేనగరికెలన
కుంతీ మహాదేవి కూర్మి మేనల్లుడు మాధవుండేవీట మరగినాడు"

తే.గీ॥ పెద్ద గవకులనేపుటభేదనమున నెలమినిలుచుండు వ్రీడా విహీన జఘను
డట్టి పేఠికాపురిజేర నరుగుదెంచె పరమశైవుండు శ్రీ పరాశరసుతుండు।

శా॥ అంతర్వాణి భజించె కుక్కుటపతిన్ హాలాహలగ్రీవునిన్,
శాంత స్వాంతుడు కొల్చె దానవ చమూ సంహారిణిన్ హుంకృతిన్,
చింతించెన్ ముని సార్వభౌముడు పురక్షేత్రాధి దైవంబులన్
కుంతీమాధవ పూజచేసె ఋషి, వాక్పుష్పోపహారంబులన్!

ఈ పై పద్యాలు శ్రీనాథ కవి సార్వభౌముని భీమేశ్వర పురాణంలోనివి. కాశీవిశ్వేశ్వరుడయిన పార్వతీశ్వరుని ఆనతి చొప్పున కాశీ వదలివస్తూ వేదవ్యాసుడు ఆంధ్రభూమిలోని గోదావరీ మండలం తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం అనే పుణ్యక్షేత్రాన్ని దర్శించి, ఆ దివ్యస్థలమునందు దక్షిణదిశనున్న రాజరాజేశ్వరీ ప్రాణేశుడైన కుక్కుటేశ్వరునీ, దానవసేనను మట్టుపెట్టిన హుంకారిణీ దేవి లేక పురుహూతికాశక్తినీ, ఆ తరువాత కుంతీమాధవ దేవునీ భక్తిశ్రద్ధలతో (వ్యాసుడు) పూజించడం వర్ణిస్తాడు మహాకవి శ్రీనాథుడు! (తన భీమ ఖండంలో)

మా అమ్మ శ్రీమతి బాలాంత్రపు వేంకటరమణమ్మగారి పుట్టిల్లు పిఠాపురం. ఆమెకు అభిజనమూ తాతగారూ అయిన పాలెపు పళ్లంరాజుగారు కాపురం ఉండే పేట ఊరికి ఉత్తరపు కొనకు కొంచెం ఈవల ఉన్న కుమారస్వామి ఆలయమూ, కోనేరూ ఉండిన కొత్తపేటలోని కుమార నగరం!

పాలెపు పళ్లంరాజుగారు అప్పటి పిఠాపురపు రాజావారయిన రావు గంగాధర రామారావు గారి దివాణంలో ఠాణేదారు. ఆ ఠాణేదారుగారిల్లు కుమారస్వామి ఆలయానికి కోనేటికీ ఎదురుగా తూర్పువైపు పోయే సందులలో రెండవ వీధిలో కుడివైపు ఉండేది

పాలెపు పళ్లంరాజు గారికీ ఆయన భార్య పద్దమ్మ (పద్మావతి) గారికీ ముగ్గురు కూతుళ్లు సూరమ్మా, సుందరమ్మ, రాజేశ్వరి లేక రాజమ్మ. సూరమ్మగారికి దుగ్గిరాల సుబ్బారాయుడుగారికీ,

ముగ్గురు కుమార్తెలూ ఇద్దరు కుమారులూ, పెద్దవియ్యమ్మ, చిన్న వియ్యమ్మ, వెంకటరమణమ్మా, అప్పారావు, పళ్లంరాజూ! పెద్దవియ్యమ్మని పిఠాపురానికి 4, 5 మైళ్ల దూరాన ఉన్న మంగితుర్తి గ్రామానికి కరణంగారయిన సత్యవోలు సుబ్బారాయుడు గారికీ, చిన్న వియ్యమ్మను మధ్వపంతులు గారయిన రేలంగి హనుమంతరావు గారికీ, వేంకటరమణమ్మను కుతుకులూరుకు చెందిన బాలాంత్రపు వెంకటనరసింహంగారి నాల్గవ కుమారుడైన బాలాంత్రపు వెంకట్రావుగారికి ఇచ్చి పెళ్ళిళ్లు చేసారు. స్వగ్రామం కుతుకులూరైనా, 1902 లోనే పిఠాపురంలో పెళ్ళిచేసికున్న వెంకట్రావుగారు తమ అన్నదమ్ములలో రెండవ, మూడవ, నాల్గవ సోదరులతో, వారి భార్యలతో కుటుంబాలతో కాపురం తణుకుకు మార్చారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకులోని అయ్యగారి నారాయణ మూర్తిగారు, ఆచంట సాంఖ్యాయన శర్మగారివంటి విశిష్టులైన సాహిత్య మిత్రులు వెంకట్రావుగారి సోదరుల సాహిత్యపిపాసను, కృషిని ప్రోత్సాహించేవారు

3. కుతుకులూరు

బాలాంత్రపు రజనీకాంతరావు, బుద్ధవరపు నాగరాజు

బాలాంత్రపువారికీ బుద్ధవరపువారికీ తొలి కుదుటిగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రపురం తాలూకాలోని కుతుకులూరు. కుతుకులూరు గురించి మా బావ కీ॥శే॥ బుద్ధవరపు నాగరాజామాత్యుడు రాసిన పద్యమూ, బాలాంత్రాన్ని గురించి నేను రాసిన పద్యమూ పాఠకులకు ఈ ప్రకరణలో పరిచయం చేస్తాను.

శ్రీ నాగరాజు పద్యము - కుతుకులూరి గురించి

ఆ.వె. మాదికుతుకులూరు, మా తాతకరణంబు
అదియు నిరువదవ శతాబ్దికాది!
పేరునాగరాజుగారు, నా పేరదే
వంశమెన్నబుద్ధ వరపువారు
పక్కనున్న రామవరముకు పిడపర్తి
గ్రామముల కొకపుడు కరణ మితడె!
మకుట మొకటిలేని మహరాజుగా ప్రజా
గౌరవాదరముల జూరగొనియె!
సప్తఋషుల ప్రవరసహితకాశ్యపగోత్ర
వరనియోగిశాఖ బ్రాహ్మణులము!

కవనమనిన రాజకార్యంబులన స్నేహ
ధర్మమనిన మాకు తగని ప్రీతి!
అరయసుబ్బరాయు డప్పలరాజును
నాగరాజునాయనతనయుండు
సుకృతిమల్లనకుడు సుబ్బరావునువంత
పూర్వ పురుష అతుల పుణ్యమతులు!

బాలాంత్రపు వారిని గురించి నా (రజని) పద్యం

శా॥ బాలాయంత్రము పూజచేసె నటమా వంశస్థుడేనాడొ ఆ
బాలాయంత్రమె యింటిపే రయెనుగా మాగ్రామ నామంబుగా
బాలాంత్రంబయె మాకు స్ఫూర్తి సకుటుం బంబందె జన్మించుటన్
బాలాంత్రానికి మున్సబుల్ వరుసగా మాల్పూడి (మల్లెపూడి) వంశస్థులే.

తొలిప్రకరణంలో బుద్ధవరపు (తొలి) నాగరాజుగారి సంతానం గురించి వివరించాను. ఒక్కొక్క తరాన బుద్ధ వరపు వారికి బాలాంత్రపు ఆయనో లేక బాలాంత్రపు ఆయనకు బుద్ధవరపు ఆయనో దౌహిత్రుడో, అల్లుడో, మేనల్లుడో అవుతూంటారు.

బుద్ధవరపు తొలి నాగరాజుగారి సంతానంలో జ్యేష్ఠుడైన వెంకట సుబ్బారావుగారి భార్య మహాలక్ష్మమ్మ మా మేనత్త మా చెల్లెలికి తరువాత భర్తయైన నాగరాజును కన్నది. మహాలక్ష్మమ్మ కుమార్తె సుభద్రాదేవి నాకు భార్య. ఆమెకు పెద్దన్నగారు నాగరాజు మా చెల్లెలు కనక దుర్గా ఉరఫ్ అనూరాధకు భర్త! తరతరానికి బాంధవ్యాలు మారుతూండవచ్చు.

బాలాంత్రంగ్రామ మునసబులైన మల్లిపూడియింటిపేరు పెద్దలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో మంత్రులవుతూ వచ్చారు.

మాది వాధూలస గోత్రము. ఋషులు - భార్గవ, వీతహవ్య మరియు సావేతస

4. వాధూలస గోత్రస్థులు

బాలాంత్రపువారు, కస్తూరివారు (నియోగులు)
కూచిపూడి వారిలో భాగవతులవారు,
శ్రీ వైష్ణవులలో కందాడైవారు, ద్రావిడులలో
వర్ధమానివారు, గంటివారు
మద్రాసు ఆంధ్రసమితి పురస్కార గ్రహీత హరి ఆదిశేషు
గారువాధూలస గోత్రికులు! మద్రాసు మ్యూజిక్
అకాడమీ పూర్వకార్యదర్శి డా॥ వి. రాఘవన్,
విజయవాడ రేడియో డైరెక్టర్‌గా ఎస్.డి గా నా తరువాత వచ్చిన వారిలో
పి. శ్రీనివాసన్ వాధూలస గోత్రికులు.

5. తణుకు - బి.వి. రావు బ్రదర్స్

కుతుకులూరిలోని బాలాంత్రపువారి సోదరులలో పెద్దాయన వెంకటసుబ్బారావు గారికి ఒంగోలు సబ్‌కోర్టులో నాజర్ ఉద్యోగం అయింది అది 1903 ప్రాంతం. వెంకటసుబ్బారావు గారికి కాకినాడ పొణుంగు పాటి వారి కుమార్తె వెంకట సుబ్బమ్మగారినిచ్చి పెళ్ళిజరిగింది రామయ్య అనే రెండవ సోదరునికి తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం చాగంటివారి అమ్మాయి సూరమ్మగారితోను 3వ సోదరుడైన నీలాచలంగారికి సామర్లకోట దగ్గరి కాపవరం వద్దిపర్తి వారి అమ్మాయి వెంకాయమ్మనిచ్చి పెళ్లిళ్లు చేశారు.

ఆచంటసాంఖ్యాయన శర్మగారు సంపాదకత్వం నిర్వహిస్తున్న కల్పలత. అనే పత్రికలో సమస్యా పూరణం వంటి సాహిత్య ప్రహేళికలను నిర్వహించేవారు. బాలాంత్రపు సోదరులలో వేంకటరావుగారు ఆ ప్రహేళికా పూరణాలలో పాల్గొనేవారు. 1903 లో ఒక సమస్యాపూరణపు పోటీలో పిఠాపురంలోని వోలేటి పార్వతీశంగారికి ప్రథమ బహుమతి. పిఠాపురం కాపురస్తులయిన నడకుదుటి వీరరాజుగారికి ద్వితీయబహుమతి, నేతి సుబ్బారాయుడు గారికి తృతీయ బహుమతి, తణుకు కాపురస్థులయిన బాలంత్రపు వేంకటరావుగారికి నాలుగవ బహుమతి వచ్చాయి.

ఈ సాహిత్యం పోటీలో బహుమతులు పొందిన ముగ్గురూ కొంచెందూరంగా బంధువులయినవారు. పరస్పరం మరింతసన్నిహిత మిత్రులూ, దగ్గరి బంధువులూ అయారు.

నడకుదుటి వీర్రాజు తాతగారి మేనకోడలు లక్ష్మీబాయమ్మను దుగ్గిరాల సుబ్బారాయుడుగారి పెద్దకొడుకిచ్చి పెండ్లిచేశారు. ఆ పెద్దకొడుకు దుగ్గిరాల అప్పారావు గారు వోలేటి పార్వతీశంగారి తమ్ముడు భాస్కరరామ్మూర్తికి లక్ష్మీబాయమ్మ చెల్లెలు ఉప్పులూరి వారి రెండవకుమార్తె శేషమ్మను పెండ్లిచేశారు దుగ్గిరాల అప్పారావు మా అమ్మగారికి (వెంకటరమణమ్మగారికి) అన్నగారు బాలాంత్రపు వెంకటరావుగారూ వోలేటి పార్వతీశంగారు ఆవిధంగా దగ్గర బావగార్లు అయ్యారు పరస్పరమూ! నడకుదుటి వీర్రాజు పంతులు గారు మా నాన్నగారికి (వరసకి) మేనమామా. పార్వతీశంగారికి బుల్లిబాబూ అయ్యారు వీర్రాజుగారి ప్రోత్సాహంతో బాలాంత్రపు వేంకటరావుగారు, వోలేటి పార్వతీశంగారూ వేంకటపార్వతీశ్వర కవులయారు అది 1906వ సంవత్సరం

జంటకవులుగా శ్రీ బాలాంత్రపు వెంకటరావు గారు, శ్రీ వోలేటి పార్వతీశం గారు

తణుకు - బి.వి. రావు బ్రదర్స్

1903 నాటికే తణుకు వచ్చి ఆచంట సాంఖ్యాయన శర్మగారి సాహిత్య ప్రోత్సాహమూ. తల్లాప్రగాడ సూర్యనారాయణరావుగారనే న్యాయవాది గారికి వారి న్యాయవాద వృత్తిలోను సాహిత్యవ్యవసాయంలోను సహాయ్యకులుగా మానాన్నగారయిన బాలాంత్రపు వేంకటరావుగారు. బి.వి. రావు బ్రదర్సు అనే సాహిత్య సంస్థ కార్యనిర్వహణ కేంద్ర బిందువైనారు. 1906లో పెండ్లి అయాక మా అమ్మ వేంకటరమణమ్మగారు వేంకటరావుగారి సహధర్మచారిణిగా, బి.వి. రావు బ్రదర్సు సంస్థ సభ్యులందరికీ అతిథేయురాలయింది

బి.వి.రావు బ్రదర్సు - 1903 06 మధ్య బాలాంత్రపు వేంకటసుబ్బారావు గారి జ్యేష్ఠకుమారుడైన బాలకవి రామచంద్ర సత్యనారాయణ కామేశ్వర్రావు రచనలను

తెలుగుకవితలను, చిన్నినాటికలనూ ఒక పుస్తకరూపంలో ప్రకటించారు. బాలాంత్రపు వేంకటరావుగారు రచించిన ధనాభిరామం అనే నాటకాన్ని (గద్య పద్యాలతో కూడినది) ప్రకటించారు. ఆనాటకపు ప్రస్తావనలో సూత్రధారుడు తన భార్యయైన నటికి ధనాభిరామ నాటక రచయిత అయిన కవిని గూర్చి ఈలా చెపుతాడు. (బాలాంత్రపు వేంకటరావుగార్ని గురించి) దీనిని 18వ శతాబ్దంలో నూతన కవి సూరన పద్యకావ్యంగా రచించాడు.

ఉ॥ మంత్రికులావతంసుడును మాన్యుడు సద్గుణగణ్యమూర్తిబా
లాంత్ర మహాన్వయాంబుధి కలానిధియై తగు నారసింహ స
న్మంత్రికి సూరమాంబకును నాల్గవపుత్రకుడై కవిత్వపున్
తంత్రములోవినేర్చిన గుణజ్ఞుడు వేంకటరాయుడుగ్మలీ!

అని సూత్రధారుడు తన భార్యయైన నటితో చెపుతాడు. ధనాభిరామం కథ దేవలోక భూలోకాలలో జరిగింది. దేవలోకంలో ఇంద్రుని దర్బారులో స్త్రీని వశపరచుకొనేది ధనమా, ప్రేమయా అనే చర్చవస్తుంది. కుబేరుడు ధనమనీ, మన్మధుడు ప్రణయమనీ పంద్యాలు పలుకుతారు. భూలోకంలో ద్రాక్షారామంలోని వేశ్యాయువతియైన మదనమంజరిని వశపరచుకొనేది నేనంటే నేనని కుబేరుడు మన్మధుడూ ప్రతిజ్ఞలు చేస్తారు. ఈనాటకం అచ్చయిన తర్వాత (ఇందులోని నాయికా పాత్రగా మచిలీపట్టణంలోని డి.వి. సుబ్బారావుగారు తాను నటించానని) విజయవాడ రేడియో స్టూడియోకి మరోక నాటకం వెయ్యడానికి వచ్చి ఈ గ్రంథరచయిత రేడియోలో కార్యకర్తగా ఉండిన రజని బాలాంత్రపు వేంకటరావుగారి కుమారుడని తెలిసికొని తన్ను ఫలానాగా పరిచయ పరచుకొన్నారు.

బి.వి. రావ్ బ్రదర్సు ప్రచురణలలో తణుకులో వెలువడిన మరొక నాటకం 'సతీసంయుక్త' 1906 - 1908 ప్రాంతాల బాలాంత్రపు వెంకటరావుగారు తానే వ్రాసి ప్రచురించినది.

ఆ తర్వాత క్రమంగా వేంకటరావుగారు పార్వతీశంగారూ ఇద్దరూ పిఠాపురంలోగాని, తణుకులోగాని, కలిసి జంటకవులుగా కవితారచనలు చేయడం ఆరంభించారు. ఇద్దరూ కలిసి వెంకటగిరి రాజావారి ఆస్థానానికి వెళ్లారు. వెంకటగిరి రాజుల మూల పురుషుడైన వెలమవీరుడూ విజయనగర సామ్రాజ్యపు పాలకవంశపు చివరి పరిపాలకులయిన రామదేవరాయలు వెంకటపతిరాయలకు సహాయకుడుగా యాచ శూరేంద్రుడు గొబ్బూరి జగ్గరాజనే కుట్ర కుహక ప్రయోక్త అయిన శత్రురాజును తోపూరు యుద్ధంలో చంపి, విజయనగర పాలకులకు శత్రు నిశ్శేష సహాయ్యం చేసిన యోధవరుని పేర, వేంకటగిరిబొబ్బిలి పాలకుల మూలపురుషుని పేరు మీ "దయాచశూరేంద్రవిజయ" మనే నాటకమును వేంకటరావుగారే రచించగా, వేంకటగిరివారు

ప్రచురణం చేయించారు పార్వతీశంగారు ఈనాటకరచనలో తను పాలుగొనలేదని తరువాత ప్రకటించారు వేంకటగిరిరాజావారు ఉభయులను గౌరవించారు. సత్కారం చేశారు. యాచమూరేంద్ర వేంకటగిరిపాలకులకు మూలపురుషుడు అందుచేత అప్పటి వేంకటగిరి రాజావారు అనాటక ప్రచురణకు కావలసిన సాహాయ్యం అప్పుడే అందించారు

6. తణుకు – 1911 – ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయ స్థాపనము

జంటకవులు కండని నడకుదుటి వీరరాజు పంతులుగారి ఆశీస్సుతో బాలాంత్రపు వేంకటరావు గారు, వోలేటి పార్వతీశంగారు, పిఠాపురంలోగాని తణుకులోగాని తరచుగా కలుసుకొని జంటకవిత్వం వ్రాయడం మొదలుపెట్టారు తణుకులోని బి.వి.రావు బ్రదర్సు బోర్డుకు బదులుగా ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయం అనే బోర్డు గృహద్వారానికి ముందు తగిలించారు. బాలాంత్రపు వేంకట సుబ్బారావు గారు ఒంగోలు సబ్‌కోర్టు లోని నాజర్, వారి రెండవ సోదరుడు రామయ్యగారి బావమరిదీ, తూర్పు గోదావరి జిల్లాలోని కపిలేశ్వరపురం జమీందారీలోకి దివానూ అయిన చాగంటిశేషయ్యగారూ, వేంకటరావుగారికి రచయితలుగా తోడుపడగలమని వాగ్దానాలు చేయడం. వారి ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయానికి రెండేసి నెలల కొక నవల వ్రాయగలవారి తోడ్పాటు ఏర్పడింది. అది 1911 వ సంవత్సరం బెంగాలీ భాషలో బంకించంద్రఛటర్జీ నవలలు వ్రాయడం ప్రసిద్ధిలోకి రావడం చూశారు మన రచయితలు బంకించంద్రుడి దుర్గేశనందిని నవలను తెలుగులోనికి అనువదించి, చాగంటి శేషయ్యగారు ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం ప్రకటించగల తొలినవలగా అందరూ అంగీకరించారు. తణుకు కాపురస్థులయిన అయ్యగారి నారాయణమూర్తిగారిని అధ్యక్షులుగా ఎంచుకున్నారు. ఆవిధంగా ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం రెండేసి మాసాలకొక నవలను విడుదల చేస్తూండడానికి నిర్ణయం తీసుకొన్నారు. 2వ కుసుమం వేంకట పార్వతీశ్వరకవుల తొలి స్వతంత్ర చారిత్రక నవల వసుమతీ వసంతము. మౌర్య చంద్రగుప్తుడు ఇంచుమించు భారతదేశంలో ముప్పాతిక వంతులు సార్వభౌమత్వం వహించిన చారిత్రికగాథ వసుమతీ వసంతులు కల్పితపాత్రల ప్రణయగాథతో కలిపి, వేంకట పార్వతీశ్వర కవులు రచించిన తొలిస్వతంత్ర నవల ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయం ప్రచురించిన రెండవ కుసుమం. లా ఫాంటెయిన్ (లామిరాబ్లే) అనే పేర ఫ్రెంచిభాషలో విక్టర్‌హ్యూగో రచించిన నవలకు బాలాంత్రపు వెంకట సుబ్బారావు గారి తెలుగు అనుసరణ దురదృష్టవంతులు' అనే నవల ఇది ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయం ప్రచురించిన 3వ కుసుమం! ఇది అందరికంటే మా పెద్ద

పెద్దనాన్నగారి రచన. ఈయన మొదటకొన్నాళ్లు ఒంగోలు సబ్ కోర్టులో పనిచేసినా తర్వాత గుంటూరులో సబ్‌కోర్టులో పనిచేస్తూ అరండల్ పేటలో ఇల్లు కట్టుకుని కాపురం ఉండేవారు. ప్రసిద్ధ విదుషీ వీణధనమ్మాళ్‌కి చెల్లెలైన రూపావతమ్మ (కర్నాటక సంగీత) గాయకవిదుషి మా పెదనాన్నగారికి నేస్తంగా కొన్నిఏళ్లు గుంటూరువచ్చి వారింట్లో, వారితో ఉండిపోయింది. మా పెదనాన్నగారు ఆరోజుల్లో తలపాగా కోటూ వేసుకుంటే రైటానరబుల్ శ్రీనివాసశాస్త్రిలా ఉండేవారు. ఆయన కళ్లు స్వాప్నికుడి కళ్లల్లాగా పై రెప్పలచాటుకి పోయి, గిర్రున తిరిగి వస్తూండేవి రూపావతి తన శాస్త్రీయ కర్నాటక సంగీతంతో సహా పరవశమయిపోయి, మా పెద్దనాన్నగారిని స్వయంగా కోరుకుని గుంటూరులో వారింట్లో ఉండి పోయింది మా దొడ్డమ్మ (వెంకట సుబ్బమ్మ) మేం అంతా వింటూండగా తరచు ఆయన రసికతను దెప్పుతూ ఉండేది ఎవరివల్లో ఎవరుపడ్డారనికాకుండా, ఇద్దరూ పరస్పరమూ ఆకర్షితులయి, ప్రేమికులయి కళాపోషకులుగా ప్రసిద్ధికెక్కారని చెప్పుకోడం పాఠకులయిన మనకు సముచితం అని చెప్పుకోవాలి.

7. ఆంధ్ర ప్రచారిణీ ప్రగతి (తణుకు నుంచి నిడదవోలు)

వేంకటపార్వతీశ్వర కవులకూ ఆంధ్రపచారిణీ గ్రంథ నిలయానికీ తణుకు నుంచి నిడదవోలుకి కార్యస్థానంగా మారింది. దానివల్ల బి.వి. రావు బ్రదర్సు (బాలంత్రపు వేంకటరావు సోదరులకుంటుంబం) నిడదవోలుకి మారింది అది 1913 ప్రాంతం 1911 13 ల మధ్య రెండు సంవత్సరాలలో ఆంధ్ర ప్రచారిణీ రెండేసి నెలలకి ఒక్కొక్కటిచొప్పున 12 నవలలను ప్రచురించి, నిడదవోలు వచ్చేనాటికి కొవ్వూరి చంద్రారెడ్డిగారి అధ్యక్షతలో పనిచేస్తూ 13వ నవలగా వేంకటపార్వతీశ్వర కవుల రెండవ స్వతంత్రనవలగా ప్రమదావనమును ప్రచురించింది విజయనగర సామ్రాజ్య సార్వభౌముడైన శ్రీకృష్ణ దేవరాయల చారిత్రక పరిపాలన కాలానికి చెందిన ఈ నవలలోని కథలో రాయలు ప్రధాన పాత్ర.

బి.వి రావు సోదరులలో అందరిలోను కనిష్ఠుడు మా పినతండ్రి సూరిబాబు అనే సూర్యనారాయణరావు కలకత్తాలో ఎమ్.ఏ. చదువుతూ, ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయంలో అనువాద ప్రచురణలుగా పనికి వచ్చే బంకించంద్రఛటర్జీ, రవీంద్రనాథఠాకూర్, పాంచకడీదేవుల నవలల వంగమూలగ్రంథాలను, కలకత్తా నుంచి, బెంగుళూరు నుంచి వాటి కన్నడ అనువాదాలను గ్రంథమాల నిర్వాహకులకు అందేటట్లు చేసేవాడు. 1906 - 1910 ల మధ్య ఆయనకు

తిరువనంతపురంలో దివాన్‌గా ఉండిన బొప్పూడి నాగుమయ్యగారు అనే రాష్ట్రేతరాంధ్రకుటుంబానికి అల్లుడై జానకమ్మ అనే నాగుమయ్యగారి కుమార్తెతో పెండ్లయింది.

1910 ప్రాంతాన జరిగిన ఆ పెండ్లికి మాతాతయ్యగారు వెంకటనరసింహంగారూ, బామ్మగారు సూరమ్మగారూ, వ రి సంతానం పెళ్లికొడుకుతో సహా ఐదుగురు కొడుకులూ. (వారి కుటుంబాలు) కుమార్తె మహాలక్ష్మమ్మ అల్లుడు బుద్ధవరపు వెంకట సుబ్బారావు అయన అన్నదమ్ముల అయిదారుగురు కుటుంబాలూ చెల్లెలు వాడ్రేవు మాణిక్యాంబా, భర్త మా మేనమామలు దుగ్గిరాల అప్పారావు, పళ్లంరాజులూ అందరికీ ఆంధ్రదేశంనుంచి తిరువాన్కూరుకి తిరిగి స్వగ్రామానికీ రానుపోనూ ఖర్చులకు ఆడపెళ్లివారు తిరువాన్కూరుదివాను బొప్పూడి నాగుమయ్యగారే భరించారు.

మానాన్నగారికంటే ఒక్కయేడాదే ముందుపుట్టిన మా చిట్టి పెద్దనాన్నగారు బాలాంత్రపు నీలాచలంగారు 1914 లో స్వర్గస్థులయారు. ఆయన వంగభాషామూలంనుంచి బి. వెంకటాచారిగారి కన్నడానువాదం సహాయంతోను తెనుగున చేసి. "ప్రాచీన భారతీయుల ఉపనివేశములు" అనేచిన్న పరిశోధనగ్రంథాన్ని ఆంధ్రప్రచారిణీ 1914 లో ప్రకటించింది.

ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం తణుకు నుంచి నిడదవోలుకి మారింది నిడదవోలుకి మారిన బి.వి. రావు సోదరుల కుటుంబ నిర్వాహకురాలిగా, గృహిణిగా, మానాన్నగారి ముఖ్య సచివురాలిగా మా అమ్మ వెంకట రమణమ్మ బాధ్యతలూ పెరిగాయి.

వెంకటరావుగారూ సోదరులూ నిడదవోలులో కాపురం ఉండినపుడే, కలకత్తాలోనూ (పిన తండ్రి) సూరిబాబుకి ఉపదేశగురువయిన నళినీ కాంతసాంఖ్యతీర్థ అనే స్వామిజీ నిడదవోలులో మాయింటికి అతిథిగా వచ్చారు. 1915వ సంవత్సరం మే 9వ తేదీని పుట్టిన మా అన్నయ్యకు ఆస్వామీజీ పేరే నళినీ కాంతరావు అని పెట్టారు.

తణుకులోను, నిడదవోలులోను కొందరు శిష్యులకూ శిష్యురాండ్రకూ మాతాతయ్య బాలాంత్రపు వెంకట నరసింహంగారు, మన సాంప్రదాయిక సంకీర్తనలైన నారాయణతీర్థుల (సంస్కృత) తరంగాలను మునిపల్లె సుబ్రహ్మణ్య కవి రచించిన (తెలుగు) అధ్యాత్మక రామాయణ కీర్తనలనూ నేర్పేవారు.

1918 ప్రాంతాన మా బామ్మ, సూరమ్మగారూ, ఆమె తర్వాత తాతయ్య వెంకటనరసింహం గారూ చనిపోయారు ఈ మరణవార్తలు తిరువాన్కూరులో ఉన్న మా పినతండ్రి సూర్యనారాయణరావు గారికి ఆయన మామగారూ పరివారమూ తెలియనివ్వలేదు. ఉత్తరాల ద్వారా ఆలస్యంగా తెలుసుకుని మా సూరిబాబు అత్తవారి యింటినుంచి కోపంతో ఆంధ్రదేశం

వచ్చేశారు. ఆయన అన్నలు కూడా తిరువాన్కూరు మామగారిపై కోపగించి, నిడదవోలు దగిరి కలవలపల్లి కరణం ముళ్ళపూడి పేరరాజుగారి మేనకోడలూ పెమ్మరాజు కృష్ణారావు గారి కుమార్తె అయిన వేంకటరత్నమ్మ (అమ్మడు)తో, మా సూరిబాబుకి ద్వితీయవివాహం చేశారు.

రజని పిన్ని శ్రీమతి వెంకటరత్నమ్మ (అమ్మడు పిన్ని),
చిన్నాన్న శ్రీ సూర్యనారాయణరావు (సూరిబాబు) గారు

నిడదవోలులో బి వి రావు సోదరుల కుటుంబంలో మా నాన్నగారికి తోడుగా మా సూరిబాబూ, మా అమ్మకు తోడుగా అమ్మడుపిన్నీ చేరుకున్నారు.

1919వ సంవత్సరంవచ్చింది, పూర్తికాబోతోంది ఒక నెల తేడాలో మా అమ్మడు పిన్నీ, మా అమ్మ ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు నెల తప్పారు మా పిన్ని నెలలు నిండాక పురిటి కని కలవలపల్లి వెళ్లింది. మా అమ్మ ఒక నెలతేడాతో, నిడదవోలులోనే ఉంది.

నిడదవోలులో ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయపు అధ్యక్షులయిన కొవ్వూరు చంద్రారెడ్డిగారు చనిపోయారు అప్పటికి మాసూరిబాబు (సూర్యనారాయణరావు) బంకించంద్ర ఛటర్జీ వంగ భాషలో రచించిన శ్రీకృష్ణచరిత్రము ఒకటి రెండు భాగాలుగా తెలుగులోకి అనువదించాడు. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయపు 18వ, 19వ కుసుమాలుగా నిడదవోలులో ప్రచురించారు

8. రజనీ జననం కథ

మా అమ్మకి తొమ్మిది నెలలు నిండాయి. పిఠాపురం నుంచి మా పళ్లరాజుమామయ్య అమ్మకి పురుటి సహాయానికి మా చిన్నమ్మమ్మని (వంకాయలపాటి రాజమ్మ అనే రాజక్కయ్య) నిడదవోలు తీసుకొచ్చారు. రవీంద్రనాథ ఠాకూర్ పిఠాపురం వచ్చి పిఠాపురవు ఆస్థాన సంగీతవిద్వాంసులైన తుమరాడ సంగన్న శాస్త్రిగారిని రాజాగారి అనుమతితో శాంతినికేతన్‌కి తీసుకువెళ్లారట అక్కడ సంగన్న గారి వీణావాద్య కళాకౌశలానికి రవీంద్రుడు ముగ్ధుడైపోయి, ఆయన ద్వారా విన్న కొన్ని కర్ణాటకరాగాలలో వంగకీర్తనలు వ్రాసి పాడించి తన నాటకాలలో ప్రయోగించ డట.

రాజోలునుంచేమో, మామేనత్తవచ్చింది. అంతకు ముందరి సంవత్సరం మా అమ్మ 4 ఏళ్ళు దాటిన మా అన్నయ్యకు తర్వాత ఒక పాపపుట్టి పదిమాసాలలోపునే చనిపోయిందట మళ్లీ యీసారి కూడా ఆడపిల్లే పుడితే తనకొడుక్కి చేసుకుందామని మా మేనత్త మహాలక్ష్మమ్మ ఆశపడుతోంది. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయానికి అధ్యక్షులు చనిపోయిన చంద్రారెడ్డిగారి స్థానే రాజమండ్రిలోని అద్దేపల్లి లక్ష్మణస్వామి గారితో యాజమాన్యానికి వ్యవహర్తగా పనుల నిర్వహణకూ ఏర్పాటులకోసం రాయబారాలు చేస్తున్న మానాన్నగారు ఇంటికి వచ్చారు. శ్రీకృష్ణ చరిత్రం 1వ భాగం చిన్నమ్మమ్మకిచ్చి పురిటిగదిలో ఉన్న మా అమ్మకి ఇమ్మన్నారు. మా అత్తయ్యా ఆమె అభిమానులూ, మళ్లీ ఆడపిల్లేపుడుతుందంటున్నారు. మా చిన్నమ్మమ్మ కొన్ని సూచనలను బట్టి ఈ సారి పాపాయిగారు పుడతాడని చెపుతోంది. మా అమ్మగారి మనస్సులో శ్రీకృష్ణచరిత్రం మొదటిభాగంలోని బాలకృష్ణుని బొమ్మ మామేనమామ పళ్లంరాజు చెప్పుకొని వస్తున్న సంగన్నగారి సంగీతకచ్చేరీల కథలూ, గిరగిరతిరుగుతున్నాయనుకుంటాను.

అది 1920 జనవరి 29వ తేదీ శుభోదయం నిడదవోలు గ్రామం! వేంకటపార్వతీశ్వర కవులలో ఒకరయిన బాలాంత్రపు వేంకటరావుగారి ధర్మపత్ని మా అమ్మ వేంకట రమణమ్మగారికి పురిటి నొప్పులు ప్రారంభమయాయి. కావ్యకుసుమావళిలోని ధర్మపత్ని అనే ఖండకావ్యంలో

"పనులలో చేయి, పలుకు లోపలను పలుకు
మనసులోపల మనసు, జీవనములోన
జీవనము చేర్చి ఒక్కటై చేరుకొనిన కాంత"

మా అమ్మే!

ఇద్దరు బావగార్లూ వారిలో ఒకరిపిల్లలిద్దరూ తోడికోడల్నూ (మా చిట్టీ పెద్దనాన్నగారిభార్య), ఒక మరదీ, వస్తూ పోతూ కవితావ్యాసంగంలో పాల్గొనే జంటకవి (వోలేటి) పార్వతీశం గారూ, ఇతర కవిపండితమిత్రులూ, ఇందరితో కిటకిట లాడే ఇంటిని స్వయంగా చక్కబెట్టుకొనే ఇల్లాలు, ధర్మపత్ని పురిటిగది చేరింది. చిన్నతోటికోడలు ఒక నెలముందుగానే తనపురిటికోసమని నిడదవోలుకి అల్లంత దూరాన ఉన్న పారుగూరు కలవలపల్లికి వెళ్లి 1919 డిసెంబరు 25న ఒక కొడుకుని కన్నది (మా పినతండ్రి సూర్యనారాయణ రావుగారి రెండవభార్య పురుళ్లు పొయ్యడంలో అమృతహస్తం అయిన మా అమ్మకి పినతల్లి రాజమ్మగారు పురిటికి కొద్ది రోజులు ముందుగానే పిఠాపురం నుంచి నిడదవోలు తానుపెంచిన 'అక్క' కొడుకుతో (మా మేనమామ పళ్లంరాజుతో) వచ్చి పురిటిగది ప్రవేశించింది.

మా అమ్మకి తొలిచూలు పిల్లవాడు నాలుగేళ్లుదాటిన నళినీ, రాజోలునుంచి వచ్చిన మా అత్తయ్య కొడుకు నాగరాజూ (ఆరేళ్ల దాటిన వాడు) బొంగరమూ గాలిపటమూ అంటూ మా అమ్మ వెంటపడ్డారు తాతయ్యగారి చందుగా పెట్టెలోంచి బొంగరమూ గాలిపటమూ తాడూ కాసిన్ని రంగు సుద్దలూ ఇచ్చి పొరుగింటి పిల్లలతో ఆడించమని మా అమ్మ బావగారి అబ్బాయికి (సత్యానికి) అప్పచెప్పింది.

1919లోని తొలి మాసాలలో ఆంధ్ర దేశ చరిత్రలో జరిగిన అపూర్వ సంఘటన మహా కవి రవీంద్ర నాథఠాగూర్ పిఠాపురం విచ్చేయడం! మా అమ్మగారి పుట్టిల్లు!

మహారాజవారికోటలో అతిథియైన రవీంద్రుని కోసం ఆస్థాన సంగీతవిద్వాంసులయిన సంగమేశ్వర శాస్త్రిగారు వీణావాదనలో అమృతఝరులు కురియించి, విశ్వకవిచేత ఆనందబాష్పాలు విరియించింది అప్పుడే! అంతటితో తృప్తిచెందక, రవీంద్రుడు 1919 సెప్టెంబర్‌లో మన సంగన్నగారిని శాంతినికేతన్ తీసుకెళ్లారు. అక్కడ కొన్నివారాలు తన వీణావాదనతో ఠాకూర్‌ను తన్మయుంచేసిన శాస్త్రిగారు రవీంద్రుని బంగాలీ సంగీత నృత్య నాటికలలో రవీంద్రుని మృదు మధుర కంఠానికి తోడుగా తన వీణతో సహకారం చేసి, ప్రవహింపజేసిన అమృతవాహినులను గురించిన గాథలు పిఠాపురంలో ఆరోజులలో ఘనంగా చెప్పుకొన్నారు.

అదికాక, తణుకులోను, నిడదవోలులోను ఆచుట్టుపక్కల ఊళ్లనుంచీ వచ్చే ఎందరో శిష్యులకు ఆధ్యాత్మ రామాయణ కీర్తనలూ నారాయణతీర్థుల తరంగాలూ నేర్పి మా తాతయ్యగారు (సన్యసించి) సిద్ధిపొంది (స్వర్గస్థులయి) ఏణ్నర్ధమే అవుతుందప్పటికి! నేను ఊహించిన మా అమ్మగారి మరో భావతరంగాలివి! ఆయేడే వెలువడబోయే బాలగీతావళి మొదటి భాగంలోని

నర్సరీ రైమ్సు తొలివ్రాతప్రతులు మా అమ్మగారి దస్తూరిలో కనిపించేవి! మరి మా న్నాగారు రచించిన స్త్రీల వ్రతకథల కూర్పుతో మాఅమ్మగారి చేయూత ఎంతుందో!

ఆనాటి మధ్యాహ్నం 2.25 గంIIలకు సుఖ ప్రసవం అయింది. "పాపాయిగాడే" అన్నారు. మా నాన్నా అమ్మ పురిటి గదిలోకి వెళ్లారు.

"వీడు నల్లాడు అంటున్నారు మీకులాగ ఉంటాట్ట" అంది మా అమ్మ.

"అవును పెద్దాడు ఎర్రాడు, నీలాగ! వీడునల్లాడునాలాగ! పెద్దాడి జాతకంలో ఆత్మకారకుడు సూర్యుడు! కనకనళినీకాంతడన్నాముకదా! ఈ చిన్నాడికి ఆత్మకారకుడు చంద్రుడు, కనక వీణ్ని రజనీకాంతుడంటాము. అన్నారు నాన్న.

కావ్యకుసుమావళిలోని 'షట్పది'లోని పంక్తులు పాడుతూ నన్ను మా నాన్నగారి చేతులకు అందించింది అమ్మ.

"నల్లనల్లని వాడెనగుమోము వాడె
చిన్ని వేణువునూదు చిరుగొల్లవాడె!
ప్రణయసంగీతంబుపాడుచున్నాడె
ప్రేమమీరగనిన్నె పిలుచుచున్నాడె

చిన్నారి నిరిగొమ్మ సిగ్గేటి కమ్మ
కన్నారగనవమ్మ కదలిరావమ్మ"

9. రాజమండ్రి - కాకినాడ

నిడదవోలులో నిడదవోలు రామమూర్తి గారింట్లో కాపురం ఉంటూండిన బాలాంత్రపు వారి కుటుంబం కొన్నిమాసాలలోనే రాజమండ్రికి బదిలీ కావలసివచ్చింది. (1920 -21)

ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయం కార్యస్థానం నిడదవోలునుంచి రాజమండ్రికి మార్చవలసివచ్చింది. అక్కడి అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారు అధ్యక్షులు. కాకినాడలో కాపురం ఉంటూండిన వోలేటి పార్వతీశము గారు నవలారచనమో, కవిత్వమో చెయ్యవలసి వచ్చినప్పుడు రాజమండ్రి వచ్చి కొన్ని వారాలుండి జంట కవితాగోష్ఠిలో పాల్గొని మళ్ళీ కాకినాడ వెడుతూ ఉండేవారు. మానాన్నగారూ, బాలాంత్రపు వెంకటరావుగారి సోదరులతో మా అమ్మగారూ, పిల్లలతోపాటు రాజమండిలో కాపురం కొనసాగిస్తూ ఉండేవారు. ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం కార్యస్థానం పని రాజమండ్రిలోనే అద్దేపల్లి వారి యాజమాన్యంలో జరుగుతూ ఉండేది. రెండేసి నెలలకు ఒక అనువాదనవల కాని, స్వతంత్ర నవలకాని, వెలువరిస్తూండేవారు పాంచకడీదేవు బెంగాలీ భాషలో వ్రాసిన అపరాధపరిశోధన నవలలను తెలుగు చేసి ప్రకటిస్తూవచ్చారు. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల వారి నవలా ప్రచురణల ద్వారా ఆంధ్రదేశంలో మధ్యతరగతి మహిళా లోకంలో పుస్తక పఠనాభిలాషుల శాతం క్రమంగా పెరుగుతూవచ్చింది.

1920 జనవరి 29వ తేదీన జన్మించిన నాకు ఒక ఏడాదినుండి ఆరు నెలలు కావస్తోందనగా మా అమ్మ వేంకటరమణమ్మకు మళ్లీ నెలతప్పింది.

ప్రచారిణీ నవలారచనకూ, కవిత్వంలో పాల్గొనడానికి వస్తూ, బి వి. రావు బ్రదర్స్ ఆతిథ్యాన్ని స్వీకరిస్తున్న పార్వతీశ కవిగారు, మానాన్నగారికి పెద్ద బావగారు తమ చెల్లెలూ, తమ ఇంటి ఆడపడుచూ అయిన మా అమ్మ వేంకట రమణమ్మగారిని యీసారి పురిటికి కాకినాడలో తమ యింటికి తీసుకెడతామన్నారు. డిసెంబర్ నెలలో తీసుకువెళ్లారు. పిఠాపురంనుంచి మా అమ్మపురుళ్ళకి మంత్రసానీ, తైనాతీగా మా చిన్నమ్మమ్మ వంకాయలపాటి రాజమ్మగారు (రాజక్కయ్య), మా అమ్మమ్మల అమ్మ (మా అమ్మకి అమ్మమ్మ) పాలెపుపద్మమ్మగా రనే పద్మావతి గారితో సహా కాకినాడ చేరుకున్నారు మా నాన్నగారి కార్య సచివుడు మా సత్యం అన్నయ్య మాతో ఉండేవాడు.

1921 లో సామర్లకోటలో భీమేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంలో వేంకటపార్వతీశ్వరకవులిద్దరూ సామర్లకోట భీమేశ్వరుని ఆలయమంటపపు డాబామీద తమ ఏకాంతసేవాకార్య పూర్వభాగరచనా కార్యక్రమానికి పూనుకున్నారు

ఏకాంత సేవలోని ద్వితీయభాగంలో ఇదివరకే రాజమండ్రిలో చాలా ఘట్టాల రచన పూర్తి చేయడమేకాకుండా, ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల 20వ కుసుమం అయిన వారి స్వతంత్రనవల మాతృమందిరం లోని ప్రతి ప్రకరణానికి ముందు శీర్షికాప్రాయంగా వేసుకొనే పద్యాలు! అవి రాజమండ్రిలో వెలువడిన మాతృ మందిరంలో వచ్చేశాయి ప్రకరణ ప్రారంభపద్యాలుగా!

రాజమండ్రిలో ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయానికి అధ్యక్షులయిన అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారు ఆంధ్ర ప్రచారిణీకి ప్రచురణకోసం దేశంలోని ఆయా రచయితలు పంపిన నవలల వ్రాత ప్రతులను దారిమళ్లించి సరస్వతీ గ్రంథమాల అనే సొంత సంస్థనొకదానిని తలపెట్టి ఆంధ్ర ప్రచారిణీ నిర్వహణపై శ్రద్ధ తగ్గించడం వేంకట పార్వతీశ్వరులకు తలనొప్పికి కారణమయింది.

మానాన్న బాలాంత్రపు వేంకటరావుగారు, సోదరులతోటి కుటుంబము కాకినాడకు మార్చుకొంటూ, ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలకు కాకినాడనుంచి పుస్తక ప్రచురణ చేద్దామని నిర్ణయించుకున్నారు. అదే సమయానికి కొంచెంముందుగా, పిఠాపురం దివానుగారయిన మొక్కపాటి సుబ్బారాయుడు గారు ఆంధ్రప్రచారిణీ వారికి ఒక ముద్రాణయంత్రాన్ని బహూకరించారు

10. చెల్లాయి పుట్టుక - అమ్మ చుక్కల్లోకి

1922 జనవరి 23వ తేదీని మా అమ్మ మా చెల్లెలు పాపాయమ్మని కన్నది పురుడువచ్చిన తొమ్మిదో రోజున మాఘ శుద్ధ చవితినాడు మా అందరినీ దుఃఖసముద్రంలో ముంచేసి "చుక్కల లోకి వెళ్లిపోయింది". పురుడు అమ్మచుక్కలలోకి వెళ్లిపోవడమూ పార్వతీశంగారింట్లోనే జరిగింది. ఆనాటికి మా నాన్నగారి వయస్సు 41. నాకు ఇంకో వారానికి రెండేళ్లు పూర్తవుతాయి. మా అన్నయ్య నళినికి ఏడేళ్లు!

విరహసంగీతం :

అలమూరులో ఉంటున్న మా మేనత్త, పాపాయమ్మను పెంచి పెద్దచేసి, తన పెద్దకొడుకు నాగరాజుకి పెళ్లి చేసుకోవాలని ఆమె, కోరిక . అనూరాధ నక్షత్రంలో పుట్టిన మా చెల్లెలికి బెజవాడ కనకదుర్గ పేరుపెడదామని మానాన్నగారు అనుకొన్నారు మా అమ్మ కూడా అలాగే అనుకొని ఉంటుంది ఆపాపని మా అత్తయ్య బుద్ధవరపు మహాలక్ష్మమ్మ తనతో తీసుకెడతానని, వెంకటరావు అన్నయ్యతో (మానాన్నతో) ఓదార్పు మాటలలో చెప్పి, ఆయన సమ్మతిని పొందింది. మా

చిన్నమ్మమ్మ రాజమ్మగారు రెండేళ్ల చంటివాడినయిన పిల్లాణ్ణి అంటే నన్ను తనతో తీసుకెడతానని చెప్పింది మా నాన్నతో.

ఎవరైనా పిఠాపురం నుంచి కాకినాడవస్తే, వాళ్లతో పిఠాపురం వెళ్లడం, అక్కడ కొన్ని వారాలు చిన్నమ్మమ్మతో ఉండడం కాకినాడనుంచి ఎవరయినా పిఠాపురం వస్తే, వాళ్లతో పాటుగా వెళ్లి అక్కడ కొన్ని వారాలుండడం అలా సాగింది నాకు కొన్నాళ్లు!

కాకినాడలో వెంకటరావుగారూ, సూర్యనారాయణరావుగారు భార్యా, ఆయన కొడుకు నాకంటే ఒకనెల ముందు డిసెంబరు 25న పుట్టిన దుర్గాప్రసాదూ. మొదట కొన్నాళ్లు వేములకొండ వారింట్లో కాపురం. మా సూరిబాబు భార్య అమ్మడుపిన్ని ఇల్లు చక్కబెట్టుకొనేది. రామయ్య పెద్దనాన్నగారి కుమారులు (తల్లిలేనిపిల్లలు) నరసింహం, కృష్ణమూర్తి, సత్యం మాతోటే ఉండేవారు.

11. విరహ సంగీతం (1922)

విశ్వంబు వెలయించు వెన్నెలపాట
భువనంబులలరించు పువ్వులపాట!
కోరికల్ చిగురించు కోకిలపాట
కడలేని పాటలో కలిసినదేమొ!
మేటి ననవాటి సెలయేటి నీటివాలు
పజ్జగొజ్జంగిపూవు చప్పరముకింద
చలువ పన్నీట పెరిగిన వలపుతీవ!
వేడికన్నీటిలో నిన్ను వెదకవలసె!
ఆశలన్నియు కూడ శూన్యంబులయ్యె
కటిక చీకటు లెల్లెడ క్రమ్ముకొనియె!
నిండు పున్నమ నవ్వు వెన్నెల వెలుంగు
మెరుగుచుక్కల గుంపులో మరిగిపోయె!
దీటు గనరాని చదలేటి నీటిలోని
యూర్మికల లోని యుయ్యాల లూగియూగి
వెలది వెన్నెల కన్నుల విందుచేసి,
తరలి పోయితే వినుత్రోవ తమ్మినావ!
చిగురు తొగరుచూచి, చిన్నారి పొన్నారి
పూవుతావుచూచి పొల్చుకొంటి
భావలతిక కానబడకుండ నిట్టూర్పు
సెగల పొగులుచున్న చిన్నెలెల్ల!
సంజకెంజాయవెలసిన జాడలోనె
నా కనులలోనే క్రొన్నెల రేకజూపి,
కడకు కన్నీరు కాలువ గట్టు మీద
నెవరు చీకట్లు పెట్టిరోయెరుగనైతి!
ఆ కళా మాధురీమూర్తి రాకపోయి
భావసాగర ముప్పొంగు పక్షమరిగె.
నయన కువలయములు విచ్చునాటు లేగి
నిండు చీకటి రాత్రియే నిలిచె తుదకు!
చల్లగా తోచునాదు జాబిల్లి నెవరొ
దాచుకొన్నారు నీలాంబుదంబులోన,

అట్లుగాకున్న కనరాని యాశలేల
చిటుకు చిటుకున రాలు నీ చినుకులేల
పతగి, నీ మనోహర భావగతులకనుల
విందుసేయుచు నెగిరెడి వేళలందు
నీదు బంగారు రెక్కల నీడ నాడు
నేను నొక గేస్తు ననుకొంటి. నేడదేది?
మాటలాడినయట్లు, పాటపాడినయట్లు
తోచి తోచి నిన్ను చూచుకొరకు
కనుల గడుగు చుంటి కడివెడునీళ్ళలో
రమణి యింక కానరావె నాకు?
కలలనైన నిన్ను కాంచు బాగ్యము పోయె
నిముసమైన కనుల నిదుర లేక,
పవలు రేయితోచు ప్రకృతి లేకయె పోయె,
జీవధనమపైన నీవు లేక!
చిలుక పలుకులేవో చెలువంపు కోకిల
పదములేవొ, తేటి పాటలేవొ
మాటలేవొ నన్ను మరపించి మరపించి
నా వసంత లక్ష్మి నన్ను బాసె!
ఆదియె సుమధుర దివ్యగానానుభవము
అదియె సుమధుర మందానిలానుభవము
ఆదియె సుమదుర పుష్ప గంధానుభవము
కాని నా వసంతేందిర కానరాదు!

కావ్య కుసుమావళి తృతీయ భాగంలో అచ్చయిన 'విరహసంగీతం' అనే ఖండకావ్యంలోని ప్రేయసిని వెదకికొనే వేడికన్నీళ్ళూ మా నాన్నగారివే, ఆ నాటికే పార్వతీశంగారి ప్రథమ భార్య సీతమ్మగారు స్వర్గస్థురాలయి ఉండటంచేత కావ్యకుసుమావళిలోని విరహసంగీతం జంట కవుల ఇద్దరిదీను అని చెప్పడానికి వీలుంది. కాని, ఆ పద్యాలలోని కవి ఉత్తమ పురుష ఏకవచనానికి మూల ప్రతినిధి మా నాన్నగారే. పార్వతీశం గారికి సుభద్రమ్మ గారనే ద్వితీయ భార్య ఆ నాటికి బాగానే ఉంది ఆవిడకే వారికి కలిగిన సంతానం (పదికాన్పులు) అంతా కలిగారు. మా నాన్నగారు మా అమ్మ చుక్కలలోకి వెళ్లిపోయినప్పటి ఆయన 41 ఏళ్ళ వయస్సు నుంచీ తనకి తొంభై దాటేదాకా ఇంట్లో ఒంటరిగా ఉండిపోయారు. మా సూరిబాబూ, ఆయన భార్య అంటే మా అమ్మడు పిన్నీ, బి.వి. రావు సోదరుల ఉమ్మడి కుటుంబాన్ని, తాము తమ 70వ దశకంలో ఒకరితరవాతొకరు స్వర్గస్థులయ్యే వరకూ వదలలేదు.

12. కాకినాడకు మార్చిన కార్యస్థానమూ – కాపురము

ఈ కాకినాడ కాపురంలో ఉండగానే మానాన్న పార్వతీశంమావయ్యలు ఎడమమోచేతులపై పడుకుని ఇద్దరూ వ్రాసుకుంటున్నట్లు తీయించుకున్న జంటకవుల అపురూప ఫొటోతో 'ఏకాంతసేవ' భక్తి కావ్యమూ వేంకటరత్నం నాయుడుగారికి అంకితం చేసిన 'రత్నహారం' అనే ద్విపదకావ్యమూ, రెండూ పాకెట్ సైజ్‌లో తయారయి కాకినాడలో ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయం నుంచి విడుదలయినాయి.

ఏకాంతసేవకి కాకినాడ కాలేజి ఆంగ్లోపన్యాసకులు పెద్దాడ రామస్వామిగారి ఆంగ్ల భాషలో ఉపోద్ఘాతమూ 'అనసూయ' మాస పత్రిక సంపాదకురాలయిన వింజమూరి వెంకటరత్నమ్మగారి తమ్ముడు దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రిగారి తెలుగు ఉపోద్ఘాతము తోనూ ఏకాంతసేవ కుతూహల కారియైన జంటకవులు ఛాయాచిత్రము ఇద్దరూ చాపలమీద ఎడమచేతిపై అనుకుని, ఒత్తిగిలి కుడి చేతితో వ్రాసుకుంటున్నట్లుగా ఏకాంతసేవలో చేర్చుకున్నారు. ఈ జంటకవుల విలక్షణమైన ఛాయాచిత్రాన్ని అప్పుడు కాకినాడలో వెలువడిన "కావ్యకుసుమావళి" లో కూడా చేర్చుకున్నారు (1924). అట్టి అపురూప రచనను గూర్చి ముందు పేజీలలో ఇస్తున్నాను.



13. ప్రణయగీతం 'ఏకాంతసేవ!' (ఏకాంత సేవ - 1)

వేంకట - పార్వతీశ్వరకవుల ఏకాంత సేవను గురించి "ఇది విమర్శనాతీతము. వంగభాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో, మన యాంధ్రమునకీ మహాకవుల భక్తుల ఏకాంతసేవ అట్టిదని నా అభిప్రాయము" అన్నారు కృష్ణశాస్త్రి అది ఎంత మాత్రము అతిశయోక్తి కాదు

ఏకాంతసేవ అనగానే సామాన్యజనుల వాడుకలో గుడిలోని దేవునికి పొద్దుటి నుంచి రాత్రి వరకు ప్రతిదినము ప్రభాతం నుంచి రాత్రి పవళింపు వరకు చేసే సేవలలో చిట్టచివరిది అనే అర్థమే వెంటనే స్ఫురిస్తుంది. కాని ఈ కావ్యానికి జంటకవులు పెట్టుకున్న శీర్షిక అర్థంలో అంత కంటె విస్తృతమూ, ఇంకా విశ్వవ్యాప్తమూ అయి ఉన్నాయి

విశ్వమూ పరమాత్మా, ప్రకృతీ పురుషుడుగా స్త్రీ పురుషతత్వాలకు ప్రతీకలై నిత్యసృష్టికీ, విశ్వగతికీ కారకులుగా, పాలకులుగా వర్తిస్తుంటారు ఏదీలేని, ఏదీ కాని పరమాణువో లేక సంకల్పమాత్రం అనదగిన శూన్యమో అంతటికీ కారణం అనుకున్నప్పటికీ అది ఆదిలో ఒక్కటయి, ఒకటి రెండయి, రెండు మెండయినట్టు వింటూనే ఉంటాము. ఆ మొదటి రెండింటిలోనివే స్త్రీ పురుషతత్వాలు చరాచర (స్థావరజంగమ) జీవకోటికీ, మనుజరాశికీ ప్రజననకారణమైనవి అవే. ఆ జంటలో పురుషుడు దేవుడయితే స్త్రీ అయిన దేవేరి వారిద్దరూ దివ్యులే అయినప్పుడు వారి శృంగారం దివ్యప్రణయం అనిపించుకుంటుంది. శృంగారం అంటే ఇక్కడ అలంకరణం కాదు. నవరసాలలోను రాజు అనిపించుకున్న రసమే. రెండు ఆత్మలు పరస్పరసమాగమానికి పడే తపన స్థాయీభావంగా 'రతి' అనిపించుకుని ఆ తరువాత అవస్థలలో పరితప్తమై, భావానుభావ సంచారీసంస్కారాలతో రసస్థాయి పొందితే శృంగారం అవుతుంది. అతి ప్రాచీనకవులలాగ కాక మధ్యయుగకవులు అనేకులు ఈ శృంగార నిరూపణలో స్త్రీపురుష స్వభావాల భౌతికసంబంధాల చిత్రణాన్ని నిర్మొహమాటంగా చొప్పించి కామమాలిన్యం అంటించారనే అప్రతిష్ఠకు లోనయ్యారు. ప్రకృతిపురుషప్రతీకల పరిణామమిధునమైన రాధాకృష్ణుల లీలలో గాని, గోపికాకృష్ణుల లీలలో గాని, శివపార్వతుల కావ్యనాయికానాయకులైనప్పుడు వారి వైవాహిక లీలలోగాని ఆ మాలిన్యం అంటించారనిపించని మహాకవుల్ని సంస్కృతాంధ్ర బాషా సాహిత్యాలలో కాగడా పట్టి వెదకవలసిందే

ఉదాత్తమైనటువంటి దివ్య ప్రణయం అనేది చిత్రితం కావలసివచ్చినప్పుడు దాన్ని అమలినశృంగారం అందాం అని ఆధునికకవితా కులగురువులు భావకవిత్వ ప్రారంభికవైతాళికులు అన్నారు (రాయప్రోలు ప్రభృతులు)

వేంకట - పార్వతీశ్వరకవులు అటువంటి ప్రతిజ్ఞ చేయలేదు. దివ్య ప్రణయం ఇతివృత్తంగా ఒక భక్తిరసకావ్యాన్ని అద్యంతమూ అమలినంగా రచించారు.

1920లో వీరి మూడవ స్వతంత్రనవల 'మాతృమందిరం' రచించారు పద్యకావ్యం ఏకాంత సేవలోని రెండవ సగంలోని పద్యాలెన్నో మాతృమందిరం నవలలోని ప్రకరణాల ముందు ఉదహరిస్తూ వచ్చారు నవలలో భర్త వదిలిపెట్టి వెళ్ళిపోవడం చేత చింతాగ్రస్తురాలైన కథానాయిక ఇంటిలోని అలమారులోని పుస్తకాలు ఒక్కొక్కటి తీస్తుంది. మరొకటీ మరొకటీ అమె మనస్సుకి నచ్చవు ఏకాంతసేవ తీస్తుంది. పుటలో పాదజ్ఞాపికలో ఏకాంతసేవ భక్తి రసాత్మక పద్యకావ్యము అని సూచించారు. చివర మాతృమందిర సేవాసంస్థలో ప్రణయమందిరంలో 'ప్రాసాదవీథి వేణుగానరవంబు వినవచ్చుచుండె వేదాంతమయి జేరువేళ యేతెంచె భద్రంబు భద్రంబు ప్రాణరత్నంబ అను మధురభక్తి పూరితమైన 16 పంక్తుల మంజరీగానం వినిపిస్తుంది. 1921లో సామర్లకోటలో కార్తీకసమారాధనలు జరిపించారు కాకినాడలోని పెద్దలు, అక్కడి భీమేశ్వరాలయపు గర్భగుడి డాబా మీద వేంకట పార్వతీశ్వరులిద్దరూ సమావేశమయ్యేవారు. ఏకాంతసేవ మొదటి సగం అక్కడ, అప్పుడు అలాగ పూర్తి చేశారు. దివ్యుడైన ప్రియతమునితో నాయిక అయిన ప్రేయసి హృదయేశ్వరుని గురించి కోయిలయై గొంతెత్తి పాడుతుంది. కల్యాణగీతిలో అవశయై చిక్కిన కలకంఠిని కరుణించిన కల్యాణమూర్తి కనుమరుగైపోవడం చేత దుర్భరమైన విషాదంలో పరితపించే నాయిక, ప్రణయాధినాథుని సందర్శానికై ప్రార్థిస్తుంది. ఆత్మేశుతో నైక్యమొందకయున్న ఒకింతొసేపైన ఓ పని యామె ప్రణయస్వరూపుని పట్టి తెచ్చుటకు ప్రణయవనంబు లోపలి పుష్పరథంలో భ్రమరమే బాసటగా బయలుదేరుతుంది. పదిలమైన పాణిద్వయంతో, నిశ్చలమైన నేత్రయుగంతో చెదరని చిత్తంతో స్వామినర్చించే పూజాద్రవ్యసమితితో ఆమె అయత్తురాలు కాగానే శ్రీ పుష్పయోగ సంసిద్ధి చేకూరుతుంది యుగయుగాల నుండి మోగే అనంతవిశ్వగానం నిత్యనూతనగానం మరల పాడిందే పాటగా తానే తేటియై పాడుతుంది. విశ్వమంతా వెన్నెలతీగ పాకుతున్నట్లు, దిక్కులన్నీ దివ్యగానాలతో నిండునట్లు ప్రకృతి అంతా పరవశమయేటట్లు ప్రవిమల భక్తిపూరితయైన ప్రేయసి, పరమేశ్వరుని గూర్చి పాడే ప్రణయగీతం ఏకాంతసేవ!

14. మైమరపించిన 'ఏకాంతసేవ' (ఏకాంతసేవ - 2)

కవిరాజ హంసల నవల 'మాతృమందిరం' వెలువడిన 1920 జులై నాటికి ముందే రెండవ సగం ఏకాంతసేవా, 1921 నవంబర్ నాటికి మొదటి సగమూ రచించారు. ఆ రెండు ఏళ్ళలో కాకినాడ నుంచి అప్పటిలో వింజమూరి వెంకటరత్నమ్మ గారి సంపాదకత్వంలో వెలవడుతుండిన మాసపత్రిక 'అనసూయ'లో కొన్ని మాసాలు ఏకాంతసేవ కవితాఖండాలు సీరియల్‌గా అచ్చవుతూ వచ్చాయి. పత్రికానిర్వహణలో సంపాదకురాలికి ఆమె తమ్ముడు దేవులపల్లి కృష్ణశాస్త్రి సహాయకుడుగా పనిచేసేవారు.

కృష్ణశాస్త్రిగారు గాని, అప్పటిలో కాకినాడ పిఠాపురం రాజా వారి కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా ఉండిన పెద్దాడ రామస్వామిగారు గాని, బ్రహ్మసమాజానికీ సంఘ సంస్కరణోద్యమానికీ కులపతి మాన్యులనిపించుకున్న బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడు గారు గాని, ఏకాంతసేవ కవితా ఖండాలను ఏకేశ్వరోపాసనా సమావేశాలలో ప్రార్థనగీతాలుగా తమ నిత్యదైనందిన ధర్మోపన్యాసాలకి ముందుగానో, తరువాతనో గానం చేస్తూ, తాము భక్తి పరవశులైపోయి సభాసదులకి అతిలోకరమణీయమైన తన్మయత్వం కలిగించేవారు. 1922లో వేంకటరత్నంనాయుడు గారి షష్టిపూర్తికి అంకితంగా రచించి ప్రకటించిన రత్నహారం కూడా అత్యంత భక్తిరసపూరితాలైన అరవై మంజరీ షట్పదులతో కూర్చినది. రత్నహారం విడుదల చేసిన కొద్ది కాలంలోనే కృష్ణశాస్త్రిగారి తెలుగు పీఠికతోను, పెద్దాడ రామస్వామిగారి ఆంగ్ల ఉపోద్ఘాతంతోను ఏకాంతసేవ కూడా వెలువడింది. రెండూ పాకెట్ ఎడిషన్‌సైజులో వెలువడ్డాయి. ఆ ఏకాంతసేవ చిన్న పుస్తకంలో (60 పుటలు) వేంకట - పార్వతీశ్వరకవుల ఛాయాపటం ఒకరి ఒకరికొకరెదురుగా ఎడమ మోచేతులపై ఆనుకొని పడుకొని కుడిచేతులతో వ్రాస్తున్నట్లుగా నవ్యతను ప్రకటిస్తూ దర్శనం ఇస్తుంది. ఆధ్యాత్మిక సాధకులైన ప్రతి వ్యక్తినీ (స్త్రీ గాని, పురుషుడు గాని) నిత్య జీవిత సందర్భాలలో ఏదో ఒక మానసిక పరిస్థితికి అప్పటికప్పుడు పరమాత్మకు చేసికొనే విన్నపాలలాగా రత్నహార కవితా ఖండాలూ, ఏకాంతసేవా కవితా ఖండాలూ, చేతికి అంది వస్తూండేవి. పాఠకులనీ, శ్రోతలనీ మైమరపిస్తుండేవి.

ఆధ్యాత్మిక సాధకులో, జీవితంలో ప్రేమ విరహితులో, సాహితీ పిపాసువులూ, సంసారులూ, దూరస్థలాల నుంచి కూడా జంట కవులు అప్పుడే కాపురం మార్చుకున్న కాకినాడకు వచ్చి ఏకాంతసేవ కావ్యశ్రవణం తరచు చేసి ఆనందబాష్పాలు రాల్చి వెడుతుండేవారు. పిఠాపురం మహారాజావారి కోటలో అంతఃపురం దాకా ఏకాంతసేవ ఆకర్షింపసాగింది. కోటలో యువరాజాది, మహారాణీదీ ఒక పక్షం., అది ఇష్టపక్షం. మహారాజా వారు మాత్రం తమ కొలువు కూటంలోని ఒక

అస్థానకవి అస్తమానమూ చెవిని ఇల్లు కట్టుకుని 'శతపోరు' తూండడం చేత ఏకాంతసేవ అంటే కొంత ఇష్టపడుతూ ఉండీ కూడా, పూర్తిగా మనసిచ్చి మెచ్చుకోవడానికి కష్టపడేవారు.

ఆ అస్థానకవి చెవిలో చేసే బోధన ఇలా ఉండేది. "ఇది కవిత్వమేమిటి మహారాజా! నా మొగము! ఇందులో నాయిక యేది, నాయకుడేడి ఇందులో పద్యములకు ముందు ఆదే పద్యమో సూచించు మొదటి యక్షరములున్నవా? ఇదంతా భావకవిత్వం కాదూ! దీనికి పీఠిక వెలిగించినదెవరు మహారాజా! మన తమ్మన్న శాస్త్రిగారి కొడుకు కృష్ణ శాస్త్రే కదా. అతగాని కావ్యాలు ఊర్వశి, ప్రవాసము, కృష్ణపక్షము! ఆ పుస్తకాలలో ఏ పద్యమేదో తెలిపే అక్షర సూచనలున్నవా? అదియును భావకవిత్వమే. ఆ భావకవి గారు పీఠిక వెలయించినదియును భావ కవిత్వమే. ఇటువంటివారికి తగిన గౌరవం దేవిడీమన్నాయే" ఇలా ఉండేది, ఆ వ్యతిరేక ప్రచారం. సస్పెన్సు కోసం ఆ ప్రచారం చేసిన మహాకవి పేరు ముందు వ్రాయడం లేదు. ఎందుకంటే ఆనాడు సాధారణంగా ఆశుకవితతోనూ, అవధానాలతోనూ, ఇతరులైన జంటకవులతో సాహిత్యయుద్ధాలు చేసిన జంటకవి పెద్దల లాగా ఈ కవిరాజహంసలు ఆశుకవితజోలికి గాని, అవధానాల జోలికి గాని పోయినా, తమ కావ్యకుసుమావళిలో 'అగ్ని పరీక్ష, నిర్వేదము, ఆత్మప్రబోధము' అనే అన్యాపదేశ కవితలను ప్రకటించి వున్నారు. ఆ కవితలు కావ్యకుసుమావళిలో 1924 లో అచ్చుకాక పూర్వం, 'భారతి' వంటి ఆనాటి సాహిత్య పత్రికలలో అచ్చయి, కొందరు సాహితీజిజ్ఞాసువులకి వినోదానందాలను కలిగించేవి. (ఆత్మప్రబోధం నుంచి)

"బ్రహ్మసూత్రంబుతో పడుపుసాని హారంబు
పొంబట్టు లంగాకు బొంది చేసి
గడసాని పారాణికాళ్ళతో వైష్ణవు పంగనామాలకు రంగు వైచి
ముసలి గడ్డంబుతో పసిబాల చిన్నారి చెక్కుటద్దాలకు చెలిమి గూర్చి
వశ్యమంత్రములతో వైరిదుర్జయవీర శైవదీక్షితులకు చదువు చెప్పి
ఇచ్చ వచ్చినట్టు లెన్నియో ప్రకృతుల గూర్చి మార్చి పాడుకొనుము గాని
పాడి తప్పు నీకు పరతత్వబోధల పేరునిలువుకొన గోరితేని!
వేద్య తత్త్వ ఏకట విమర్శక పథము బట్టి మిట్టిపడకుమయ్యా
పార్వతీ పరమేశ పదభావగతి నీవు ప్రకృతి పురుషులకే భ్రమయు టేల?
ధ్వని జీవమైన యువన్యాసకుడు నీవు పలుకుపొందికలకే ఉలుకుటేల?
ప్రణయరసము గొలిపి ప్రకృతిని వలపించి పరవశతను గూర్చు పాటపాడి
ఎన్నో యాటలాడు నీవిట్టు లేకాంతసేవ నింత పడకపోవుటేల?"

ఈ పద్యాలు భారతిలో చదువుకొన్న పాఠకులు కాకినాడలోను, పిఠాపురంలోను, ఊరిలోను, కోటలోను, అంతఃపురంలోను కూడా, ఒకరితో ఒకరు, 'కంఠాభరణమూ, విప్రనారాయణా, వృద్ధ వివాహమూ నాటకాలను రచించిన పిఠాపురం ఆస్థానకవీశ్వరుడైన పానుగంటి వారి కొలువు కూటపు చెవికొరకు స్వభావానికి "మంచి చపేటిక' తగిలించారు మన జంట కవులు" అని చెప్పుకునేవారు.

15. ఏకాంత సేవ - 3

సం॥ 1966 - 68 మధ్య నేను హిమాలయాల పైని డార్జిలింగ్ దగ్గరగా ఉండే రేడియో కేంద్రం (కర్సియాంగ్)లో పని చేస్తున్నప్పుడు, అక్కడి పరిసరాల ఏకాంతతకు అనుగుణంగా ప్రశాంతంగా ఉందని, ఏకాంత సేవను తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువాదం చేశాను అలోన్ విత్ డి స్ప్రెజ్ డివైన్ అని అనువాదానికి ఆంగ్ల శీర్షిక అంటే దివ్య ప్రియతమునితో ఏకాంతత అని అర్థం. ఈ ఏకాంతత అనే మాటలో సమాగమమూ, సాన్నిహిత్యమూ, సమైక్యమూ మూడుభావాలు ధ్వనిస్తున్నాయి. అంచేత ఏకాంతసేవ అనే సంప్రదాయిక భక్తి శాస్త్ర సంకేతానికి చాల సమంజసమైన విధంగా ఆంగ్లంలోకి అనువదించానని ప్రసిద్ధ ఆంగ్ల రచయిత, మాజీ సాహిత్య అకాడమీ అధ్యక్షులు శ్రీనివాసయ్యంగారు మెచ్చుకున్నారు.

ఇంగ్లీషు ఏకాంతసేవలోని కవితా ఖండాలను విన్న బంగాలీ, నేపాలీ మిత్రులు మొదట అవి రవీంద్రుని కవితకు అనువాదాలు అనుకునేవారు. కాదంటే ఆ కూర్మికథ (మిస్టిసిజం) కవితలో కనిపిస్తోందనే వారు. ఆమాట నిజం! వేంకట పార్వతీశ్వరకవుల ఏకాంత సేవకైనా, రవీంద్రుని గీతాంజలీ భాను సింహేర్ పదావలీ వంటి కవితలకైనా మౌలిక ప్రోత్సాహం వారి వారి ప్రాంతీయ దేశికవితా సంప్రదాయాలనుంచి వచ్చిందే. మన జంట కవులకు దేశియక్షగాన ప్రదర్శనలలోని భామాకలాపం నుంచి ప్రోత్సాహం వచ్చింది. ఇటువంటి ఇన్స్పిరేషన్ టాగూర్‌కి తన ప్రాంతపు కీర్తన చండీదాసు, విద్యాపతుల నుంచి వచ్చింది జయదేవుడి గీత గోవిందం నాటకీయ సంవాదాల వంటి గేయాలలో సాగింది. అది కూడా అంతకు పూర్వపు అపభ్రంశ (ప్రాచీన బంగాలీ) బాషలోని దేశి కవితనుంచి కలిగిన పరిణామమే.

ఏకాంతసేవలో అక్కడక్కడ సూత్రధార సంధి వచనాలవంటి కవి కథనాలూ ప్రకృతి వర్ణనలూ ఉన్నా మొదటి నుంచి చివరి దాకా ప్రతి కవితా ఖండమూ - నాయికా పాత్ర ఉత్తమ పురుషలో (ఫస్టు పెర్సన్) ఆత్మాశ్రయంగా పలికే వాక్యాలే. ఈ వాక్యాలను మన జంట కవులు తెలుగువారి

దేశిఛ్ఛందస్సులయిన ఆటవెలది, ద్విపద, తేట గీతులలోనే కూర్చారు. ముఖ్యంగా ద్విపదలోను ఆటవెలదీ తేటగీతుల్లోను ఒక ధార ప్రవాహమూ, నృత్యాత్మకమైనలయా, ఆవేశమూ పూనకము కలిగించే పకీ, తిరిగి తిరిగి ఆ వృత్తిలోకి వచ్చే కొన్ని భావాత్మకమైన మాటలూ ఉంటాయి. చదివేవారికీ వినేవారికీ ఆ శ్రుతిలో ఆ లయలో ఆ ఆవృత్తిలో తన్మయత కలుగుతుంది. నిజానికిది ఈ మూడు ఛందస్సులూ తెలుగు వారి దేశి నాటకాలలోని దరువులూ పాటలూ అని నేను వేదికలపై పాడి నిరూపించాను. ఆ పాటను పద్యాలుగా చదువుకోవడం మనకి నన్నయభట్టుగారు అలవాటు చేశారు అయినా, రంగనాథ రామాయణంలోని ద్విపదలను, తోలుబొమ్మలవాళ్ళు వేరువేరు లయలలో సాగే పాటలుగా పాడడం కద్దు.

దేశి సాహిత్య ధోరణులతో పరిచయం కాని వాటిపై ఆదరభావం కాని లేని సాహిత్య విమర్శకుల చేత ఏకాంత సేవలోని కథానాయిక పలుకులు నాయికకి భామ వేషంలో లాగ ఆ ఆవేశం ఆ పూనకం ఏమిటి? అని విమర్శింపజేశాయి.

మనదేశి సాహిత్యంలో నృత్యగాన ప్రదర్శనలలోను పల్లెలలోను ఆలయ ప్రాంగణాలలోను ప్రాచీన మధ్య యుగాలలో ఆడుతూ ఉండిన శ్రీ గదితము, రాసకము, హల్లీసకము, కోల్యాటకము వంటి దేశి రూపకాలను భరతమునికి తరువాతి సంగీత నాట్య కోవిదులు లక్షణబద్ధం చేసి మార్గత్వ (శాస్త్రీయతా) గౌరవాన్ని వాటికి కలిగించేరని నా భావతరంగాలలో అప్పుడప్పుడు వ్రాస్తూ వచ్చాను. వాటిలో 'శ్రీ గదితము' దేవుని దేవేరి ఏమి చెప్పినది అనే ఇతి వృత్తమూ రీతీ ఏకాంత సేవకైతేయేం, భామాకలాపానికైతే యేం అండాళ్ తిరుప్పావైకైతేయేం వంగదేశపు (నవలల్లోని) హరిదాసీనుల కీర్తనల్కైతే యేం ఆధారాలయాయి కలకత్తా నుంచి వచ్చే హింది సినిమాలలో సఖీజా మధురానగర్‌జా అని రాధ దూతికను కృష్ణుని దగ్గరకు సందేశ హారిణిగా పంపే గీతాలు, చండీదాస్ కోహే కళంకిని రాధా అనీ వచ్చే కీర్తనలన్నీ శ్రీ గదిత రూపావతారాలే.

చండీ దాను గేయానికి నా అనువాదం,

ప్రణయాంకితమ్ముగా బ్రదుకుసాగింతు
ముద్దుగా అలరారు ముక్కుముక్కొరగ
ప్రణయమ్మునేదాల్తు, ప్రణయాంజనమ్ము

ప్రణయమే ధర్మము ప్రణయమే సేవ కంటి కొల్కుల రేఖగా దిద్దుకొందు, అనుచు చండీదాసు ప్రణయగీతోక్తి!

వేంకటపార్వతీశ్వరుల ఏకాంత సేవలో ఇదే మాదిరి శైలిలో ఆవృత్తిలో తిరిగితిరిగి వచ్చి తన్మయత కలిగించే నాయికా వాక్యాలు.

"ప్రణయ శకుంత దంపతులమై మనము, ప్రణయ లీలామృత రసతరంగముల
ప్రణయడోలా పరంపరల మధ్యమున ప్రణయ రూపానంద భాగ్యంబుగాంచి
ప్రణయ శాసనమున ప్రణయరాజ్యంబు పాలింతమిక రమ్ము ప్రణయాధినాథా"

అక్కిరాజు ఉమాకాంతంగారు తమ నేటికాలపు కవిత్వం అనే విమర్శ గ్రంథంలో ఏకాంత సేవలోని 'మధురముగ, మార్దవంబుగా మంజులముగ మానసానందకరముగా మంగళముగ'

వంటి పద్యాలలో పునరుక్తీ, భావస్పష్టతలేని పులుముడూ ఉన్నదని అభిప్రాయపడ్డారు. దానికి కారణం ఈ పద్యంలోని క్రియా విశేషణాలలోని ఒకొక్క మాట అర్థానికీ ప్రక్కమాటల అర్థానికి ఛాయా మాత్రమైన భావ వ్యత్యాసం ఉందని గుర్తించకపోవడమూ సహృదయతా లోపమూ కావచ్చు, పాండిత్య జడతా కావచ్చు.

16. ఏకాంత సేవ - 4

శ్రీ విలాసంబుతో చిద్విలాసమున

కర్తతాత్పర్య సమాశ్లేషమయ్యె - అని కొండంత అర్థంతో కూడిన ఉపనిషద్వాక్యం లాంటి మహాకావ్యంలోని ప్రభాత సంగీతం అనే శీర్షికతో - ఆ కావ్యపు నాందీ గీతం!

ఈ కావ్యపు నాయికా నాయకులు 'శ్రీ' అంటే ప్రకృతి దేవీ, చిత్ అంటే చిద్రూపుడైన పరమాత్మా - వీరిద్దరూ అర్థతాత్పర్యాలుగా ఒండొరులను పెనవేసుకొన్నారు అని ఆరంభమంజరీ ద్విపదలో - విశ్వప్రభాత యవనికముందు నిలబడి జంటకవులు సూత్రధార నాందీ వచనంలోనే నాటకీయంగా కథోద్ఘాటనం చేశారు? అంటే దశరూపక శాస్త్ర పద్ధతిలో నాటకపు ఇతివృత్తాన్ని సూచించడం అన్నమాట. ఈ కావ్యం నాటకీయంగా ఉపరూపకమైన శ్రీగదితముగా రచించారనడానికి తార్కాణం ఈ తొలి మంజరి! అరవై రెండు దాకా సాగిన మిగిలిన కవితా ఖండాలన్నీ ఆటవెలదులు, గీతమాలికలూ, మంజరులూ అన్నీ నాయిక ఉత్తమ పురుష (ఫస్ట్ పెర్సన్) లో పలికే వాక్యాలే.

"ప్రకృతి రాగరంజితమయింది. చిత్తం ప్రేమ సంసిక్తం అయింది."

"విభుని శ్రీ పాదములు కొల్వు వేళయేమొ, రమణునేకాంత సేవకు సమయమేమొ"

"భ్రమరసుందరి పద్మాసనమున నుండి హాయిగా అప్పుడే శ్రుతి వేయుచుండె"

"అప్పుడే వింతగాపురివిప్పుకొంచు నెమ్మినెరజాణ నృత్యంబు నెరపుమండె"

"ఏదో విద్యుత్ప్రభాపుంజమిపుడు తేచె, ఏదో భవ్యవాద్యస్వనమిపుడు తేచె"

"మాన సానందకరముగా మంగళముగ పాడవే మమ్మకోకిలా పాడవేమె" - అని ఈ విధంగాసాగిన తొలి ఘట్టం అంతా ఉత్కంఠితయైన నాయిక నాయకుని సేవకు, కలయికకు ముందు తనలో చెలరేగే భావశబలతా మాధుర్యంతో నిండిన ఊహలు.

ఆత్మేశ్వరుని సాక్షాత్కారం తాత్కలికంగా లభించింది. కాని క్షణంలో ఆయన కనుచాటయినాడు. ఆశాభుగపు మంచు తెరలలముకొంటాయి. కోరిక ఈ రికలు ఎత్తి పొరలుతూన్న నాయిక తనవల్ల ఏ తప్పిదం జరిగిపోయిందో అని వాపోతుంది

"ఎరిదండ మెడలోన వేయుటే గాని
కన్నార నీ మూర్తి గాంచనేలేదు
ప్రణమిల్లి అడుగుల ఒడుటయేగాని,
చేతులారగ సేవ చేయనే లేదు?
వెలుగులో చీకటి దరిసె గాబోలు,
మనసులో తెలివిలో మరపులు తేచె
ఆనందమందుటే అపచారమనుచు
మదినెంచి యీరీతి మా మలు సేయ భావ్యమై తోచెనే ప్రాణేశ నీకు!

17. పిఠాపురం కాకినాడల మధ్య నా పెరుగుదల

నాకు మూడు నాలుగు ఏడాదులు పూర్తవుతుంటే పిఠాపురం నుంచి ఎవరైనా కాకినాడ వచ్చి, తిరిగి పిఠాపురం వెళ్లిపోతుంటే వాళ్లతో పిఠాపురం లోని మా చిన్నమ్మమ్మగారింటికి వెళ్లిపోతూ వుండేవాడిని.

మా మేనమామ పళ్లంరాజుకి సహచరుడూ సహకవీ అయిన పానుగంటి చిరంజీవిరావు మావయ్యతో కలిసి కాకినాడనుంచి సామర్లకోట మీదుగా పిఠాపురం వెళ్లిపోడం జ్ఞాపకం వస్తూంటుంది ఈ చిరంజీవి మావయ్య బహు నాటకకర్తా సాక్ష్యుపన్యాస రచయితా అయిన పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారి రెండవ కుమారుడు

అప్పుడు మా చిన్నమ్మమ్మ వంకాయలపాటి రాజమ్మగారిని అమ్మమ్మా అనికాక, అమ్మా అని పిలిచేవాడిని నేను. ఆవిడ నన్ను బాచన్నా, బాచిబాబు అనిపిలిచేది. బాచి కొండా మొహిరీకాసులందండా అప్పుడుకాచిన వెన్నా, ఇలా రకరకాలముద్దుపేరులతో చాలా ఆప్యాయంగా చూసుకొనేది.

ఒకనాడు కుమారస్వామి కోవెలకోనేటిఒడ్డున రాత్రి 10 గంటలకి చెంచులక్ష్మి నరసింహస్వాముల వీధినాటకం ఆడారు. నేను మా అమ్మమ్మ ఒళ్లో కూచుని చూశాను. ఆనాటకం నీలపు రంగు పూసిన చెంచులక్ష్మి ముఖం నాకు అంత యిష్టం వుండేదికాదు ఆదిలక్ష్మి ముఖానికి అరదళం పసుపురంగూ నాకు సంతోషముకలిగించేది. చెంచులక్ష్మిని మొదట చూసినప్పుడు భయంకూడావేసి ఏడిచాను ఆవిధంగా శ్రీమహా విష్ణువు పట్టమహిషి శ్రీ మహాలక్ష్మి నాకు 2, 4 ఏళ్ల బాల్యంలోనే ఇష్టదేవత అయింది.

ఆమరునాడు మా అమ్మమ్మగారింటికి పెండ్యాల సత్యభామ వచ్చింది ఈ సత్యభామ భామకలాపం భాగవతం వీధినాటకం. (అప్పుడు) దానిని నృత్యకలాపం అని అనేవారుకారు. బాగోతం వీధినాటకం అనే వారు ''భామ జడపట్టు'' అని నాటకంముందు ఒక ఘట్టంఉండేది. దానిలో సత్యభామ తలపైని ధరించడానికి భామజడ, నగలతో జరీచెంకీలతో మెరిసే రంగురంగుల ముచ్చి బంగారపు రేకులతో పువ్వులతో, తలమీద ఆకాశమూ, నక్షత్రాలూ చంద్రవంకా ఇంకా రాగిడీ ఏవేవో అలంకారాలూ వచ్చేటట్లుగా మా అమ్మమ్మ తానే సత్యభామకి ప్రత్యేకంగా తయారు చేసి యిచ్చేది. భామ రంగంపైకి వచ్చేముందు ఈ జడని తెరపైవేసి, ఆముందుకూర్చున్న కొందరు పెద్దలతో సత్యభామ ప్రశ్నలువేయించుకుని, జవాబులు వారికి సంతృప్తి కలిగేటట్లు చెప్పి ఆపైని ''అభ్యుదయపరంపరాభివృద్ధిగా భామ రంగముపై ప్రవేశించువిధంబెట్లనిన'' అని సూత్రధారుడు

అంటూంటే, భామ "భామనే" అని అహిరిరాగంలో కంఠంఎత్తి, మైలు దూరానికి మైకులు లేని ఆ రోజుల్లో తనకంఠము వినిపించేటట్లు పైని తారస్థాయిలో ఎత్తుకుని ఆలాపిస్తూ పాడేది కూడా మద్దెళ్లూ తాళాలు హంగుదారులు వాయిస్తూ వంతపాటకులు గానం చేస్తుంటే సత్యభామ ప్రావేశిక దరువు పాడేది.

మా అమ్మమ్మగారింట్లో అమ్మమ్మే యశోదమ్మ. బాచి కొండడైన నేను బాలకృష్ణుడిని.

ముందొక జడా, వెనకొక జడా వేసి అమ్మమ్మ చేమంతీ, బంతీ, పువ్వులు పెట్టేది ఇంకా రక రకాల పూవులు పెట్టేది. అమ్మమ్మగారింట్లో ఆవుల పాడి ఉండేది.

వెన్నముద్దలు, మీగడతరకలు తినిపించేది. గుమ్మపాలు తాగించేది. అప్పుడు నాకు 3, 4 ఏళ్ల వయస్సు.

మా అమ్మమ్మగారింట్లో మామేనమామ పళ్లంరాజూ మా చిన్న పెత్తల్లి కొడుకు రేలంగి హనుమంతరావు అనే లడ్డూ అన్నయ్యా పద్యాలు పాడి వినిపిస్తూ నాచేత పాడిస్తూండే వారు. భాగవతంలోవీ, కృష్ణశతకంలోవీ, భాస్కర, దాశరథీశతకాలలోనివీ పద్యాలు, రాగాలలో సెట్ చేసి పాడి నాచేత తిరిగి పాడిస్తూ ఉండేవారు నాకు పద్యం పాడుతూంటే ఒక రోజున కల్యాణిరాగం దానంతటది నాకు తెలియకుండానే వచ్చేసింది.

నాకు తెలియకుండానే వచ్చేసింది ఐదోయేడు. నాకూ మా దుర్గా ప్రసాదం అన్నయ్యకీ (మా సూరిబాబుగారి అబ్బాయి) ఒకనెలే నాకంటే పెద్ద ఒక్కేసారి పుట్టి వెంట్రుకలు తీయించారు.

మానాన్నగారు పిఠాపురంలో చివుకుల గోపాలరావు గారు అని రాజాగారి దివాణంలో పనిచేస్తూ రిటైరైపోయిన ఉద్యోగినుంచి కొత్తపేటలో మెయిన్‌రోడ్డుపైని పెద్దడాబా, మేడమీద రెండుగదుల మిద్దే, పెద్ద దొడ్డీ ఉండే ఒక యిల్లు కొన్నారు.

18. పిఠాపురం కాపురం - ఆంధ్ర ప్రచారిణీ

పిఠాపురంలో ఊరి దక్షిణపు అర్ధభాగంలో ఇంచుమించు మధ్య నుండే మార్కెట్టూ వాడ్రేవువారి భవనాలూ, బియ్యపు మిల్లూ, చెరుకుల కాలువ వంతెనా, బాదం సూర్యంకొట్టూ ఉండే మెయిన్ రోడ్డు మీద సాయిబాబా గుడి తరువాత వచ్చింది పాదాలమ్మ తాడిచెట్టు. ఆ తాడిచెట్టుకి ఎదురుగా పడమటి ముఖంగా అరుగులూ ద్వారబంధమూ ఉన్న పై డాబా కనబడే ఇల్లు మా నాన్నగారు కొన్న మా ఇల్లు. ఆ ఇంటికి ఉత్తరం కుడివైపు రెండు పాయలుగా కరపవారి పంటకాలువలూ, ఆ తర్వాత సూర్యారాయ నిఘంటు కార్యాలయమూ, దానికి ఎదుట పడమటివైపు బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి బంగళా - దానికి ఉత్తరం వైపున దివానుగార్ల బంగళాలు - అలా కుడివైపు ఉత్తరంగా పోగా పోగా అగ్రహారం అనే పేటా ఇంకో రెండు మైళ్లు నడిస్తే గొల్లప్రోలు అనే గ్రామమూ వస్తాయి.

1925 లో కొన్న ఆ ఇంట్లోనే ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయం కార్యస్థానం అచ్చయి తయారయి వచ్చిన పెద్ద కాగితాలను పేజీ కొలత ప్రకారం మడిచి, కలిపి కుట్టడానికీ, బైండింగు చెయ్యడానికీ కావలసిన పనివారంతా వీధి హాలులోను, లోపలి పెద్ద హాల్‌లోను కూర్చునే వారు, ఆ వీధి హాలులోనే గుమస్తాగారూ, పుస్తకాల బీరువాలూ ఉండేవి.

19. అక్షరాభ్యాసం - ప్రాథమిక పాఠశాలలో చదువు

మళ్ళీ నా కథలోకి వస్తే, కాకినాడలోని మా పులుగుర్త నరసింహత్తయ్యగారి అల్లుడు చాగంటి సుబ్బారావు అన్నయ్యగారు అనే సామర్లకోటలోని ఉన్నతపాఠశాల హెడ్‌మాస్టారు, ఎమ్.ఎ. పరీక్షకై తయారవుతూ అప్పటికే మద్రాసులో ఒకటీ, కలకత్తాలో ఒకటీ రెండు ఎమ్.ఏలలో ఉత్తీర్ణుడైన మా సూరిబాబు వద్ద ఆంగ్లభాషా. వాఙ్మయాలలోను, తత్త్వశాస్త్రంలోను, తరిఫీదు కావడానికి పిఠాపురం వచ్చిన చాగంటి సుబ్బారావు అన్నయ్యగారు మాపినతండ్రిగారి అబ్బాయైన ప్రసాదం అన్నయ్యకు నాకూ (అప్పటి అయిదేళ్లునిండిన వాళ్లం) గురువుగా అక్షరాభ్యాసం చేశారు.

అక్షరాభ్యాసం అయ్యాక మా యిద్దరినీ (దుర్గాప్రసాదం అన్నయ్యనీ, నన్ను) పిఠాపురం లో మాయింటికి ఎదుటిపక్క ఇళ్ల పంక్తిలో ఉన్న కొండెవరం మాస్టారి (సత్యవోలు తమ్మిరాజు గారు) బడిలో రావుచెల్లయమ్మారావు గారి ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో చేర్పించారు

1925, 26, 27 సంవత్సరాలు అపారశాలలో 3 తరగతులలో ప్యాసయాము.

ఇక్కడ జ్ఞాపకం వుంచుకోతగ్గ విషయం (డిక్టేషన్) ఉక్త లేఖనం చెబుతూంటే నా వెనుకాల నుంచున్న హెడ్మాస్టర్ తమ్మిరాజు గారి కొడుకు జగన్నాథరావు నేను వ్రాసిన దాని నుండి కాపీ కొడుతుంటే హెడ్మాస్టర్ గారునన్ను బెత్తంతో పిక్కల మీద కొట్టేరు. తట్లు తేరాయి. ఈ విషయం తెలిసి మా సత్యం అన్నయ్య, చావలి సత్యనారాయణ వచ్చి హెడ్మాస్టర్ గారిని, వెనక కూర్చుని మీ వాడు కాపీకొట్టూంటే ఇతనినెందుకు కొట్టారని గట్టిగా అడిగేరు. తరువాత హెడ్మాస్టర్ గారు మా పెద్దవారి వద్దకు వచ్చి క్షమాపణ చెప్పుకున్నారు.

20. నా ఉన్నత పాఠశాల చదువు

నాల్గోతరగతి చదువకుండానే నన్ను, దుర్గాప్రసాద్ అన్నయ్యను 1928లో 5వ తరగతిలో ప్రవేశపరీక్ష చేయించి భావయమ్మారావు ఉన్నత పాఠశాలలో చేర్పించారు.

డిశెంబరు నెలలో క్రీడా దినోత్సవంలో ఆటస్థలంలో ఒక తాడు పట్టుకుని 30, 40 మంది పిల్లలు నుంచుని ఒక పంక్తిలో ఉన్నాం. డ్రిల్‌మాస్టర్ విజిల్ ఊదేడు. తాడుపట్టుకున్న పిల్లల్లో నేను తప్ప మిగిలిన పిల్లలందరూ ముందుకు పరుగెత్తుకుని వెళ్ళి ఆటస్థలంలో అవతలికొసకు చేరుకున్నారు నేను ఒక్కడిని మాత్రం ఆ మొదటి పంక్తిని వదలలేదు. అందరూ అవతలి కొసకి చేరుకున్నా 2, 3 అడుగులు వేసి ఒక్కణ్ణే ఎందుకులే అని వెనక్కి వచ్చేసి మొదటనించున్న చోటే నించున్నాను. ఈ ఆటస్థలము ఆటలునావికావు. నాకు కావలస్సిన ఆట స్థలం ఇదికాదు. వేరే ఏదో ఉందని తోచింది నాకు.

మా ఇంటికి ఎదుటనే ఉన్న అవసరాల కొండలరావు గారి అమ్మాయిలకి మండా ప్రకాశంగారు అనే సంగీతం మాష్టారు సంగీతం చెప్పడానికి వచ్చేవారు అయనతమ్ముడు మండా కృష్ణమూర్తిగారు నాకు సంగీత పాఠాలు చెప్పడానికి రోజూ మా ఇంటికి వచ్చేవారు. మా ఇంటికి ముందు పక్క సందులోని జూలూరు తులశమ్మగారూ, కొటికలపూడి సీతమ్మగారు కాపురముండే ఇంటిలోను దివానుగార్ల ఇళ్ళలో మొక్కపాటి వారింటిలోను, అ ఇళ్ళకి యెదుటిపేటలో టౌనుహాల్ వెనుక మొక్కపాటి నరసింహశాస్త్రిగారి అమ్మాయిలకీ సంగీతం చెప్పే వారాయనే కృష్ణమూర్తిగారు. ఈ మండ ప్రకాశం, కృష్ణమూర్తి గార్లిద్దరూ వీణాచార్య సంగమేశ్వరశాస్త్రిగారి శిష్యులే. వారు పిఠాపురం రాజావారి అస్థాన సంగీత విద్వాంసులే!

21. పిఠాపురం నుండి గుంటూరు - మళ్ళీ పిఠాపురం

ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయం నవలా ప్రచురణ విభాగం బారువారి వీధికి పోలేటి పార్వతీశంగారింటికి వెళ్లి పోయింది. మా నాన్నగారి నిర్వహణలోకి ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్ వాచకాలూ, శతకాలూ, ఉపవాచకాలూ, నాండిటెయిల్డ్ టెక్స్టులులూ, ఇటువంటివన్నీ వచ్చాయి

కార్యాలయంలో ఒక పురాతన సొరుగుల డ్రాయరూ వ్రాతబల్లా వాటిమీద కార్యదర్శిగా పని చేయడానికి వింజమూరి శివరామారావు గారినీ ఆయనతో పాటు నన్నూ కాకినాడ ఒంటెద్దు బండిపై బదిలీ ప్రయాణంలో పంపారు. కాకినాడలో సూర్యారావుపేటలో డాక్టర్ వేదాంతం వెంకట కృష్ణయ్యగారి ఆసుపత్రి ముందు భాగంలో ఉండగా, వెనుక భాగంలో భారతీనికేతనం అనే పేర, మా రామయ్య పెదనాన్నగారి కుమారుడు, మా నాన్నగారికి కార్యదర్శిగా పనిచేస్తుండిన మా సత్యం అన్నయ్య బాలాంత్రపు సత్యనారాయణరావు (బాలాంత్రం) అక్కడ బాలాంత్రం కంపెనీ, అనీ జాతీయ గ్రంథమాల అనీ, ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్ అనీ భారతీనికేతన్ అనీ జాతీయ గ్రంథమాల అనీ బోర్డులు వ్రాయించి - గోడలకి తగిలించారు, శివరామారావుగారు తరువాత వేరే వ్యాపకాలలోకి వెళ్లిపోయారు ఐనపర్తి శివశంకరరావు అనే ఆయన ఈ కార్యస్థానంలోకి కార్యదర్శిగా చేరుకున్నాడు.

అది 1933 - 34. నేనూ ప్రసాదం అన్నయ్యా ఫిఫ్త్‌ఫారం పరీక్షకి వెళ్లాము వేసంగి సెలవులు వచ్చేశాయి. తెల్లవారగట్లే ఆటరంధీలో తలగడా తీసి ఎదటివాడి ముఖం మీద గట్టిగా కప్పడం ఆట ఆడుకుంటున్నాం. వాడు నా ముఖం మీద తలగడా గట్టిగా మూసి పట్టుకునే సరికి నాకు ఊపిరి ఆడక బోర్లా పడుకున్నవాణ్ణి చటాలున పైకి లేవడంతో నా తల వెనుక భాగానికి వాడి ముని పంటికొన తగిలి నాకు తలకి రక్తం వచ్చింది. వాడి పై పన్ను సగానికి విరిగిపోయింది. వీధి బయటికెళ్ళి వచ్చిన మా సూరిబాబూ, ఇంట్లో వంటింటి పనులలో నుంచి లోపలికి వచ్చిన మా పిన్నీ, ఈ పాపాయి మా అబ్బాయిని చితకకొట్టి, మునిపన్ను విరగ్గొట్టేశాడు మొర్రో అని గొడవపెట్టారు అ గదికి పై గదిలో ఉన్న మా నాన్న ఇదంతా విని, నన్ను పిఠాపురం నుంచి చదువుకి గుంటూరు పంపించెయ్యాలని నిర్ణయించారు. నా తలకి మా అమ్మమ్మ (రాజక్కయ్య) కట్టుకట్టింది. మొత్తానికి గుంటూరులో పెద్దనాన్నగారింటికి పంపేసి, అక్కడ నన్ను పిరాట్ల శంకరశాస్త్రిగారి దగ్గర సంగీతం చెప్పుకుంటూ, గుంటూరు టౌన్ హైస్కూల్‌లో సిక్స్త్ ఫారం (ఎస్ఎస్ఎల్‌సి) చదివించాలని నాన్నగారు మా సత్యం అన్నయ్య నిర్ణయించేశారు. ఫిఫ్త్ ఫారం చదివిన విద్యా సంవత్సరం పూర్తయిపోయింది. వేసవి సెలవులు పూర్తికాగానే ఎస్ఎస్ఎల్‌సి స్కూల్ ఫైనల్ ఉన్నత పాఠశాల చివరి సంవత్సరం చదువు పూర్తిచేసి పబ్లిక్ పరీక్ష దాకా గుంటూరులో చేయించాలని నిర్ణయించారు.

పిఠాపురం నుంచి నన్ను మా నాన్నగారు గుంటూరు పంపించేసారు. గుంటూరులో అది మా పెదనాన్న బాలాంత్రపు వేంకట సుబ్బారావుగారి ఇల్లు.

అక్కడ మా రామచంద్రం అన్నయ్య అతని భార్య సీతామహాలక్ష్మి వదిన! మా దొడ్డమ్మ పాణుగుపాటి వారి ఆడపడుచు సుబ్బలక్ష్మి. వీరు కాక నలుగురైదుగురు యువక బలం మా సీతామహాలక్ష్మి వదిన తమ్ముడు నాన్నయ్య బావ (తల్లా ప్రగడ గోపాలకృష్ణారావు) మా అమ్మడక్కయ్యకీ. అద్దంకి సుబ్బారావు బావగారికి పెద్ద కొడుకు రామం (అద్దంకి శ్రీరామచంద్రమూర్తి) మా సత్యవతి వదినా సరస్వతి వదినల మేనల్లుడూ ఈ యువక బలం అంతా ఒక కుటీర పరిశ్రమలో కార్మికులు.

ఆ కుటీర పరిశ్రమ పళ్ళపొడి తయారీ నేను కూడా ఈ యువక బలంతో చేరడం వల్ల ఈ బలంలో నేనూ ఒక కార్మికుడిగా తేలాను.

విభూతి పట్లు, పిప్పరమెంటు బిళ్లలు (తీపివి అన్నమాట) చితక్కొట్టిన ఎండువక్కలు (పోకచెక్కలు) అన్నింటిని కలిపి పొడిచేసి కల్వంలో పొత్రంతో నూరడం - మొత్తానికి అదే పళ్ళపొడి అన్నమాట. ఆ తర్వాత పొడిని వస్త్రకాళితం పట్టి (అంటే పల్చటి గుడ్డలో వేసి జల్లించడం అన్నమాట) ఉపయోగించుకునే వాళ్లం.

నాకు కాబోయే సంగీత గురువులు పిరాట్ల శంకరశాస్త్రిగారు, పురాణం కనకయ్య శాస్త్రి గారు వస్తూ పోతూ ఉండేవారు వారి శిష్యుల్లో సీనియర్లు వింజమూరి గోవిందరాజాచారిగారి కొడుకులు వరదరాజయ్యం గారు, శ్రీనివాసాచార్లు కూడా మా పెదనాన్న గారింటికి వస్తూపోతూ ఉండేవారు.

వారానికి ఒకసారి కొన్ని సంగీత కచేరీలు జరిగేవి మా పెద్దనాన్న గారింటి వాకిట్లోనూ, లేకపోతే టౌను హైస్కూలు లోనూ, కచేరి విద్వాంసులు పర్వతనేని వీరయ్య చౌదరిగారు. వారి నేస్తం గానమోహిని గారు. పాఠశాలలు తెరవగానే నన్ను టౌను హైస్కూల్లో స్కూల్ ఫైనల్ క్లాసులో (ఎస్ఎస్ఎల్సి) చేర్చారు. 150 మందికి పైగా విద్యార్థులు హెడ్మాష్టారు బుద్ధిరాజు రామచంద్రరావు గారు వెదురు బెత్తంతో తరగతి గదిలో కొచ్చేవారు. గదిలో గొడవ తగ్గకపోతే ఒకటవ కుర్రవాడి దగ్గర నుంచి ఆఖరి కుర్రవాడి దాకా వెదురు బెత్తంతో నెత్తిమీద కొట్టుకుంటూ పొయేవారు హెడ్మాష్టరు. నాకు అది సరిపడలేదు పిఠాపురంలో మా హైస్కూల్లోనూ తరగతి గదుల్లో పంతులు గదిలో కొచ్చేదాకా గొడవ గొడవగా ఉండేది కాని, వెదురు బెత్తంతో మొట్టికాయలనేది నేను చూడలేదు.

రాచకొండ సూర్యనారాయణ గారు చరిత్ర తరగతి తీసుకొనేవారు తెలుగు మాస్టారి పేరు జ్ఞాపకం లేదు మా పిఠాపురంలో అయితే ఉపాధ్యాయుల వెంకటేశ్వర్లుగారు లేక చిత్రాడ శాస్త్రులు గారు (ఈయన చిత్రాడ నుంచి వచ్చేవారు), చీమలకొండ అద్వైత పరబ్రహ్మ శాస్త్రిగారు, పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు వీళ్లందరికీ నేను పద్యాలు బాగా పాడతానని తెలిసి నా చేత పాడించేవారు గుంటూరులో పంతుళ్ళకి నేను పద్యాలు రాగాలతో పాడతానని తెలియదు. నా నిరుత్సాహాల్లో ఇది ఒకటి. మేస్టర్లు నన్ను చూడగానే వెంకట్రాయ కవిగారి కొడుకువా? నళినీ కాంతరావు తమ్ముడివా అని అడిగి తెలుసుకునేవారు. అదే గుంటూరులో మన గురించి ఎవరూ పట్టించుకొనే వారు లేరు జూలై, ఆగస్టులో 1, 2 వారాలు హైస్కూలుకి వెళ్ళి వస్తూ నాకీ ఊళ్ళో చదువు నచ్చలేదు. సంగీతం టీచర్‌లు సంగీతం చెప్పడం లేదు. నా ఫీజు కట్టేసి, గుంటూరు నుంచి నన్ను టి.సి.తో విడుదలచేసి, పిఠాపురంలో చేర్పిస్తే గానీ నాకున్న దిగులు తగ్గదని చెప్పి మా నాన్నగారికి ఉత్తరం వ్రాసాను. మా నాన్నగారు మా రెండో పెదనాన్న రామయ్యగారి కొడుకుని అంటే మా సత్యం అన్నయ్యని పంపించారు. ఆ సత్యం అన్నయ్య గుంటూరు పెదనాన్న గారితోటి, రామచంద్రం అన్నయ్యతోటి మాట్లాడి, గుంటూరులో టరం ఫీజు కట్టేసి, నా టి.సి. తీసుకొని, పిఠాపురం తీసుకెళ్ళిపోయాడు.

పిఠాపురంలో చిల్లరిగె భీమసేనరావు గారు హెడ్మాష్టరు. ఆయన క్లాసులోనే స్కూల్ ఫైనల్ (ఎస్.ఎస్.ఎల్.సి.)లో చేర్పించేసారు. నా గుంటూరు వలస తీరిపోయి పిఠాపురం వచ్చేసాను. మా పినతండ్రిగారి అబ్బాయి ప్రసాదం అన్నయ్య నా సహాధ్యాయిగా పిఠాపురంలో తరగతులకు వెళ్లటం ప్రారంభించాను. నా చేత బెంచీ, మీద నిలబెట్టి పద్యాలు పాడించే పాఠశాల ఇది నాకెంతో ఇష్టమైంది నాటకాలు అవీ వేసి వాటిలోనూ, సంగీత పోటీల్లోనూ బహుమతులు, వన్నెమోర్లు, పొందిన పాఠశాల పిఠాపురం పాఠశాల.

22. మారాజు మామయ్య - కుటుంబము

మాకు ఇద్దరు మేనమామలు. మా పెద్ద మేనమామ దుగ్గిరాల అప్పారావు గారు గురించి నా కెక్కువ తెలీదు. వారి భార్య శ్రీమతి లక్ష్మీబాయమ్మ గారు అంటే నాకు బాయప్ప అత్త పెద్ద మామయ్య బాగా వ్యాయామం చేసేవారట. గద తిప్పడం, కఱ్ర తిప్పడం హారిజాంటల్ బార్‌పై విన్యాసాలు చేసేవారని విన్నాం ఈ ప్రతిభ మా అన్నయ్య నళిని పుణికి పుచ్చుకున్నాడు. ఆటల్లో ఎన్నో ప్రైజులు తెచ్చుకున్నాడు.

మారెండో మేనమామ రాజుమామయ్య అంటే దుగ్గిరాల పళ్లంరాజు గారితో నాకు చనువు చాలా ఎక్కువ. మాచిన్నతనంలో అనగా ప్రాథమిక తరగతులు చదివే రోజుల్లో భుజం మీద పడుకోబెట్టుకుని వేర్వేరు రాగాలలో పద్యాలు పాడుతూ జోకొట్టేవాడు. ఆసాంగత్యంలోనే నాకు ఒక ఓజున కల్యాణిరాగం పాడటం వచ్చేసింది. నేను హైస్కూలులో చదువుతూండే రోజుల్లో రాజుమామయ్య నన్ను కాకినాడ తీసికెళ్ళి అక్కడ Young Men s Happy Club లో పెద్దవారైన శ్రీ గండికోట జోగినాథం బాబు గారికి పరిచయం చేసేడు. వీడు రజని మా అక్కయ్య గారి అబ్బాయి సంగీతం లో మంచి అభిరుచి ఉంది అని చెప్పేడు. ప్రక్కన ఒకరు హార్మోనియం వాయిస్తూంటే నేను

ఏ పట్టనము మ్రోలనేలేరు ప్రవహించు
పృథివికి ముత్యాల పేరువోలె
మున్నూట యఱువది మూర్తి భేదములతో
విహరించు నేవీట వేల్పుపిండు
పీఠాంబ చెవి యోగపీఠి హుంకృతి దుర్గ
నవిచి కావుందు నేవగరి కెలనఁ
గుంతిమహాదేవి కూర్మిమేనల్లుడు
మాధవుండేవీట మరగినాఁడు

పెద్ద గవఁకుల నేపుట ఖేదనమున
నెలమినిలుచుండు ప్రీఠా విహీన ఋఘనుఁ
దట్టి పీఠాపురముఁ జేరవరుగు డెంచెఁ
పరమ శైవుండు శ్రీపరాశర సుతుండు

అన్న శ్రీ భీమేశ్వర పురాణములోని పద్యమును భాగేశ్వరి రాగంలో పాడేను అందరూ మెచ్చుకున్నారు. వారిలో సినీరంగంలో హాస్యనట శిఖామణి శ్రీ రేలంగి వెంకట్రామయ్య కూడా ఉన్నాడు అప్పుడు మారాజు మామయ్య కూడా పోతన భాగవతంలోని "నల్లనివాడు" పద్యాన్ని శంకరాభరణంలో పాడేడు.



మా మేనమామగారు శ్రీ దుగ్గిరాల పళ్ళంరాజు గారు (1900 - 1940)
మా అత్తయ్య గారు శ్రీమతి ము॥లు॥సు॥ సత్యవతి (1903 - 1936)

మారాజుమావయ్య భార్య శ్రీమల్యాల వెంకటసోమరాజుగారి పెద్దకుమార్తె సత్యవతి. మామయ్య వేర్వేరు చోట్ల ఉద్యోగాలు చేసేడు. VOLCART Brothers కాకినాడ శాఖలో పని చేసేవారు కొంతకాలం ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలలో కూడా పనిచేశారు. కొంతకాలం మా సత్యం అన్నయ్యతో కలసి విజయవాడలో ఆయుర్వేద వైద్యం చేసేవారు కొన్నాళ్ళు నౌపడాలో శ్రీపాట్నూరు స్వామిబాబుగారి వద్ద బర్మాషెల్ కంపెనీలో పనిచేసినట్టు విన్నా. 1930వ దశకం చివరి సంవత్సరాలలో బళ్ళారి, కడపలలో బాటా కంపెనీలో పనిచేసేవారు. పానుగంటి లక్ష్మీనరసింహంగారి కుమారుడు చిరంజీవిరావుతో కలసి జంటకవులుగా కవిత్వం వ్రాసేవారు. రాజుమావయ్యకి ఇద్దరు కుమారులు. ఒక కుమార్తె. ఈమెను మేనమామ మాల్యాల వెంకట శివరామకృష్ణ కిచ్చి వివాహం చేశారు. రాజు మామయ్య పద్యకవితా అభినివేశం అతని కుమారులకు అనంత లక్ష్మీనారాయణ మూర్తి (పుల్లం రాజు), విశ్వేశ్వరం (విశ్వనాథం) లకు కలగడంలో ఆశ్చర్యంలేదు. శ్రీ లక్ష్మీనారాయణ మూర్తి కాకినాడ పి.ఆర్.కాలేజిలో బి.ఎ. ప్యాసయి డివిజనల్ ఇంజనీర్ టెలిగ్రాఫ్స్ డిపార్ట్‌మెంట్‌లో విశాఖపట్నం లో ఉద్యోగంలో చేరాడు. అకౌంట్స్‌లో కృషి

చేసి టెలికాం ఎకౌంట్స్ తరఫున పూనా, ఒంగోలు, కలకత్తా, జైపూర్, హైదరాబాద్, విశాఖపట్నం, ఢిల్లీలలో పనిచేసి అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (టెలికాం అకౌంట్స్)గా రిటైరయ్యాడు. చిన్ననాటి నుండి పద్యకవిత్వంలో అభిలాషమెండు ఏ ఊరు, ఏ ప్రాంతం వెళ్ళినా అక్కడి ఆంధ్ర ఎసోసియేషన్‌లో ప్రముఖ పాత్ర వహిస్తూ తన కవితా వ్యాసంగానికి అవకాశం తీసుకుంటూండేవాడు రిటైరయిన తరువాత పూర్తిగా కవిత్వానికే అంకితమయి కవితా ప్రసూనాలు, కవితా సౌరభాలు, కవితామృతలహరి అనే మూడు తన కవితల సంకలనాలను ప్రచురించాడు. కవిసమ్మేళనాలు, అవధానాలలో తప్పనిసరిగా పాల్గొంటూ ప్రాంతంలోని కవి మిత్రులందరికీ స్నేహపాత్రుడయ్యాడు ఇదంతా రిటైరయాక పదిహేను సంవత్సరాలలోనే సం॥ 2002 జనవరిలో స్వర్గస్థుడయాడు బంధువులు, కవిమిత్రులు కలసి సహృదయకవితామూర్తి శ్రీ డి.ఏ.ఎల్.ఎన్.మూర్తి స్మారక సమితిని స్థాపించి, మూర్తి సంస్మరణలో ప్రతిఏటా ఒక కవిశేఖరుని సన్మానించుట, ఒక సాహిత్య ప్రసంగమును అందించుట చేస్తున్నారు.

ఇక రాజు మామయ్య రెండవ కుమారుడు విశ్వేశ్వరం (విశ్వనాథం) ఆంధ్రాయూనివర్సిటీలో ఎం.ఫార్మ్ చదివి అక్కడే లెక్చరర్‌గా చేరాడు. అతను ఫార్మకాలజీలో పిహెచ్.డి. చెకోస్లావాకియా రాజధాని ప్రాగ్‌లో చేసేడు. ఫార్మసీ విభాగంలో హెడ్, ఫేకల్టీ డీన్ మొదలగు అనేక బాధ్యతలు నిర్వహించి ప్రొఫెసర్‌గా రిటైరయ్యాడు అతని భార్య శ్రీమతి వెంకట రమణమ్మ నా సహాధ్యాయుడు ఆచార్య కాకర్ల వెంకట రామనరసింహం వద్ద తెలుగులో పరిశోధన చేసి నేను "కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేట్" తీసుకున్న స్నాతకోత్సవంలోనే ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుండి పిహెచ్.డి పట్టా తీసుకున్నది

మా రాజు మామయ్య పెద్ద కుమారుడు శ్రీ దుగ్గిరాల అనంతలక్ష్మీనారాయణ మూర్తి

23. పిఠాపురం - జాన్సన్స్ క్లబ్

నా భావతరంగాలు పిఠాపురం పైకి ప్రసరించడానికి కారణం, ఆంధ్రప్రభలోని 'శరథితరంగాలు'. అందులో దాశరథిగారు జ్ఞాపకం చేసి ప్రశంసించిన కవి కాళ్లకూరి గోపాలరావుగారు మా బంధువర్గంలోని వారు. ఆయన రచించి, సెట్టి లక్ష్మీనరసింహం గారికి అంకితం ఇచ్చిన సౌందర్యమంజరి పద్యకావ్యాన్ని కవిగారు స్వయంగా మా ఇంటికి వచ్చి, మా నాన్నగారయిన బాలాంత్రపు వేంకటరావుగారికీ, మా పినతండ్రి సూరిబాబుగారికీ వినిపిస్తుంటే 1930 ప్రాంతంలో నా బాల్యంలోనే విన్నాను. అంతేకాక, గోపాలరావు 'చంద్రలేఖావిలాపం' అనే మధ్యయుగపు పచ్చి శృంగారకావ్యం తాళపత్రప్రతిని పరిశోధనాత్మకంగా సంస్కరించి అచ్చు వేయించారని జ్ఞాపకం అది పిఠాపురానికి నాలుగు మైళ్ల దూరాన వున్న చంద్రపాలెం వాస్తవ్యులైన కూచిమంచి జగ్గకవి రచించిన హేళనకావ్యం (సెటైర్)! ఇవి గాక, వాల్మీకి జీవితంపై ఒక నాటకం కూడా అప్పటికే వ్రాశారు.

ముప్పయ్యవ దశకంలో పిఠాపురంలోని ప్రతి పేటా ప్రతి వీధీ, సంస్కృతాంధ్ర కవిపండిత ప్రకాండులతో కిటకిటలాడుతూ వుండేది రైల్వేస్టేషన్‌లో రైలు దిగి ఊళ్లోకి సాగిపోయే రహదారికి ఎడమవైపున ఆస్థాన కవిద్వయం వేంకటరామకృష్ణకవుల (ఓలేటి వేంకటరామశాస్త్రి - వేదుల రామకృష్ణకవి) మేడలూ ఎదురుగా కొంచెం పక్కగా వెనుక స్వాపర్సుపేటను ఆనుకొని ఆస్థానకవీ, ప్రసిద్ధనాటక కర్తా, సాక్షివ్యాససంపుటాల రచయితా, షేక్స్‌పియరూ, ఎడిసనూ కలిసి మూర్తీభవించిన కవీశ్వరుడు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి ఇల్లూ! ఇలా బైలుదేరిన రాచబాట, కొద్దిగా ఎడవమైపు మలుపు తీసుకుని, తిన్నగా రాజా వారి కోటగుమ్మం దగ్గరికి తీసుకెడుతుంది కోటగుమ్మం ఎడమవైపుగా పెద్ద బజారు దాటి దక్షిణంగా వెళ్లే రహదారి ఆ వీధి'కి అంటే కోటవారి వీధికి వెడుతుంది. "ఆవీధి"ని ఆ నాటి పిఠాపురసాహితీపరులలో లార్డ్ జాన్సన్, నడకుదుటి వీరరాజు గారిల్లు. ఈయన కాళ్లకూరి గోపాలరావుకి మేనమామ వారి వీధిన నడకుదుటి వారిల్లూ, కోట పక్కనే చర్లవారు, పిశుపాటివారూ, బారువారి వీధిని బాలవ్యాస వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రుల వారిల్లు వేదపారాయణ పంచకావ్యాల పాఠాలతోనూ, ఆ పక్కనే ఓలేటి పార్వతీశకవిగారు ఇల్లూనూ!

మా యింటికి ఎడమవైపున పక్క సందులో పిఠాపురం రాణీవారికి, ఆడపిల్లలకూ, ఊరి ఉత్తరపు కొసనున్న టౌన్ హాల్‌లో ఒకదానిలో ఊరిలోని మహిళల విద్యాభ్యాసానికి, సంస్కృతాంధ్రాలు నేర్పే జూలూరు తులశమ్మగారు కవయిత్రి వుండేవారు. ఆ సందుకి ఎదుటి

సందులో ప్రసిద్ధులైన హెడ్మాస్టరూ, కవీ అయిన కూచి నరసింహం గారుండేవారు. మా యింటికి కుడిపక్క ఒక పెద్ద మేడలో సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యస్థానం వుండేది. అందులో చర్ల నారాయణశాస్త్రి, గణపతి శాస్త్రి, పిశుపాటి చిదంబర శాస్త్రి, శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, పురాణం సూర్యనారాయణతీర్థుల వంటి సంస్కృతాంధ్ర విద్వాంసులు పని చేసేవారు. ఆ మేడకు పక్క సందులోనే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, వారి అక్కగారూ, 'అనసూయ' మాసపత్రికా సంపాదకురాలు వింజమూరి వెంకటరత్నమ్మగారు, బావగారు వింజమూరి లక్ష్మీనరసింహారావు గారు, టౌన్ హాలు వెనుకగా బారిస్టర్ పార్వతీశం రచించి ప్రసిద్ధి పొందిన మొక్కపాటి నరసింహశాస్త్రిగారూ వుండేవారు మా యింటి వెనుక పేటలో కుమారస్వామి చెరువు వొడ్డున వీణాచార్య సంగమేశ్వరశాస్త్రిగారిల్లు!

ఆనాటి పిఠాపురపు జాన్సన్స్ క్లబ్‌కు (విమర్శాదర్శ సాహితీకూటానికి) అధ్యక్షులైన మా వీరరాజు తాతగారు జ్ఞాపకం రావడానికి కారణం, ఈ వ్యాసం మొదటిలో పేర్కొన్న కాళ్లకూరి గోపాలరావుగారు ఈయన మా వీరరాజు తాతగారి సొంత మేనల్లుడు. మానాన్నగారు (బాలాంత్రపు వేంకటరావు గారు) ఒక వేలు విడిచిన మేనల్లుడు, వీరరాజు గారి సాహితీకూటంలో ఒక పక్క హాలులో ఆనాడు పది - పండెండ్రు మంది, ఏడెనిమిది పేక దస్తాలు కలిపి ఆడేబిజ్జిక్ అనే ఆట ఆడేవారు. ఆ సంరంభంలో మధ్య మధ్య 'నన్నయ యతులు - కొన్నింటి గతులను గురించీ, కవిరాజు శిఖామణియైన నన్నెచోడుని కవితాగుంభనాలను గురించీ, ఎఱ్ఱాప్రెగడా, నాచనసోముల తారతమ్యాల గురించీ చర్చలు సాగుతూ వుండేవి. వీరరాజు కవిగారికి విమర్శాదర్శక అనే సార్థక బిరుదాన్ని ఒకానొక సాహిత్యపరిషత్తు వారిచ్చి గౌరవించారు 1903 ప్రాంతంలో అచంట సాంఖ్యాయనశర్మ గారి కల్పలత పత్రికలో సమస్యాపూరణ కవిత్వపు పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయబహుమతులు పొందడమూ, 1906 ప్రాంతంలో పిఠాపురంలో వీరరాజు గారి దగ్గర బంధువర్గంలోని మా అమ్మగారిని పెళ్లి చేసుకొనడమూ, మా నాన్నగారినీ, ఓలేటి పార్వతీశం గారినీ, వీరరాజుగారికి మరింత సన్నిహితులను చేశాయి.

ఎఱ్ఱాప్రెగడ, నాచనసోములు హరివంశ రచనలో నాచనసోమునిదే పైచేయి అని వీరరాజుగారి వాదము. అతడికి లేని సంయమనం అనే గుణం లెస్సగా వున్నవాడు గనుక ఎఱ్ఱాప్రెగడదే పైచేయి అని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు. ఆనాడు చేసిన సాహితీచర్చలు, ఆనాటి భారతి పాఠకులకు సుపరిచితాలు!

వేంకటపార్వతీశ్వరుల `కావ్యకుసుమావళి` అనే రెండు సంపుటాల కవితా సంకలనాలు నడకుదుటి వీరరాజు పంతులు గారి తెలుగు పీఠికతో 1924లో ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయం ప్రచురించింది. ఆ సంపుటాలకు ఆంగ్లపీఠిక వ్రాసిన టేకుమళ్ల రాజగోపాలరావు గారు. ఆంధ్ర భాషా వికాసకర్త చిలుకూరి నారాయణరావుగారు, వీరరాజు గారికీ, వేంకటపార్వతీశ్వరులకు చాలా ఆత్మీయులైన మిత్రులు. వారూ, కవితరంగిణీకర్త చాగంటి శేషయ్యగారూ, వీరంతా పిఠాపురం వస్తూపోతూ ఉండేవారు. విమర్శాదర్శ సాహితీకూటంలో మిత్రులు. వీరరాజుగారూ, వేంకటపార్వతీశ్వరులూ కలిసి మూర్తి త్రయం అనే పేర శివపురాణం, బ్రహ్మపురాణం, వామన పురాణం, 10, 15 సంపుటాలుగా పురాణ గ్రంథమాలికగా ప్రచురించారు. విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల వీరరాజు గారు నడుపుతూండిన ముద్రణాలయం!

24. అలనాటి పిఠాపురం - కొందరు కవిపండితులు

పిఠాపురం రైల్వేస్టేషన్ నుంచి ఊళ్లోకి కోటగుమ్మానికి తీసుకెళ్లే రాజబాటకి ఎడమవైపున అప్పటి రాజావారి ఆస్థానకవీశ్వరులు జంట కవులైన ఓలేటి వెంకటరామ శాస్త్రిగారిదీ, వేదుల రామకృష్ణ కవిగారిదీ మేడలున్నాయి. ఆ మేడలకి ఎదురుగా దక్షిణంగా సామర్లకోట రైలు దారికి సమానాంతరంగా అర్ధమైలు నడిస్తే ఒక మసీదూ. దాని పక్క ఉమర్ అలీషా కవిగారి మేడా వస్తాయి. `ఉమ్రాలీషాగారు, కుక్కుటేశ్వర మాధవస్వాముల రథాలుండే మందబయలికి ఎదుట కావ్యకర్త. ధారళంగా ధారా శుద్ధితో సంస్కృతాంధ్రాలలో కవిత చెప్పగలిగే కవీశ్వరుడు. ఉర్దూ, అరబీ, పారశీ, ఆంగ్లభాషలు క్షుణ్ణంగా చదివినవారు. 1934 నుంచి 45 వరకు ఢిల్లీ లోని కేంద్రశాసనసభలో సభ్యుడు.

> **"మా తాతయు మా తండ్రియు ఖ్యాతిని అఖైలలీ మహాగురువర వి**
> **ద్యాతత్త్వము నేర్చిరి తద్రీతుల వివరింతు యోగరీతులు తెలియన్"**

అనే పద్యంలో చెప్పినట్లు, ఉమ్రాలీషాగా రింట మూడు - నాలుగు తరాలుగా అఖైలలీ మహాగురువుల పరంపరలో సూఫీ వేదాంతమును బోధించే గురుపీఠాధిపతులు. వీరి శిష్యవర్గంలో ముస్లిములే కాక అమలాపురం ప్రాంతాలకు చెందిన శ్రోత్రియ కుటుంబాలకు చెందిన బ్రాహ్మలు కూడా ఉండేవారు. ఉమర్‌ఖయ్యాం (పారశీకకవి) రుబాయీలకు కవిగారితెలుగు అనువాదం,

చంద్రగుప్త, అనసూయాదేవి కళ అనే మూడు నాటకాలు (సూఫీ) తత్వ సందేశము కీర్తనలు, స్వర్ణమాత అనే శీర్షికను కందార్థదరువులు, ఉమరాలీషా గారి తెలుగు రచనలు. వీరింటి కెదురుగా ఉన్న రథాల మందబయలులో కుక్కుటేశ్వరస్వామి. మాధవ స్వాముల రథోత్సవం రాత్రులలో తెల్లవార్లూ పెండ్యాల సత్యభామగారి (భామాకలాప) భాగవతమేళ ప్రదర్శన జరుగుతూండేది. ఎటేటా! ఆ ప్రభావమే ఆయనచేత తత్వసందేశాన్ని కీర్తనలుగాను, స్వర్గమాత కందార్థదరువులనూ రచింపచేసిందని అనుకుంటాను. సూఫీతత్వాన్ని గురించిన ఆయన పద్యం ఒకటి

కనదులే పాదరసంబు తాత్వికుడు బంగారంబు గావించిన
ట్లనుమానాస్పదమై వినాశకరమై యల్లాడు జీవుండు బ్ర
హ్మముగా మార్చెడు త్రోవ జూపితి నిధి ధ్యాసంబు సంధించి మీ
కనులన్ విప్పుడు శూన్యమందు హరి సంకాశంబు సంథిల్లెడున్!

కవి గారి ఇంటికెదురుగా పోయే బస్సు దారీ, దానిని దాటి ఇంకాస్త పైకి పోతే సామర్లకోట పోయే రైలుదారి దాటి అవతల చిత్రాడ వైపు వెళ్లే దారిలో పక్క పొలాల్లో ఉమ్రాలీషా గారి ముద్రాక్షర శాల ఉండేది. అప్పుడు ఊరికి అవతల ఈ ప్రెస్సూ, ఊరి లోపల కోటవారి వీధిని వి ఎమ్ ఆర్ ప్రెస్సూ (నడకుదుటి వీరరాజుగారి విద్వజ్జన మనోరంజని), రెండూ పని చేస్తుండేవి. కంపోజిటర్లూ, మొదలైన కార్యకర్తలు కొందరు కొన్నాళ్ళు ఒక ప్రెస్సులోను,కొన్నాళ్ళు మరొక దానిలోను పనిచేయడం ఉండేది. హనుమంతరావు అనే మా పెత్తల్లి కొడుకుతో నా చిన్నతనంలో కొన్నిసార్లు ఆ ప్రెస్సుకీ, కొన్ని సార్లు ఈ ప్రెస్సుకీ వెళ్లాను. వీరరాజుగారి ప్రెస్సులో కంపోజిటర్‌గా పనిచేసి క్రమంగా సాహిత్యపరిశోధనాకావ్య పరిశీలనలో వారి వద్దా, గురువుగారనబడే ఆస్థానకవిగారైన ఓలేటి వేంకటరామశాస్త్రిగారి వద్దా ఆశీస్సులందిన దాసరి లక్ష్మణస్వామి గారు, వర్ణన రత్నాకరము అనే నాలుగు సంపుటాలలో తెలుగు మహాకావ్య ప్రబంధాల నుంచి వివిధాంశాలపై కావ్య ఖండికలను సంకలనం చేసి ప్రకటించారు ఆ రోజులలోనే.

రైలు స్టేషన్‌కి ఎదురుగా తూర్పు పడమరలుగా పోయే రోడ్డు మీదున్న పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి ఇంటికి పక్కసందు స్టూవర్ట్‌పేటకి తీసుకువెడుతుంది ఆ పేటలో వేదకాలం నాటి భారతీయవ్యవసాయచరిత్రను, (ప్రసిద్ధమైన) మహాభారత విమర్శమునూ, ఉత్తరభారతకథాపరీక్షిచ్చరిత్రా అనే గ్రంథాలను రచించిన ఉద్దండ పండితుడు మా గురువుగారు హైస్కూలు పండితులు పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారిల్లుండేది. ఈయన అనేక ఉత్తర దక్షిణ భారత విద్వాంసుల, పాశ్చాత్య విద్వాంసుల పరిశోధనలను పరిశీలించి మహాభారత కథాకాలమునూ రచనా కాలమునూ ప్రతి ప్రధానపాత్ర స్వభావాది విశేషాలను అధునిక దృక్పథంతో

తర్కించి, భారత కాలము నాటి సాంఘికాదిపరిస్థితులపై తన అభిప్రాయాలను నిష్కర్షగా ప్రకటించి ఆ నాటి సాంప్రదాయిక విద్వాంసులైన కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారి వంటి వారితో వివాదాలకూ, కోర్టు కేసులకూ దిగి ఢీకొన్నవారు. ఇక కోటవారి వీధిన చీమలకొండ అద్వైత పరబ్రహ్మశాస్త్రి గారనే మా మరో గురువు గారు సంస్కృతాంధ్ర పండితులుండేవారు ఆయన సంగీతప్రియుడు. వివిధరాగాలలో పద్యాలను పాడనేర్చినవారు, మా తరగతిలో ఆయన నా చేత ఆ పని చేయించి ఆనందించేవారు.

కొత్తపేటలో మా ఇంటికి ఎడమపక్క నందు రాజావారి కుమార్తెలకూ, ఘోషా స్కూలులో ఉన్న మహిళలకూ తెలుగు - సంస్కృతాలు నేర్పే ఉపాధ్యాయిని జూలూరి తులశమ్మగారు కాపరముండేవారని వ్రాశానే, ఆవిడ కాపురం ఉండే ఇల్లు కొటికలపూడి సీతమ్మగారిది ఆవిడ ఒక కవయిత్రి రాణీ గారు దసరాలకు కోటలో ఏర్పాటు చేసే మహిళాసమావేశాలలో వీరిద్దరూ, జ్ఞానమాంబగారనే మరో విదుషీమణీ ఉపన్యాసాలిస్తుండేవారు.

మా మేనమామ దుగ్గిరాల పళ్ళంరాజు గారు, పానుగంటి వారి కుమారులు చిరంజీవిరావు, విజయరాఘవరావు, రమణరావుగార్లూ, కృష్ణశాస్త్రిగారి మేనల్లుళ్ల వెంజమూరి శివరామరావు, వెలమకన్ని సుబ్బరాయశాస్త్రిగార్లు, మా పెత్తండ్రిగారి కుమారుడు బాలాంత్రపు సత్యనారాయణరావు, చాగంటి శేషయ్యగారి కుమారుడు భీమశంకరం - వీరంతా సారస్వతమిత్రమండలిగా ఆనాడు సాహిత్య సేవ చేసే యువతరపు కవులు!

మా యింటికి ఎదురుగా దక్షిణోత్తరంగా సాగిపోయే రాచబాటను ది గ్రాండ్ నార్తరన్ ట్రంక్ రోడ్ అనేవారు. మా యింటికి కుడివైపున (ఉత్తరం) ఉండే దివానుగార్ల బంగళాలలో మొదటిదానిలో రఘుపతి వేంకటరత్నంనాయుడు గారుండేవారు ఆయన వీరేశలింగం గారితో పాటు, సంఘసంస్కరణలోను, హరిజనోద్ధరణ కోసమూ పాటుపడిన ఆధునికాంధ్రనిర్మాతల్లో ఒకరు. బ్రహ్మసమాజానికీ, మహారాజా వారి కుమారులకూ, కుమార్తెలకూ గురువుగాను, కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాల ప్రిన్సిపాలు గాను, ఆ తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయంలో కులపతిగానూ చేసి, కృతకృత్యులై, నిరంతర దైవధ్యాన నిరతులై దీనజనోద్ధరణకు దీక్షాదక్షులై బ్రహ్మర్షి అనిపించుకున్న మహనీయుడు! హేమచంద్ర సర్కారు వంటి రాష్ట్రేతర అతిథులు మహారాజావారి ఆహ్వానంపైని పిఠాపురం వచ్చినపుడు, నాయుడుగారితో బస చేసి, మా యింటి ముందు నుంచి పోయే గుర్రపు సార్టులో కనబడేవారు!.

25. ఆంధ్ర ప్రచారిణీ విభజన

ఇన్ని పుస్తకాలు పద్యకవిత్వం, గద్యరచనలూ, నవలలూ, పురాణాలూ వెలువడుతున్నాయే. ఈ రచనలన్నీ వ్రాసేదెవరు? వ్యవహర్త ఎవరు? వ్రాసే ఆయనే వ్యవహారం కూడా చేస్తారా? లేక, వ్యవహారాలూ, క్రయ విక్రయాలూ ఒకాయన చేస్తుంటే రెండో ఆయనే వ్రాస్తుంటాడా? పేరిద్దరిదీ ఉన్నా రచన ఒకరిదే కావాలా ఇలాటి చర్చలూ ప్రసంగాలూ జంట కవుల చుట్టాలూ, పక్కాలూ మిత్రులూ, శత్రులూ జంటకవులలో ఒకరిమీద ఒకరికి ఈర్ష్యాసూయలు కలిగే రీతిని సంభాషిస్తుండడమూ దానితో ఆ జంటకవులకు ఉక్రోషాలూ, ఈర్ష్యా కలగడము లేక, జ్యోతిషులో కూడా జంటకవులు విడిపోతారని ఒకసారి ఒక భావన కలిగింది. దానితో, నవలలూ, పురాణాలూ వీటిని వెలువరిచే గ్రంథమాలగా ఒక భాగమూ, స్కూళ్లకు పాఠశాలకూ పనికివచ్చే పుస్తకాలను ప్రకటించి వ్యాపారంచేసే. ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్ అని ఒక భాగమూ రెండుగా విభజించాలని వెంకటరావుగారు పార్వతీశంగారిని ఈ రెండింటిలోను నువ్వేభాగాన్ని తీసుకుంటావని అడిగారు. నవలలను ప్రకటించే విభాగాన్ని నేను తీసుకుంటాను. పాఠశాల విద్యా ప్రచారకమైన ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్ నువ్వు (వేంకటరావుగారు) తీసుకో అని చెప్పారు పార్వతీశంగారు.

ఆ ప్రకారం, జంటకవులు విడిపోయి, వేరువేరుగా కవిత్వాలు వ్రాసుకోవడం, భారతి వంటి పత్రికలలో కవిరాజ హంస (1), కవిరాజహంస (2) అని రచనాకారుని పేరు ప్రకటించుకోవడం మొదలుపెట్టారు.

ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయం నవలల ప్రచురణ విభాగం (పిఠాపురంలో) బారువారివీధికి వోలేటి పార్వతీశంగారింటికి వెళ్లిపోయింది. మానాన్నగారిని నిర్వహణలోకి ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్ వాచకాలూ, శతకాలూ, ఉపవాచకాలూ, నాండిటెయిల్డ్ టెక్స్టులూ, ఇటువంటివన్నీ వచ్చాయి.

కార్యాలయంలో ఒక పురాతనపు సొరుగుల డ్రాయరూ, వ్రాత బల్ల వాటిమీద కార్యదర్శిగా పని చెయ్యడానికి వింజమూరి శివరామరావు గారినీ నన్నూ కాకినాడ ఒంటెద్దుబండిపై బదిలీ ప్రయాణంలో పంపారు. కాకినాడలో సూర్యారావుపేటలో, డాక్టర్ వేదాంతం వెంకట కృష్ణయ్యగారి ఆసుపత్రి ముందు భాగంలో ఉండగా, వెనుక భాగంలో భారతీనికేతనం అనేపేర, మా రామయ్య పెదనాన్నగారి కుమారుడు, మానాన్నగారికి కార్యదర్శిగా పనిచేస్తుండిన మా సత్యం అన్నయ్య బాలాంత్రపు సత్యనారాయణరావు (బాలాంత్రం) అక్కడ బాలాంత్రం కంపెనీ అనీ జాతీయ గ్రంథమాల అనీ ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్ అనీ, భారతీనికేతన్ అనీ జాతీయ గ్రంథమాల అనీ బోర్డులు వ్రాయించి గోడలకి తగిలించాడు. శివరామారావుగారు తరువాత వేరే వ్యాపకాలలోకి వెళ్లి పోయారు. ఐనపర్తి శివశంకరరావు అనే ఆయన ఆ కార్యస్థానంలోకి ఆఫీసు మేనేజర్‌గా చేరుకున్నాడు.

26. మా పెద్ద చెల్లాయి (కనకదుర్గ ఉరఫ్ అనురాధ) ఆలమూరు నుండి రాక

మా పెద్ద చెల్లాయి తొమ్మిది రోజుల పసికందుగా ఉండగా మా అమ్మ వెంకట రమణమ్మ మరణించింది కదా! మా అత్తయ్య బుద్ధవరపు మహాలక్ష్మమ్మ ఆ పసికందును తనతో కూడా తీసికెళ్లి ఆలమూరు కాపురంలో దానికి పురిటి దోషాలవలన వచ్చిన లోపాలను తొలగించడానికి కాళ్ళుతోమించడం వంటి కొన్నిచికిత్సలు చేయించి పూర్తి ఆరోగ్యం వచ్చాక నాల్గేళ్ళ వయసులో పిఠాపురంలోని మా ఇంటికి తీసికొని వచ్చింది. వంకాయల పాటి రాజమ్మ (రాజక్కయ్య లేక వంకాయల పాటి రాజేశ్వరి) మా చెల్లెల్ని తన పక్కనే ఉన్న ఎఱ్ఱ జాంపండు మేష్టారు స్కూల్లో చేర్పించింది. అయన రేగిళ్ళ మాష్టారు సత్యనారాయణగారి కొడుకు సుబ్బారావు సంగీతంలో నాతో కలిసి సంంగీత పరిశోధనలు చేసారు. చెల్లికి పాపాయమ్మ అని ముద్దుపేరు బుద్ధవరపువారి ఇంట్లో పాపాయి అనేవారు. నన్ను మా ఇంట్లో అందరూ పాపాయి అనేవారు తేడా ఏమిటంటే అప్పుడపుడు పాపాయిగాడు అని కూడా అనేవారు.

క్రమంగా మా చెల్లెలు పెద్దదవుతూ ఉంటే నాన్నగారు మద్రాసునుంచి మంచి మంచి పరికిణీలు తెచ్చిపెట్టేవారు. ఊర్లో కొత్తగుడ్డలు కొని కుట్టించడం సంగతి అల్లా ఉండగా మా చెల్లాయి పెద్దదవుతూఉండేసరికి పిఠాపురం మహారాణి గారి ఘోషాస్కూల్లో (టౌన్ హాల్లో) చేరింది జూలూరి తులశమ్మగారు కృపమ్మా దేవరాజుగారు టీచర్లు. దుండెమ్మ కూతురు అమ్మాయమ్మక్క పాటలూ అవీ పిల్లల చేత పాడించేది నాకొక పాట ఇప్పటికీ జ్ఞాపకం వస్తోంటుంది. పాపాయమ్మ పాడుతూండేది అది

నూరిపోసేమందుకాదు
నూరువరహాలిస్తేరాదు

అంతేగుర్తుంది. ఇదేమో ఎడమకాలిపై చెయ్యివేసికుని పాడుతూండేది మాపిన్నేమో ఆకాలుమీద చెయ్యితీసేయి పాపాయమ్మ అని చెయ్యితీసే దాకా చెప్తూనే ఉండేది. ఇంకోపాటమామూలు ప్రార్థనాగీతం "ఆనందాసాగరుడు అరుగూ దెంచెను నేడు" ఇంటిపనులలో మాచెల్లి పాపాయమ్మ అన్ని విధాలా సహచరిగా పనిచేస్తూండేది. అంటే పీటలు వెయ్యడం కంచాలు పెట్టడం, నాన్నని, అన్నల్ని భోజనానికి పిలవడం భోజనాలయ్యింతర్వాత అక్కడ శుద్ధి చేసి కంచాలు కడగడం వంటివన్నమాట. ఈ పన్లుతాను చేసి కుంటుంటే నేను ఓ పుస్తకం తీసుకుని చదువుకుంటూ తనకి సాయంగా ఉండేవాణ్ణి పగలు రాత్రి కూడా. మా మండువాలో ఒక పంజరం వ్రేలాడుతూండేది దాంట్లో ఒక రామచిలక ఉండేది మా చెల్లాయిలాగే నాన్నా అన్నానికి అని చెప్పేకేకవేసేది. అంతేకాదు

మాపేర్లన్నీ దానికి తెలుసు. పాపాయి, పాపాయమ్మ, అన్నయ్య అని పిలిచేది. ఎవరైనా వచ్చి తలుపుకొడితే మేము వచ్చేవచ్చే అనే వాళ్ళం. ఆ చిలుక వక్కావక్కా అనేది. కోకిల కూతలూ రకరకాల ఈలలు వేసేది తలతిప్పుతూ పంజరంలో అడ్డకర్రమీద విన్యాసాలు చేస్తూండేది. దానికి భోజనం పళ్లూవగైరాలన్నీ మాపాపాయమ్మే పెట్టేది పక్కపెరట్లో గోడమీంచి జామకాయలు కాసి పండ్లుపండేవి ఒంటికాలి మీద నుంచుని రెండోకాలుతో పండు పట్టుకొని కొరికి తినేది పంజరంలోని రామచిలక!

సాయంత్రం అయ్యేసరికి ఆరోజుల్లో కరెంటు లేదు గనుక కిరసనాయలు బుడ్లు హరికేన్ లాంతర్లలో కిరసనాయలు పోసి మూడులాంతర్లు వెలిగించేది మా చెల్లెలు. ఒకటి మేడమీద మానాన్నగారి మంచంపక్క స్టూలు పైని రెండోది కింద హాల్లో మేడ మెట్లమీద మూడో మెట్టుమీద పెట్టేవారు రెండోమెట్టుమీద మేం కూర్చొనేవాళ్ళం. గోడసీటు నాది అని అనేవాళ్ళం. దేవుడు మందిరం దగ్గర గల అరుగుమీద మూడో లాంతరు ఆ అరుగుపక్కన పీటవేసికుని రాత్రిపూట మేంచదువుకొనేవాళ్ళం. ఈ దీపాలన్నీ వెలిగించే డ్యూటీ మా చెల్లాయి పాపాయమ్మదే.

సూర్యారాయ విద్యానంద పుస్తకం భాండాగారం సోములు బాబుగారి (రాజుగారి బావమరిది) మేడమీద ఉండేది ఆ లైబ్రరి నుంచి తెచ్చిన పుస్తకాలు ముందు నేను ఆతర్వాత మా చెల్లాయి చదివేవాళ్ళం. అవి ఆంధ్ర ప్రచారిణీ నవలలు. బరంపురం వేగుచుక్కవారి నవలలు. రాజమండ్రి సరస్వతీ గ్రంథ మండలివారి నవలలు ఇవి చదివేవాళ్ళం. ఈ రొటీన్ ఇలా సాగిపోతూ ఉండేది.

27. వరమ్మ జననం

అది 1931వ సంవత్సరం ప్రజోత్పత్తి నామ సంవత్సరం కార్తికమాసం. మా అమ్మడుపిన్ని (అంటే మా సూరిబాబు భార్య) గృహయజమానురాలుగా మా అమ్మ వెంకట రమణమ్మ దగ్గర తరిఫీదు అయింది. మా ప్రసాదం అన్నయ్యకూ (నాకూ) 11 ఏళ్లు దాటాక మా పిన్ని నెల తప్పింది. నెలలు నిండాయి నిడదవోలు దగ్గరి కలవలపల్లి నుంచి మా సూరిబాబు అత్తగారు పెమ్మరాజువెంకటరమణమ్మ అమ్మమ్మగారూ ఆవిడ చెలెలు చెల్లక్కఅమ్మమ్మా వచ్చారు పిన్నికి పురుడుపోయడానికి. నవంబరు 16వ తేదీ (1931) సుఖప్రసవం అయి మా యింటిలోనే చిన్న చెల్లాయి పుట్టింది. మా పెద్ద చెల్లాయి కనకదుర్గ లేక అనూరాధ ఆలమూరులో (ద్వారపూడి దగ్గర) మా అత్తయ్య (మేనత్త) మహాలక్ష్మమ్మ దగ్గర పెరుగుతోంది.

నేనూ ప్రసాదం అన్నయ్యా హైస్కూలులో (ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్ హైస్కూలు) 3వ ఫారం చదువుతూండేవారం. మా అమ్మకు పిన్ని వరలక్ష్మి పూజ చేయగా చేయగా పుట్టిందని చిన్నచెల్లాయికి వరలక్ష్మి అని పేరు పెట్టారు. మాకు 11 ఏళ్లు.

ఈ చిన్నచెల్లాయికి ఒక యేడాది నిండి, కాస్తవొళ్లు పెరిగేవేళకి నేను ఎత్తుకుని, కోక గుడ్డతో వీపుకి కట్టుకుని, ఒక మోచేతికింద యెరుకలసాని బుట్ట లాంటిదాన్ని నడుముకి నొక్కిపట్టి, మా యింట్లో దొడ్డీ వీధిసావడీ తిరుగుతూ అమ్మ, జీలకర్ర, దనియాలు, అల్చిప్పలూ, మోదుగుమాద కురంజవాము, సూదులోయ్ అని ఎరకలసానివేషంతో చిన "చెల్లాయి పాప"ని యిల్లూ దొడ్డీ అంతా తిప్పేవాడిని అ తరువాత యీ చిన చెల్లాయే నా రెండో కూతురుకి అల్లుణ్ణిచ్చింది.

28. ఆంధ్ర ప్రచారిణీ నిలయం మార్పు, మాయిల్లు 'పెళ్లివారి విడిది'

మాయింటి కింది అంతస్థుహాలూ, గదులలోనుంచి ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయాన్ని చర్చికి ఎదుటి మేడలవరుసలో పాన్నాక్షిగారి (వేపూరి వేణుగోపాలదాసుగారి) ఇంటికి రెండిళ్లు ఉత్తరం వైవుండే మేడలోకి మార్చారు.

మా యెదుటింటిలోని అవసరాల కొండలరావుగారు రెండవ అమ్మాయి రామలక్ష్మిపెళ్లికి మాయిల్లు విడిదిగా రెండిళ్లకీ మధ్యగా మెయిన్ రోడ్డుమీద పందిరివేశారు. పందిరి స్తంభాలకు రాత్రిళ్లు వెలిగించడానికి ఇలాయి బుడ్లు పెట్టారు మానాన్నగారూ ఆయనతోపాటు మా అన్నయ్యా నేనూ క్రింద కచ్చేరి హాల్‌లోకి వచ్చాము. మేడమీది గదులూ, వరండా, రామలక్ష్మి పెళ్లికొడుకు (మగపెళ్లివారి) కుటుంబానికి విడిదిగా యిచ్చారు. అయిదు రోజులపెళ్లి అయిదోరోజు నాగవిల్లి అయిపోయాక పెళ్లివారు ఆడపెళ్లివారింటిలోనే అప్పగింతలూ అవీ పూర్తిచేసుకొని, వాళ్లవూరు వెళ్లిపోయారు.

ఒకరోజు మధ్యాహ్నం పెళ్లికొడుకూ, అయన సొదరుడు మొదలైనవారు నాచేత పెళ్లివారింట్లో ఏవేవో పాటలు పాడిస్తూంటే ఆ పాటలకి నేను చేతులు తిప్పుకుంటూ అభినయం చేస్తూంటే నేను పాటకి తగినట్లు అభినయం చేస్తున్నాను. పెళ్లివారింటికి ఎదుటిల్లయిన మా యింటి వాకిట్లో నుంచి మా అన్నయ్య నాట్యం చేస్తున్న నన్ను చూసి, ఇంటికి వెళ్లడంతోనే ఒక బెత్తంతీసుకుని పెళ్లివారింట్లో భోగం ఆట ఆడతావా భడవకానా అని కొట్టాడు. చిత్రం ఏమిటంటే అప్పటికి

అతని మానసిక వికాసంలో నేను ఆడింది భోగం ఆట. సంగీతంలో, నాటకంలో భాగం అయిన నాట్యం అనే గౌరవం ఆనాటి మా అన్నయ్య మనస్సులో ఆ ఆటంటే అప్పటికింకా కలగలేదు. ఆ తర్వాత మా అన్నయ్య ఆంధ్ర మహాసభస్త్రీలశాఖలో ఉద్యోగం చేస్తూ ఉండినప్పుడు ఎప్పుడో కలిగిఉండాలి.

29. ఆంధ్ర ప్రచారిణీ సంక్షిప్త ఇతిహాసం (పరిచయం)

1903 లో బి.వి.రావ్ అండ్ బ్రదర్స్ అనే పేరుతో ప్రారంభించిన మా నాన్నగారి క్రియాశీలక రచనా సంతానం, నాకు ముందుపుట్టిన సహోదర సంస్థ 1911 లో ఆంధ్ర ప్రచారిణీ అయింది దానికి ఇప్పుడు సంక్షిప్త ఇతిహాసం ఇస్తున్నాను.

ఈ శతాబ్ది తొలి దశాబ్దాలలో ఆంధ్ర బాషా ప్రచారానికై ఉదయించిన మూడు ప్రచురణ సంస్థలు విజ్ఞాన చంద్రిక (1903 06). ఆంధ్ర భాషాభివర్ధిని, మచిలీపట్నం (1906). ఆంధ్ర ప్రచారిణీ గ్రంధనిలయం (1911).

అటువంటి ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయానికి సంపాదకులై ఐదారు స్వతంత్ర నవలలను, అనేక అనువాదాలనూ, స్వీయ రచనలకు ఇతివృత్తాలను శతాధికంగా వెలువరించి ఏభై ఏళ్ళపాటు అశేష ఆంధ్ర పాఠక లోకంలో భాషాభిరుచి గ్రంథ పఠనాభిలాష పెంపొందించిన భాషా కృషీవలులు వేంకట పార్వతీశ కవులు. వీరి నవలా శైలీలాలిత్యం ఒక తరం తరుణ పాఠకహృదయాలను, అభిరుచులనూ సరళం చేయించిన ఈ కవి రాజహంసల "ఏకాంత సేవ" ప్రణయోపాసకులైన నవ్య కవులకు భగవద్గీతాప్రాయమైంది వీరి "బృందావన" రసవాహినులు, కోమల "కావ్య కుసుమావళి" ఆధునిక కవితా నికుంజాలకు క్షీరతుల్యాలు' సంధియుగంలో యుగశక్తి వశులై ఈ జంటకవుల వ్యక్తం చేసిన ఆవేశాలకూ, ఆశయాలకూ తదనంతర తరాల నవ్యసాహిత్య పారిషదులు తమ రచనల ద్వారా ప్రబోధ ప్రచారాలు కలిగించారు. ఆ గ్రంథమాలలో విజ్ఞాన చంద్రిక, ఆంధ్ర భాషా వర్ధిని ప్రకృతి శాస్త్ర, మహాపురుష జీవిత. దేశ చరిత్రాది వివిధ గ్రంథాలతోపాటు సంవత్సరానికి ఒకటో, రెండో నవలలు కూడా ప్రచురించడం ధ్యేయంగాగల సంస్థలు కాగా ఆంధ్ర ప్రచారిణీ మాత్రం ప్రధానంగా నవలా ప్రచురణకు అంకితమైన సంస్థ.

మనోహర కథాకల్పితములైన నవలలు, నీతిదాయకంబులగు భాషాభివృద్ధి కారకములూ

నగుటచే చదువరులకు భాషాభిరుచి కలిగించి శాస్త్ర పురాణాది గ్రంథాలు చదివి తెలియదగిన విజ్ఞానాభివృద్ధి కలిగించుటకు కారణములై యుండు సదుద్దేశముతో మేమీ ఉద్యమమునకు పూనుకొంటిమి.

౩౦. భ్రమర కీట న్యాయం

పిఠాపురం ఊళ్లో మూడు ముద్రాక్షరశాలలుండేవి ఒకనాడు ఆ ముద్రాశాలలో అక్షరాల కూర్పు చేసేవారూ, అచ్చువేసేవారూ. అచ్చయిన ఫారాలను పెద్దపెద్ద కాగితాలను ఎనిమిదీ, పదహారు మడతలుగా మడిచి. వాటిని పుస్తకంగా కుట్టడమూ దానికి టైటిల్ పేజీ వేసేకో. వెయ్యక ముందో అంచులను కోసే కటింగ్ మెషిన్ ఉండేది.

ఒక్కొక్క ప్రెస్‌లో సీనియర్ కంపోజిటర్‌గా ఉండే మేస్త్రీలు, అచ్చువేసే పుస్తకాలన్నీ చదవడమూ, చదివిన పుస్తకాలను లోపలి విషయ సూచనలను బట్టి ఆయా పురాణాలుగా నవలలుగా పద్యకావ్యాలుగా, ఖండకావ్య సంపుటాలుగా సర్దుబాట్లు చేయడమూ, ఇలాగ తమ తెలివితేటలతో క్రియాశీలతనూ, కర్మకారిత్వాన్నీ పోషించుకుని గ్రంథ కర్తలూ రచయితలూ, పుస్తక భాండాగారాధికారులూ అయిన వారున్నారు.

దాసరి లక్ష్మణస్వామి అనే సీనియర్ ముద్రాశాలాకార్మికుడు నడకుదిటి వీరరాజు పంతులు గారి విద్వజ్జనమనోరంజనీ ముద్రాక్షర శాలకు "వర్ణనరత్నాకరం" అనే మహాకవుల వివిధ కావ్యాల సంపుటాలనుంచి ఎంపిక చేసిన వర్ణనల పద్యాలను సూర్యోదయము, సూర్యాస్తమయము, పర్వత వర్ణనా వంటివి.

అలాగే విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాలలో సీనియర్‌గా పని చేసిన అల్లంరాజు రంగ నాయకులు శ్రీ సూర్యరాయవిద్యానంద పుస్తక భాండాగారం (గ్రంథాలయం) లో లైబ్రరియన్‌గా ఉండేవారు ఆయన మంచి గేయకవిత్వమూ, పద్యకవిత్వమూ వ్రాస్తూ పుస్తక భాండాగారంలో లిఖిత పత్రికను నడిపే వారు. అటువంటి లిఖితపత్రికలో నాబోటి ఎదుగుతూన్న యువకవుల నవరచనలను సంచికలో వేసి, పుస్తక పఠనాలయంలో నలుగురూ చదవడానికి ఉంచేవారు. ఆ భాండాగారానికి విచ్చేసిన దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ వంటి కవి పండితులు ఆ లిఖిత పత్రిక చూసి, ననుబోటి యువకవులరచనలను పొడించి మెచ్చుకునేవారు.

మా ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయంలో బైండింగ్ సెక్షన్ కాగితాలను మడిచి, పుస్తకాలు కుట్టేశాఖలో పనిచేసే బూరెల సత్యనారాయణమూర్తి అనే కార్మికుడు పెద్దవాడవుతూండగా తెలంగాణాకు వచ్చేసి, చందా నారాయణశ్రేష్ఠి కంపెనీవారికి భారతం, భాగవతం, రామయణం బొమ్మలతో పిల్లల కోసం వ్రాసి అచ్చువేయించడానికి కారకుడైనాడు

మా అన్నయ్య నళినీ కాంతరావు హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నప్పుడు నేనూ మా ప్రసాదం అన్నయ్యా 3వ ఫారం లోకి వచ్చాము. మా అన్నయ్య ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాసయి ఇంటర్ చదవడానికి కాకినాడ కళాశాల హాస్టల్‌కి వెళ్లిపోయాడు. ఆ తర్వాతి యేటి దసరాలకి కాకినాడలో సరస్వతీగాన సభలకి వెళ్లడానికి మానాన్నగారు కాకినాడ మా అన్నయ్య దగ్గరకి నన్ను అతిథిగా పంపారు.

మా అన్నయ్యకి లేడీస్ హాస్టల్‌లో అద్దేపల్లి సీమంతిని (లక్ష్మణస్వామి నాయుడుగారి కుమార్తె) తులసి సుభద్రా మొదలయిన అయిదారుగురు గర్ల్‌ఫ్రెండ్స్ ఉండేవారు వారిమీద పద్యాలు వ్రాసిన మాఅన్నయ్య నాచేత రంగస్థలనాటక సంగీతపు పాటలు పాడించడానికి లేడీస్ హాస్టల్‌కి పంపాడు. చిన్నవాడిని కనుక నన్ను ఆగర్ల్ ఫ్రెండ్స్ తమతో కలిసి మెలిసి వారుపెట్టిన చాకొలెట్స్, బిస్కెట్లు తిని వాళ్లని నా పాటలతో ఆనందింపజేస్తే వాళ్లెంతో సంతోషించి, మా అన్నయ్యకి థాంక్సు చెప్పారు.

నేను కాకినాడ మసీదు బజారూ, వంతెనా దాటి జగన్నాథపురంలోని వులుగుర్త లక్ష్మీనరసింహం అత్తయ్యగారింటికి వెళ్లి, అక్కడకూడా పాటలూ అవీ పాడి, వాళ్లు మెచ్చుకున్న సంతృప్తి ఆనందాలతో, అన్నయ్యదగ్గరకి పిఠాపురంలో మానాన్నగారిదగ్గరికి వెళ్ళి వాళ్ల మెప్పుల గురించి చెప్పుకున్నాను.

31. పిఠాపురంలో బందావారి నాటకాలు, పాటలూ

పిఠాపురం దివాన్ కోకా సుబ్బారావు నాయుడు గారి కుమారుడూ, అసిస్టెంట్ దివానూ. అయిన కోకా శివనాధశాస్త్రి గారితో స్నేహంవల్లా, దివాన్ గారి బంగళా ప్రాంగణంలో పందిరివేసి, నాటకాలూ, పాటలూ ప్రదర్శించడానికి ఏలూరి నుంచి బందా కనకలింగేశ్వరరావు గారు పిఠాపురం వచ్చి, ఒకటి రెండు వారాలు మకాం వేశారు. అప్పుడు నాకు 12వయేడు.

ఒక వారాంతపు శని ఆదివారాలలో, పిఠాపురం కారనేషన్ బంగళాలో బసచేసిన జిల్లా మెడికల్ ఆఫీసర్ మేజర్ (కర్నల్) తాడిమేటి శంకరశాస్త్రిగారు, ఆయన భార్య శాంతాశంకర శాస్త్రిగార్ల సమ్ముఖంలో హార్మనీ తబ్లాలతో బందాగారు పాటలూ, పద్యాలూ పాడీ, నా చేత కూడా ఒకటి రెండు పద్యాలు పాడించారు నేను భాగేశ్వరి రాగంలో అరయన్ శంతనుపుత్రుపై విదురుపై అక్రూరుపై కుబ్జపై పరగంగల్గు భవత్కృపా రసము నాపై కొంత రానిమ్ము, నీ చరణాబ్జంబులు నమ్మినాను జగదీశా, కృష్ణ, భక్తప్రియా అనిపాడి ముగించే సరికి నా చెయ్యి పట్టుకులాగి, శాంతా శంకరశాస్త్రిగారు, తన వొళ్లో కూర్చొబెట్టుకుని భేష్ భేషని బుజ్జగించారు. మెప్పుకోలుగా! బందాగారు బసవరాజు అప్పారావుగారి పాటలను దివాన్ గారి బంగళా పందిరిలో పాడుతూ, ఆ పాటలను తిరిగి నేను వరసలు పెట్టి పాడుతూండడానికీ ఆతరువాత, టంగుటూరి సూర్యకుమారి మొదలైన కళాకారిణుల చేత రేడియోలో పాడించడానికీ కారణం అయినారు

పూర్వవిద్యార్థుల సంఘ సభలలో ప్రస్తుత విద్యార్థుల సంగీతపు పోటీలలో నాకు ప్రథమ బహుమతి వచ్చింది. హైస్కూలు పందిరిలో నాటకాల చౌచౌలలో నేను కనకతారనాటకంలోని కనకసేనుడి వేషంలో "మా అక్క తార జాడ గన్నారె మీరు" అని "ప్రకృతిలోని అడవిలోని భల్లూకము వ్యాఘ్ర గజమృగప్రతతు లారా" అని అడుగుతూ చదివి మూర్ఛపోయిన పద్యానికి, మా ఉపాధ్యాయులలో చాలా రిజర్వ్డుగా, సీరియస్‌గా ఉంటూండే చెల్లూరి సత్యనారాయణ గారనే ఫిజిక్సు మేస్టార్ రసావేశాన్ని ఆపుకోలేక తప్పట్లు కొట్టి వన్స్‌మోర్ అన్నారు మూర్ఛపోయిన నేను లేచి ఆపద్యాన్ని కమాసిరాగంలో మళ్లీపాడి, ఆనాటి పిన్నా పెద్దల మెప్పు పొందాను. నేను గెలుపులూ జయములూ పొందే ఆటస్థలం ఇదీ అని నాకు అప్పుడు తెలిసివచ్చింది

ఓల్డ్ బాయ్స్‌డే, (పాత విద్యార్థుల వార్షికోత్సవం పాఠశాల నిత్య వార్షికోత్సవము) వంటి ఉత్సవ సంధర్భాలలో జరుగుతూండిన సంగీతపు పోటీలలో ప్రథమ బహుమతీ నావశం అవుతూండడం పరిపాటి అయింది.

నేను సక్కుబాయి నాటకంలో శివయోగి పాత్రా, రామదాసు నాటకంలో కబీర్దాస్ పాత్రా వంటి వేషాలు వేసి, పాటలూ పద్యాలూ పాడడం, తోటి విద్యార్థుల తరగతి ఉపాధ్యాయుల మెప్పుపొందడం నాకూ మా ఇంటిలో పెద్దలకూ సంతోషకారణం అవుతూ వచ్చింది!

32. "ఆవీధి"లో అద్దంకి వారికి అతిథిని నేను

పిఠాపురంలో మాధవస్వామి గుడి నుండి మొదలయ్యే బారువారి వీధి దానికి ఒక చివర కలిసేకోటవారివీధి ఈ రెండు వీధులూ ఉండే మొత్తంపేటను `ఆవీధి" అనే వారట ఇందులో కోటవారివీధిని నడకుదుటి వీరరాజు తాతయ్యగారిల్లు. ఎదురుగా ఉప్పలూరి వారిఇళ్లు వీర్రాజు తాతయ్యగారింటి వరసలోనే విద్వజ్జన మనోరంజని అనే వీరరాజుతాతయ్యగారి ముద్రాక్షరశాల ఉండేవి.

బారువారి వీధి. కోటవారి వీధి కలిసేచోట బారువారివీధిలో అద్దంకి శ్రీరాములు గారిల్లుండేది. శ్రీరాములు గారు మాగుంటూరి పెద్దనాన్నగారైన బాలాంత్రపు వెంకట సుబ్బారావుగారికి వియ్యాలవారు అంటే మా పెద్దనాన్నగారి కుమార్తె అమ్మడక్కయ్య శ్రీరాములు గారి కోడలు! కొడుకు అద్దంకి సుబ్బారావుగారు మా బావగారు ఆయన ఏయేవూళ్లలోనో పశు వైద్యశాఖాధికారిగా ప్రభుత్వోద్యోగిగా పనిచేసి, పిఠాపురానికి బదిలీ అయినాడు బారువారి వీథిలో ఉన్న యిల్లు శ్రీరాములు గారికీ మా సుబ్బారావు బావగారికీ స్వగృహం. మా బావగారు పిఠాపురం వచ్చారంటే నేను వారింట్లో అతిథిని, బావగారి ఆస్థానగాయకుడిని.

అప్పుడు నేను పాడుతూండేపాటలు తెలుగు రంగస్థల నాటకాలలోని జనరంజకమైన పాటలు, సావిత్రి తులాభారము, సక్కుబాయి, మొదలైన నాటకాలలో, కపిలవాయి రామనాథశాస్త్రి, జొన్నవిత్తుల శేషగిరి రావు తుంగలచలపతిరావు, రామతిలకం, కన్నాంబ, స్థానం నరసింహారావు, బందా కనకలింగేశ్వరరావు మున్నగు రంగస్థల నటీనటులు పాడిన జనరంజకమైన పాటలు. (బసవరాజు అప్పారావు గారి గేయాలూ యెంకి పాటలు).

అద్దంకి సుబ్బారావు బావగారు వాళ్లింట్లో నా చేత ఆ పాటలు పాడించేవారు సుబ్బారావు గారికీ మా అమ్మడక్కయ్యకీ పుట్టిన సంతానంలో జ్యేష్ఠుడు, కొడుకు రామం (శ్రీరామచంద్రమూర్తి) అతని చెల్లెళ్లు ఇందిరా, రామలక్ష్మీకాక డాక్టర్ సుబ్బారావు గారి చెల్లెళ్లు గురజాడ వారికోడలు రమణమ్మా ఆమె చెల్లెలు తాయారూ వాళ్ళ పిల్లలూ, గురజాడ రామం మొదలు, అందరూ వినేవారు! ఇందిరా తెలుగు లెక్చరర్‌గారి భార్య (విశాఖపట్నం) శని, ఆదివారాలు వాళ్లింట్లోనే పాటలు పాడుతూ ప్రొద్దున్నా, సాయంత్రం, రాత్రి భోజనం అయాకనూ, సోమవారం ఉదయం, కొత్తపేటలో మాయిల్లు చేరుకుని, దుర్గాప్రసాదం అన్నయ్యతో కలిసి మెయిన్‌రోడ్డూ మిల్లు మేదరగూడెం త్రోవని, మాలపల్లే స్మావర్ట్‌పేటల గుండా హైస్కూలుకి వెళ్లి, వచ్చేటప్పుడు ఒకోసారి మాలపల్లీ చెరకుల కాలవా కుమారస్వామి గుడి దాటుకుంటూ, మాయింటి పక్కనుంచి పోయే కరపవారి కాలువ గట్టు రోడ్డు ద్వారా ఇల్లు చేరుకునేవాళ్లం!

33. అప్పుడప్పుడు జల్దంకివారి అతిథులం నేనూ అన్నయ్యా

మా అమ్మగారయిన వేంకటరమణమ్మగారికి ఒక వేలు విడిచిన పినతల్లి కూతురు అన్నపూర్ణపిన్ని. ఈవిడ మా చెన్నాప్రగడ వారికోడలు. మామేనమామ దుగ్గిరాల పళ్లంరాజు భార్య గోనేడ వాస్తవులు అయన సత్యవతి అత్తయ్యకి పురుడువచ్చినప్పుడల్లా, గోనేడకరణం గారి భార్య అయిన అన్నపూర్ణ పిన్నీ, మా పిఠాపురం చిన్నమ్మమ్మ రాజక్కయ్య వచ్చి సహాయం చేసే వారిద్దరూ ఇలా పురుళ్ళకేకాకుండా అన్నపూర్ణ పిన్ని మాధవస్వామి గుడివద్ద ఉన్న జల్దంకి వారింటికి వచ్చినప్పుడల్లా ఆవిడకి మేనల్లుళ్ళయిన జల్దంకి పెద్ద (పొడుగు) ప్రసాదరావు (పొట్టి లేక) చిన్న ప్రసాదరావులు మా అన్నయ్య నళినికి సహపాఠకులు హైస్కూలులో అన్నయ్యకి కబురువెళ్ళేది అన్నపూర్ణ పిన్నిఊళ్లోకి వచ్చిందని.

పిన్ని ఊళ్లోకి వచ్చినపుడల్లా నేనూ నళినీ అన్నయ్యా మాధవస్వామి గుడివద్ద ఉంటూండే జల్దంకి వారింటికి శని, ఆదివారాల్లో వెళ్లి వస్తూండేవాళ్లం.

ఈ అన్నపూర్ణ పిన్నీ, జల్దంకి అన్నదమ్ములైన పొడుగూ పొట్టి ప్రసాదరావుగారుల్లో పెద్దాయన కూతురు వాడ్రేవువారి కోడలు నారెండో అబ్బాయి శరత్ చంద్రకి వధువు కృష్ణవేణిని (కోడల్ని) ఇచ్చింది.

34. అసెంబుల్డ్ రేడియూ - 1

సాయంత్రం పిఠాపురం వాహ్యాళిలో ఊరి బైట వేపూరి వేణుగోపాల దాసు (శ్రీమతి పొన్నాక్షిగారి కుమారుడు) గారి ఫార్మ్‌లో విడివిడి భాగాలతో సమకూర్చిన (అసెంబుల్డ్) రేడియో వినడం.

స్కూల్ ఫైనల్ పరీక్షలముందు ప్రిపరేటరీ సెలవుల్లో ఉప్పాడ రైల్వేగేటు దాటితే వేణుగోపాలదాసు 'వేపూరి'గారి "ఫాం"లో, విడి భాగాలతో తయారు చేసిన రేడియో సెట్టు ట్యూన్ చేస్తూంటే, పెద్దాడరామచంద్రరావు, బొంగు వెంకటరావు వంటి మిత్రులతో కలిసి, బొంబాయి, లాహొర్, లక్నో వంటి రేడియోకేంద్రాలను వింటూండేవాళ్లం వాహ్యాళిగా అటు వెడుతూ. అది 1936వ సంవత్సరము. ఆ వినడంలో ఖుర్షిద్, రఫిక్, గజ్నవీ వంటి బొంబాయి సినీ కళాకారుల పాట కచ్చేరీలను హిందీ (సినిమాపాటలే) వినేవాళ్ళం. హిందుస్థానీ కచేరీలు, అప్పుడప్పుడు మద్రాసు

మ్యునిసిపల్ రేడియోనుంచి కర్నాటక సంగీత కచేరీలు వినేవాళ్ళం. ఉత్తరాది కచేరీలలో హీరాబాయి బరోడ్‌కర్, ఖాన్‌సాహెబ్ అబ్దుల్ కరీంఖాన్, ఓంకార్‌నాథ్ ఠాకూర్‌ల కచేరీలు వినేవాళ్ళం. మద్రాస్ రేడియో నుంచి చెంబై వైద్యనాథ్ అయ్యర్, మహారాజపురం విశ్వనాథ అయ్యర్‌ల కచేరీలు (జయతి జయతి మంత్రం జన్మసాఫల్యమంత్రం), ఖాన్‌సాహెబ్ అబ్దుల్ కరీంఖాన్ పాడిన జమునా కే తీర్ (లాహోర్ నుంచి), "పియా బిన్ నహీ ఆవతచైన్ వంటి పాటలను మొదట విన్నది అలా సమకూర్చిన రేడియోలోనే. నేను సింధ్ కాఫీ రాగంలో రచించిన "మరునిముసమె మనదో, కాదో' అప్పుడు రచించి వరుస అమర్చినదే. సైగల్ పాడిన లగ్ గమే చోట్, హాయ్ రామ్ రామ్ కూడా ఆ పాటవరుసలో కలుస్తుంది.

గొల్లప్రోలు రైలు దారిలో వజ్రఖండి, గొర్రె ఖండి కాల్వల ఒడ్డున గల తోటలలో షికారు వెడుతూంటే, పిఠాపురం హైస్కూల్ కిందితరగతులలో టీచర్‌గా పనిచేస్తూండే మిత్రుడు శ్రీకురుమెళ్ల వెంకటరావుకి కర్నాటక సంగీతపు రాగాలంటే పరమఛాందసమైన యిష్టం. ఆమేష్టరూ. పెద్దాత రామచంద్ర రావూ నా చేత కర్నాటక రాగాలను వర్ణాలనూ పాడించేవారు.

వేపూరి వేణుగోపాల దాసుగారు పిఠాపురం మహారాజాగారి దివాణానికి చెందిన వేపూరి పొన్నాక్షిగారి కుమారుడు. దాసుగారి కుమార్తె ఇందిర ఉన్నత పాఠశాలలో నాసహపాఠి ఆతర్వాత నేను విజయవాడలో పని చేస్తూండిన తొలి సంవత్సరాలలో పున్నమ్మ తోటలో కాపురం ఉండే రోజుల్లో ఇందిరగారు, ఆమె భర్తా మా కుటుంబానికి పక్క వాటాలోనే కాపురం ఉండేవాళ్ళు!

35. పిఠాపురం నుంచి కాకినాడ

స్కూల్ ఫైనల్లో సెలక్షన్ పరీక్షలుండేవి. ఆ పరీక్షల్లో నేను నెగ్గాను. కాని మా ప్రసాదం అన్నయ్య తప్పాడు. నేను ఎస్ ఎస్ ఎల్ సి పరీక్షల్లో నెగ్గి కాకినాడ కాలేజీలో ఇంటర్‌లో జాయిన్ అయినాను మా ప్రసాదం అన్నయ్య మెక్‌లారెన్స్ స్కూల్లో, ట్రైనింగ్ స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్ పరీక్షలో చేరాడు (టి.ఎస్.ఎల్.సి.).

కాకినాడలో (పి.ఆర్.) పిఠాపురం రాజావారికాలేజిలో ఇంటర్మీడియేట్‌లో చేరాను. దేశ చరిత్రలు, లాజిక్ సబ్జెక్టులు తీసుకున్నాను దేశ చరిత్రల్లో బ్రిటీష్ ద్వీపాల చరిత్ర (History of British islands) దేవుడు మాష్టారు దుగ్గిరాల రామకృష్ణారావు మాష్టారు చెప్పేవారు. భారతదేశ చరిత్ర వి నారాయణ రావు గారు, పిరాట్ల శ్రీరామంగార్లు చెప్పేవారు. లాజిక్ తర్కశాస్త్రం డిడక్టివ్

లాజిక్‌లు ఆర్. పొన్నుస్వామి గారు, ఇండక్టివ్ లాజిక్ కొత్తా సత్యనారాయణ రావుగారు చెప్పేవారు. ఉత్సవ సభల్లోను, ప్రత్యేక సభల్లోను ప్రిన్సిపాల్ పెద్దాడ రామస్వామి గారు మేఘ గంభీర గాత్రంతో క్వాడ్రాంగిల్ హాల్ ప్రతిధ్వనించేటట్లు ఉపన్యాసాలు చేసేవారు.

నేను ఇంటర్ జూనియర్ చదువుతున్నపుడు మా అన్నయ్య నళినీకాంతరావు బి.ఎ. జూనియర్ చదివేవాడు. ఆయేడే శాంతా శంకర్ పతకం కోసం ఒక సంగీత పోటీని కాలేజి నిర్వహించింది. అది క్వాడ్రాంగిల్ హాల్లోనే జరిగింది. డి.యమ్.ఓ (District Medical Officer) అయిన తాడిమేటి శంకరశాస్త్రిగారి భార్య శాంతాశంకర శాస్త్రి పేర ఉన్న ఆ పతకంకోసం సంగీత పోటీ కాలేజి తరఫున విద్యార్థుల్లో ప్రథమ బహుమతి శాంతాశంకరశాస్త్రి బంగారు పతకం నాకు, ద్వితీయ బహుమతి మా అన్నయ్య సహపాఠి అయిన బి.వి. నరసింహారావుకి వచ్చాయి. హైస్కూల్ విద్యార్థుల్లో ఈమని శంకరశాస్త్రికి వీణ వాద్యంలో ప్రథమ బహుమతి వచ్చింది. రెండు సబ్జక్టులు అంటే తెలుగులోను, దేశ చరిత్రలోనూ నూటికి 60% కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. అంటే డిస్టిన్‌క్షన్ (విశిష్ట కృతార్థత అన్నమాట) వచ్చింది. కాకినాడలో మానాన్న గారి స్నేహితుడు వడ్లమాని సోమనాథశర్మగారు అనే జ్యోతిష్కుడుండేవాడు వారిది మాది ఒకటే గోత్రం వాధూలస. మా అన్నయ్య జాతకం, నాజాతకం తీసుకొని ఆయన దగ్గరికి వెళ్ళాం. వీళ్ళు ఏ కోర్సు చేస్తే బాగుంటుంది తెలుసుకోడానికి నాకు కళాసారస్వత సంబంధమైన కోర్సు పై చదువు ఉంటుందని చెప్పారాయన

౩౮. అసెంబుల్డ్ రేడియో - ౨

నేను కాకినాడ పి.ఆర్. కాలేజిలో ఇంటర్ మీడియట్ చదువుతున్నా క్వాడ్రాంగిల్ హాలులో మా ఇంగ్లీషు తెలుగు క్లాసులు పూర్తయాక పుస్తకాలసంచీ భుజాన వేసుకుని ఫిజిక్స్ లాబొరేటరీ మీదుగా వెడుతూ అక్కడ డా. అయ్యగారి వీరభద్రరావుగారు ఫిజిక్స్ లెక్చరర్ అసెంబుల్డ్ రేడియో పెట్టొంటే వెళ్ళి వినేవాళ్ళం బొంబాయినుంచి హీరాబాయి బరోడేకర్, లక్నోనుండి ఉస్తాద్ ఫయ్యాజ్ ఖాన్, ఖాన్‌సాహెబ్ అబ్దుల్ కరీం ఖాన్ పాడిన పాటలు, ఖ్యాల్‌లు, గీత్‌లు వినేవాళ్ళం.

37. కాకినాడ నుండి వాల్తేరు (నేటి విశాఖపట్నం)

పై చదువులో చేరడానికి అంటే డిగ్రీ చదువులో చేరడానికి వాల్తేరుకి ఒక దరఖాస్తు, బెంగాల్ భోల్‌పూర్‌లోని శాంతినికేతన్‌కి ఒక దరఖాస్తు చేసాను. తెలుగులోను, చరిత్రలోను విశిష్ట శాతం మార్కులురావడం వల్ల వాల్తేరు ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుంచి నాకు సీటు వచ్చినట్లు జాబు అందింది. మా అన్నయ్య నన్ను వాల్తేరు లోని ఆంధ్ర విశ్వకళాపరిషత్ కళాశాలలో చేర్పించడం కోసం నాకూడా సాయం వచ్చాడు డా॥ మల్లవరపు వెంకట కృష్ణారావు గారి ఇంట్లో తిమ్మరాజు సత్యనారాయణరావు అనే విశ్వకళాపరిషత్ ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకుడు కూడా ఉంటుండేవాడు వారు మా బంధువులే వారింట్లో దిగాం. వాల్తేరులో డా॥ కృష్ణారావు గారికి, మల్లవరపు విశ్వేశ్వరరావు గారికి చెల్లెలు తిమ్మరాజు సత్యనారాయణరావుగారి భార్య కామేశ్వరి, తిమ్మరాజు సత్యనారాయణ రావుగారి చెల్లెలు త్రిపురసుందరి కాకినాడలో జగన్నాథపురంలో మా నాన్నగారి వేలు విడిచిన సోదరి పులుగుర్త లక్ష్మీ నర్సమాంబగారి కోడలు. నర్సమాంబత్తయ్యగారింట్లో నా చిన్నతనంలో కాపురం ఉండేవాళ్ళం అని ముందు ప్రకరణలో చెప్పాను.

కూర్చున్నవారు (ఎడమనుండి కుడికి) సర్వశ్రీ గంటి జోగిసోమయాజులు, విస్సా అప్పారావు, పింగళి లక్ష్మీకాంతం, వఝల చినసీతారామశాస్త్రి, గొర్తి వెంకటరావు, అబ్బూరి రామకృష్ణారావు, నిలుచున్నవారు కె.వి.ఆర్. నరసింహం, అక్కలగుంట జ్ఞానాభరణం, బాలాంత్రపు రజనీకాంతరావు, కొరంపూడి రాజమన్నార్

నేను చేరబోయేది తెలుగు, సంస్కృతం విషయాలుగా బి ఏ ఆనర్స్ లేక ఎం.ఏ. దీంట్లో సౌత్ ఇండియన్ హిస్టరీ అంటే దక్షిణ భారత చరిత్ర కూడా చెప్తారు. దాని ఉపన్యాసకులు గొర్తి

వెంకట్రావుగారు తెలుగు శాఖ అధ్యక్షులు పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య చరిత్ర సాహిత్య శిల్ప సమీక్ష ఆయన చెప్పేవారు. భాషాచరిత్ర ఉపన్యాసకులు గంటి జోగి సోమయాజిగారు. వ్యాకరణానికి వఝ్ఝల చిన సీతారామ స్వామి శాస్త్రి గారు, మన పద్యకవిత్వ పాఠాలు మహాభారతం చెప్పడానికి మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు, సంస్కృతం తెలుగు వ్యాసరచన, వీటి ఉపన్యాసకులు అబ్బూరి రామకృష్ణారావుగారు, సామ్యవాదం నుంచి సంస్కృత వాఙ్మయం దాకా అన్నివిషయాలు సాకల్యంగా చెప్పేవారు అబ్బూరి మాస్టారు.

ఆప్షనల్ విషయాలు ఏమున్నప్పటికీ తెలుగు, లెక్కలు (ఇలాగ) అందరికీ ఉమ్మడి తరగతిలో ఇంగ్లీషు ఎం.వి.ఎస్. సుబ్బారావు గారుచెప్పేవారు ఇంగ్లీషు తరగతిలో ఈ ఆత్మకథని అంకితం చేసుకొన్న వక్కలంక రామచంద్రరావు ఒకనాడు కలిశాడు. 3వ ఫారం తరువాత అదే కలవడం పలకరింపు నా తరగతి సహాధ్యాయులు కార్యమపురాజమన్నారు, కె.వి.ఆర్. నరసింహం, అక్కలగుంట జ్ఞానాభరణం తెలుగు సాహిత్య సంఘానికి అధ్యక్షుణ్ణి నేను. కార్యదర్శిరాజమన్నారు.

మేము తెలుగు సాహిత్య సంఘం తరపున కొన్ని సాహసాలు చేసాం. జనంలో పాతుకుపోయిన కొన్ని అభిప్రాయాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకొని. కొన్ని అపోహలు మాత్రమే అని రుజువు చేసాం.

మొదటిది తెలుగు సాహితీ సభలో మాట్లాడడానికి వక్తలుగా సాహితీ సమితి సభాపతి శ్రీ తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రిగారిని, శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారితో ఆసలు పడదు అనుకొన్న విశ్వనాథ సత్యానారాయణగారిని వక్తలుగా ఆహ్వానించడానికి కారకులం నేను, రాజమన్నారు.

విశ్వనాథ సత్యనారాయణగారు వాల్తేరు స్టేషన్‌లో దిగగానే అయనకు స్వాగతం చెప్పి, విశ్వకళాపరిషత్‌కు తీసుకొచ్చి స్టాఫ్ రూమ్‌లోని లక్ష్మీకాంతం గారికి, వైస్ ఛాన్సలర కట్టమంచి రామలింగారెడ్డిగారికి పరిచయాలు చేసినప్పుడు లక్ష్మీకాంతంగారు విశ్వనాథగారు ఒకరి నొకరు ఏరా! సత్యం బాగున్నావా పిల్లలు కులాసా ఏరా. కాంతం వదినె కులాసా? అని చెప్పి లక్ష్మీకాంతంగారు సత్యనారాయణగారు కుశల ప్రశ్నలు వేసుకొంటే మాకు ఒళ్ళు పులకరించింది.

రెండవది . ఇంకొక సభకి వ్యావహారిక భాషా వాది గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు గారిని కూడా మేం వక్తగా ఆహ్వానించాం. గంటి సోమయాజులుగారు వంటివారు మూతివిరుపులు విరిచినా లక్ష్మీకాంతంగారు, వైస్ ఛాన్సలర్ సి.ఆర్. రెడ్డిగారు సంతోషించారు (గిడుగంటే అక్కడవరికీ పడదు) తెలుగుతల్లి మీద పసిడి మెరుంగుల తళతళలు అనే పాటనేను వ్రాయడానికి కారకులు సి ఆర్.రెడ్డిగారే. తిక్కవరపు రామిరెడ్డి సభా భవనం కట్టించి దాని ప్రారంభోత్సవానికి పాడటానికి

గాను నన్ను పాట వ్రాయమన్నారు. వైస్ చాన్సలర్ సిఆర్. రెడ్డిగారు ఆ పాటే

పసిడి మెరుంగుల తళతళలు
పసిమి వెలుంగుల మిలమిలలు
గౌతమ కృష్ణలగలగలలు
గుడిబేగంటల గణగణలు
మెరసి మెరసి మించిన శుభపమయము తల్లి
తరళయశోపతి అనుపమిత రాగ వల్లి నీ
వర సంతతి చేమోడ్పులివె తెలుగు తల్లి

ఈ పాటని మా విధ్యార్థులం బృందగానంగా పాడుతుంటే నా భుజాల మీద చేయివేసి వైస్ ఛాన్సలర్ సి.ఆర్.రెడ్డి గారు కూడా పాడారు. పాడి తన ముగింపు ఉపన్యాసంలో ఈరచనకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దీని పల్లవి పసిడి మెరుగుల తళతళలుకాదు. వరసంతటి చెమోడ్పులివే తెలుగు తల్లి. ఇంగ్లీషు సాంగులో (Burden of the song) ఇంగ్లీషులో ఇలాగే ఉంటుంది. రజని, తన రచనలో ఆ సాంప్రదాయాన్ని అనుసరించాడని రెడ్డిగారు ప్రత్యేకాభినందనలు తెలిపారు.

మూడేళ్ల బి.ఏ. ఆనర్సు కోర్సులో మొదటి యేడు థర్డ్ ఆనర్స్ అనేవారు. ఆ తరువాత రెండేళ్లూ ఫోర్త్ ఆనర్సూ ఫిఫ్త్ ఆనర్స్ వేరు వేరు సబ్జక్టులు ఇష్టవిషయాలుగా, చరిత్ర, ఆర్థికశాస్త్రం, గణితశాస్త్రం, తెలుగూ, సంస్కృతమూ ఇలాగ ఏం తీసుకున్నా అందరినీ థర్డ్ ఆనర్సులో ఇంగ్లీషు కామన్‌క్లాస్. అదుగో అతరగతి ఉపన్యాసకులు ఎం.వి.ఎస్. సుబ్బారావు గారు, ఆ తరగతిలో కలుసుకున్నాం. నేనూ వి.ఆర్. రావు అనే రాముడూ అతడే ఈ నా ఆత్మకథకి కృతిభర్త.

ఇంగ్లీషులో 3వ ఆనర్స్ చివర పరీక్ష ఉండేది. మీరు వక్కలంక రామచంద్రరావుగారు కదండి అని నేనడిగాను. "థర్డ్‌ఫారం తర్వాత ఇన్నేళ్లకి థర్డ్ ఆనర్సులో ఒకే తరగతిలో సహాధ్యాయులం అయాం అయితే గారూ అనీ అండీ అనీ అనుకోఅక్కర్లేదు'' అవును, రజనీ అలాగే రాముడూ.

38. బెజవాడ గోపాలరెడ్డి గారి పెళ్లి, నవ్యసాహిత్య పరిషత్ కవులతో నా మద్రాసు ప్రయాణం

1938లో అప్పటి రాజ్యాంగం ప్రకారం మద్రాసు రాష్ట్రంలో రాజాజీ ప్రధానమంత్రిగా ఉండిన ప్రభుత్వంలో మంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి పెళ్లికి ముహూర్తం గురుదేవుడు రవీంద్రనాథ్ ఠాకుర్ జన్మతిథియైన మే 8వ తేదిగా నిశ్చయించారు. మదరాసు పచ్చయప్పా కళాశాల ఆవరణలో పెళ్లిపందిళ్లు, పెళ్లివారికీ నవ్యసాహిత్య పరిషత్సమావేశానికి ఆహూతులయిన కవిమిత్ర బాంధవుల కందరకూ విడిదులు పచ్చయప్పా కళాశాల హాస్టల్ గదులే! అప్పటికి వాల్తేరు ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో ఒక సంవత్సరం పూర్తయిన విద్యార్థిగా ఉండేనేనూ మహాకవులు తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రిగార్ల నాయకత్వంలో సమకూడిన యువకవి బృందంలో ఒకడను. శివశంకర స్వామి పద్మావతీ చరణ చారణ చక్రవర్తి అనే పద్యనాటకంలో నేను పరాశరుడి పాత్ర, బి.వి. నరసింహారావు పద్మావతి పాత్ర, గాడేపల్లి అనంతం జయదేవుడి పాత్ర ధరించాము. పెద్ద కవులూ, యువకవులూ, పిల్లకవులూ అందరూ, నవ్యసాహిత్య, పరిషత్ విశిష్ట సమావేశంలో తమతమ కవితలు చదివి, పెండ్లి కుమారుడయిన మంత్రిగోపాలరెడ్డి గారి సత్కారం పొందారు.

గోపాలరెడ్డిగారి పెండ్లి అయిపోయాక, ఆయా నవ్యసాహిత్య పరిషత్కవులకు పెండ్లి వారితరఫున సత్కారాలూ సన్మానాలు జరిగాక, మే 9, 10 తేదీలలో కవుల బృందాలు మద్రాసులో వేర్వేరు మిత్రుల గృహాలకు అతిథులుగా వెళ్ళిపోయారు

నేను కృష్ణశాస్త్రిగారూ, వారి కుటుంబం వింజమూరివారి కుటుంబముతో కలసి మాంబళం అరుశమ్మాళ్ వీధిలో 7వ నెం॥ ఇంటిలో కొమ్మూరు వెంకటరామయ్య కొమ్మూరి పద్మావతీదేవి గార్ల ఇంటికి చేరుకున్నాము. నా హెూల్డాల్‌లో నా బట్టలూ కాసిన్ని పుస్తకాలతోపాటు నేను కూడా కొమ్మూరువారింటికి మారాను.

కృష్ణశాస్త్రిగారితో పాటు వారి మేనకోడళ్లు వాళ్లమ్మగారు నాన్నగారూ, వేంకటరత్నమ్మగారూ బి.వి. నరసింహరావుగారూ కూడా, అక్కడకు మారాము. వింజమూరి శివరామారావు, గాడేపల్లి శంకరం కృష్ణశాస్త్రిగారి మామగారి తమ్ముడు వస్తూ పోతూ ఉండేవారు.

నేను శంకరం (గాడేపల్లి) తోగాని, శివరామారావుతో గాని కలిసి, మాంబళం నుంచి

మౌంట్‌రోడ్ మీదుగా ఎగ్మూర్ లో పసుమర్తి కృష్ణమూర్తి గారింటికి వెళ్లి ఆయన కుమార్తెలయిన అప్పటికి గుళ్లపల్లి విశ్వేశ్వరమ్మ, పసుమర్తి భానుమతులను వారింట్లో చూశాను

జూన్ నెలలో ప్రారంభం కానున్న మద్రాసు ఆకాశవాణి రేడియో ప్రసార కేంద్రం ఎగ్మూర్ మార్షల్స్‌రోడ్‌లో స్టూడియోనిర్మాణానికై ఎస్‌ఎబెస్టాస్ (పెద్ద పెద్ద) పలకలను ఎయిర్ కండిషన్ యంత్రాల ఏర్పాట్లనూ చూశాను.

ఆకాశవాణిలో సీనియర్ ఉద్యోగుల్లో ఒకరైన ఆచంట జానకిరాం నిర్వహణలో అక్కడ స్టూడియోల ఏర్పాటు అయేలోపునే ప్రారంభదినాన్నే ప్రసారం కావలసిన "అనార్కలీ" నాటకపు రిహార్సల్సు చూశాను. ఈనాటకాన్ని వింజమూరి వెంకటలక్ష్మీనరసింహారావుగారు, ఊటుకూరి నరసింహారావుగార్ల రచనలను, ముద్దు కృష్ణగారు రచించిన అనార్కలీలో ఒకటిరెండు రంగాలను రిహార్సల్సు చేస్తున్నారు.

అనసూయ సీతాదేవులు ఏదైన ఊరువెళ్లారో ఏమోకాని, కృష్ణశాస్త్రిగారి 'రారమ్మ రారమ్మ మందారమా రక్తకరవీరమా, మాలతీ మల్లికా, మాధవీకన్యకా శేషాలికా, పోయినది దానిమ్మ పూవ్వు, తీయతీయదనాలప్రోవు అనే పాటలను అనార్కలీ నాటకంలో నాందిగాను, తుది రంగం చివరా ప్రసారం కాపడానికి వావిలికొలను పద్మాసనీ వెంకటరమణరావు గార్ల కుమార్తెలు లీలా, సరస్వతులకు నేర్పమని జానకిరాం గారు నన్ను వినియోగించారు.

అప్పటికి సరస్వతికి పన్యాల రంగనాథరావుతో పెండ్లి ఇంకా కాలేదు. వావిలి కొలను పద్మాసనిగారు ఆచంట రుక్మిణమ్మగారికి (లక్ష్మీపతిగారి ద్వితీయ భార్య) అప్పాచెల్లెలు వరస! ఆ పాటల సంగీతం బి.వి. నరసింహారావు రంగస్థలంపై అనార్కలీ పాత్రధారీ అనసూయా దేవీ కాకినాడలో సమకూర్చారు అనార్కలీ పాత్ర, వచన నటనకోసం, రేడియోలో పసుమర్తి విశ్వేశ్వరమ్మగారి సోదరి భానుమతిని ఆచంట జానకిరాంగారు రిహార్సల్సులో ఉపయోగించారు.

39. సాహిత్య కళా విద్వద్బంధువు : శ్రీ బెజవాడ గోపాలరెడ్డి

1937 లో అవిభక్త మద్రాసు రాష్ట్రానికి అప్పటి రాజ్యాంగ చట్టం ప్రకారం ప్రధానమంత్రి శ్రీ రాజాజీ (చక్రవర్తి రాజగోపాలాచారి). ఆయన మంత్రివర్గంలో గోపాలరెడ్డి సాహిత్య కళా విద్వద్బంధువు అనే సార్థక బిరుదానికి అనన్య సామాన్యంగా అర్హులు!

1938లో ఆయన పెళ్లికి ముహూర్తం పెట్టవలసి వచ్చింది గురుదేవ రవీంద్రుల శాంతినికేతనంలో అంతేవాసిగా పట్టం పొంది వచ్చి ఉండడం చేత ఆయన గురుదేవుని పుట్టిన రోజు అయిన మే 8వ తేదీని ఆ ముహూర్తం పెట్టించుకున్నారు.

1953లో శతపత్ర సుందరికి బహుమతి వచ్చిన సందర్భంగా విజయవాడలో రజనికి అభినందన సభలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారితో

ఆ తరువాత నలభయిలలో నేను మద్రాసు రేడియోలో చేరి, కార్యక్రమ నిర్వాహకుడిని అయాక, శ్రీ జి.టి. శాస్త్రిగారు డైరెక్టరుగా ఉన్న రోజులలో మద్రాసు కేంద్రం నుంచి బెంగాలీలో రవీంద్రగీతాలు ప్రసారం చేశాను. శాస్త్రిగారు నన్ను పిలిచి, నువ్వు పాడిన రవీంద్ర సంగీతం తానెరిగిన మూల సంగీతపు వరుసలకి కొంచెం బిన్నంగా వుంటున్నాయని మంత్రి గోపాలరెడ్డిగారు వ్రాశారు నీ ఆధారాలేవిటని అడిగారు. శాంతినికేతన్ నుంచి రవీంద్ర సంగీతపు సంప్రదాయమునూ బాణీని సవ్యంగా సాగేటట్లు చూసే బాధ్యతాధికారాలు గోపాలరెడ్డిగారికి వుండేవి నేను నా దగ్గరుండిన స్వరబితాన్ అనే రవీంద్ర సంగీతపు స్వరాల పుస్తకాలను తీసుకువెళ్లి శ్రీ గోపాలరెడ్డిగారిని కలిసి, స్వరాలు స్వరబితాన్ నించిన్నీ పాడే బాణీ పంకజ్‌కుమార్ మల్లిక్ రేడియో సంగీత పాఠాల నుంచీ నేర్చుకున్నానని చెప్పాను.

ఆ తరువాత వచ్చిన రవీంద్ర జయంతులకూ (మే 8వ తేదీ), వర్థంతులకూ రవీంద్ర సాహిత్య సంగీతాలను సలక్షణం తెలుగు అనువాదాలతోను వివరణా వ్యాఖ్యానాలతోను ప్రత్యేక కార్యక్రమాలను శ్రీ గోపాలరెడ్డి నిర్వహణతోను, శ్రీ మల్లవరపు విశ్వేశ్వరరావు నిర్వహణలోను ప్రసారం చేస్తూ వచ్చాము.

1953 లో మద్రాసులోను 1958లో హైదరాబాద్‌లోను ఉంటూ వచ్చిన తెలుగు భాషా సమితికి శ్రీ గోపాలరెడ్డిగారి ఆధ్వర్యంలో నేను రెండు సాహిత్య పురస్కారాలు సంపాదించాను ఒకటి నా శతపత్ర సుందరి గేయ సంపుటానికీ, మరొకటి నా ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర వ్రాతప్రతికిని (1960-61లో) ఆంధ్ర వాగ్గేయకార చరిత్రకి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి వచ్చినప్పుడు కూడా శ్రీ రెడ్డిగారి ఆశీస్సు లభించింది. నేను బహుమతి తీసుకోడానికి ఢిల్లీ వెళ్ళినప్పుడు కేంద్ర ప్రభుత్వంలో ప్రసార శాఖామాత్యులుగా వుంటూండిన శ్రీ గోపాలరెడ్డిగారి ఇంట్లో అతిధ్యం ఇచ్చారు నాకు.

శతపత్ర సుందరిలో పాటలను 1956లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో రికార్డు చేస్తున్న రజని, టంగుటూరి సూర్యకుమారి

సమాచార ప్రసార శాఖా మాత్యులుగా గాని, ఆ తరువాత ఒకటి రెండు రాష్ట్రాలకు గవర్నరుగా గాని, ఉంటూండినపుడు శ్రీ గోపాలరెడ్డిగారి సాహిత్య విద్వత్కళా బంధుత్వం సర్వతోముఖంగా వికసించింది మిగిలిన సమాచార శాఖామాత్యులు గాని, రాష్ట్ర గవర్నర్లుగాని, తాము ఏ రాష్ట్రాన్నుంచి వచ్చారో ఆ రాష్ట్రానికి వారి భాషకీ చెందిన మనుష్యుల్ని మాత్రం పరిచయం కలిగి వుండడం ఇతర రాష్ట్రాలలో పేరు కెక్కిన వారిని కూడా మనిషి కనబడనట్లు పైకి చూడడమూ జరిగేది. శ్రీ గోపాలరెడ్డి కాశ్మీర్ వెళ్లినా, గుజరాతు వెళ్లినా, కలకత్తా వెళ్లినా, కేరళ, కర్నాటకా, ఒరిస్సా వెళ్లినా, ఆయా రాష్ట్రాల సాహిత్య సంగీతవిద్వాంసులను మేధావులను ముషాయిరాలలో కవి సమ్మేళనాలలో సంగీత సభలలో ఎంతో చనువుగా పలకరించి, మళ్లీ ఎప్పుడు కలుసుకున్నా పేరు పెట్టి పలకరించి కుశలప్రశ్న వేస్తూండేవారు. మన రాష్ట్రం వాడినయిన నా సంగతి సరే ముప్పయి నలభయి మందికి అవతల దూరంగా ఉన్నా సరే ఏమయ్యా రజనీ ఇటురా అని ఆప్యాయంగా పలుకరించేవారు.

వరంగల్‌లో 1981లో పోతన శత జయంతి సభ ఆయన అధ్యక్షతతో కొనసాగుతోంది నేను తిరుపతి నుంచి వరంగల్ చేరుకుని, గోపాలరెడ్డిగారు సభలో మొదట వరుసలో కూర్చున్నాక ముందరనే వేదిక ఎక్కుతుండగా నాకూ మాటాడే అవకాశం ఇప్పించమని అడిగారు. అన్నమయ్య పోతనల ప్రయోగాలలో... సామ్యాలున్నాయని'

40. 7, అరుళమ్మాళ్ వీథిలో

7, అరుళమ్మాళ్ వీథిలో కొమ్మూరి వారి ఇంట్లో ఉండగా ఒక సంఘటన జ్ఞాపకం ఉంచుకోవలసినది జరిగింది.

నా హోల్డాల్ కి బెల్ట్ ఉందికాని, ఆబెల్ట్‌కి తాళం కప్ప ఏదీ ఉండేది కాదు. నా హోల్డార్‌లో నా డైరీ నేను వ్రాసుకొనే దినచర్య పుస్తకం ఉండేది సాముద్రిక పుస్తకం ఒకటి చదివి. నా చేతిలో రేఖలకి నేనే ఒక రీడింగు అడైరీలో వ్రాసుకున్నాను.

"నా 20వ ఏడు పూర్తయేసరికి నా చదువు పూర్తయిపోతుంది. మా నాన్నకి ఇష్టంలేని ఒక అమ్మాయితో నాకు ప్రణయం ఏర్పడి, ఆమెను పెండ్లి చేసుకోడానికి నిశ్చయించడం, మానాన్నగారితో అభిప్రాయ భేదానికి దారి తీస్తుంది" అని వ్రాసుకున్నాను నా డైరీలో.

హోల్డాల్ తాళం లేకుండా ఓపెన్‌గా తెరిచే ఉండడంచేత, కృష్ణశాస్త్రిగారు నా డైరీ తీసి చదివారు. "ఇలా డైరీలో నీ యిష్టం వచ్చినట్లు వ్రాసేసుకుని, ఇలా నలుగురాడపిల్లలూ వచ్చిపోతూ ఉండే హాలులో నీ హోల్డాల్‌లో అడైరీ పెట్టుకోడంలో నీ ఉద్దేశం ఏమిటి? ఇక్కడికి వచ్చే పిల్లల్లో ఎవరినో ఈ పంక్తులు ఆకర్షించాలనేనా అని చెప్పి అడుగుతూ నన్ను దబాయించారు.

నాకు కళ్లవెంబడినీళ్లతో, గొంతులో డగ్గుత్తికావచ్చి, ఆయనతో ఇలా అన్నాను. "నేను నాడైరీ నా సొంతానికి వ్రాసుకున్నాను గాని, ఏ అమ్మాయిల మనస్సుని ఆకర్షించడానికి కాదు మానాన్నగారికి గాని, ఇంట్లో ఎవరికి గానీ చెప్పని నా హృదయరహస్యం మీకు చెప్పుతున్నాను ఇప్పుడు. మానాగరాజు బావ చెల్లాయమ్మా అనీ మీరు పాపా అనీ పిల్చుకొనే సుభద్రని నేనూ, నన్ను సుభద్రా ఒకరికొకరం కోరుకున్నాం. ఈ సంగతి మీకే మొదటి సారి చెబుతున్నా. మా నాన్నగారికి ఆవిషయం ఇష్టం లేని సంగతి అని చెప్పేసరికి ఆయనకూడా కళ్లనీళ్లు తుడుచుకుంటూ "మా పాపని గురించా వ్రాసుకున్నావు నీ డైరీలో" అన్నారు.

41. బుద్ధవరపు వెంకట సుబ్బారావు మావయ్య స్మృతి

మా మావయ్య చనిపోవడంతో ఆ తర్వాత ఆలమూరులో నున్న మా (మహాలక్ష్మమ్మ) అత్తయ్యని మా నాన్నగారు పిఠాపురం తీసుకువచ్చేశారు అత్తయ్యతో పాటు ఆమె కొడుకు లిద్దరూ, కూతురు 'భద్రం' కూడా ఆమెతో పిఠాపురం వచ్చేశారు.

మా బావ నాగరాజు కాకినాడలోనో రాజమండ్రీ లోనో బి.ఎ. పరీక్ష కడుతూఉండేవాడు. (ఎం.ఎస్.ఎం) సాంబం బావ పిఠాపురం హైస్కూల్లో 4వ ఫారం చేరాడు.

భద్రాన్ని హైస్కూల్లో ప్రవేశ పరీక్షకు పంపారు పిఠాపురం నుంచి మా చెల్లెలు పాపాయమ్మని తోడిచ్చి. కాకినాడలో రాములవారి గుడికి ఎదుట భారతీనికేతనంలో మాసత్యం అన్నయ్యకాపురం పెట్టి అక్కడ ఇంటిపెత్తనాన్ని అత్తయ్యకి ఇచ్చాడు. భద్రాన్ని సుభద్రా అనే వాడినినేను.

న్యూథియేటర్సు వారి సినిమాలు సైగలు హీరోగా నటించి పాటలు పాడిన సినిమాలు కాకినాడలో చూసేవారం ఫెలిక్సుటాకీస్‌లో చండీదాస్ సినిమాలో సైగలూ, ఉమాశశి హీరో హీరోయిన్లు వాళ్లు పాడిన ఆ యుగళ గీతాలు నేనూ సుభద్రా పాడే వాళ్లం.

"ప్రేం నగరమేఁ బనావుంగీ ఘర్ మైఁ
త్యజ్‌కే సబ్ సంసార్!
ప్రేమహీ ధర్మహై ప్రేమహీ కర్మహై
ప్రేమహీ సుఖకాసార్!
ప్రేమకే సంగ బితాయేంగే జీవన్
ప్రేమ్ హి ప్రాణాధార్!"

సుభద్రని అత్తయ్యా బావావాళ్లూ చెల్లాయమ్మ అనే వాళ్లు.

అత్తయ్య ఒకనాడు నాతో అంది. "ఒరే పాపాయి, నువ్వూ చెల్లాయమ్మా కలిసి పాడుతూ ఉంటే సైగలూ ఉమాశశి పాడుతున్నట్లే వుంది. చెల్లాయమ్మని నువ్వే చేసుకోవాలి సుమా" అని, నేను వినయపూర్వకంగా నవ్వాను. ఇలా ఉంటుండగా.

సుభద్రకి 12 ఏళ్లు పూర్తయ్యాయి. అప్పుడు నేను ఇలా పాడాను కాకిలాగా ఏమూలగా చూసేది అందుకని కాకి బావా అని పిలిచేవాణ్ని.

"కాకి చూపుల కన్నె కొలుకుల
కొత్త తీపుల చవులు పూయగ

తేనె బుగ్గలు గుంటలడగా
తీయపాటలు పాడుతుంటే
పం(డెండే వసంతమిట్టే
సారు తెంచిందోయ్
కాకిబావా కాకి బావా, కలిగెని రెక్కల్లో సత్తువ
ఎగరలేవో ఏకతంగా ఎరక రావుచు మింటిలోనికి
చూపులకునూ రంగునకునూ చూడగానువు కాకిబావవి
హాయిగానువు పాటపాడిన కోయిలెందుకిక"
ఒక్క పాటెలుగెత్తిపాడవ్
ఒక్కమాటె గెత్తి పాడవ్!
నక్కబావని కాను లే నేను
తలయెత్తి చూచుటకు
తటపటాయించకోయ్
కలిసి మాటాడుటకు
కళ్లలపడకుమోయ్"

ఎప్పుడు సిగ్గుతో నాతో ఎక్కువ మాటాడేది కాదు మా హృదయాలు మౌనంగా పరస్పరైక్యం చెందే యోగాభ్యాసం చేసేవి.

ఆ విధంగా, అత్తయ్యా వాళ్లూ, భారతీ నికేతనంలో కాకినాడలో ఒకయేడాదే ఉండి ఆ తరువాత మళ్లీ పిఠాపురం వెళ్లిపోయారు. పిఠాపురంలో ఆ సంవత్సరం చివరే అత్తయ్య చనిపోయింది

ఎం.ఏ. (బి.ఏ. ఆనర్సు) రెండోయేడు చదువుపూర్తయింది వాల్తేరు (విశాఖ)లో

42. పాపాయికి భద్రానికి పెళ్లిముహూర్తాలు

1939 వేసవి రాబోతోంది నేను సెలవులకు పిఠాపురం వచ్చాను ఒక రోజు నాన్న నన్ను తన గదిలోకి పిలిచారు.

నాన్న : నువ్వు కాకినాడ వెళ్లి పాపాయమ్మకీ, నాగరాజుబావకీ ఒక ముహూర్తమూ, భద్రానికీ దుర్గాప్రసాదుకీ (సూరిబాబు కొడుక్కి) ఇంకొక ముహూర్తమూ వచ్చే చైత్ర, వైశాఖ మాసాలలో సత్యం అన్నయ్యతో చెప్పి అక్కడ పురోహితుల చేత పెళ్ళి ముహూర్తాలు నిర్ణయం చేయించుకురా.

నేను : పాపాయమ్మకీ నాగరాజు బావకీ ముహూర్తం పెట్టిస్తాను. గాని, రెండోది తనకి ఏబావయిష్టమో భద్రాన్ని అడిగి ముహూర్తం ఆలోచించుకుందాం.

నాన్న : ఏ బావ యిష్టమో భద్రాన్ని అడగడం యెందుకు?

నేను . భద్రానికి రజనీబావని చేసుకోడం యిష్టం అని నాకుతెలుసు. అలా కాకుండా వేరే బావతో చేస్తే కష్టపడుతుంది.

నాన్న : మీకుమీరే నిర్ణయాలు చేసుకోవడమేనా? వాళ్లమ్మ ద్వారా రాగల ఇంటిఆస్తిపై ఆశతో వెంకటరావు భద్రాన్ని తన కొడుక్కి చేసుకున్నాడని అంటారురా. (నాకు కన్నీళ్లూ, గద్గదికావచ్చాయి)

నేను . నా పెళ్లికి నా చదువుపూర్తయేదాకా అంటే ఏప్రిల్ 1940 దాకా నాకుతొందరలేదు. పెళ్లి అంటూ చేసేశాక, విమర్శలు వాటంతట అవే సద్దుమణుగుతాయి. (మనస్సు సర్దుబాటు చేసుకుని అన్నమాటలు) నాన్న నిర్ణయానికి వ్యతిరిక్తంగా నిర్ణయం చేసి, చెబుతున్నానే అని గొంతులో వణుకూ, మాటలో తొణుకూ, కళ్లల్లో నీళ్లు కూడా వచ్చాయి నాకు.

కాకినాడ వెళ్లాను భారతీనికేతనంలో సత్యం అన్నయ్యతో మళ్లీ అవే సంగతులు మాటాడాను.

"నిర్ణయాలు పెద్దవాళ్ల ప్రమేయం లేకుండా మీ అంతట మీరు చేసేసుకోడమేనా" అన్నాడు సత్యం అన్నయ్య కూడా.

నాకు మళ్లీ కన్నీళ్లూ గద్గదికావచ్చాయి. సుభద్రకి ఏబావ యిష్టమో తెలుసుకుని ఆబావతో (అంటే నాతో) పెళ్లిచేస్తే న్యాయం లేకపోతే కష్టపడుతుందికదా అని అన్నాను. తనుకూడా మొత్తానికి ఒప్పుకున్నాడు. నాగరాజు బావకి మా పెద్ద చెల్లాయి పాపాయమ్మనిచ్చి పెళ్లి ఏప్రిల్ 12, (1939) తేదీని పిఠాపురం లోని మా యింట్లోనే జరిగింది.

"శ్రీనివాసన్‌గారు అనే అయ్యరుగారికి, నాతరపున 100 రూ॥లు ఇస్తే అదే నా కట్నంగా భావిస్తాను మరేమి అక్కర్లేదని నాగరాజు బావ చెప్పాడు. పెళ్లికొడుకుగా!

ఇంటిముందు పందిరా, పందిర స్తంభాలకి ఇలాయిబుడ్లూ బుద్ధవరపు వారింటి పెళ్లిళ్లలో ఆనవాయితీగా చేసే నిశానీ డప్పుల వాద్యం, పెళ్లిగన్‌సెట్ మేళానికి తోడుగా ఏర్పాటు చేశారు. మా మేనమామ దుగ్గిరాల పళ్లంరాజు తన మేనకోడలును పాపాయమ్మను ఎత్తుకుని తీసుకెళ్లి పెళ్లి పీటలమీద కూర్చొబెట్టాడు.

పెళ్లయిన నాటి సాయంత్రం (12, ఏప్రిల్ 1939) మా యింటి డాబామీద వీణ సంగమేశ్వర

శాస్త్రిగారి శిష్యురాలయిన తోట చెల్లాయమ్మగారు కీ.శే డాక్టర్ సంతం రంగారావుగారి తల్లి (గుడిపాటి వెంకట చలం మాకుటుంబమిత్రులు) గారి శిష్యురాలు లీలగారు వీణవాయిస్తూ క్షేత్రయ్య పదాలు గానం చేశారు.

43. ఆచార్య విస్సా అప్పారావు

మాస్టర్ సి.వి.వి. (కుంభకోణం కాంతారావు యోగి) ఆయన శిష్య ప్రముఖులు వేటూరి ప్రభాకరశాస్త్రి, విస్సా అప్పారావు, వావిలికొలను వెంకటరమణారావుగార్లు ఈ ప్రకరణంలో నా సహవిద్యార్థులు నాతో బృందగానం నేర్చుకోడానికి సహకరించక నన్ను బాధించినపుడు నేను వ్యాకులపడి మూర్ఛవంటి పరిస్థితిలో ఉండగా, మరోమిత్రుని గదిలో విస్సా అప్పారావు గారు రాగా నాకు తెలిసి అక్కడికి వెళ్ళి నేను వారికి నమస్కారం చేసి పరిస్థితిని చెప్పగా, "Oh! God let me be cured"అనే మంత్రము నా చేత చెప్పించి నాకు నేను తెలికపడేట్టు జరిపించారు. అపై విద్యార్థులు ప్రసన్నం అయ్యేట్టూ చేశారాయన ఆవిధంగా.

అబ్బూరి రామకృష్ణారావుగారి నదీ సుందరి నాటక బృందం వాళ్ళు నాకు `మృచ్ఛకటిక' నాటకప్రదర్శనకు పాటలు, సంగీతం కూర్చటం సంభాషణకు నేపథ్యసంగీతం నాచేత చేయించేందుకు నాటక విభాగంలో శ్రద్ధ చూపించిన ఆంధ్రవిశ్వకళా పరిషత్ రిజిస్ట్రార్ కూర్మా వేణుగోపాలస్వామి గారు నేను ఏ.ఐ ఆర్. మద్రాసులోనున్నప్పుడు నాచేత సెలవు పెట్టించి విశాఖకు రప్పించారు.

బెంగుళూరు రేడియోలో నేను స్టేషన్ డైరక్టరుగా ఉన్నప్పుడు రాళ్ళపల్లి వారి సప్తతిజన్మ దినోత్సవంకు (70వ పుట్టిన రోజు) అధ్యక్షుడుగా ఉండే భాగ్యం లభించింది. ఆ సందర్భంలో సభలో మాట్లాడుతూ "లోచూపు పైచూపుతో బక్కపల్చగ కనపడే భాగవతుడు" అని ఆయన్ను ప్రస్తుతిస్తే ఆయన ఎంతో ఆనందించారు.

"పతికో, పితకో సుతునకో ఆజీ
వితమూ విధేయతా
యుగయుగాలకు లభింపదో ఇక స్వతంత్రతా
మేలుకో ఓ భారతనారీ, మేలుకో"

అంటూ నాచే రాయించిన స్త్రీ వాద సాహిత్యంకు మూలకారుడు శ్రీ త్రిపురనేని గోపీచంద్ మా బావనాగరాజుకి మిత్రుడు, సహపాఠి. జీవితంలో ఒక్కోదశలో నాస్తికత్వమూ, వాస్తవికత,

అధివాస్తవికత అవలంబించినా చివరకు యోగుల మనస్తత్వానికి చేరుకున్నాడాయన. నాయందు ఆయన అభిమానం అపారం అలాగే 'మానవతి' చిత్రానికి ప్రొడ్యూసర్ వై వి రావు 'పండితజగన్నాథరాయల పై సినిమా తీశారు.

రావుకు నేనంటే ఎంతో అభిమానం. సినిమాలో ఉపయోగించుకున్నా. లలితా సహస్రం పుస్తకం ఒకటి నాకిచ్చి 'మాహేశ్వరి, మహాకాళి'' అంటూ పరాశక్తిపైన నా చేత ఒక పాట రాయించారు అది మరువరానిది దానికి డాన్స్ డైరక్టర్ ఉమారామారావు టీ.వీ.లో చాలా సార్లు అలేఖ్యాపుంజల నాట్యంతో ప్రదర్శించి జనరంజకం చేశారు.

తుమ్మపూడి సంజీవదేవ్ లోతయిన భావుకుడు. సాహితీ భావ సంపన్నుడు చిత్రకారుడు స్వరూప వైరూప్య చిత్రకళాదక్షుడు నాకు చేసిన పురస్కారాల్లో నేను ఎన్నికగ భావించిన వాటిలో ముఖ్యమైన పురస్కారం ''సంజీవదేవ్‌స్మారక పురస్కారం''.

44. "మా అబ్బూరి మాస్టారు - ఛందస్సుల్లో కొత్త మెలికలు"

1934 - 35 సంవత్సరాలలో 'నదీసుందరి' నాటకాన్ని ఇంటర్‌మీడియెట్‌కు తెలుగు పాఠ్యగ్రంథంగా పెట్టింది ఆంధ్ర విశ్వవిద్యాలయం. ఆ సంవత్సరంలో నేను మా పిఠాపురం హైస్కూలులో ఐదవ ఫారం చదువుతున్నాను. కాకినాడ కాలేజీలో ఇంటర్ చదువుతున్న మా అన్నయ్యకు అది పాఠ్యాంశం మాత్రమే కాదు కళాశాల వార్షికోత్సవంలో మా అన్నయ్య (నళినీ కాంతారావు) కావేరి పాత్ర వాళ్ల లెక్చరర్ కాళ్లకూరి సత్యనారాయణగారు అగస్త్యపాత్ర ధరించారు.

ఆ నాటకాన్ని చదివిన (పిఠాపురంలో) మా పినతండ్రి సూర్య నారాయణరావుగారు. కాళిదాస భవభూతుల సంస్కృత నాటకాలలో సమానమైన జనానాంతరసౌహృదం కలిగించే పాత్రలతో వాతావరణంతో గుండెలను దగ్గుత్తికతో పట్టివదలని ఉత్తమమైన తెలుగు నాటకాన్ని సృష్టించిన ప్రథమశ్రేణి కవులలో ఒకరు. ఈయనెవరో గాని అబ్బూరి రామకృష్ణరావుగారు అన్నారు. ఆయన చుట్టూ చేరి సాహిత్యవిషయాలు నేర్చుకుంటూ చర్చించే మా తరం పిల్లలతో! అప్పటికే ముద్దుకృష్ణగారు సంకలనం చేసి విడుదల చేసిన ఫెదర్ వెయిట్ పుస్తకం ఆధునికకవుల కవితాఖండాల సంపుటం 'వైతాళికులు' తీసుకొచ్చి అందులోని కొన్ని పద్యఖండికలు వినిపించాను. అబ్బూరి మేష్టారి కవితాఖండికలతో నా పరిచయం వాటితోనే.

పూజాశిరీషము లేరుకొంటివి, పోయివచ్చెదొ ఇవ్వనీ
తేజోవిలీన దృగంచలమ్ముల తేరి చూచెద వెవ్వనీ!

పెర్షియన్ - ఉర్దూ కవితలలో తరచుగా వినిపించే 'గజల్'లాగా తెలుగు గేయం ప్రాయాలని చేసిన ప్రయత్నం అది - అని తరువాత వాల్తేరులో ఆయన పాఠం చెప్పే తెలుగు ఎమ్.ఏ. తరగతులలో విద్యార్థిగా కలిసినప్పుడు చెప్పారు.

అది కాక, తెలుగులో సొంతంగా ఉన్న ఛందస్సులలోనే కొత్త అందాలను వెదుకుతూ ఆయన చేసిన ప్రయోగాలు ఆ నాటి 'వైతాళికుల'లోనే దర్శనమిచ్చాయి.

పూజాతిసాంద్ర కర్పూరంబులందు
ప్రాజ్ఞదీపాభోలవమ్ముల యందు
మడుగు పన్నవి పాట
పొడుచు వెన్నెల తేట
తలపు తిక్కన పల్కు తెలుగు పల్కులకు!
అఖ్షామనోహరలావణ్యమూర్తి, తేజోరుణాక్షి సందీప్త పాంచాలి
కనుల క్రొమ్మెరుపులు, కనుబొమ విరుపులు
కలవు తిక్కన పల్కు తెలుగు పల్కులకు'

రగడలో నుంచి ముత్యాల సరాన్ని ఎంచి కూర్చి, గురజాడ వారు తరువాతి తెలుగు కవులకు, మాత్రాచ్ఛందస్సుల్లో మరచిపోయిన 'గుమ్మడేడే' వంటి దేశిగేయాల వైపు దారి చూపిస్తే, వెంకట-పార్వతీశ్వరకవులు రాయప్రోలు, అబ్బూరి, తెలుగు ప్రజల దేశికవితాచ్ఛందస్సులలో మకుటాయమానమైన ద్విపదను ఆదరించి మార్గదర్శులయ్యారు. అబ్బూరి మాస్టారు ఆ ద్విపదలోనే రెండు పాదాలను రీవిగా నడిపి, మూడో పాదానికి బదులు రెండేసి ఇంద్రగణాలతో రెండు పంక్తులు పాడి, చివర మళ్లీ ఒక మామూలు ద్విపదపాదంతో ముగించడం, దేశి నుడికారపు అందాలను సంస్కృతసమాసాల తొలి రెండు పాదాలతో మేళవించి, తిక్కన కవిత్వంలోని ఉభయ భాషాకవి మిత్రతకు నివాళులర్పించారు.

ఈ విధంగానే ద్విపదచ్ఛందస్సులోరెండు పాదాల తరువాత ఒక చిన్న మెలికతో కొత్త మలుపు కనపరుస్తారు. 'ఆంధ్రవీరకంఠీరవ' అనే శీర్షికన కోడి రామమూర్తిపై వ్రాసిన కవిత.

"ఏ యశఃపారిజాతమ్ముల మాల, ఆంధ్ర
మాతృగ్రీవమందు ముత్యాల హారమై నెలంగా

తారాళి దూరమై తూలగా, చేరిపాడెదము నీ గౌరవగీతి!

"నీ విజయపతాక మాడెడు చోట, ఆంధ్రదేవి ప్రసన్నయై పాడు పాట

నవ్యశోభాప్తిచే

శాశ్వతదివ్యసందీప్తిచే మ్రోగెడు గాక అశాఖిత్తులదర!"

ఎరిగున్న ఏ తెలుగు ఛందం గాని, సంస్కృతవృత్తం గాని మాతృక అనడానికి వీలు లేకుండా, ఒక కొత్త ఛందస్సును 'సరోజినీ దేవి' పైని వ్రాసిన కవితలో ప్రయోగించారు పాదాల ఏర్పాటు మొదట ఆయన చేసినట్లుగానే చూపిస్తాను. తొలి ప్రొద్దు రేకలు తలనూపు మొకలు, కుడి లేని బంగారు గనులు, సరోజినీ గానశకలములు!

దారి తప్పిన చోట తెరిన సెలయేట

పారు మెల్లని పాట

చిందు తియ్యదనాల చెలులు, సరోజినీ స్నిగ్ధగీతములు!

మాస్టారు ముత్యాలసరానికి మాతృకామూర్తియైన రగడను నిర్లక్ష్యం చెయ్యలేదు. ఆయన సంధ్యాకామినిని ఆహ్వానించే గేయం.

"పూవు పొడితో పసుపు పూసుక, కావి యిగురుల కొంతులద్దుక

త్రోవ లెరిగిన చరణములతో రావె సంధ్యాకామినీ!

ఉదయకన్యలు కలశములతో పిదికి పంపిన యాలమందల

పొదుగులను క్షీరముల నింపితి గదవె సంధ్యాకామినీ!"

ఇందులో ఏడు మాత్రల గణాలే అయినా, పాడేటప్పుడు ప్రతీ యేడో మాత్రని అర్థం చెడకుండా గడుసుగా పాడిగిస్తే, ఎనిమిది మాత్రల రక్తి నిచ్చే ఆదితాళం పడుతుంది.

కవిత్రయంలో నన్నయ ఎర్రనలు తరుచుగా వాడి, నన్నయకు పూర్వంకూడా బెజవాడ శాసనం ద్వారా ప్రసిద్ధి పొందిన తెలుగు వారి దేశిచ్ఛందం మధ్యాక్కర' విశ్వనాథ సత్యనారాయణగారు అభిమానించి ఈ ఛందస్సుతో ఒక శతకమే వ్రాశారు. మా అబ్బూరి మాస్టారే మధ్యాక్కరలో ఆధునికమైన అందపు మెలిక చూపించిన నవకవిశేఖరుడు ఆ మెలిక పల్లవిలోనే స్వీకరించి, గేయశరీరంలో ఎర్రాప్రెగడ ధోరణి అవలంబించారు రెండు మధ్యాక్కర పాదాల యాక అ మెలిక మళ్లీ ప్రయోగిస్తారు. పృథివీప్రశంసలో

"ఓ విశాలావనీ! శోభాతిపావనీ!

అరంభ పుణ్యక్షణముల నీకుడు వివరింపనాటి

నీ యాదిసౌభాగ్య మెటుల, వెల్గెనో భవదీయశాటి
ఆకుపచ్చని యాకులో పండు వెల్తురు రేకులో
నిన్ను ప్రశ్నించగాజాల, నీనాటి ప్రొద్దుటి పూట
గంభీరమై ప్రవహించె, నీదు సౌందర్యంపు పాట!
కాంతికల్లోలినీ, వైభవశాలినీ!"

పాటంతా చదవాలనుంటే 'వైతాళికులు' పుస్తకంలోనో, 'అబ్బూరి' కవితాసంకలనంలోనో చదువుకోవాలి. వినాలంటే నేను పాడగా వినాలి!

45. బి.ఏ. ఆనర్స్ పరీక్ష - ఫస్టుక్లాస్ - మా వివాహము

అది 1939 - 40. నా ఎం.ఏ చదువులో చిట్టచివరి సంవత్సరం అన్నమాట 1940 ఏప్రిల్‌లో నా పరీక్షలైనాయి.

ఫిఫ్త్ ఆనర్స్ ఫైనల్ పరీక్షకు వెళ్ళినవాళ్లం నలుగురం తెలుగు సంస్కృతాలు సబ్జెక్టులుగా మా బ్యాచ్ ఐదవది తెలుగు ఎమ్.ఏ. చరిత్రలో మొట్టమొదటి సారిగా పరీక్షకి వెళ్లిన నలుగురికి ఫస్టుక్లాసు వచ్చింది. విశ్వకళాపరిషత్‌లో మా గురువులు ఇంట్లో మానాన్నా మొ॥ పెద్దవాళ్లు నేను ఫస్ట్ క్లాసులో ప్యాస్ అయినందుకు ఎంతో సంతోషించారు.



దంపతులుగా రజని, శ్రీమతి సుభద్ర

ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో బి.ఏ. ఆనర్సు ఫస్టుక్లాసులో ప్యాసయి డిగ్రీ తీసుకున్నప్పుడు

ఆ వెంటనే సుభద్రతో నా వివాహం ప్రాముఖ్యం వహించింది. పెళ్ళి కూతురు తల్లీ తండ్రీ చని పోయుండడం వల్ల ఆమె మేనత్త మాణిక్యాంబా ఆమె భర్త వాడ్రేవు మాచిరాజుగారు కోటిపల్లి దగ్గర సత్యవాడ గ్రామం కరణంగారు మేనకోడలు చెల్లాయమ్మ సుభద్ర పెళ్లి సత్యవాడ గ్రామంలో తమయింట జరిపించమని కోరారు. మా నాన్న ఒప్పుకున్నారు. కాకినాడ నుంచి కోటిపల్లికి ఓ రైలు దారి ఉండేది. ఆ రైల్లో ప్రయాణం మంచి రోమేంటిగ్గా ఉండేది.

కన్యాదాతలుగా మా నాగరాజు బావ, మా చెల్లాయి పాపాయమ్మ పీటల మీద కూర్చున్నారు. మా అమ్మ బదులు ఆమె రవికెను బొడ్లో దోపుకొని మా నాన్నగారు పెండ్లికుమారుడనైన నా పక్కన కన్యాదాన స్వీకారం కోసం కూచున్నారు మాణిక్యాంబ పిన్ని (కరణం గారి భార్య) పెళ్లి కొచ్చిన వారందరికీ అతిధ్యం ఇవ్వడం. చెల్లాయమ్మ (సుభద్రమ్మ) పెళ్లికి అతిధ్యం ఇవ్వ గలిగి నందుకు ఎంతో సంతోషించారు. కరణం గారు వారి భార్యాను. మా పెళ్ళి జరగిన తేదీ 14 - మే 1940వ సంవత్సరం. 14 మే తేదీ ప్రాముఖ్యం ఏమిటి? అని అడుగుతుండేవాణ్ణి మా ఆవిడని. తను ఆ విషయం మార్చిపోతుండేది. మన పెళ్ళిరోజు అని గుర్తు చేస్తుండేవాణ్ని. వెంటనే సిగ్గుపడ్తూనవ్వేది.

1945 నాటి జంటగా రజనీ సుభద్రలు

46. నా తొలి ఉద్యోగం

వెంకట పార్వతీశ్వర కవులలో పార్వతీశంగారు సంపాదకులుగా ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలలో ఆయనకు సహాయకుడిగా, ఉప సంపాదకుడిగా చేరాను. కొన్ని నవలలనూ పాఠ్యపుస్తకాలనూ పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ పెట్టించే పనిమీద ప్రతియేడూ మా నాన్నగారు మదరాసు వెళ్తుండేవారు. ఇప్పుడాపని నావంతయ్యింది.

గోరా, మాతృ మందిరం. వీటిలో గోరా టాగూరు బంగాలీ నవలకు వేంకటపార్వతీశ్వర కవుల అనువాదం, రెండవది స్వతంత్ర నవల.

అది 1940 డిసెంబర్ ఆఖరువారం మేనేజింగ్ డైరెక్టర్ మాపెత్తండ్రి కుమారుడు బాలాంత్రపు వెంకటకృష్ణారావుగారు. ఆయన తమ్ముడు అసలు వ్యవహర్త సత్యనారాయణరావు వ్యష్టి (వ్యక్తిగత) సత్యాగ్రహం లో జైలుకి వెళ్లారు.

నేను ఆంధ్రవిశ్వకళాపరిషత్తులో ఎమ్.ఏ.లో ఉత్తీర్ణుణ్ణై ఏడెనిమిది మాసాలయింది కాకినాడలో ఆ ఏడెనిమిది మాసాలూ పార్వతీశంగారు తయారు చేస్తున్న బాలసూర్యవాచకాల వేరువేరు తరగతుల పాఠ్యపుస్తకాల రచనలో సహాయం చేస్తుండేవాణ్ణి

ఆ యేటి జూన్ నెలలో కాకినాడలో మా ఆవిడతో కాపురం పెట్టి, ప్రచారిణీ పనికి ఆఫీసుకి (కార్యాలయానికి) వెళ్లివస్తూండేవాణ్ని నా సంగీత నాటిక చండీదాసులో అప్పటికే మూడువంతులు తయారయ్యింది వీటన్నిటితోటే నేను మద్రాసు వెళ్లాను. నేను వెళ్లిన వ్యవహారం (పాఠ్యపుస్తకాల నిర్ణయం) రెండూ మూడు రోజులలోనే పూర్తయింది.

మద్రాసులో సెలవులకి కాలక్షేపానికి వచ్చిన పింగళి లక్ష్మీకాంతంగారు, ఆ నగరంలోని లయోలా కళాశాల సాహిత్యోపన్యాసకులు ఆకొండి పరబ్రహ్మశాస్త్రిగారు, ప్రిన్సిపాల్ మోటుపల్లి రామానుజరావుగారు, శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు, వీరందరినీ కలిశాను దేనిని ఏ క్లాసుకో జ్ఞాపకం లేదుగాని, ఇంటర్ బి ఏ లకు మాతృమందిరం, గోరాలు రెండింటినీ మద్రాసు విశ్వవిద్యాలయము ఆంధ్రవిశ్వకళాపరిషత్తూ పాఠ్యగ్రంథాలుగా ఎంపిక చేశారు ఆయేడు!

అప్పటికే మా అన్నయ్య నళినీకాంతరావు ఆంధ్రమహాసభ, స్త్రీల శాఖలో దుర్గాబాయిగారితో మహిళలను బెనారెస్ మెట్రిక్కుకు, ఇంటర్ పరీక్షలకు ప్రయివేట్‌గా తరిఫీదిచ్చే పనిలో మైలాపూర్‌లో ఉండేవాడు. అతనితో బస డిసెంబర్ ఆఖరువారం లాయిడ్సురోడ్ ప్రక్క డాక్టర్ గారి బాలసుందర రావుగారింట్లో జరగిన ఒక టీ పార్టీకి మా అన్నయతో కలిసివెళ్ళాను. మద్రాసులోని ప్రముఖులలో

తెలుగువారు కొందరు ఆ పార్టీకి వచ్చారు వారిలో రేడియో తెలుగు త్రిమూర్తులున్నారు వారు ఆచంట జానకిరాం, డాక్టర్ అయ్యగారి వీరభద్రరావు, సూరి నారాయణమూర్తి గార్లు నన్ను అక్కడ పాడించారు. నన్ను రేడియోవారికి పరిచయం చేశారు అమర్నాడు నన్ను రేడియోకి రమ్మన్నారు.

ఆవెళ్లడమే రేడియోలో ఆడిషన్ జరిగింది. జనవరి (1941) 7వ తేదీన శ్రీశ్రీ రచించిన మోహినీ రుక్మాంగద గేయనాటిక ప్రసారం అవుతుంది. అదులో పాల్గొనడానికి నాకు ఒక కాంట్రాక్టు ఇచ్చారు.

ఆనాటకానికి సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావు. శ్రీ అవసరాల శేషగిరి రావు (సుమంగళి సినిమా హీరో గిరి) ఆరేడియోనాటకంలో యముడిపాత్ర, నాది బ్రహ్మపాత్ర. కమలకుమారి అనే అమ్మాయి మోహిని, రుక్మాంగదుడు శ్రీపారుపల్లి సత్యనారాయణ. శ్రీశ్రీ రచనలలో అచ్చయిన వాటిలో ఈనాటిక స్క్రిప్టు దొరకదు

ఇందులోనేను 'శమనా ఓ శమనా

వినిపించెద జరిగిన కథ' అనేది బ్రహ్మగా పాడిన పాట.

ఈవికసించిన జీవతకుసుమము

మౌళి తాల్పగా రావో' అనే పాట మోహినిగా కమలకుమారి పాడిన పాట ఇది నేను పాల్గొన్న మొదటి రేడియో ప్రోగ్రాం.

47. మా చిన్నబావ (సాంబం) కుటుంబం

మా చిన్నబావ అంటే మా ఆవిడ సుభద్రకు చిన్నన్నయ్య అతను మా సాంబం బావ! బుద్ధవరపు సాంబసదాశివరావు. ఆలమూరుకు దగ్గరగా ఉండే జొన్నాద సమీపాన ఉన్న హార్డింజ్ మిడిల్ స్కూలు (మాధ్యమిక పాఠశాల)లో 3వ ఫారం దాకా చదివాడు. ఆ తర్వాత పిఠాపురం వచ్చేశాడు. పిఠాపురం హైస్కూల్‌లోనే 4, 5, 6 ఫారంలలో చదివాడు నేను బొంగు వెంకటరావూ, చిల్లగె శ్రీనివాసరావూ, శివయోగి, సక్కుబాయీ విశ్వరాధభట్టరు వేషాలు వేసిన సతి సక్కుబాయి నాటకంలో జనాబాయి అనే శాస్త్రి బాబాయి (పెద్దాడ రామచంద్రరావు) వేషం వేసిన శాస్త్రి బాబాయికి సాంఘిక మిత్రురాలి వేషం వేశాడు.

మా చిన్నబావ కూడా నాకులాగే 1920లోనే పుట్టాడు కాని, అతను జూన్ నెలలో జన్మించాడు

ఆ తర్వాత పిఠాపురంలో ఎస్.ఎస్.ఎల్.సి. చేసి, కాకినాడ కళాశాలలోనే ఇంటరూ, బి.ఎ. (ఫిలాసఫీ) రెండూ వరుసగా కృతార్థుడయాడు మా సత్యం అన్నయ్య సత్యాగ్రహానికీ జైలుకీ వెడుతూ, సాంబం బావ ఉద్యోగమూ పెళ్లి వ్యవహారమూ గుంటూరులోని మా పెద నాన్నగారికి (బాలాంత్రపు వెంకట సుబ్బారావు గారికి అప్పచెప్పాడు. ఆయన తన స్నేహితుడైన పొగాకు కంపెనీ ఏజెంటు ఆదిరాజు వీరభద్రరావుగారి కుమార్తె లలితాదేవిని పెండ్లి చేశారు మొదటిలో కొన్నాళ్లు జిల్లా కోర్టు (గుంటూర్లో) నాజర్ ఉద్యోగమూ తరువాత ఎక్సైజ్‌శాఖ ఇన్స్పెక్టర్ ఉద్యోగం చేశాడు.

సాంబం బావ పరచూరు, మచిలీపట్నమూ, గుంటూరు వంటి పట్టణాలలో, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం చేసి, చేతులకు ఉంగరాలు చేయించుకుని ఉంగరాల ఇన్స్పెక్టరుగారు అని పిలిపించుకొనేవాడు.

సాంబం బావకీ లలితాదేవికీ, మొత్తం 10 మంది సంతానం కలిగేరు బుద్ధవరపు వెంకట సుబ్బారావు, (బ్యాంక్ ఆఫీసరు), నారాయణప్రసాద్, బుద్ధవరపు వెంకటకృష్ణరావు (ఆర్.టి.సి) లో సెట్విన్‌బస్‌లో డ్రైవర్ సహాయకుడి ఉద్యోగం, వెంకట రమణారావు మెడికల్ సేల్స్‌మేన్, బుద్ధవరపు శివరామకృష్ణ లేక బాబూజీ పత్రికలలో పనిచేస్తూ ఉంటాడు. బాబూజీ కొడుకులలో ఆఖరివాడూ, కుమార్తెల్లో లక్ష్మి, గాయత్రి, సరస్వతి, నిరుపమలేకనిమ్మీ మా చిన బావ సంతానం మొత్తం పదిమంది. తల్లిదండ్రులిద్దరూ పరలోకగతులయినారు. శివరామకృష్ణ - ఒక సంస్కృతి సంచికనొకదానిని తమతల్లిదండ్రుల దివ్యస్మృతికై ప్రచురించాడు.

48. మద్రాసు ప్రయాణం - పాఠ్యగ్రంథ వ్యవహారం

అభిప్రాయ బేధాల వల్ల మా నాన్న బాలాంత్రపు వెంకటరావుగారు పిఠాపురం వెళ్ళిపోయారు అక్కడే ఉంటున్నారు కాకినాడ గాంధీనగరంలో కీర్తివారింట్లో అచ్యుతరామ చంద్రమూర్తి ఇంట్లో సంపాదకుడుగా పార్వతీశం గారు ఉపసంపాదకుడుగా నేను కలుస్తూండేవాళ్లం ఉపసంపాదకుడుగా నేను కొన్ని పుస్తకాలు తీసుకొని మద్రాసు వెళ్ళి పాఠ్యగ్రంథ నిర్ణాయక సంఘ సభ్యులను కల్సుకుని ఆంధ్రప్రచారిణీ ప్రచురించిన కొన్ని పుస్తకాలను చూపి పాఠ్య గ్రంథాలుగా నిర్ణాయక సభ్యులలో కొందరు ప్రముఖులను కల్సుకుని వారితో మాట్లాడి ఆంధ్ర ప్రచారిణీ ప్రచురణ గ్రంథాలను పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించేందుకు మాట్లాడే బాధ్యత నాపై బడింది ఆసభ్యులందరూ మద్రాసులోనే ఉన్నారు. అందుచే మద్రాసు ఎళ్ళి కలవాలి.

ప్రయాణం ఖర్చులకోసం నేను రామచంద్రపురం వెళ్ళి ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయం అధ్యక్షులయిన బాలాంత్రపు కృష్ణారావు అన్నయ్యతో మాట్లాడి వారి అనుమతీ, ప్రయాణం ఖర్చు తీసుకోవాలి తీసుకెళ్తూ ఉన్న పుస్తకాలలో (పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించడానికి) రవీంద్రనాథ్ ఠాగూరు రచించిన గోరా, అనువాదం, వెంకటపార్వతీశ్వర కవుల స్వతంత్రనవల ఆంధ్ర ప్రచారిణీ ప్రచురించిన 20వ కుసుమం మాతృమందిరం ఇవి. రామచంద్రపురం వెళ్ళేను. పుస్తకాలు తీసుకున్నాను, ప్రయాణానికి కావలసిన డబ్బులు తీసుకున్నాను.

పనిలోపని నేను క్రొత్తగా వ్రాస్తూన్న సంగీత నాటకం, ఇంకా ఇతర రచనలు మరికొన్ని చండీదాసు ఇవన్నీ తీసుకెళ్లాను.

రైలు దిగడం తోటే మైలాపూర్‌లో అమరజ్యోతి హొటల్ ప్రక్కన ఉన్న కల్పక విలాస్ హొటల్ మేడ గదిలో ఉంటున్న మా అన్నయ్యతో బసచేసాను.

మా అన్నయ్య ఆంధ్ర మహాసభ స్త్రీల శాఖ గుమ్మడిదల దుర్గాబాయమ్మగారి ఆధ్వర్యంలో నడుస్తున్న స్త్రీల పాఠశాలలో పనిచేస్తూండేవాడు. అక్కడ అన్ని తరగతులూ చదవనక్కరలేకుండా ఎస్.ఎస్ ఎల్ సి మెట్రిక్యులేషన్, ఇంటర్ మీడియట్ కోర్సుల పరీక్షలకు వెళ్లేవిధంగా బోధిస్తూండేవాడు. అదే సమయంలో పిఠాపురం నుండి నాగరాజు బావ, మా చెల్లాయి పాపాయమ్మ, సుభద్రా కూడా వచ్చేరు. వీరందరికీ పాలాతోపులో ఒక వాటా తీసుకున్నాము. మా అన్నయ్యకి తోడు ఆపాఠశాలలో బోధించడానికి మరికొందరు ఉపాధ్యాయులుండేవారు పాఠశాల శ్రీబాగ్‌లో ఉండేది మిగిలిన ఉపాధ్యాయులలో ఒకరు ఎస్ టి.ఎల్.కె.వి నారాయణాచార్యులుగారు

మాచర్లవారింట్లో బసచేసిన శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారిని కలిసేను. ట్రిప్లికేన్‌లో బసచేసిన వేటూరి ప్రభాకరశాస్త్రిగార్ని కలిసేను. శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారిని, ఆకొండి పరబ్రహ్మ శాస్త్రిగారిని, శ్రీగంటి జోగి సోమయాజులు గారిని కల్సుకుని మాట్లాడేను గోరా, మాతృమందిరం ఇంటర్మీడియట్‌కి డిగ్రీకి పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించేరు.

49. జపాన్ బాంబు

1942 లో మద్రాస్ మీద జపాన్ వాడి బాంబు పడటంలో ఆంధ్రతీర ప్రాంతాల వరకూ వచ్చిన అనేక మంది మద్రాస్‌లో ఉంటున్న తెలుగువాళ్ళు తమ తమ ఆంధ్ర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. (తాత్కాలికంగా) నేనూ పిఠాపురం చేరాను. రేడియోలో వ్యవసాయదారుసికి లేఖలు వ్రాసి చదువుతూంటే గోపీచంద్‌గారు నన్ను చూడ్డానికని పిఠాపురం వచ్చారు. కాంట్రాక్టు పద్ధతిపై వచ్చేదట్టు పెంచితే బాగుండుననిపించి నాకు ఆ కాంట్రాక్టు అయ్యేట్టు, కాలవ్యవధి పెంచుతూ ఆదేశం వచ్చింది. 1943 నాటికి నా నెల జీతం వందరూపాయలయింది. ఐతే ఆ జీతం తీసికోకుండానే రేడియోలో ప్రభుత్వ అధికారిగా పదవి వచ్చింది. ఒక నల్లటి 'అచ్‌ఖాన్' కోటు (షేర్వానీ) సంపాదించి ఇంటర్వ్యూకి వెళ్ళి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయి ఆగష్టు 15న సెలెక్ట్ అయ్యాను. నాలాగే వై.ఎస్.రావు (శ్రీవాత్సవ), ఎస్వీసుబ్బారావు (బుచ్చిబాబు)లకూ ఇటువంటి అపాయింట్‌మెంటు లభించింది. మొత్తం పదిమందిమి ఉద్యోగుల మయ్యాము 1944 మే 8న ఉద్యోగంలో చేరాను. ఎటొచ్చీ ఆ'వంద' తీసికోలేదనే బెంగ ఉండిపోయింది. ఐతే 175 రూ॥లు జీతం' రేడియోలో అధికారిగా సోమవారం బుధవారం పదిహేను నిముషాలు నెలకో గంట నాటకం, ప్రత్యేక హాస్యవల్లరి, చిత్రమయజగత్, రోజూ గ్రామీణ కార్యక్రమం సరేసరి. తయారు చేయటంనాపని. ఒకసారి పాఠశాల సమయం కూడా నిర్వహించవలసి వచ్చింది.

"ఇంత నుంత నేల
ఇటువంటి నందె వేళ
విహరింపగ రావేల రావేల" అంటూ పాటలు, ఇంటర్వ్యూలు ఇలాసాగేవి

కృష్ణశాస్త్రి రాస్తే, నేను అయన పాట పాడటం లేక నేనే రాసి ట్యూన్ చేసుకోవడం జరిగేది. "మీ పాపకు ఓ పాట" అనినేరాసిన పాట, ట్యూన్‌లతో కార్యక్రమం కన్నమ్మగారి ఆధ్వర్యంలో సాగేది ఇది వారానికోరెండుసార్లు ప్రసారం అయ్యేది. ఆటవిడుపు అనేకార్యక్రమంకోసం "రారెచిన్న పిల్లలార" అంటూ టెడ్డీబేర్స్ పిక్నిక్ ట్యూన్‌లో సాగించి పాడించాను. ఈ పిల్లల కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు బాపు, ముళ్ళపూడి రమణలు! అలా వారానికో పిల్లల బృందం ఇందులో పాల్గొనేది. నెలకోసారి జానపదగీతాల కార్యక్రమం ఏర్పాటుచేసి అరుదైన పాటలు సేకరించి ప్రసారం చేసాను. నన్ను పెంచిన మా అమ్మమ్మ దగ్గర పాత మంగళగీతాలు సేకరించాను. అవి ప్రసారం అయితే విని సంతోషించారు మా అమ్మమ్మ. చుట్టూ చేరే పిల్లల్ని మామనవడు నాపాటలు వినిపిస్తున్నాడంటూ వాళ్ళకి పిఠాపురం పార్కులో రేడియో వినేలా చేసేది ఆవిడ.

నేను కాకినాడనుంచీ కలకత్తా మద్రాస్ మెయిల్‌కి కలిపేరైలు ఎక్కాను. సామర్లకోటకు మానాన్నగారు వచ్చి సాగనంపారు. అలా మద్రాసు తిరిగి చేరాను. అక్కడ రాయపేటలో నాకోసం ఓ రెండు గదుల మేడ ఇల్లు కుదిర్చారు దుర్గాబాయ్‌గారూ మా అన్నయ్యానూ

50. మా అన్నయ్య నళిని పెళ్ళి - 1948

1939 లో మా చెల్లెలు, బావ, మరదలు వాళ్ళ పెళ్ళి గురించి మాట్లాడినపుడు మానాన్నగారు మా అన్నయ్య పెళ్ళిగురించి ఏమి మాట్లాడలేదు. అంతవరకు పెద్దాడ రామస్వామి గారి నాలుగవ అమ్మాయి జ్యోతిష్మతిని మా అన్నయ్యకిచ్చి చేద్దామనుకున్నారు. 1939 ప్రాంతంలో అధికార్లతో అభిప్రాయ భేదాలవల్ల కాకినాడ పిఠాపురం రాజాకాలేజీ ప్రిన్సిపాల్ ఉద్యోగంనుంచీ రామస్వామిగారు తప్పుకోవలసి వచ్చింది. దాంతో అహమ్మదాబాద్‌లో అంబాలాల్ సారాభాయ్ పిల్లలకు ప్రైవేటు చెప్పడానికి ఆయన అహమ్మదాబాద్ వెళ్ళి పోయారు దేశకాలాలు పరిణామం చెందటంతో 1948 ప్రాంతములో రామస్వామి గారు భీమవరం కాలేజికి ప్రిన్సిపాల్ అయ్యారు. కాకినాడలో ఉన్నప్పటి నుంచీ ప్రిన్సిపాల్‌కి సన్నిహితుడైన మా సత్యం అన్నయ్య అటు రామస్వామిగారితో ఇటు మానాన్నగారితోను మాటాడి మా అన్నయ్య పెళ్ళి భీమవరం లో జరపడానికి నిశ్చయించారు. అప్పుడు గోపీచంద్ తీస్తున్న సినిమాకు సంగీతంపాటలు చేసిన నాకు కొంతధన సాయం కలిసింది. దాన్ని మానాన్నగారికిచ్చాను భీమవరం నుంచి మద్రాస్ వచ్చేక రేడియో మిత్రులకు, జర్నలిస్టులకూ, సినిమా స్నేహితులకూ పెద్ద విందు చేయగలిగాము. రామస్వామి గారమ్మాయి జ్యోతిష్మతి మావదిననాకు అంతవరకు ఆంధ్ర మహిళాసభ వుంటుండే 127, రాయపేట హైరోడ్‌లోని టి.ఆర్ వెంకట్రామశాస్త్రి, మిస్టర్ రాజగోపాలన్ ఇంట్లో సంస్కృత కాలేజి వుండే ఇంట్లో కాపురం ఉండేవారం మా అన్నయ్య వదిన ట్రిప్లికేన్‌లో వేరేఇల్లు తీసుకున్నారు. సంస్కృత కళాశాలకు ఎదుటి ఇల్లు వదిలి ఆళ్వార్ పేటలో చింతగుంట రాఘవరావుగారు కట్టిన ఇంట్లోకి నేను, మా ఆవిడ మారాము. చదలవాడ నారాయణరావు (హీరో) మా పొరుగు ఇంట్లో ఉండేవాడు.

51. మా చిరంజీవులు - 1

1951 జనవరి వస్తోందనగా మా ఆవిడకి నెలలు నిండాయి. మా చెల్లెలు, మా నాగరాజు బావ మాతోటే వుండేవారు మా ఆవిడ డాక్టరు చేత పరీక్ష చేయించుకోడానికై డా కల్యాణి నర్సింగ్ హెూమ్ (మైలపూర్)కి వెడుతూండేది. కనే రోజుల్లో ఓ రాత్రి కడుపులో బిడ్డకి కాలుమెలిక పడిందని నొప్పులు వచ్చేవేళ చేయించుకోండని చెప్పుకున్నారు. అది జనవరి 28 రాత్రి తెల్లవారితే నేను పుట్టిన రోజే అది. డాక్టర్ చూడటం ఆలస్యం అయింది. బిడ్డకాలేమో మెలికపడింది మెలికతీసి శ్రమపడాల్సివచ్చింది. అందులో హెమిప్లిజియా వచ్చి ఎడమ ముంజెయ్యి ముడుచుకు పోయింది బిడ్డ పుట్టేసరికి మాకు ఆచెయ్యి సంగతి తెలియలేదు పాకేవయసు వచ్చేసరికి సంగతి తెలిసింది. మా అమ్మాయి చిత్తానక్షత్ర ప్రథమ పాదంలో పుట్టింది.

మరో ఏడాదికి పోటీగా మా వదినె కూతుర్ని కన్నది. పాపపేరు మనోరమ. అన్నయ్య ఎగ్మూర్‌లో ఆచంట జానకీ రామ్ ఖాళీ చేసిన ఇంట్లో కాపురం వుండేవాడు.

మా ఆకాశవాణి స హెూద్యోగుల్లో నా సీనియర్లు శ్రీ కె పి. రంగాచారి, శ్రీ ఆచంటి జానకీరామ్ వంటివారు మీ ఇంట్లో లక్ష్మీపుట్టిందంటూ అభినందించేరు.

నేను, మా నాన్నగారు, సత్యం అన్నయ్య తిరుపతి ఎళ్ళేం. మా మొదటి పాపకు అప్పుడు ఐదవమాసం పిల్లకి వేంకటరమణ కుమారి అని అటుస్వామి పేరు ఇటు మా అమ్మపేరు కలిసి వచ్చేలా పెట్టాము.

52. మా సత్యం అన్నయ్య సన్యాసాశ్రమ స్వీకారం (1953)

మా పెద్దమ్మాయి (ఒకటో సంతానం) చి॥సౌ॥రమణ కుమారి పుట్టుకలో ఎడమ పక్క (కాలూ, చెయ్యీ) కొద్దిగా పక్షవాతంలావచ్చింది ఆవిషయం మాకు 3, 5 మాసాలలో చంటిబిడ్డ ప్రాకలేకపొడము ఎడమ గుప్పిటితో ఏవస్తువూ పట్టుకోలేకపోవటమూ మాకు తెలిసిందే 3వ, 5వ మాసాల మధ్య.

5వ మాసంలో పాపకి వేంకటేశ్వర స్వామి పేరు పెట్టు కుందామని నిశ్చయించాక, మానాన్నగారు, మా సత్యం అన్నయ్యా నేనూ, తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుపతీ, తిరుమలా వెళ్లాము. సత్యం అన్నయ్య జేబులో మా రైల్వే రిటర్న్ టికట్లూ (మద్రాసు నుంచి తిరుపతీ, దర్శనానంతరం తిరుపతి నుంచి మద్రాసూ ప్రయాణాలకు రిటర్న్ టికట్లు ఇచ్చేవారు) మా ముగ్గురుకీ యాత్రకీ బసా భోజనాలు వగైరా ఖర్చులకీ సరిపడా సత్యం అన్నయ్య దగ్గరే ఉంచాము గోవిందరాజ స్వామి దర్శనానికి వెళ్లినపుడు, స్వామి గర్భగుడిలో క్యూలో స్వామికి నమస్కరిస్తున్న సత్యం అన్నయ్య జేబులోంచి క్యూలో ఉన్నవాడో, పైగా ఉన్నవాడో ఒక దొంగ మనీపర్సు తస్కరించి ఆ యాత్రికుల గుంపులో కనబడకుండా ఎవరికీ దొరక్కుండా పారిపోయాడు.

మేం - దైవసన్నిధిలో జరిగిన నష్టానికీ తీర్థయాత్రలో మాముగ్గురికీ కలిగిన కష్టానికీ విధినీ, దైవాన్నీ, జాతకాలను విమర్శించుకుంటూ వీధిలోకి వచ్చేసరికి ఆంధ్రా బ్యాంక్ కనబడింది 1953వ సంవత్సరం అది నేను మద్రాసు రేడియోలో ఉద్యోగినీ, నాజీతం అక్కౌంటు ఆంధ్రా బ్యాంక్ మైలాపూర్ బ్రాంచిలో ఉంది కనుక, తిరుపతి బ్రాంచిలో మేనేజర్‌గా ఉన్న ఇంటర్‌లో నా సహపాఠీ సత్యం అన్నయ్యకు రాజకీయ మిత్రుడైన మొసలికంటి తిరుమలరావుగారి తమ్ముడూ అయిన మధ్వారావును కలుసుకుంటే మద్రాసు బ్రాంచి మేనేజర్ తో మధ్వారావు మాట్లాడి నాకు మా కష్టం కడతేరే ధనసహాయం చెయ్యమని అడగొచ్చు అని మా పెద్దలిద్దరికీ చెప్పాను ఆపని చేశాము మధ్వారావు మద్రాసు బ్యాంకు తో మాట్లాడి మాకు ఇంకా తిరుపతిలోను, తరువాతి తిరుగు ప్రయాణంలోను ఖర్చులకీ మద్రాసు తిరుగు ప్రయాణానికి మా ముగ్గురు టిక్కట్లకు కావలసిన డబ్బు తీసుకున్నాం.

మద్రాసు చేరుకున్నాగాని, మా సత్యం అన్నయ్యకి అప్పటికే కొన్నాళ్లనుంచీ ప్రయత్నంలో ఉన్న సన్యాస స్వీకారం మనోనిశ్చయం దృఢపడింది.

బులుసు సాంబమూర్తి గారికి కాయకల్ప చికిత్స చేసి, వారు కాయ కల్ప చికిత్స చేయించుకున్న 150 ఏళ్లకు పైన వయస్సులో ఉన్న తపస్వీజీ మహారాజ్ అనే గురుయతీంద్రుడు

కాకినాడలో విష్ణు సేవాశ్రమం స్థాపించిన స్వాములవారు మా సత్యం అన్నయ్య చేత సన్యాసాశ్రమం స్వీకరింపజేశారు.

సత్యం అన్నయ్య, అప్పటినుంచీ స్వామి సత్యప్రకాశ్ అనే సన్యాసాశ్రమనామం స్వీకరించాడు మానాన్నగారూ, రాజకీయ గురువైన బులుసు సాంబమూర్తిగారూ, రామచంద్రపురంలోని వకీలయిన బాలాంత్రపు వేంకటకృష్ణారావు అనే (మా పెద్దనాన్నగారి మూడో కొడుకు) మా ఇంకో పెద్దన్నయ్యా వారందరి యెదుటా సత్యం అన్నయ్య స్వామిజీ అయిపోయాడు. స్వామీజీ గా ఆయన ఉన్నావ్ కౌశికలం అనే ఊళ్లల్లో ఉత్తర ప్రదేశ్‌లో హిమాలయాలలో ఉండీ కొన్ని పుణ్యక్షేత్రాలలో రెండుమూడు పర్యాయాలు దీర్ఘకాల తపస్సులు చేశాడు. ఒకటి రెండు తపస్సులయాక కాకినాడ విష్ణు సేవాశ్రమం లోని సన్యాసులతో అభిప్రాయ (మత) భేదాలుఏర్పడి, క్రమంగా అవతార్ మెహెర్ బాబా ప్రభావంలోకి వచ్చి, స్వామి సత్యప్రకాశ్ మెహరానందగా కాకినాడలో ప్రసిద్ధుడయినాడు.

ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయం పుస్తక ప్రచురణ సంస్థా ఆ 'కామాటం' అంతా స్వామిజీకి రామచంద్రపురంలోని అన్నగారికొడుకైన బి.ఎస్ ఆర్. రావు (బాలాంత్రపు శ్రీరామచంద్రరావు) అనే ఫిలడల్ఫియా ఆర్థిక శాస్త్ర వేత్త అయిన అబ్బాయికి అప్పగించాడు "ఆంధ్ర ప్రచారిణీ" పుస్తక సంస్థ ఇప్పుడు కాకినాడలో ఉంది. అబ్బాయి (బి.ఎస్.ఆర్ రావు) తన బార్యా పెద్ద కొడుకూ అంతా ఇప్పుడు హైదరాబాదులో ఉన్నా కాకినాడలో బి.ఎస్ ఆర్ రావు మేనల్లుళ్ల రక్షణలో ఉంది. యాజమాన్యమూ నిర్ణయాధికారాలూ అన్నీ అధికారికంగా బి.ఎస్.ఆర్.రావే!

53. మా చిరంజీవులు - 2

1953 వచ్చింది. మార్చి నెల 20వ తేదీ నాటికి నెలలు నిండాయి మా ఆవిడకు ఈసారి కల్యాణి నర్సింగ్ హోమ్‌కాకుండా ఎగ్మూర్ మెటర్నిటీ హాస్పిటల్ డా ఆచంట లక్ష్మీపతిగారి కుమార్తె శ్రీమతి ఇందిరా రామ్మూర్తి పర్యవేక్షణలో మా ఆవిడ మాసాలు గడుపుతోంది. ఈసారి మగపిల్లవాడు పుడతాడని ఆశించినట్టే పుట్టాడు. మార్చి 25న 1953. పుష్యమి నక్షత్రం ద్వితీయపాదంలో పుట్టాడు. పేరు హేమచంద్ర. పోటీగ మావదినె అన్న భార్య ఓ కొడుకును కన్నది మేనేలలో పేరు కిరణ్ సుందర్ 1954 ఏప్రిల్ 5న మా చెల్లికి పెద్ద కూతురు పుట్టింది పేరు మహాలక్ష్మి.

1952, 53, 54 లో పిఠాపురం యువరాజా రామాయణ రచన కోసం వెంకట పార్వతీశకవులకు వసతి కోసమనీ కోటగుమ్మం పక్కనే ఒక చతుశ్శాల ఏర్పాటు చేశారు యువరాజావారు జంటకవుల సౌకర్యం కోసం చేసిన ఏర్పాట్లలో ఒకటిగా మా పార్వతీశం మావయ్య చెవివైద్యం కోసం మద్రాసు కర్ణవైద్యులు డా. చెరియన్‌కు ఉత్తరం రాశారు. పార్వతీశంగారు తన మనవరాలు సీతతో కలిసి మద్రాసు మైలాపూర్‌లోని మా బసకి వచ్చేరు. నేను డా॥ చెరియన్‌కి ఫోన్ చేసి మావయ్యను తీసుకువెళ్ళాను అయన వైద్యం చేశారు అక్కడే పుట్టిన రమణ కుమారిని పార్వతీశం మావయ్యగారి మనవరాలుసీత ఎత్తుకుని ఫోటో తీసింది.

మా చిరంజీవులు - 3

మూరెండో అమ్మాయి (మూడవ సంతానం) కడుపునపడ్డది. 1955 వ సంవత్సరంలో మే 8వ తేదీన నేను ప్రభుత్వోద్యోగపు ఆదేశాలు పుచ్చుకున్నది 1942 సం॥ మే 8వ తేదీనే. రెండవ అమ్మాయి పుట్టింది. 1953 లో అబ్బాయి పుట్టినది మొదలు కుటుంబ ఆరోగ్య పర్యవేక్షణ మార్షల్ రోడ్ ఎగ్మూర్ లోనే మూడవపాప మంచి ఆరోగ్యంతో వండులాగ ఉండేది. అప్పుడు సుబ్రహ్మణ్య నామాలు జపిస్తూండేవాణ్ణి వాటిలో నిరుపమా నామం తీసుకుని పాపకి పెట్టాము. 'నిమ్మి' అని పిలిచేవారం అనురాధా నక్షత్రంలో పుట్టింది

"నిమ్మి నీ పళ్లేవి, చెల్లి నీ పళ్లేవి
ఎక్కడ దాచుకు వచ్చేవే
ఎలకమ్మ నీపళ్లూ నీకూ ఎప్పుడు తెచ్చి ఇస్తుందే"

అని పాడి ముచ్చట పడేవాళ్లం పిల్ల చిందులేస్తోంటే!

మా చిరంజీవులు - 4

మద్రాసుకి యుగోస్లావియా అధ్యక్షుడు టిటో వచ్చాడు మాశరచ్చంద్ర శరదృతువులో పుట్టాడు. పుబ్బనక్షత్రం. అనాడు అస్పత్రినుంచి మేము బిడ్డలతో తిరిగి వస్తోంటే వెడుతున్నకారు, వాహనాలు మాముందు నుంచే వెళ్లాయి. శరత్‌ను అప్పటినుంచి అప్పుడప్పుడు టిటో అని పిలిచేవాళ్ళం. 1956లో నాకు బెజవాడ బదిలీ అయినా మా అవిడను కాన్పులకోసం మద్రాసు పంపేవాడిని.

మా చిరంజీవులు - 5 (1958)

అప్పటికి మా చెల్లాయి అనూరాధకు రెండో కూతురు పుట్టింది. మా ఐదవ సంతానం (మూడో అబ్బాయి) 1958 అక్టోబర్ 7వ తేదీన పునర్వసు నక్షత్రంలో పుట్టాడు. పేరు రామచంద్ర వెంకోబ్ నాన్నగారి పేరు కలసివచ్చేట్టు రామచంద్రునిపేరు స్మరించేట్టును పెట్టాము (తిరుపతి వెంకటేశ్వరస్వామి ఎదుట). వాడికి చక్కెర పొంగలి ప్రసాదం తినిపించినవేళే, అదే అన్నప్రాశన లా జరిగింది.

పిల్లలందరిమీద సమానమైన ప్రేమతో ఇలా మా అవిడపై వ్రాశాను.

"ఓసి నామేనత్త కూతురా ఓ
సోసి మాబావ మురిపెపు చెల్లెలా
ఓసోసి మా చెల్లాయి చిననాటి ఆటపాటల చెలిమికత్తెవై
చెల్లెక్కు చిలిపి చేష్టల చిట్టి మరదలా, నా
తొలినాటి తీయపాటల దొర గొంతులో తనగొంతు
కలిపి పాడేపలవు కిన్నెరా, నా
అనుదిన స్వప్నాల అనునిశాస్వప్నాల అనునిమేషము, నాదు
భావవృక్షము నల్లుకొను కల్పవల్లి నా
అయిదుగురు రత్న మాణిక్యాల బంగారు
అనుగు బిడ్డల కన్నతల్లీ....."

54. అనాటి మద్రాసు రేడియో - తెలుగు త్రిమూర్తులు

తొలిరోజుల్లో మద్రాసు రేడియోలో తెలుగు కార్యక్రమాలు నిర్వహించే ముగ్గురు ఉద్యోగస్థుల్ని తెలుగు త్రిమూర్తులనేవారు. వారు ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం ప్రారంభించిన 1938 జూన్ నుంచీ కూడా మొత్తం కార్యక్రమాలు నిర్వహణలో మార్గదర్శకులుగా ఎన్నో ప్రయోగాలు చేసినవారు వారిలో ఒక్కొక్కరిని గురించి వారి ఒక్కొక్క కార్యక్రమ ప్రయోగం గురించీ ఒకనాటి భావ తరంగం నింపెయ్యవచ్చు. కాని ఈ వేళ వాళ్ల ముగ్గురిని గురించి నేను ఒకానొక సందర్భాన వ్రాసిన శబ్ద చిత్రాల కవితా ప్రక్రియ చవిచూపిస్తాను ఈ శబ్ద చిత్రాన్ని పెన్‌స్కెచ్చి అనవచ్చు వ్యంగ్య చిత్రం లేక కార్టూన్‌ని కూడా పెన్సల్ స్కెచ్చి అనో పెన్‌స్కెచ్చి అనో అనవచ్చు.

ఈ శబ్ద చిత్రం ప్రక్రియలో కార్టూన్‌లో ఉండే వ్యంగ్యధోరణి అవలంబించి, మృదువైన హేళనమూ స్తుతీ రెండూ మేళనమై ఉంటాయి అభిమానులకి స్తుతులు అనిపిస్తాయి తెలిసిన ఇతరుల్లో కొందరికి మృదువైన హేళన స్ఫురిస్తుంది.

ఈ త్రిమూర్తులు ముగ్గురూ నన్ను రేడియోకు ఆడిషన్ తీసుకుని ఎంపిక చేసిన వారు ఒకరు శ్రీ అచంట జానకిరాం, రెండవవారు శ్రీ సూరి నారాయణమూర్తి మూడవవారు డాక్టర్ అయ్యగారి వీరభద్రరావు. ముగ్గురూ సర్వీస్‌లో రిటయిరయాక - 1973 లో నేను విజయవాడ కేంద్రానికి రజతోత్సవాలు జరిపించిన సందర్భంలో జరిగిన సమావేశాల్లో ఆ ముగ్గురినీ వేదికపై ఆసీనుల్ని చేసి వినిపించిన - ఛందోరహితమైన స్వేచ్ఛా కవితా - అక్కడక్కడ లయ ఉంటుంది.

"ఉండేవారు మద్రాసులో - రేడియో తొలి రోజుల్లో!
ఉద్దండులైన తెలుగు త్రిమూర్తులు!
గగన వాణీక్రియా కలాప చక్రవర్తులు !

ఒకరు (జానకి) రాం, ఒకరు (ఎస్.ఎన్) మూర్తి ఒకరు రావ్ - వారినే ఒకరు బ్రహ్మ ఒకరు విష్ణువు, ఒకరు శివుడూ - అనేవారు.

అభిమానులు, విమర్శకులూ, అనపేక్షకులూ!

డా॥అయ్యగారి వీరభద్రరావు - రజనీ

ఒకరిది సృజనా మాధురి అని, ఒకరిది పాలన చాతురి అని, ఒకరిది విలయవైఖరి అనీ అనేవారు - మరి నా దృష్టిలో ఒకరిది మాధురీ కళాయితమైన విగతలయాత్మక సృజన!

అతను సుహృజ్జనాభిరాముడు (జానకి) రాముడు

చందన గంధ విలిప్త సుశుభ్ర శరీరుడు, ధగద్ధగిత కనకాంచల రాజిత కుందకుసుమధవళాంబరధారి

వికసిత పారిజాత మాలికా విశ్రుత కమలామలాంజలి యుతుడు, విస్మృతాంగనాలకా గరుధూప ప్రమత్త భృంగాయమాన సురుచిర సుస్నిగ్ధ నయనుడు!

కాంచీ కంకణ క్వణిత శ్రీ రంగధామేశ్వరీ హారిద్రకుంకుమాశోభిత దేవగాంధారి రాగలక్షిత కథాశారదా కథన ముగ్ధ మోహనుడు!

ఇంకొకరిది ఉదాత్త కళా ప్రకాశక బుధ పరితోషక విశిష్టలయాత్మక సృజనా ప్రోత్సాహక పాలన చాతురి.

అద్వితీయుడతడు ద్వితీయ నారాయణుడు. సాక్షాద్వ్యక్త స్థిత సదాశయ

మహాలక్ష్మీకుడు?

అర్థ వైచిత్ర్య బహుధా పరిణత రాజమాన్య రాజన్య పూజితుడు; గగన భారతీ బహుముఖ కళావికాస కారణుడు!

సదసత్కళా వివేచన శీలి! సమ్యక్ సంస్కృతి సమారాధకుడు ! సదాసజ్జన విధేయుడు!

మరియొకరిది సృజనాత్మకమైన

రజనీ - శ్రీ సూరినారాయణమూర్తిగారు

విశిష్టలయా లయాత్మకమైన విశిష్ట సృజనా - జీవితంలో కేవలం మాధురిని మాత్రమే చూడగోరని వైజ్ఞాన పాక్షిక సహజకళాచాతురి! అతడు విశిష్ట శివత్వ సాధన సంతతరుద్రుడు. బహురూపనటన భావతన్మయ భరతుడు, విమర్శ వీరవిహార పట్ట భద్రుడు, అపర వీర భద్రుడు, సుహృత్సుముఖతా సంపద అనభిముఖుడు!

లేనిపోని పక్షపాతాలు కానవస్తాయి తూనికల్లో! కాన రావవి యెంత మాత్రమూ కలిసిరాని పోలికల్లో! కవిగా కళా హృదయానికి కనబడిందే వ్రాసినపుడు కనబడకూడదు పక్షపాతాలు - సూక్ష్మ దృష్టిని చూసినపుడు! శ్రవణ పేయ గగన వాణీ చతుర కళా తపస్సులో భాషా నాదబ్రహ్మతత్త్వ విరాట్స్వరూపమూర్తి సాక్షాత్కృతి లభించి కృతకృత్యులయే లక్ష్యపరులు కొద్ది మందేః

వారిని లెక్కించడానికి ఒక్క చేతివేళ్ళక్కువ!

కనిష్ఠికను మడిచిం తర్వాత మిగిలే వేలు అనామికే!

గురిలో కొరత లేని నిరంతరారాధకుడే

గురుత్వాని కర్హుడు!

అధ్యేతగా నిరంతరమూ అనందించే అమల హృదయుడే ఆదర్శ ప్రాయుడయిన అధ్యాపకుడు!

ఈ ముగ్గురు త్రిమూర్తులలోను మధ్యవారు శ్రీ సూరి నారాయణమూర్తి ఆకాశవాణి దూరదర్శనులకు డిప్యూటి డైరెక్టర్ జనరల్ పదవి నిర్వహించి రిటైరయి, విజయవాడలో ఉండేవారు. (1జనవరి 1981 నాడు) పరమపదించారు. మిగిలిన యిరువురూ కీర్తిశేషులయారు ఆ తరువాత.

అప్పుడే రేడియో నాటకాల ఇన్‌చార్జి డా॥ అయ్యగారి వీరభద్రరావు, శ్రీ అచంట జానికిరాం ప్రసంగాల శాఖ నిర్వహించేవారు శ్రీ ఎస్.ఎస్. మూర్తిగారు ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఉండేవారు స్టేషన్ డైరెక్టర్ శ్రీ గోపాలన్ గారు మొదలగు రేడియో నిర్వాహకులతో పరిచయమేర్పడింది.

55. రేడియోలో నా మొదటి కార్యక్రమం

సుమారు డబ్భైయేళ్ల క్రితం అంటే 07-01-1941 వ తేదీన మద్రాసు రేడియోలో నేను పాల్గొన్న మొదటి కార్యక్రమం ప్రసారం అయింది. అంతకు దాదాపు వారం రోజుల ముందు రేడియోలోని తెలుగు మూర్తి త్రయానికి నన్నొక మిత్రులు పరిచయం చేశారు.

అయేంటి వేం నెలలో నా పెళ్ళయింది. జూన్‌లో కాకినాడలో కాపురం పెట్టి, ప్రచారిణీ పనికి ఆఫీసుకి వెళ్ళి వస్తూండేవాణ్ణి, వాల్తేరులో విశ్వవిద్యాలయంలో చదివేప్పుడే 1938, 39 లో ప్రారంభించిన నా సంగీత నాటిక చండీదాసులో మూడువంతులు అప్పటికే తయారయింది. ఆ పాటలు, ఆధునిక కవుల గీతాలూ, మరికొన్ని నా గీతాలు పాడుకొంటూ స్నేహితులకి వినిపిస్తూండే వాణ్ణి.

వీటన్నిటితోటి మద్రాసు వెళ్ళానన్నమాట. నేను వెళ్లిన వ్యవహారం (ఆఫీసు పని) రెండు మూడు రోజులలోనే పూర్తయింది.

మద్రాసులో సెలవులకి కాలక్షేపానికి వచ్చిన పింగళి లక్ష్మీకాంతంగారు ఆ నగరంలోని కళాశాలలో సాహిత్యోపన్యాసకులు అకొండ పరబ్రహ్మశాస్త్రిగారు, మోటుపల్లి రామానుజరావు గారు వీరందరినీ కలిశాను. ఇంటర్మీడియేట్, బి.ఏ.లకి దేనిని ఏ క్లాసుకో జ్ఞాపకం లేదు గాని గోరా, మాతృమందిరమూ రెండింటినీ మద్రాసు విశ్వవిద్యాలమూ, ఆంధ్ర విశ్వవిద్యాలయమూ పాఠ్యగ్రంథాలుగా ఎంపిక చేశారు.

అప్పటికే మా అన్నయ్య నళినీకాంతరావు, ఆంధ్ర మహాసభ స్త్రీల శాఖలో దుర్గాబాయిగారు, మహిళలకు బెనారస్ మెట్రిక్‌కు, ఇంటర్ పరీక్షలకు ప్రైవేటుగా తర్ఫీదు ఇచ్చే పనిలో - మైలాపూర్‌లో ఉండేవాడు. అతనితో బస. డిసెంబర్ అఖరివారం - లాయిడ్స్, రోడ్డు పక్క డాక్టర్ గాలి బాలసుందరరావు గారింట్లో ఏదో ఒక టీ పార్టీ జరిగింది. మా అన్నయ్యతో దుర్గాబాయి గారితో నేనూ పార్టీకి వెళ్ళాను మద్రాసులోని ఆనాటి తెలుగు వారిలో ప్రముఖులు కొందరు ఆ పార్టీకి వచ్చారు. వారిలో రేడియో తెలుగు త్రిమూర్తులు ఉన్నారు. వారు - ఆచంట జానకిరాం, డాక్టర్

అయ్యగారి వీరభద్రరావు, సూరి నారాయణ మూర్తి గార్లు.

దుర్గాబాయిగారు ఇతర మిత్రులు, నన్ను రేడియో వారికి పరిచయం చేశారు. అక్కడ ఆ పార్టీలోనే నా చేత పాడించారు. ఆ మర్నాడు రేడియోకి రమ్మన్నారు.

ఆ వెళ్ళడమే, రేడియోలో ఆడిషన్ జరిగింది జనవరి 7వ తేదీన (1941) శ్రీశ్రీ రచించిన సంగీత నాటిక మోహిని రుక్మాంగద ప్రసారం అవుతుంది దానిలో పాల్గొనడానికి రమ్మని నాకు ఒక కాంట్రాక్టు ఇచ్చారు.

ఆ నాటకానికి సంగీత దర్శకుడు శ్రీ సాలూరు రాజేశ్వరరావు, అవసరాల శేషగిరిరావు ఆ నాటకంలో యముని పాత్ర, నాది బ్రహ్మ పాత్ర కమలకుమారి అనే అమ్మాయి మోహిని, రుక్మాంగదుడు శ్రీ పారుపల్లి సత్యనారాయణ ఆనాటకం స్క్రిప్టు శ్రీశ్రీ రచనలలో అచ్చయిన వాటిలో కనబడదు.

56. "కృష్ణదేవరాయ వైభవం"

(తొలి రేడియో డాక్యుమెంటరీ)

తొలి రోజులలో మద్రాసు రేడియో తెలుగు కార్యక్రమాల నిర్మాతల్లో క్రియాశీలురైన వైతాళికులలో ప్రథమ శ్రేణికి చెందిన వారిలో అగ్రగణ్యులు అచంట జానకిరాం 1938 జూలై మొదటి వారంలో మద్రాసు నుంచి ప్రసారం అయిన మొదటి తెలుగు రేడియో నాటిక అనార్కలీ కూర్పు, నిర్వహణా, దర్శకత్వమూ ఆయనవే. ఆయన వ్రాసి, దర్శకత్వం నిర్వహించిన కార్యక్రమాలను - కొన్నింటిని "అజంతా" అనీ, కొన్నింటికి "సుకుమార్" అనీ, కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఆయన అసలు పేరుతోను ప్రకటించేవారు.

1941 జనవరి 7వ తేదీన నేను మొదటి రేడియో సంగీత నాటకం శ్రీశ్రీ మోహినీ రుక్మాంగదలో పాల్గొన్నాను ఆ తరువాత వారం రోజులకే జానకిరాం గారు "కృష్ణదేవరాయ వైభవం" అనే చారిత్రక రూపకం - "డాక్యుమెంటరీ" తాను పరిశోధనాత్మకంగా బహుప్రయాసతో కూర్చిన రూపకంలో నేను పాల్గొనడానికి స్టేషన్‌డైరెక్టర్ ప్రత్యేక సమ్మతి పొందవలసి వచ్చింది. అది ప్రసారం అయినది 15, జనవరి 1941వ తేదీనే.

ఈ రూపకం మౌలిక రచన శ్రీ అకొండి వేంకటేశ్వరరావు దానిని అధారంగా చారిత్రక విషయాల నెన్నింటినో పయస్.. న్యూనిజ్ వంటి విదేశీ చరిత్రకారుల వ్రాతల నుంచి యథార్థ సంఘటన స్వరూప స్వభావాలతో రూపకాన్ని పెంచడానికి జానకిరాం నన్ను వెంట పెట్టుకొని మద్రాసులోని కన్నిమారా, మద్రాసు విశ్వవిద్యాలయం, ప్రాచ్య లిఖిత గ్రంథాలయాలన్నీ తిరిగి విషయ సేకరణ చేశారు. నేను తెలుగు సాహిత్యంలో ఎం.ఎ. పట్టభద్రుణ్ణి అయి ఒక్క యేడాదే అయివుండడం ఒక్కటీ, శాసనాలలోని గద్య పద్యాలను రాగయుక్తంగా సంప్రదాయిక నాగస్వర సంగీతంతో పాటు పఠించగలగడం ఒకటి ఆయన నేను పాల్గొనడానికి ప్రత్యేక అనుమతి పొందడానికి తోడుపడ్డాయి.

నేను గాక ఆ రూపకంలో పాల్గొన్నవారిలో ఆనాటికి నాటక, సినిమా రంగాలలో పేరు మోసిన దిగ్గంతులు కొందరున్నారు. వారిలో ముఖ్యులు రాయల పాత్రధారి శ్రీ పారుపల్లి సుబ్బారావు, తిమ్మరుసు పాత్రధారి శ్రీ ముంజులూరి కృష్ణారావు, అల్లసాని పెద్దన పాత్రధారి శ్రీ పారుపల్లి సత్యనారాయణ, ఇంకా అప్పటికే నిలయ కళాకారుడయిన ప్రయాగ నరసింహశాస్త్రి కూడా వున్నారు

రాయల చారిత్రక వైభవం వీలయినన్ని కోణాల నుంచి అ రూపకంలో చొప్పించడానికి చేసిన ప్రయత్నంలో తరువాత దేశంలో కొట్టిన పిండి అయిపోయిన భువన విజయకవితాగోష్ఠి, రాయవాచకం అనే రాయల ఆస్థానోద్యోగుల సమాచార వివరణము చేసే కవితలలో నుంచి కొన్ని ఘట్టాలు, విదేశీ యాత్రికులు చేసిన రాయల సభావర్ణనలు, సభలో రాజనర్తకి నృత్య గీత ప్రదర్శనం, ఇవికాక, ఒకానొక ఉత్తరాయణ పుణ్యకాలంలో పెద్దనగారు రచించిన పద్యాలతో రాయలవారు జారీ చేసిన దానశాసనం ఇవన్నీ ఆ రూపకంలో చోటు చేసుకున్నాయి

రూపకం ఒకేసారి మూడు నాలుగు స్టూడియోల నుంచి ప్రసారం అయింది. ఒక్కొక్క స్టూడియోలోను నిర్మాతకు కుడిభుజం లాంటి సహచరులు ఒక్కొక్క రూపకం ప్రతితోను, అది సంభాషణల స్టూడియో అయితే వారంతా ఒక స్టూడియో! సంగీతం పాడేవారూ, వాయించేవారూ, ఒక స్టూడియోలో! ప్రధాన పాత్రలయిన రాయలు, తిమ్మరసు, పెద్దన వంటి పాత్రలకు పాడే పద్యాలుంటే వారికి పక్క వాద్యకారులూ, హర్షధ్వానాలు, ప్రజల జయజయధ్వానాలకు వెనుక ఉండే సామూహికపు రొదా వంటి నేపథ్య ధ్వనులు రికార్డుల ద్వారా వినిపించే వాటికి టర్న్‌టేబుల్ ఉండే ఒక స్టూడియో, ఇలాగ ఏర్పాటు చేశారు. పాత్రధారులందరికి ఒక్కొక్కరి చేతిలోను ఒక్కొక్క ప్రతి ఉండేటట్లు శ్రీ జానకిరాం రూపకం మొత్తం త్యాగరాయనగరిలో ఒక ప్రెస్‌లో అచ్చువేయించి తెచ్చి పాత్రధారులకు పంచి పెట్టారు.

నేను శాసనం పఠించిన పద్ధతి బ్రాడ్కాస్టింగ్ ప్రసార చమత్కారాలు విరివిగా వృద్ధిపొందని

ఆ రోజుల్లో చాలా అపురూపమైనది. ఒక స్టూడియోలో టర్న్‌టేబుల్‌పైని ఒక నాగస్వరం రికార్డు డోలు లయ సాగుతుంటే కేవలం రాగాలాపన చేసే ఘట్టం నాకు హెడ్‌ఫోన్స్ ద్వారా చెవుల్లో వినిపింపచేశారు. డోలు ముక్తాయి పూర్తయి, రాగం ఒక ఆవృత్తి కాగానే నేను గొంతు కలిపి శాలివాహన శకవరుషంబులు వేయిన్నీ నన్నూట నలుబదిరెండగువేట, ఉత్తరాయణ పుణ్యకాలంబున అని నాగస్వరం రికార్డు నుంచి వినిపించే రాగావృతాలలో మేళనం అయేటట్లు పఠించడం, ఆ భాగం ఒక డిస్కు మీద రికార్డు చేసి విన్న వారంతా అది ఆ కాలంలో 16వ శతాబ్దంలో నుంచి వెలువడుతున్న కంఠంలా ఆనందించారు ఈ ధ్వన్యాత్మక చమత్కారం ఆ తొలి రోజుల్లోనే నా చేత జయప్రదంగా పలికించిన శ్రీ జానకిరాం క్రియాశీల భావాలు ఆ తరువాత నా బ్రాడ్కాస్టింగ్ జీవితంలో ఎన్నో కొత్త పరుగులు పెట్టించాయని ఎప్పుడూ తలుచుకుంటూ వుంటాను.

57. అలనాటి మద్రాసు రేడియో డైరెక్టర్లు

అనాడు బ్రిటిషు పరిపాలనలోని దక్షిణ భారతానికంతకూ, అవిభక్త మద్రాసు రాష్ట్రానికి రాజధానియైన మద్రాసు ఒక్కటే 1938 జూన్ 16న ఏకైక రేడియో కేంద్రంగా ప్రారంభం అయింది. 1939 జూన్, జూలైలలో తిరుచ్చిరాపల్లి కేంద్రం వచ్చింది తిరుచ్చి కేవలం తమిళ కార్యక్రమానికి, కాని మద్రాసు నుంచి తెలుగు, తమిళం కన్నడం, మళయాళం నాలుగు భాషా ప్రాంతాల సంస్కృతులనూ ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రసారం అయ్యేవి. నేను కాజ్యువల్ ఆర్టిస్టుగాను, రచయితగాను పాల్గొన్న రెండు మూడు కార్యక్రమాలను గురించి ఇటీవల భావతరంగాలలో అనాటి జ్ఞాపకాలను స్మరిస్తూ వచ్చాను.

1942 జూలైలో 1వ తేదీన నేను మద్రాసు రేడియోలో నిలయ కళాకారుడు గాను, రచయితగాను చేరాను. అప్పటి ప్రోగ్రామ్ ఆఫీసర్లకు ఒకరిద్దరు కళాకారుల్ని వ్రాత పనులకీ చేదోడు వాదోడు పనులకి కేటాయించేవారు. నేను ఆచంట జానకీరాంగారికి సహాయకుడుగా పనిచేసేవాణ్ణి. కార్యక్రమ నిర్వహణలోగాని, ఆఫీసు కార్యనిర్వహణలోగాని, ఒక్కొక్క సమస్య వచ్చినప్పుడు నువ్వు ఆర్టిస్టుగానే ఉండిపోతావా, ప్రోగ్రాం ఆఫీసరువీ, స్టేషన్ డైరెక్టరువీ ఎప్పటికి కాగలుగుతావయ్య ఇలాగయితే? అన్ని విషయాలపైనీ, చిన్న విషయాలపైనీ కూడా సర్వ సమగ్రమైన దృష్టి ఉంచుకోవాలి అనేవారు. నాకు మాత్రం ఏదో పాటో, నాటకమో, వ్రాయడమో,

రిహార్సలు చేయడమో, దానిని ప్రసారం చేయడమో అదే ధ్యేయంగా అంతిమ గమ్యంగా అనిపించేది. 1943లో ప్రోగ్రాం అసిస్టెంట్ పదవికి దరఖాస్తు పెట్టి ఆగస్టు 15న ఇంటర్వ్యూలో నెగ్గి 1944లో ప్రోగ్రాం ఆఫీసర్‌గాను. ఎగ్జిక్యూటివ్ గాను సెలక్టయినప్పటికీ, కార్యక్రమ నిర్వహణా, దేశంలోని పలువురు రచయితలు, కళాకారులు రేడియో కార్యక్రమాలలో పాల్గొనేటట్లు ప్లాన్ చెయ్యడమూ ఆ కార్యక్రమాలలో వారి విజయం నా విజయంగా భావించి తృప్తి చెందడమూ గమ్యం అనుకునేవాణ్ణి.

ఆ మొదటి పదేళ్ళలో మద్రాసు కేంద్రాన్ని నిర్వహించిన డైరెక్టర్లను, వాళ్ల పరిపాలనా పద్ధతులూ, సామర్థ్యమూ, వ్యక్తిగత విశిష్ట చాతుర్యాలూ, వివిధ విషయ పరిజ్ఞానమూ, చూస్తుంటే వాళ్లు విలక్షణ వ్యక్తులుగా, ఎంతో ఎత్తుగా పైకి తలెత్తి చూడవలసిన వాళ్లుగా కనిపించేవారు. అటువంటి డైరెక్టర్ కుర్చీలో ఒక నాటికి నేను కూర్చుని, కేంద్రాన్ని దాని వివిధ శాఖలనీ, దానిలోని కళాకారులనీ, రచయితలనీ, ఉద్యోగులనీ ఆ డైరెక్టర్లు దిద్దుకుని నడిపించినట్లు చేయగలుగుతానన్న ఆశ ఏ కోశానా ఉండేదికాదు.

మద్రాసు కేంద్రపు డైరెక్టర్లలో మొట్టమొదటి అయన పేరు విక్టర్ పరంజ్యోతి. ఆయన మద్రాసులోని సెయింట్ ఆండ్రూస్ చర్చిలో "కోయిర్ లీడర్" గాయక బృంద నాయకుడు, కొన్నాళ్లు "ది మెడ్రాస్ మెయిల్" ఇంగ్లీషు దినపత్రిక సంపాదకవర్గంలో పనిచేశారు. 1938 జూన్ 16న మద్రాసు కేంద్రం ప్రారంభం అవుతూండగా ఆయననే స్టేషన్ డైరెక్టరుగా వేశారు మద్రాసు కేంద్రపు పాశ్చాత్య సంగీత నిర్వాహకులూ, ఇంగ్లీషు కార్యక్రమ నిర్వాహకులూ, ఎందర్నో ఆయన రూపొందించారు. తన తరువాత తనంతటి వాడుగా, కోయిర్ లీడర్‌గా, పాశ్చాత్య సంగీత ప్రయోక్తగా, ప్రొడ్యూసర్ ఎమెరిటస్, రాష్ట్రపతి గౌరవాన్ని అందుకున్న శ్రీ హేండెల్ మెన్యూల్ శ్రీ పరంజ్యోతికి శిష్య వర్గంలో ప్రధానుడు. నేను నా తొలి కార్యక్రమాలలో చండీదాసు నాటకంలో మద్రాసు చేరినప్పుడు డైరెక్టరు శ్రీ పరంజ్యోతే. ఆ తరువాత ఆయన కలకత్తా, బొంబాయి ఆల్ ఇండియా రేడియోలకు డైరెక్టరుగా వేరు వేరు వ్యవధుల్లో పనిచేసి, ఢిల్లీలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పదవిలో కొంత కాలం పనిచేసి 1947 ప్రాంతంలో తిరగి బొంబాయి డైరెక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు

1942 లో నేను మద్రాసు కేంద్రపు నిలయ కళాకారుడిగా చేరినప్పుడు స్టేషన్ డైరెక్టర్ శ్రీ ఎస్ గోపాలన్. ఈయన కామర్స్ గ్రాడ్యుయేట్. చిన్ననాటి నుంచీ రేడియో ప్రసారాలంటే చాల ఇష్టమూ, కుతూహలమూ ఉండేవి. 1933లోనే ఔత్సాహిక రేడియో షార్ట్ వేవ్ ప్రసారాలకు లైసెన్సు తీసుకున్నవారు. కొన్నాళ్లు "హిందూ" ఆంగ్ల దిన పత్రికకు వారం వారం సమాచార వ్యాసాలూ, ప్రకటనలూ పర్యవేక్షిస్తుండే వారు. 1936లో ఆల్ ఇండియా రేడియోలో రీసెర్చ్ ఆఫీసర్‌గా చేరారు

తరువాత డైరెక్టర్ జనరల్ లయొనెల్ ఫీల్డెర్ ఆయనను 1939 జూలైలో తిరుచ్చిరాపల్లి రేడియో కేంద్రానికి డైరెక్టర్‌గా వేశారు. 1941 లో మద్రాసు కేంద్రంలో నేను చండీదాసు ప్రసారం చేసినప్పుడు డైరెక్టర్ ఆఫ్ ప్రోగ్రాం గాను, ఆ తరువాత ఎసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీ జి. త్యాగరాజ శాస్త్రిని తిరుచ్చికి డైరెక్టర్‌గా పంపి, తిరుచ్చిలో డైరెక్టర్‌గా వుండిన శ్రీ గోపాలన్‌ను మద్రాసు డైరెక్టర్‌గా చేశారు.

'సంగీతం వంటి కళల సంప్రదాయాన్ని పోషించాలి. పరిరక్షించాలి అనే విధానం శాస్త్రి గారిది. నిత్య రచనా శీలమైన కళలలో కొత్త పుంతలు తొక్కడాన్ని ప్రోత్సహించాలి' అనే విధానం గోపాలన్ గారిది.

శ్రీ జి.టి.ఎస్ నాయర్ - రజని

శ్రీ గోపాలన్ గారి దగ్గరకు రేడియో ప్రసారానికి వచ్చిన వక్తలుగాని, రచయితగాని, సంగీత విద్వాంసుడుగాని, చిత్రకారుడు గాని, విజ్ఞాన శాస్త్రవేత్తగాని, అర్థికశాస్త్ర నిధిగాని, ఎవరు వచ్చినా వారి వారి విషయాలలో తనకు కూడా ఎంతో ప్రవేశమూ, శ్రద్ధా, కుతూహలమూ వుండినట్లు వారి సంభాషణ సాగేది. అవతలి వారు ఆశ్చర్యపోయేవారు ఈయన కిన్ని విషయాలెలా తెలుసని.

అత్యంతం ఆయనకు ఇష్టమైన కార్యక్రమం ఆయన స్వయంగా స్టూడియోలో కూర్చుని నిలయ విద్వాంసులతో - కళాకారులతో పనిచేయించిన ప్రత్యేక కార్యక్రమం - 'సంగీతంలో రమ్యాలోకం' (నూతన ప్రయోగాలు, "రీమా" అనే "పెన్" నేమ్‌తో ఆర్. వైద్యనాథన్ అనే జెమినీ స్టూడియోలోని సంగీత ప్రయోక్త, శ్రీ బాలచందర్, శ్రీ నారాయణ అయ్యర్, రజని, 'నియాజీ" అనే పెషావరు నుంచి వచ్చిన ఎసిస్టెంట్ డైరెక్టరూ వంటి విద్వాంసులను, కళాకారులను స్టూడియోకి పిలిపించి పాత సంగీత వరుసలలో కొత్తదనం ఎలా వస్తుంది? పంజాబీ వరుసలలో తెలుగుపాట ఎలా వుంటుంది? జానపద గీతాల వరుసలలో కొన్నిటికి కొత్త మెరుపులు జోడిస్తే ఆకర్షణీయమైన లలిత గేయంగా ఎలా రూపొందుతుంది? ఈ కార్యక్రమాలలో శ్రీ ఈమని శంకరశాస్త్రి ఐదు వీణలతో చేసిన "ఆదర్శ శిఖరారోహణం" మరువరానిది - చాలా పేరు పొందినదీను వాద్య గోష్ఠిలో అక్షరాలు లేకుండా కూర్చిన సంగీతంలో భావ రూపకల్పనా, కథా కల్పనా, ఆ కథకు

శీర్షిక పెట్టడమూ, ఈ ప్రయోగంలో తయారయింది ఎవరెస్టు శిఖరంపై సాధించిన విజయం ఆదర్శ శిఖరారోహణం! ఈ కల్పనలకూ శీర్షికకూ, రజనీకి తొలి శిక్షణ శ్రీ గోపాలన్ ద్వారానే

58. అలనాటి మద్రాసు - రేడియో డైరెక్టర్లు - 2

మధ్య ప్రాచ్య సంగీతపు ఆలాపనా పద్ధతుల్ని మా 'రజని' అవలీలగా తన లలిత సంగీతంలో ఈ మధ్య పాడేశాడని డైరెక్టర్ గోపాలన్‌గారు సగర్వంగా చెప్పడం వల్ల ప్రత్యేకంగా మోజుపడి, ప్రసిద్ధ వాహినీ ఫిల్మ్ డైరెక్టర్ శ్రీ బి.ఎన్.రెడ్డి తాము అప్పుడు తీస్తున్న స్వర్గసీమ చిత్రంలోకి నా చేత ఓహెలా పావురమా మొదలైన అరడజను పాటలు వ్రాయించుకున్నారు.

స్టూడియోలో రిహార్సిల్సుతోనూ రికార్డింగ్‌లతోనూ రాత్రి పన్నెండూ ఒంటిగంటా దాటిపోతే కార్యక్రమంలో పాల్గొంటున్న కళాకారుల్ని రేడియో వ్యాన్‌లో ఇళ్లకు పంపుతూ గోపాలన్‌గారు రజనిని మాత్రం స్వయంగా తన కారులో ఎగ్మూర్ నుంచి మైలాపూర్ దిగబెట్టేవారు నీ గదిలో దీపం ఇంకా వెలుగుతూ మీ ఆవిడ ఎదురు చూస్తోందని చెపుతొందనేవారు.

నూతన రీతుల క్రియాశీలతకు సంప్రదాయపు పరిధులు అడ్డురాకూడదనే విధానం గోపాలన్‌గారి దయితే, ఆయన తరువాత మద్రాసు కేంద్రపు డైరెక్టర్ అయిన ఈ జి. త్యాగరాజ శాస్త్రి క్రియాశీలతలో ఏ కొత్త పోకడలు పోయినా సంప్రదాయపు పరిధులలోనే జరపాలనే విధానం పాటించేవారు.

రేడియోకు రాకపూర్వమే నా సంగీత రచన రెండు ప్రవాహాలలో సాగుతూ వచ్చేది. ఒకటి సంప్రదాయ పరిధులలో ప్రసిద్ధ కర్ణాటక రాగాలతో రసవంతంగా భావ యుక్తంగా సాహిత్యాన్ని పాడించే ధోరణి. మరొకటి సమకాలీన ఆంధ్రేతర భారతీయ సంగీత ధోరణులూ ప్రపంచ సంగీత ధోరణులూ మన మాటలకు నప్పేటట్లు వాడుకోవడము. రెండోది గోపాలన్ గారికి నచ్చితే (మొదటిది ఆయనకు నచ్చలేదని కాదు) మొదటి ధోరణి వల్ల త్యాగరాజ శాస్త్రిగారు కూడా నా పనిపట్లా నా పట్ల, ఆదరణ చూపారు. నేను విద్యార్థి దశలో 18వ ఏట చేసిన పసిడి మెరుంగుల తళతళలు అనే తెలుగు తల్లి పాట ఆనంద భైరవిరాగంలో సంప్రదాయ పరిధిలో విశిష్టమైన పోకడలో కూర్చడం వల్లనే అనుకుంటాను, శాస్త్రిగారు నన్ను ఆఫీసు పని అయిపోయాక వారింటికి రప్పించుకుని, ఆ తెలుగు పాట సాహిత్యము స్వరమూ దేవనాగరి లిపిలో వ్రాయించి, వారి శ్రీమతికి చెప్పించారు

ఆఫీసు పని అయిపోయాక అనే మాటలు శాస్త్రిగారి వ్యక్తి సంబంధం విషయాలలో మర్యాదలలో మరిచిపోరాని విషయం. శ్రీ జి.టి. శాస్త్రి అంటే, అయన ఆఫీసుకువచ్చి పొద్దుటే మెట్టెక్కుతుంటే స్టూడియో టయిం తొమ్మిది అయిందన్నమాట. సాయంత్రం ఆయన మెట్లు దిగుతుంటే ఐదు గంటలు కొట్టిందన్న మాట. తిరిగీ ఆయన డ్యూటీరూంకి వచ్చారంటే ఏడు గంటలయిందన్నమాట. ఈ అలవాట్లవల్ల అయన్ని గడియారం త్యాగరాజ శాస్త్రిగారనే వారం.

నా మొదటి సంగీత నాటకం నేను రేడియోలో చేరక పూర్వం విన్న అధికారులలో త్యాగరాజ శాస్త్రిగారు కూడా వున్నారు. దానికి నేను వాడిన బంగాలీ సంగీతం శాస్త్రిగారికి వ్యక్తిగతంగా ఇష్టం కాదు అయినా ఆనాటకాన్ని అంగీకరించడానికి వెనుకాడలేదు. అయనే అడిగారు. అప్పుడు! మన కర్నాటక సంగీత సంప్రదాయంలో కూడా నువ్వు వరుసలు అమర్చగలవా అని, గ్రీష్మరుతువు అనే సంగీత నాటకం గౌళ, మోహన, మందారి, శహనవంటి రాగాలలో కూర్చాను. ఆ తరువాత దివ్యజ్యోతి, మేఘదూత, వంటి కొన్ని నాటకాల్లో సంప్రదాయ సంగీతమే అమర్చాను. రసస్ఫూరకత్వానికి కర్ణాటక సంగీతం కూడా సమర్ధమే, అనీ, సంగీత రచయితలో ఉందికాని, సంగీత పద్ధతి ఏదీ రసహీనం కాదని నామతం అంటే ఆయనకు నచ్చేది.

ఆ రోజులలో జాతీయ సంగీత కార్యక్రమాలకు బదులు ఢిల్లీ నుంచి రాత్రి 8-30 నుండి 9-15 దాకా మ్యూజికల్ రౌండ్ అప్ అనే కార్యక్రమం వచ్చేది. ఒక్కొక్క కేంద్రంలో తయారైన విశిష్టమైన క్రియాశీలమైన ఐదు నిముషాల కార్యక్రమాన్ని నిర్మాత గురించి రచయిత గురించిన వివరాలు చెపుతూ ప్రసారం చేసేవారు. అది ఒక ప్రతిష్ఠాపూర్వకమైన కార్యక్రమం అన్నమాట.

హుల్బుల్బులా అయి, అయి అయి అపదలగాయి, ఏడవకు ఏడవకు వెర్రి అబ్బాయి, ఏడిస్తే నీ కళ్ళు నీలాలగారూ, అని మా వేంకట పార్వతీశ్వర కవులు ఒకటవ తరగతి బాలగీతావళిలో సమకూర్చిన పాటని నేనూ ఒక చౌచౌ కార్యక్రమంలో కుమారి ఎన్ వరలక్ష్మి చేత ఆనందభైరవి రాగంలో తల్లుల జోలపాట వరుసలో పాడించాను. అలాగే 'ఘనాఘనాఘనా గర్జింపవాఘనాశని' (ఘన+అశని) అనే సొంత గేయాన్ని మేఘరంజని రాగంలో వాద్య నేపధ్యంతో సహా గాలీ, వానా, రాగస్వరాలలో కలిపి కీ.శే. ఘంటసాల చేత పాడించేను మరొకసారి. ఈ రెండూ శాస్త్రిగారు మ్యూజికల్ రౌండ్ అప్ కోసం తాను ఎంపిక చేసి, ఢిల్లీ పంపి ప్రసారం చేయించారు. ఈ రెండింటిలో కూడా ఆయన కోరే సంప్రదాయికతా, రసవత్తా, జాతి సంస్కృతి ప్రతిబింబించడమూ వంటి సుగుణాలుండడమే ఆయన ఎంపికకు కారణం అయ్యాయి

1947 లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఆ అర్ధరాత్రి (1947 ఆగస్టు 14 / 15 ప్రధాని నెహ్రూ ప్రసంగం కావడంతోనే మద్రాసు నుంచి సుబ్రహ్మణ్య భారతి తమిళ గేయం ఆడువోమే డి.కె.

పట్టమ్మాళ్ చేతా, రజని తెలుగు గేయం ఉదయమ్మాయెను స్వేచ్ఛా భారతి - టి. సూర్యకుమారిచేతా పాడించడానికి ప్రతిపాదించిన వారు డైరెక్టర్ గోపాలన్‌గారు. 1948లో గాంధీజీ పోయినప్పుడు నాచేత భగవద్గీత, ఉపనిషత్తులూ చదివించినవారు శాస్త్రిగారు.

ఒక సాయంత్రం 5 గంటలకి డైరెక్టర్ శాస్త్రిగారి సమక్షంలో మా స్టాఫ్ అంతా ఒక పార్టీకి సమావేశం అవుతున్నాం. నేను సరిగ్గా 5 గం. అయేసరికి హాలులో ప్రవేశించాను. అప్పుడప్పుడు మరిచిపోవడం అనే నా దౌర్బల్యం గురించి కర్ణాకర్ణిగా విన్న శాస్త్రిగారు నన్ను చూసి "రజనీ హేజ్ ఫర్గాటెన్ టు ఫర్గెట్" (రజనీ మరచిపోవడాన్నే మరచిపోయాడీ వేళ) అన్నారు అంతా గొల్లుమని నవ్వారు.

వీరందరివద్దా తరిఫీదు పొంది, మంచి పబ్లిక్ రిలేషన్సు ద్వారా, ఉన్నత స్థాయి అధికారులలో ఒకరుగా పైకి వచ్చినవారు శ్రీ సూరి నారాయణమూర్తి (ఎస్.ఎన్ మూర్తి) ఈయన బొంబాయి, కలకత్తా, లక్నోలలో ఆయా పదవులు నిర్వహించి ఏభైలలో మద్రాసు డైరెక్టరయ్యాడు. అప్పుడు భారతి కే సంత్ కవియోం" అనే సంగీత రూపకాన్ని (భారతదేశపు భక్తియోగులు) మద్రాసులో ప్రదర్శించడానికి వచ్చిన శ్రీ పంకజ్ మల్లిక్ మూర్తిగారి గదిలోకి అతిథిగా వచ్చి కూర్చున్నారు. మూర్తిగారు - నన్ను పిలిపించి ఇదుగో - ఇతడు మీకు ఏకలవ్య శిష్యుడు మీ వంగదేశపు కవీశ్వరుడి మీద సంగీత నాటకం వ్రాసి, ప్రసారం చేశాడు. పదేళ్ల క్రితం అని చెప్పి, నాచేత నా చండీదాసులోని రెండు పాటలు పాడించారు. అప్పుడు - ఆపాటలో తెలుగు పాటలో పంకజ్‌మల్లిక్ బెంగాలీ పాటల్లోను హిందీ పాటల్లోను వినిపించే వ్యక్తిగతమైన రాగసంగతులను తెలుగుతనం ఏ మాత్రమూ చెడకుండా తెలుగుపాటలో వినిపించిన నన్ను శ్రీ పంకజ్ మల్లిక్ ఆనంద బాష్పాలతో కౌగిలించుకోవడం నేను ఎన్నడూ మరిచిపోలేని సంఘటనల్లో ఒకటి

శ్రీ గోపాలన్, శ్రీ శాస్త్రివంటి ఆదర్శ ప్రాయులైన డైరెక్టర్ల ఆదరాభిమానాలు చూరగొని ఆకాశవాణి కింది శ్రేణుల్లో పని చేసిన అనుభవం, తరువాత రెండు మూడు కేంద్రాల డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు నా కెంతగా ఉపకరించిందో!

59. రేడియోలో నా మొదటి నాటకం : చండీదాసు

చిన్ననాటి నుంచి నేను క్రియాత్మకంగా ఏదైనా రచన మొదలు పెట్టబోయేసరికి ఏదో రాగమూ, సంగీతమూ ముందాడుతూ రావడం చేత వచనం కంటే పద్యం కంటే, అది గేయంగానో, గేయ నాటకంగానో రూపొందేది

నా యువ మిత్రుడు భట్టొకసారి అడిగాడు నన్ను "మీ గేయాలుగాని, గేయ నాటికలు గాని ఏ మాధ్యమం (మీడియం) కోసం వ్రాస్తూ వచ్చారు?" (రంగస్థలానికా, రేడియోకా, టి.వికా? అని! అతనికి నేనుచెప్పిందేమిటంటే ఏ రచననీ నేను. నా మాధ్యమం ఇదీ అని దానిపై గురిపెట్టుకుని చెయ్యలేదు. నేను రేడియోలో చేరే దాకా చేసిన రచనలను, వాటిని కూర్చేటప్పుడల్లా నా "మాధ్యమం" నేను. అవి రాగంతో పాటు లయాత్మకంగా రావడం నాకు సహజ గుణం. (సెకండ్ నేచర్) అయిపోయి, వాటిలో నాటకీయతా, రసస్ఫూర్తి సందర్భ శుద్ధీ వాటంతట అవి రచనలో సిద్ధించినప్పుడు, నేను పాడుతున్నప్పుడు తాత్కాలికంగా వింటూండే బంధుమిత్రులు, ఆ క్షణానికి నా శ్రోతలు, వాళ్ల తల పూవులూ, కను చెమర్పులూ నాకు ప్రోత్సాహకాలు అవుతూండేవి" అన్నాను

ఆ విధంగా తయారైన నా తొలి నాటకం గేయ నాటకం - "చండీదాసు".

"ఏమొన్ పీరితి కొభు దేఖి నాఇ షుని,
పొరానే పొరాన్ బాంధా ఆపొనా ఆపొని"

అని రాధాకృష్ణుల ప్రణయ లీలను ప్రకృతి పురుషుల ప్రణయ లీలగా "కీర్తన్" అనే వంగ భాషలో భక్తిగేయ మాలికలుగా రచించి - ప్రతి వైష్ణవ దేవాలయంలోను హరిదాసినుల గానం ద్వారా "జరిగే నాటక ప్రదర్శనల ద్వారా, గీత కర్తా అయిన జయదేవునికి తర్వాత వైష్ణవ గురువులలో ఒకడుగా ప్రసిద్ధి పొందిన "కవియోగి" చండీదాసు రజక బాలిక అయిన "రామిని"ని ప్రేమించి అర్చక వర్గానికి, సమాజానికి వెలి అయిపోయిన ఈ మహాకవి "సహజ యాన" అనే పేర ప్రణయ తత్వానికి ఒక ప్రత్యేక పంథకి మార్గదర్శకుడయ్యాడు. 1938లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేను ఎం ఎ (రెండవ ఏడు) చదువుతూన్నప్పుడు మా ఆహ్వానాన్ని మన్నించి మా హాస్టల్‌కి వచ్చిన తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి గారు తయారవుతున్న నాటికలోని గేయాలు విని నన్ను మెచ్చుకొని ప్రోత్సహిస్తూ, అప్పుడే తాను కూడా "సహజ యాన పంథీ" అనే పేర చండీదాసు ప్రణయ తత్త్వం మీద నాలాగే పూర్తి పద్య గేయ నాటిక వ్రాస్తున్నట్లు చెప్పారు ఈ రెండు రచనలూ (నాదీ, శ్రీ శాస్త్రిగారిదీ) 1942వ సంవత్సరం వెలువడిన "ప్రతిభ" సాహిత్య పత్రిక ఒకే సంచికలో అచ్చుకావడం

ఒక విశేషం అంతకు ముందు 1941 ఫిబ్రవరి 21వ తేదీన నా "చండీదాసు" ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం నుంచి ప్రసారం కావడమూ, ఒక ఆరు రోజులు ముందుగా 1941 ఫిబ్రవరి 15వ తేదీన గోఖలే హాల్‌లో (మద్రాసు) శివశంకరశాస్త్రి గారి సహజ యాన పంథీ రంగస్థల నాటకంగా ప్రదర్శితం కావడమూ మరొక విశేషం!

"ఎడలు రెండూ ఏకమన్నారూ, గడె వియోగమె సైచమన్నారు,
తమ సమాగమమింక ముగిసేనో తనువొరసి ఉసురులె ఎగసేనొ
రాధికా ప్రణయమ్మునకు సాటి, మాధవుని ప్రేమమ్మునకు సాటి
ఎవరు విన్నారెవరు కన్నారు"

రజని గేయంగా నలభై యేళ్లకు పైగా ఆంధ్ర మహాజనులకు పరిచితమైన గేయం పైని ఉదహరించిన చండీదాసు వంగ గేయానికి స్వేచ్ఛానుసరణం

నా 'చండీదాసు' 1941 ఫిబ్రవరి 21న ప్రసారం అయింది. చండీదాసు పాత్రను నేనే నిర్వహించిన చండీదాసు వంగగేయానికి స్వేచ్ఛానుసరణం.

నా 'చండీదాసు' 1941 ఫిబ్రవరి 21న ప్రసారం అయింది. చండీదాసు పాత్రను నేనే నిర్వహించాను. 'రామిని' లేక రామమణి అనే నాయికా పాత్ర అప్పటికి 'మాలపల్లి' అనే సినిమాలో పాటలు పాడి గాయకురాలిగామన్నిక పొందిన పి. సుందరమ్మ (మాలపల్లి సుందరమ్మ అనే పిలిచేవారు - నల్లవాడే గొల్లపిల్లవాడే అనే బసవరాజు అప్పారావుగారి గేయంతో ఆమె జనరంజకురాలయింది. ఇంకా ఎస్. వరలక్ష్మి విమలకుమారి, బళ్లారి లలిత మున్నగువారు బృందగానాలకి, చలపాక సత్యం (లేక సత్యనారాయణ) అనే పిఠాపురం, పిఠాపురం (దగ్గరి గొల్లప్రోలు) లో నా మిత్రుడు పాఠశాల రంగస్థలంపై మా నాటకాలకి హార్మనిస్టుగా మాకు సాధకం ఇచ్చే కళాకారుడు చండీదాసుకు ఈ అన్నయ్యపాత్ర! నాటకంలో సంగీతం మొదటి పాట నుంచి చివరి పాట దాకా సంగీతం నాదే. కాని పాటకూ పాటకూ మధ్యా రంగానికీ రంగానికీ మధ్యా వచ్చే సంగీత సేతువుల నిర్వహణకి - వాద్య బృంద దర్శకత్వానికీ అప్పటికే ప్రసిద్ధి పొందిన సంగీత దర్శకుడు శ్రీ సాలూరి రాజేశ్వరరావు ఇస్రాజ్ వాద్యానికి ఆయన అన్నగారు హనుమంతరావుగార్లను నియోగించారు. మిత్రుడు రాజేశ్వరరావు ఎంత సజ్జనుడంటే, సంగీతం అంతా రజనిగారి దైనప్పుడు నా పేరు ముందర చెప్పడం ఏమిటండీ అని సంగీత రచన నా పేరిటా, దర్శకత్వం తన పేరటా ఈ వరుసలో ఎనౌన్స్ చేయించారు ఆయన అంతటితో నాకు పరమమిత్రుడయిపోయి, నా పాటలు పది పన్నెండు పైగా సోలోలూ, యుగళగీతాలు రేడియోలో పాడి, బాలసరస్వతీదేవితో గ్రామొఫోన్ రికార్డు ఇచ్చారు. చల్లగాలిలో, ఓ విభావరీ, కోపమేల

రాధా మొదలయిన పాటలు! ఈ నాటక నిర్వహణకి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి డాక్టర్ అయ్యగారి వీరభద్రరావు గారు.

నాటకం ప్రసారం అయ్యాక నేను స్టూడియో పక్క బాత్రూంలో కార్యక్రమం ఆశించినంత బాగోలేదని ఏడుస్తుంటే జానకిరాం గారు ఓదార్చారు.

చండీదాసు రచిస్తున్న రోజులలోనే విని, అందులోని మనప్రేమ వంటి పాటలను మెచ్చుకున్న శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) - నాటకం ప్రసారం అయినప్పుడు ఆంధ్రప్రభలో పనిచేస్తున్నారు. "హాయుపథంలో రజని చండీదాసు" అనే పతాక శీర్షికతో సమీక్షిస్తూ రచనకీ, సంగీతానికి మంచి కితాబులిచ్చారు.

ఇది వంగకవి జీవితం కనక ఇందులో సంగీతం మొదటి నుంచి చివరిదాకా బంగాళీ కీర్తన సంగీత శైలిలోను కొన్ని చోట్ల రవీంద్ర సంగీత శైలిలోను అప్పటికి యువశ్రోతల హృదయాలను ఆకర్షిస్తున్న పంకజ్ మల్లిక్, సైగల్ వంటి మహాగాయకుల గాన పద్ధతులను నా తెలుగుపాటలకి తెలుగుతనం ఎంత మాత్రమూ చెక్కు చెదరకుండా పాడే శైలి ఒకటి రూపొందింది. కలకత్తా తెలుగు సినిమాలలో పనిచేసిన శ్రీ రాజేశ్వరరావు కూడా అదే మనోధర్మానికి అభ్యాసపడడం చేత, మా ఇద్దరికీ చండీదాసు నాటక నిర్వహణలో హృదయతరంగాలు ఒకే విధంగా పనిచేశాయి.

కీర్తనశైలిలో చండీదాసులోని ఒక గేయం

దాసీకావా ప్రాణ బంధూ, న
న్నుదాసింతువే ప్రేమసింధూ!
ఆశలే నురిగితూలేవో,
ఆకాశమే విరిగికూలేనో
హృదయమ్ముపై రాలుచున్న లోకమ్ము
అదయమా వెడవన్న నన్ను
బృందావనికి నీవురావో, మధుర
మందానిలములింకలేవో
దాసీ కావా ప్రాణబంధూ, న
న్నుదాసింతువే ప్రేమసింధూ!

౬౦. శివరాత్రి - శ్రీశైలం

మద్రాసు రేడియో ప్రసారంచేసిన రెండవ డాక్యుమెంటరీ రూపకం!

ఈ వారం 16వ తేదీని మహాశివరాత్రి. అనాటి మద్రాసు రేడియో కార్యక్రమాల జ్ఞాపకాలలో నుంచి 'శ్రీశైలం' రూపకం భావతరంగాలపైని తేలుతోంది. దాన్ని డాక్టర్ అయ్యగారి వీరభద్రరావుగారు రూపొందించారు రేడియో వంటి ధ్వని మాధ్యమం ద్వారా సామూహిక జనసందోహపు సంభ్రమోత్సాహాలను వాస్తవికత ఉట్టిపడేటట్లు ప్రసారం చెయ్యాలని ఆయన ఆశయం.

అందులో శ్రీశైలం వంటి పురాతన ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రం అక్కడ శివరాత్రి పుణ్య కాలానికి చేరుకొనే మహాజన సమూహం! ఎన్నో ఎన్నో కదలని గుంపులు - ఎన్నో ఎన్నో కదిలే గుంపులు - సంబరాలు, పరసలు, వేడుకలు వినోదాలు - క్షేత్రం గొప్పదనాలు పురాణగాధలు భక్తుల చరిత్రాలు బసవేశ్వరాది భక్తియోగుల ధర్మసూత్రాలు - నీతి ప్రవచనాలు - ఇన్ని ముఖాలు గల ధ్వని చిత్రంలో ఏ ధ్వని సముదాయాన్ని ఎంత దూరంలో వినిపించాలి. ఏ సందేశాలను ఎంత సమీపంలో ఎంత స్పష్టంగా వినిపించాలి, అవి వినిపిస్తున్నప్పుడు వాటిని అస్పష్టతలోకి ముంచివేయకుండా, ఆ వివిధ జన సముదాయాల వివిధ కార్యకలాపాలు ఎంతెంత దూరం నుంచి వినిపించాలి. ఇదంతా కాగితాలపై వివరంగా వ్రాసుకొని సాంకేతిక చాతుర్యాలు, యాంత్రిక సౌకర్యాలు ఈ నాటి అంతగా అభివృద్ధి చెందని ఆ 1940 వ దశకంలో మద్రాసు కేంద్రం ఆవరణలో ఆరుబయట కొన్ని ధ్వనులను డిస్కుపై రికార్డు చేసి, కొన్ని సామూహిక ధ్వనులకు ఒక స్టూడియో ఏర్పాటు చేసుకొని కదిలిపోతూండే భక్త సమూహాల పాటలకు ఒక స్టూడియో వ్యాఖ్యాత మాటలకు ప్రత్యేకంగా ఒక మైక్రోఫోన్‌ను కేటాయించి, ఈ కార్యక్రమాన్ని రికార్డు చేశారు. టీపీలో ఆలయఘంటా, భక్త సమూహాల మహాదేవ శంభో నినాదాల వంటి కొన్ని ధ్వనులకు ప్రతిధ్వనీ (ఎకో) వినిపించేట్టుగా ఒక స్పీకరులో నుంచి ఆ ధ్వనులని మరో మైకు ద్వారా గ్రహింపచేసి, ఫీడ్ బ్యాక్ వల్ల వచ్చే అనవసర ధ్వనులు రాకుండా (ఫిల్టర్) ఆ ధ్వనులను వడబోసి రికార్డు చేశారు.

కదిలిపోతుండే భక్తుల పాటలలో జంగం కథలు, దక్షయజ్ఞం, బుర్రకథా, శంఖం వూదే జంగమయ్య పాటా, వీరభద్రుడి ప్రభలూ ఆ ప్రభల ముందు వాయించే వీరణాలూ, మొదలయిన దేవాలయ కోలాహల ధ్వనులన్నిటితోటీ ఆ రూపకం వింటూంటే, ప్రత్యక్షంగా శ్రీశైలం వెళ్ళి స్వయంగా శివదర్శనం చేసుకున్న సంతృప్తి శ్రోతలకు కల్పించారు - ఆ రోజులలోనే!

అవి నలభైలూ ఇవి తొంభైలూ! అప్పటి నుంచి ఈ నాటికి మనదేశంలో ప్రసార మాధ్యమాల సాంకేతిక విజ్ఞానమూ, వాటి ప్రయోగ సౌకర్యాలూ అభివృద్ధి చెంది కేవల ధ్వని శ్రవణం మాత్రమే కాకుండా, దృశ్యదర్శనంలో కూడా ఉపగ్రహాల ద్వారా పెద్ద పెద్ద అంగలు వెయ్యగలిగాం మనం! ఈ నాటి రేడియో దూరదర్శన్ మాధ్యమాల ద్వారా ప్రపంచం అంతా మనకి మన డ్రాయింగ్ రూంలో రేడియో శ్రవణ పేటికలలోకి, దూరదర్శన యంత్రంలోకి అందుబాటులోకి వచ్చి, శ్రోతల సంఖ్యా, ప్రేక్షకుల సంఖ్యా దేశవ్యాప్తంగా హెచ్చయిపోయింది.

ఇటీవల దూరదర్శన్ లో ఫెస్టివల్ ఆఫ్ రష్యా, మన దేశంలోను, రష్యాలో ఫెస్టివల్ ఆఫ్ ఇండియా కార్యక్రమాలలో నుంచి ఎంపిక చేసిన దృశ్యాలు ప్రదర్శించినప్పుడు మన దేశపు జానపద కళల సంస్కృతి రష్యా ప్రేక్షకులను, రష్యాదేశపు జానపద కళల సంస్కృతి మన దేశ ప్రజలను ఆనందింపచెయ్యడం మన కందరికీ తెలుసు.

ఆ కార్యక్రమాలలో రష్యాదేశపు జానపద కళలు వివిధ రీతులు దర్శిస్తూంటే, మన సాహిత్యంలో పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో శివరాత్రి సందర్భంలో శ్రీశైల పర్వతంపై భక్తులు - ఆనాటి ఆంధ్ర ప్రజల ఆటపాటల ప్రదర్శన వర్ణన జ్ఞాపకం వచ్చింది.

"చప్పట్లు పెట్టంగ చక్కన లేచి, అప్పాటవడయాట లాడెడువారు,
వేడుకతో చిందు పాడంగ ఉబ్బి, కోడంగియాటల గునిసెడివారు
అమరాంగనలు దివినాడెడు పొడ్కి, అమరంగ గడలపై ఆడెడువారు,
ఆ వియద్గతి పక్షులాడెడునట్టి, భావనమోకులపై నాడువారు,
జనులు హర్షింప నాస్థానముల్ సొచ్చి, అనుకూల వివిధ సమ్మేళనములందు
అర్భటంబిచ్చి ఒయ్యన జవనికల, గర్భంబు వెడలి అక్కజము వట్రిల్ల
ఆడకముందర అభినయంబొలయ, చూడక ముందర చోద్యంబు తనర
నిక్కుచును, త్రిభంగి నిలుచుచు, అట్ల, చొక్కుచు సభ జూచి ఒక్కింత నగుచు
బొబ్బలు పొడుచుచు పొంగి యార్చుచును,
గుబ్బన లేచుచు గునిసి యాడుచును. జారుచు, జంగలు సాపుచు మంది
నూరించుచును మొగంబోర పుచ్చుచును
ఉరమున నడచుచు ఒదికిలబడుచు ధర బోరలుచు సముద్ధతే చనుచు
ధర తిరుగుచు బిసరిల్ తన్ని నిల్చుచును, ధర బొంగరమునట్లు తలక్రిందుసేసి
తిరుగుచు వెలిదన్ని తీపుట నిల్చుచును....."

1948 ప్రాంతంలో సామ్యవాద చైనా తరపున సాంస్కృతిక బృందం మద్రాసు వచ్చి, చైనా దేశపు జానపదకళల ప్రదర్శన లిచ్చింది. వాటిలో కూడా, మన జానపద కళలతోను, రష్యా జానపద

కళలతోను ఎన్నో సామ్యాలు కనబడి, ప్రపంచం అంతటా ఏ దేశంలో అయినా మానవుల ఆట పాటలలో ఎన్నో సామ్యాలు గోచరిస్తాయి అని తెలుసుకుంటాము.

61. శ్రీగోపీచంద్

శ్రీ త్రిపురనేని గోపీచంద్ మా అన్నయ్య నళినికి మంచిస్నేహితుడు, మాబావ బుద్ధవరపు నాగరాజుకి క్లాస్‌మేట్. నా మొదటి మద్రాసు ప్రయాణం సందర్భంలో ప్రసారం చేసిన శ్రీశ్రీ వ్రాసిన మోహినీ రుక్మాంగదలో నాపాత్ర, పాట చూసి రేడియోలో నిర్వహకులు డా॥ అయ్యగారి వీరభద్రరావుగారు, జానకిరాంగారు ముచ్చట పడ్డారు. నాకు కూడా రేడియో ప్రసారాలతో ముడిబడిన ఉద్యోగం చెయ్యాలనే ఆసక్తిబాగా ఉంది. సీనియర్ ప్రోగ్రాం డైరెక్టరుగారి ముందు నా అభిప్రాయం ఉంచడమైనది. వారు సరేనంటూ నెలకి రూ. 40/- లు ఇచ్చేట్లు మూడునెలల కాంట్రాక్టుని నాముందుంచేరు. నేను రూ. 50/ లు ఇమ్మని అడిగేను. ఎందుకంటే ఆంధ్ర ప్రచారిణీ సహాయసంపాదకుడుగా నాకు రూ. 50/- లు అప్పటికే ఇస్తున్నారు కనుక శ్రీఎస్.ఎన్. మూర్తిగారు నేనడిగినది ఇవ్వలేమన్నారు అంతటితో తిరిగి ఇంటికి వచ్చేశాను.

ఈ విషయం గోపీచంద్‌కి తెలిసింది. అతను పిఠాపురం వచ్చి అలాగ రేడియోలో వచ్చిన ఆఫర్ వదిలిపెట్టేయవద్దు రూ 45/- ఇస్తే వస్తానని నన్నేవారికి వ్రాయమన్నాడు. నేను శ్రీ ఎస్.ఎస్.మూర్తి గారికి "నాకు నా కళాకౌశలాన్ని వికసింపచేసుకోవడానికి రేడియో విభాగం మంచి అవకాశమును కల్పించగలదని భావిస్తున్నాను ఇప్పటికే రూ. 50/ లు సంపాదిస్తున్నాను కనుక రూ.45/-ల చొప్పున ఇచ్చేట్లయితే రావాలని చాలా ఉత్సాహపడుతున్నాను" అని లేఖ వ్రాసేను.

ఒకవారం తిరగకుండానే నెలకు రూ. 45/-లు ఇచ్చేట్లు 3 నెలల కాంట్రాక్టు ఖాయపర్చుతూ వెంటనే వచ్చి చేరమని మద్రాసు రేడియో వారు శ్రీఆచంట జానకిరాంగారి ద్వారా టెలిగ్రాం నాకు పంపేరు ఆవిధంగా రేడియోలో అడుగుపెట్టేను. మూడు నెలలు పూర్తి అయ్యాక తరువాత కాంట్రాక్టు రూ. 75/-లు చొప్పున, మరి మూడు నెలలయ్యాక నెలకు రూ 100/- చొప్పున మరొక కాంట్రాక్టు వచ్చేయి. అలా రేడియో విభాగంలో స్థిరపడిపోయాను.

శ్రీ గోపీచంద్ ఇచ్చిన సలహా ఎంతో సమయంలో ఉపయోగపడింది. అలాగే తరువాత జీవితంలో సినీగేయాలు వ్రాయడానికి స్వర్గసీమ తరువాత, గృహప్రవేశం, పేరంటాల్లు, లక్ష్మమ్మ మొదలైన సినిమాలతో సినిమా వ్యాసంగం ప్రారంభమవడానికి అతని ప్రోత్సాహం చొరవ చాలా దోహదమిచ్చాయి.

౬౨. సాలూరి రాజేశ్వరరావు

నే పాల్గొన్న మొదటి రేడియో కార్యక్రమం శ్రీశ్రీ రాసిన నాటకం 'మోహినీరుక్మాంగద'. రేడియోవారికి నేను పరిచయం అయిన వారం లోనే ఆకార్యక్రమం వచ్చింది. అందులో నా పాత్ర 'బ్రహ్మ'. రెండో కార్యక్రమం నా నాటకం 'చండీదాస్'. అది 1941లో ఫిబ్రవరి 21న రేడియో ప్రసారం అయింది. నాటకం దాని సంగీతం నేనే కూర్చాను. ఐతే దీని సంగీత దర్శకత్వాన్ని సాలూరి రాజేశ్వరరావుకి అప్పగించారు ఆయన... సజ్జనుడు గనుక "సంగీతం అంతా ఆయనే కూర్చాక నా పేరు పెట్టారేమిటి" అంటూ ప్రకటన లో ముందు పేరు తనది ఉండరాదని ఎంచి, "సాహిత్య సంగీత రచనలు రజనివి" అని చెప్పించారు. తన పేరు దర్శకత్వానికి మాత్రమే అని చెప్పించుకున్నాడు.

సంగీత శాస్త్రపరంగా నిజానికి రజని, రాజేశ్వరరావుల హృదయం, సంప్రదాయం సంగమానసపుత్రత్వం మల్లీశ్వరి సంగీతాన్ని శ్రీ రాజేశ్వరరావు ఆంధ్ర జనులందరూ మెచ్చేటట్టుగా కూర్చాడు.

౬౩. కున్హన్ రాజా

నేను మద్రాస్‌లో వున్నప్పుడు లలిత సంగీత విభాగం చేసే రోజుల్లో సంస్కృత కార్యక్రమాలకు కూడా నేనే అధికారిని. ఆకార్యక్రమంలో పాల్గొనటానికి ఆచార్యులు డా॥వి. రాఘవన్ వంటి సంస్కృత విద్వాంసులు ఇంకా ఇతర సంస్కృత కళాశాలల అధ్యాపకులు వచ్చేవారు. వారందరిలో గణనీయుడు మద్రాసు విశ్వవిద్యాలయ సంస్కృత శాఖాధ్యక్షులు శ్రీ కున్హన్ రాజా'. ఈయన వేదాలగురించి ఆర్యుల గురించి ఆంగ్ల గ్రంథాలు రాశారు ఇరాన్ లో ఓ యూనివర్సిటీకి అధ్యాపకులుగానూ వెళ్ళారు. ఆయన చిరపరిచితులు. నా కార్యక్రమాల్లో కొన్నిటికి నేను ఆయనను వక్తగా పిలిచి గౌరవించేను.

64. చెన్నపురి ఆంధ్ర మహాసభ స్త్రీల శాఖ

(అదే ఆంధ్ర మహిళా సభ అయింది)

మిర్జాపురం రాణీగారు అధ్యక్షురాలుగా, గుమ్మడిదల దుర్గాబాయమ్మగారు కార్యదర్శిగా చెన్నపురి ఆంధ్ర మహాసభ స్త్రీల శాఖ నడుస్తూండేది. అదే తర్వాత ఆంధ్రమహిళాసభ అయింది

చెన్నపురి ఆంధ్ర మహాసభ స్త్రీల విభాగం నిర్వహిస్తున్న శ్రీమతి దుర్గాబాయి మా అన్నగారి సహకారంతో మహిళలకి ఒక విద్యా ప్రణాళిక వేసింది ఎదిగి, వయసొచ్చి ఇంటిపట్టున ఉండి పోతోన్న తెలుగు మహిళలకు స్కూలుదశనుంచీ డిగ్రీ పరీక్షల వరకు ప్రైవేటుగ తయారుచేసే స్త్రీల శాఖ ద్వారా ఆమె స్కూలు నిర్వహించేవారు. ఆంధ్ర మహిళాసభ ఏర్పాటు ఆ సందర్భంలో నృత్తగేయాలు నృత్యముక్తకాలు నాచేత రాయించారామె. సంధ్యా దీపకళిక, సుభద్రార్జునీయం, మేనకావిశ్వామిత్ర, మధురానగరీగాథవంటి నృత్యగేయనాటికలు నా చేత రాయించి తన పాఠశాల్లో చదివే విద్యార్థినులకు రంగనాయకమ్మ, సామ్రాజ్యం రమణారావు, కులకర్ణి శ్రీనివాస్, వెంపటి పెదసత్యం వంటి నృత్యదర్శకుల చేత చెప్పించి ప్రదర్శింపజేశారు. అటువంటి సందర్భంలో నా 'చండీదాసు' నాటకం కూడా వినియోగించారు. (1940 1948 ల్లో) సరోజినీ దేవి అధ్యక్షురాలిగా ఆంధ్రమహిళాసభలో ప్రదర్శింపజేశాను.

65. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, యక్షగానాలకు ఆంధ్రమహిళా సభలో ప్రోత్సాహం

శ్రీమతి దుర్గాబాయ్ (దేశ్‌ముఖ్) 1942 నుంచీ, రజని చేత కొన్ని నృత్యగేయముక్తకాలను (ప్రత్యేకగేయాలను) నృత్యగేయనాటికలను రచింపజేసి, ఆంధ్రమహిళాసభ బాలికల చేత ప్రదర్శింపజేసేవారు. ఆవిధంగా తయారయినవే 'శతపత్ర సుందరీ' గేయమూ, 'సంధ్యాదీప' గేయమూ వీటికి కుల్‌కర్ణి శ్రీనివాస్, దేబీ ప్రసాద ఘటక్ అనే నృత్యదర్శకులు నృత్యం సమకూర్చారు 'మేనకావిశ్వామిత్ర' ఆవిర్భావం 1942లో ఆంధ్రమహిళాసభలోనే. తరువాత 'సుభద్రార్జున' గేయ నాటికా (చిన్న పిల్లల) వసంతోత్సవం మధురానగరిగాథా నృత్యనాటకాలు తయారు కావడానికి మహిళాసభ వార్షికోత్సవాలూ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రోత్సాహమూ 'కారణంబులు, ఉద్బోధకములు'. ఈ నాటకాలకు కోరియోగ్రఫీ రంగనాయకమ్మా కణ్ణన్, సామ్రాజ్యం రమణరావుగారులు సమకూర్చారు.

మధురానగరిలో చల్లనమ్మబోదు అనే సాంప్రదాయిక గోపికా గీతములో గోపికోక్తులకు కృష్ణుని ప్రత్యుక్తులను చేర్చి యుగళగేయంగా కూర్చి దానిచుట్టూ దేశిరూపక పద్ధతిలో 'మధురానగరీగాథ' అనే నృత్యసంగీత నాటిక 1943లో రేడియోలోనూ ఆతర్వాత 1944లో వెంపటి పెదసత్యంగారి కోరియోగ్రఫీతో ఆంధ్రమహిళా సభలోను, గూడవల్లి రామబ్రహ్మంగారి సమక్షంలో సారథీ స్టూడియోస్‌లోను వెంపటి పెద సత్యంగారి కూచిపూడి నర్తకబృందం సాహాయ్యంతో ప్రదర్శించారు. ఆనాడే రజనీ గళంలో కలంలో యక్షగాన రచనాంకురాలు నాటుకున్నాయి. ఈలాంటి రూపకాలలోని దేశినుడికారాలూ దేశిరాగాలమెట్లూ - కూర్చడమెలాగా అనే తపన సాటికవుల్లో కలగడానికి కొంతకాలం పట్టినట్లుంది.

1942 44ల మధ్య గౌతమబుద్ధుని జీవిత ఘట్టాలు ఇతివృత్తంగా రచించి 'దివ్యజ్యోతి - వచనసంభాషణలతో మాత్రాచ్ఛందస్సులలో గేయాలతో కూర్చిన ఆరు అంకాలనాటకంలోని మాయాదేవి స్వప్నం, సిద్ధార్థ జననం, సిద్ధార్థుని నగరసంచారం, మహాప్రస్థాన ఘట్టాలలోని గేయాలన్నిటికి ఫక్తు కర్ణాటక సాంప్రదాయిక రాగాలతో కూర్చిన సంగీతంతో నృత్యగేయనాటికలుగా ప్రదర్శితాలు.

1942 55ల మధ్య కూచిపూడి మేలటూరి భాగవతమేళ బృందాల నాటకాల రేడియో ప్రసారాలలో పాల్గొనీ, తెలుగువారి మొదటి యక్షగానమైన సుగ్రీవ విజయాన్ని సంగీత పరచి మద్రాసులో తొలిప్రసారం చేయించీ, తెలుగువారి మహాయక్షగానమైన నారాయణ తీర్థుల

కృష్ణలీలాతరంగిణి నుండి వేరు వేరు ఘట్టాలు, కృష్ణుని బాల్యలీలలూ, రాధాగోవింద, గోపీరాసవిలాసమూ, రుక్మిణీ కల్యాణమూ, వేరువేరు ప్రసారాలలో మద్రాసునుంచి వెలువరించీ, 1955లో ఆంధ్రవాగ్గేయకారచరిత్ర రచన చేస్తున్న సందర్భంలో యక్షగానం గురించి, మూడు నాలుగు వేరు వేరు ప్రకరణాలు సవివరంగా సాధికారంగా వ్రాసేసత్తువ కలిగింది రజనికి.

1956లో విజయవాడకు బదిలీ అయిన రజనికి - కూచిపూడివారి నాటకాల సాహిత్యాన్ని పరిష్కరించే ప్రయత్నాలు చేస్తున్న శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారితోను, సంగీతాన్నీ రాగప్రయోగాల సాంప్రదాయికతనూ పరిశీలించి నిర్దుష్టం చేయపూనుకున్న శ్రీవోలేటి వెంకటేశ్వరులుతోను సహకరించి, శ్రీ బందావారు కృషిచేస్తూండిన కూచిపూడివారి ఆహార్య, రంగప్రసాధనాది ప్రయోగాలలో ఆకర్షణీయతా, సాధికార సాంప్రదాయకతా సమన్వయ ప్రయత్నాలకూ, సిద్ధేంద్రకళా క్షేత్ర నిర్వహణ కార్యకలాపాలకూ సాక్షీభూతుడుగా - 1956 అక్టోబరు మాసం ప్రాంతంలో కూచిపూడి నాట్యబృందం దక్షిణదేశయాత్ర చేసినప్పుడు 'కూచిపూడి న్యాటమేళా' అనే రజని రచించిన ఆంగ్ల వ్యాసాన్ని మద్రాసు నుంచి వెలువడిన ప్రసిద్ధ ఆంగ్లదినపత్రికలో రెండు వారాలు జైత్రయాత్రా ప్రచారభేరిగా ప్రకటించడమయింది ఆ తరువాత కూచిపూడి బృందం ఢిల్లీలో విజయపతాక ఎగరవేసి, భారత ప్రభుత్వగౌరవ మర్యాదలు పొంది విజయవాడ తిరిగి వచ్చినపుడు రజని రచించిన "అభినందన" కూచిపూడి శైలి కందార్ధదరువులో శ్రీ పసుమర్తి వేణుగోపాలశర్మ బృందం నృత్యగానాభినయాత్మకంగా ప్రదర్శించారు.

1956 60 ల మధ్య ప్రతీయేడు కూచిపూడిలో జరిగే సిద్ధేంద్ర సంస్మరణ వార్షికోత్సవాలకు కూచిపూడి వెళ్ళి వస్తోండే రజని కంఠంనుంచి వెలువడిన మిశ్రచాపుదరువు కూచిపూడి వేదికపై ఇలా మారు మ్రోగింది.

"తద్ధణ తోంద్రిగుడు తఝ్ఝణుధీంతనా తకధీం తనా
దత్తిలాకోహళ భరతులే ఎత్తిరే మరుజన్మము
సిద్ధనారాయణ క్షేత్రయు లిద్ధరాతలి నుద్ధరింపగ ॥తద్ధణా॥
ప్రకృతియనియెడు క్షేత్రమే బహుపాత్రలౌ నాయికలుగా
పరమపురుషుడు నిర్గుణుడు క్షేత్రజ్ఞుడే నాయకుడుగా
జీవునకు దేవునకు సతిపతి భావమాపాదితముగా
భాగవతనాట్యాభినయముల ప్రజలజీవన్ముక్తులౌనరుప
దత్తిలాకోహల భరతులే యెత్తిరేమరుజన్మము.
సిద్ధనారాయణ క్షేత్రయలిద్ధరాతలినుద్ధరింపగ" ॥తద్ధణా॥

1958 ప్రాంతంలో - రజని రచించి విజయవాడనుండి ప్రసారంచేసిన ఆధునిక నృత్యసంగీతనాటిక - స్వైరిణీ అన్నారునన్ను - ఇందులో యక్షగాన ప్రక్రియరూపాల వెదకులాట కనిపిస్తుంది. నాటకీయతా, నృత్యాభినయ ప్రయోజనీయతా ఉంటూ సాంప్రదాయికత ఒక గేయంలో చేతికందుతూ, మరోగేయంలో ఆధునిక రూపాన్ని అందుకుంటూ సాగుతుంది

ఆ సంవత్సరం ప్రాంతంలోనే రజని శ్రీకాటూరి వేంకటేశ్వరరావుగారి పక్కన కూర్చుండి వేరు వేరు రీతుల దరువులా పదాలా మాత్రాచ్ఛందాలలో వేరు వేరు రాగాలలో సాభినయంగా పాడుతుంటే 'శ్రీనివాస కల్యాణం' అనే యక్షగానాన్ని రచించారు రజని సంగీతంతోనే అది తొలిసారి రేడియో ప్రసారం అయింది.

1960లో విజయవాడ నుంచి హైదరాబాదు ఆకాశవాణికి రజని బదిలీ అవడమూ అక్కడ సాహిత్య ప్రయోక్త కృష్ణశాస్త్రిగారి జతకలియడమూ జరిగింది అంతవరకూ ఆధునిక సంగీతనాటకాల రచనకు ఆభ్యాస పడిన కృష్ణశాస్త్రిగారు 'కాటూరి బావగారి చేత వ్రాయించినట్లే నాచేతకూడా ఒక యక్షగానం పాడుతూ వ్రాయించు రజనీ' అని ఆయన అడిగారు. 'క్షీరసాగరమథనం' ఆవిధంగా షెడ్యూలయింది. రజని ఎన్నిరకాల దరువులు వరసలు పాడినా యక్షగాన పద్ధతి రచన. కృష్ణశాస్త్రిగారి మనోధర్మాన్ని ప్రభావితం చెయ్యడానికి కుదరలేదు. ప్రసారపు తేదీ దగ్గర పడుతోందనగా, ముఖ్యమైన పాత్రల ప్రవేశికీదరువులూ, ముఖ్యఘట్టాల దరువులూ రజని కాగితం మీద పెట్టేసి, స్టూడియోకు కళాకారులనుపిలిపించి. వాళ్లకి పాటలు నేర్పి ఒద్దికలూ తీర్చేవేళకి, కృష్ణశాస్త్రిగారి కలానికి భరతావేశంకలిగి కొన్ని పంక్తులను కొన్ని మాటలను తనకు కావలసిన రీతిని దిద్దుబాటులు చేసి, జంటకవితగా పూర్తిచేశారు.

'అంబాహెచ్చరికా' - అనే ప్రారంభదరువులో

"శ్రీకృష్ణదాసచకోరపూర్ణిమా రజనీ కాంతోదయా దయారాశిహెచ్చరికా
అంబా హెచ్చరికా అపర్ణాహెచ్చరికా సాంబాశివుని ప్రేమధానిహెచ్చరికా"

ఆ 'క్షీరసాగరమథనం' హైదరాబాదు నుంచి ప్రసారం అయి, విజయవాడ రిలే చేసింది దాని రచన రజనీ కృష్ణశాస్త్రిగార్లదీ, సంగీతం రజనిదీను! దాని రికార్డింగ్ బందాగారు, విజయవాడ తీసుకువెళ్ళి కూచిపూడి నాట్యాచార్యులలో హేమాహేమీలనీ రంగస్థలంపైన ప్రదర్శింపజేశారు అది యక్షగాన ప్రక్రియ ఆధునిక ప్రగతిలో తొలి అంజ!

౮౮. డా॥ చింతామణి దేశ్‌ముఖ్

ఆంధ్ర మహిళాసభ చెన్నపురినుంచి తన శాఖలను హైదరాబాద్. ఢిల్లీలకు విస్తరించింది. దుర్గాబాయ్, చింతామణీలు దేశ్‌ముఖ్‌దంపతులయ్యారు. డా॥ చింతామణి కేంద్ర ఆర్థిక శాఖా మాత్యులేగాక మహారాష్ట్ర, హిందీలలో కవితలు వ్రాయగలదిట్ట. మైసూరు వద్ద నున్న కృష్ణరాజసాగర్ ఆనకట్టగురించి ఒక గేయకావ్యం వ్రాశారు. అది హేమావతీలక్ష్మణ తీర్థ అని ప్రారంభమవుతుంది. దాన్ని నేను తెలుగులోకి రూపొందించాను. అదీగాక వారు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ బెంగాలీలో వ్రాసిన "ఆమ్రపాలి" కథను వారు మరాఠీలోకి అనువదించగా వారిసాంగత్య సహకారములతో నేను దానిని తెలుగులో వ్రాసేను. ఆమ్రపాలి ఒక బౌద్ధభిక్షువుని ప్రేమిస్తే ఆయన నిరాకరిస్తూ తరువాత వస్తానంటాడు తన జీవితంలో ఆమ్రపాలి బహుశముగ "దష్ట' అయిసర్వంపోయి ఒక మూలన చెట్టుకింద పడివుండగా అప్పుడా బౌద్ధ భిక్షువువచ్చి ఆమె సేవకు అంకిత మవుతాడు. దీనిని కూడా నేను తెలుగు చేశాను.

చిత్రమేమంటే ఓ రెండేళ్ళతరువాత దేశ్‌ముఖ్‌ల దగ్గరకు వెళ్ళగా వారు నా తెలుగు పాటల్ని నా వరసలో పాడుతూంటే నాకు ఆనందాశ్చర్యాలు కలిగేయి దుర్గాబాయిగారు చింతామణిని 'చింతూ' అని పిలవటం గుర్తు.

67. బాహిరాంగణ ప్రసారాలు

నేను అప్పుడు మద్రాసు ఆకాశవాణిలోనే ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నాను ఎస్.ఎస్.మూర్తి గారు మా స్టేషన్ డైరెక్టర్ అది 1945వ సంవత్సరం.

అది కృష్ణాపుష్కరం జరుగుతున్న సమయం మద్రాసునుంచి ఓ.బి. ప్రోగ్రాం ఇన్‌ఛార్జిగా నన్నూ, వక్తగా ఒక కాంట్రాక్ట్ ఇచ్చి మల్లంపల్లి సోమశేఖరశర్మగారినీ విజయవాడ వెళ్లమని ఆఫీస్ ఆర్డర్‌వేశారు. మద్రాసు నుంచి విజయవాడకు రైలులో ప్రయాణం. నేను, నాతో విజయవాడ గవర్నర్‌పేటలో యెల్లేపెద్ది వారింట్లో బస. ఆచంట జానకిరాంగారి బావమరది, ఆడ్వకేట్ అయిన యెల్లేపెద్ది సుబ్రహ్మణ్యంగారింట్లో నా బస సుబ్రహ్మణ్యంగారింటి వెనక సందులో గుడిపాటి వెంకటచలం గారిల్లు నన్ను సుబ్రహ్మణ్యంగారింట్లో దిగడం చూసిన చలంగారి పిల్లలో సూర్యహాస్ వసంత్ అనే చలంగారి అబ్బాయి నేను ఇలా ఓ బి కోసంవచ్చానని తెలుసుకుని, చలంగారి యింట్లో ఆయన భార్య రంగనాయకమ్మగారికి తెలియజేశారు చలంగారూ, రంగనాయకమ్మగారూ అంతకుముందు వేసంగులలో పిఠాపురంలో తోట చెల్లాయమ్మాగారింట్లో నా పాటలు విన్నారు. (అంటే చలంగారి శిష్యురాలు లీలగారు.)

మా స్టేషన్ డైరెక్టర్ ఎస్.ఎన్ మూర్తి గారు కూడా విజయవాడవచ్చి, వాళ్ల అన్నగారు సూరి కృష్ణమూర్తి గారింట్లో దిగారు. బాహిరాంగణ ప్రసారస్థలాలు రెండు. ఒకటి సి.వి ఆర్. హైస్కూల్ కాంపౌండ్‌లో, 3,4. జానపద గాయబృందాల జానపద వీరపదాల గానం దానిలోని వేరువేరు అంశాలనుగురించి కపిల చిన వెంకటరావుగారు అని విజయవాడ నివాసియైన అడ్వకేట్ మాటాడతారు. ఓ.బి. స్పాట్ అయిన సి వి.ఆర్. హైస్కూల్ కాంపౌండ్ నుంచి టెలిఫోన్ లైన్స్‌బుక్ చేసి, టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌తో ముందుగా ఏర్పాటు చేసుకున్నాము టైం గ్రామస్థుల కార్యక్రమ ప్రసారం చేసే మద్రాసు కేంద్ర ప్రసార సమయం సాయంత్రం 6·30 - 7 గంటల మధ్య. ఒక రోజున కపిల చిన వెంకటరావుగారూ, జానపద గాయకబృందాలూ ప్రసారం చేస్తారు మర్నాడు కృష్ణానదీ ప్రవాహం మధ్యను కృష్ణాబారాజ్ కింద జలాలలో నుంచి ప్రసారం వక్త మల్లంపల్లి సోమశేఖర శర్మగారు అదికూడా గ్రామస్థులకార్యక్రమ సమయంలోనే 6.30 గం - 7 గం॥ లమధ్య. చిన వెంకటరావుగారి ప్రసంగం జానపద గాయక బృందాల ప్రస్తుత జీవిత పద్ధతులను గురించి, వారి జానపద గేయరీతులను గురించీ ఉంటుంది. సోమశేఖర శర్మగారి ప్రసంగం కృష్ణాతీరాన చరిత్రలో అనాదికాలంలో వెలసిన విష్ణుకుండిన రాజవంశం గురించీ ఆవుదూడ ఒకటి రాజకుమారుని రథచక్రాలకిందబడి మరణించింది. దూడతల్లి ఫిర్యాదుగంట మ్రోగిస్తే, రాజు విచారణ చేసి తన కుమారుడి ప్రాణాలను బలిగా ఇస్తాడు. ఆ ఆవుదూడ మరణానికి కారకుడు తనకుమారుడే అయినాసరే అని!

68. కృష్ణ - రజని

శ్రీ కృష్ణశాస్త్రి గేయ రచనలతో రజని సంగీతానికుండే అనుబంధానికి ఒక సంకేతం 'కృష్ణ రజని'. ఈ శీర్షికలో ఆత్మాశ్రయ కవితా గేయాలను నేను పక్కన కూచుని పాడుతూంటే రచించాలనే సంకల్పం ఆయనకి అరవైయో దశకంలో మొదటి సగంలో హైదరాబాద్ ఆకాశవాణిలో పని చేస్తున్నప్పుడు కలిగింది. 20, 24 దాకా గేయాలు రచించారప్పుడు కృష్ణశాస్త్రి

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారితో శ్రీరజని ఆ ప్రక్కన కృష్ణశాస్త్రిగారి కుమారుడు కోడలు

అసలు రజని సంగీతం తయారయి ప్రసారమయిన కృష్ణశాస్త్రి తొలి సంగీత నాటకం 'శర్మిష్ఠ' 1941 మార్చి 23న మద్రాసు కేంద్రం నుంచిప్రసారం అయింది.

రేడియోలో నిలయ కళాకారుడిగా నేను ఇంకా చేరకముందే 1941లో జనవరి నుంచే కేజ్యువల్‌గా పాల్గొంటూండే కార్యక్రమాల జ్ఞాపకాలలో ఈ భావతరంగాలలో తప్పక చేరవలసింది శర్మిష్ఠ.

1941 మార్చి 23న తెలుగు సంవత్సరాది. వచ్చిన వారు ఆనాడు శ్రీ అచంట జానకీరాం. కృశా గారి శర్మిష్ఠ షెడ్యూలు చేశారు యయాతి మహారాజుకు అప్పటి పట్టమహిషియైన దేవయాని వెళ్లిపోయే హేమంతుడిలా కనబడడమూ, దేవయాని అంతఃపురోద్యానంలో ఆమెకు చెలికత్తెగా

వుంటూండిన యౌవనవతి శర్మిష్ఠలోని వసంతలక్ష్మి రాజును ఆకర్షించడమూ, రాజోద్యానంలో వసంతోత్సవపు వేడుకలలో హేమంతుల సమాగమమూ ఈ ఘట్టాలన్నీ ఈ గేయ నాటకంలో (సింబాలికల్) ప్రతీకాత్మకంగా సమకూర్చారు. అందులో ఆరంభంలో హేమంతుడి వీడుకోలు పాట నేనే పాడాను.

"ఏలయింత జాలి వీడుకోలు, నేనె నిలువజాల
అలసించి చేరనా నీహారదూర తీరవేల ఏల
అలసి అలసి ఈ హేమంతికానలమ్ము నిదురించునో
మలసి మలసి సేమంతి సుమాళి బాళి పలవించునో
లోలమ్లాన లోధ్రసూన మేఖల దిగజారి పోలు
తూలి తూలి నా ద్యుపటీ రుహినాంచలములు తేలు
ఏనరేగు ఎటుల మ్రోగు ఈ యాదరగాలి పిలుపు
ఓసరిలెను కాబోలును ఉత్తరపుంగవను తలుపు ఏల
వనులోనికి రమ్మనకు"

ఈ నాటకంలో యయాతి శ్రీ అవసరాల శేషగిరిరావు, దేవయాని శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి. శర్మిష్ఠ కుమారి టుంగుటూరి సూర్యకుమారి. రాజవైద్యుడు శ్రీ మర్ల సూర్యనారాయణమూర్తి, కవి, హేమంతుడు రజని యువతీ యువకులు (బృందం) బళ్లారి లలిత, ఆమె చెల్లెలు, మాలపిల్ల సుందరమ్మ, ఋష్యేంద్రమణి, వాసంతిక, శ్రీ సాలూరి హనుమంతరావు (ఎస్రాజ్), అంజయ్య తబల, కృష్ణశాస్త్రి గారిని మధ్య పెట్టుకొని శేషగిరిరావూ నేనూ ఆయనకు చెరొకవైపునా కూర్చోగా మిగిలిన పాత్రధారులతో ఆనాటి ఫోటో ఒకటి నా దగ్గర ఉండేది

జయప్రదంగా నాటక ప్రసారం పూర్తికాగానే నిర్వాహకులైన శ్రీ జానకీరాం (1941) అప్పుడు వుడ్‌లాండ్స్ హొటల్‌లో రాత్రి విందు ఏర్పాటు చేశారు. నాటకంలో పాల్గొన్న కళాకారులూ కృష్ణశాస్త్రి గారూ, కొందరు రేడియో సహచరులూ ఆ విందుకు హాజరయ్యారు. దేవయానీ శర్మిష్ఠా పాత్ర ధారిణులలో పెద్దామె కన్న చిన్నామెకే నాటకంలో రాజు మన్నన లభించడం వల్ల దేవయాని పాత్రధారిణి ఆ దిగులును అప్రయత్నంగా ఎంతో ఒప్పేటట్లు నటించారు. ఆ దిగులు విందులో కూడా ఆమెను వెంటాడడంతో ఆమెకు కొంత అస్వస్థత కలిగి, నన్ను తోడిచ్చి ఇంటికి పంపించారు ఆవిడ నాకు 'అక్కయ్య' నన్ను ఆప్యాయంగా తమ్ముడూ అని పిలిచేవారు. ఆనాటి రేడియో నాటికల నాయికా పాత్రధారిణులలో ఆమె నంబర్ వన్ అని ప్రసిద్ధి.

కృష్ణ రజని అని శీర్షిక పెట్టిన ఈ తరంగంలో కాక, అసలు 'కృష్ణ రజని పాటల సంకల్పమూ

కూర్పులను గురించి, వేరే ముందు వ్రాస్తున్నాను ఇప్పుడు `కృష్ణ రజను`ల సాహిత్య సంగీతానుబంధాన్ని ప్రకటించిన మరొక అపురూప కార్యక్రమం గురించి మాత్రం వ్రాస్తాను. ముందొక శీర్షికలో మధ్య ప్రాచ్య సంగీత ధోరణులను నా లలిత సంగీతంలో పాడినందుకు డైరెక్టర్ గోపాలన్ మెచ్చుకున్నారని వ్రాశాను అది 1942లో నేను నిలయ కళాకారుడిగా మద్రాసులో చేరాక ప్రసారం అయింది. అప్పటికే కృష్ణశాస్త్రి పారశీక కవి 'హాఫిజ్' పద్యాలను కొన్నింటిని తనిగించి (ఎపిక్యూరియస్) ఉమర్‌ఖయ్యాం జీవిత ఘట్టాలను చిత్రించే నాటకాన్ని ఒకదాన్ని గురించి ఆలోచిస్తూ, వాటిని నాచేత పాడించుకొనేవారు. వాటిలో ఒకటి :

"వేటొక విరియు, వెన్నెలులార ఇనుడెగయు
లజ్జవతి ఉషస్సు రజత వీహారాంతు
కాంచలమ్ముల మౌక్తికాంపమ్ము కప్పుకొను!
ప్రాభాత కలధౌత పాత్ర తెండో చెలులు!
మరకతాసనముపై కొలువున్నది గులాబి,
పరచిరుజ్జ్వల విప్పుల శాద్వలంపు తివాసి
అరుణ మందారమో అరుణ ప్రవాళమో
మధువు సాకీ, మధువు మసలదీ తొలిప్రొద్దు!
ఏల యీ మధుశాల ఏరు మూసినవారు
చాలు ఈ ప్రొద్దువా పాల మూయగలారు!
హే కవాట విపాటకా, కృపాళూ నేవేడువార మీ
ద్వార మీవే తీయుమీ నేడు!"

ఈ నాటకం అతిధిశాల సంగీతమూ ప్రధాన పాత్ర నిర్వహణా నావే. తొలిసారి 1942లోనే మద్రాసు నుంచి ప్రసారమయింది ప్రసారం పూర్తికాగానే ఇంటి నుండి డైరెక్టర్ గోపాలన్ గారూ, మద్రాసులో అనాడున్న అడివి బాపిరాజుగారు టెలిఫోన్ చేసి నన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఎందుకంటే నేను ఆ నాటకంలో ఖయ్యాం పాత్ర ధరించాను. పాటలూ పద్యాలూ ఆ సంస్కృత సమాసాలు పారశీక శబ్దాల అందాలను, సౌరభాలనూ గుబాళించేటట్లు శ్రీ కృ.శా. కూర్చారు పారశీక సంగీత ధోరణులు (వరుసలలో సమకూరాయి). ఇది 60 లలో హైదరాబాద్‌లో నేనూ శాస్త్రిగారూ కలిసి పనిచేసేటప్పుడు అక్కడ ప్రసారం చేసినప్పుడు చేసిన రికార్డింగ్ టేపులో కొన్ని పాటలూ పద్యాలూ ఈనాటికీ దొరుకుతాయి. విజయవాడ రజతోత్సవ సందర్భంలోనూ, మద్రాసులో కృ.శా. సన్మానం జరిగిన సభలలోను ఈ టేపులోని నాటకాన్ని (ధ్వని ముద్రణని) నేపథ్యంలో

వినిపిస్తూ విజయవాడలో ఛాయారూపకం (షాడో ప్లే) మద్రాసులో నృత్య నాటిక (బ్యాలే) గాను ప్రదర్శింపజేశాము.

1938లో కృష్ణశాస్త్రిగారు మద్రాసు రేడియోలో తొలి నాటకం అనార్కలీలో పాల్గొన్న దాని రిహార్సలు నేను స్టూడియోలో చూసిననాడు నేను రేడియోలో చేరతాననే ఊహే లేదు. నేను నాటకంతో 1941లో మద్రాసు రేడియో వారిని చేరినపుడుగాని, 1942లో నిలయకళాకారుడిని అయినప్పుడుగాని కృష్ణశాస్త్రిగారి జోక్యం లేదు కాని ఆయన 1956-58 ప్రాంతంలో రేడియో ప్రొడ్యూసర్‌గా చేరాలని రేడియోవారు నన్నే రాయబారం పంపారు.

69. "కృష్ణరజని" - యక్షగానాలు

1956-60 ల మధ్య విజయవాడలో నేను ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసినప్పుడు సాహిత్య కార్యక్రమ ప్రయోక్త అయిన పింగళి లక్ష్మీకాంతంగారితోనూ, అక్కడ నుంచి 1960లో నేను హైదరాబాద్‌కు బదిలీ అయినప్పుడు అక్కడి సాహిత్య కార్యక్రమ ప్రయోక్త అయిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారితోను కలిసి కార్యక్రమాలు నిర్వహించే అదృష్టం కలిగింది నాకు. ఈ ఇద్దరిలో ఒకరు నాకు స్వయానా గురువులూ, రెడవవారు గురుస్థానీయులూను.

కృ శా గారిచేత హైదరాబాద్‌లో నా సంగీతంతో మూడు యక్షగానాలు రచియింపచేసి, ప్రసారం చేశాను. రచయితకు పక్కతోడయినసంగీత ప్రయోక్తగా మాత్రమేగాక, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జినేనే. ఆ యక్షగానాలలో ఒకటి క్షీరసాగర మధనం, రెండవది విప్రనారాయణ, మూడవది మాళవిక! క్షీరసాగరమధనం రచనలో మూడొంతులు నేను చేశాక కాని, శాస్త్రిగారి చేతికి యక్షగాన రచన లొంగిరాలేదు. అప్పుడు ఇద్దరమూ కలసి ఆ యక్షగానాల ప్రార్థనా దరువు ఇలా కూర్చాం. ఆ మూడు యక్షగానాలకూ ఇదే అరంభ ప్రార్థన.

అంబా హెచ్చరిక, అపర్ణా హెచ్చరిక!
సాంబశివుని ప్రేమధాని హెచ్చరిక!
కుంతీ మాధవుకూర్మి సోదరి కుక్కుటా
ర్ధేందు శేఖరుని దేవేరి హెచ్చరిక!
ముగ్గురమ్మలకు మూలమయిన తల్లీ!

ముక్తినిచ్చే కల్పవల్లీ హెచ్చరిక!
శ్రీ కృష్ణదాస చకోర పూర్ణిమా, రజ
నీకాంతోదయా, దయారాశి హెచ్చరిక!

ముఖ్యంగా చిట్ట చివర మా యిద్దరి పేరులూ వచ్చే చరణం జంట కవులులాగా, నేను 'శ్రీకృష్ణదాస చకోర పూర్ణిమా' అని ప్రారంభిస్తే ఆయన రజనీకాంతోదయా, దయారాశి హెచ్చరికా! అని పూర్తిచేశారు. రజని గొంతులో రాగం కృష్ణశాస్త్రి కళ్లకి పూర్ణిమా చంద్రోదయం అని అది అంబదయవల్ల ప్రాప్తం అనీ దాని భావం!

క్షీరసాగర మథనం ప్రసారం విజయవంతంగా జరిగిందని విన్నవారిలో విజయవాడ రేడియో నాటక ప్రయోక్త బందా కనకలింగేశ్వరరావుగారు హైదరాబాద్ వచ్చి, స్టేషన్ డైరెక్టరు వద్ద మమ్మల్ని అభినందించి, ఆ యక్షగానం టేపు ప్రతి ఒక దానిని తీసుకెళ్లారు తనతో ఈ యక్షగానం ప్లాను చేసినప్పుడుగాని, ప్రసారం అయినప్పుడుగాని కూచిపూడి వారెవరికీ దానితో ప్రమేయంగాని, పాల్గొనడం గాని లేదు. కూచిపూడి నాట్య దక్షులలో హేమాహేమీల చేత ఆ నాటకాన్ని రంగస్థల ప్రదర్శనం చేసే ఏర్పాటులన్నిటికీ కీలకపాత్ర బందావారిదే.

బందావారూ, విజయవాడ రేడియో కేంద్రపు డైరెక్టరుగారూ ఆహ్వానించగా నేనూ, కృ.శా గారూ విజయవాడకు హైదరాబాద్ నుంచి హైదరాబాద్ రేడియో తరపున విప్రనారాయణ యక్షగానం నా సంగీతంతో కృ.శా. గారి రచనతో బాలమురళీ కృష్ణ, గోపాలరత్నం, వింజమూరి లక్ష్మి మున్నగువారు ప్రధాన పాత్రలు వహించగా విజయవాడ స్టూడియోలో రికార్డు చేశాం. అందులోని దరువులకు కూచిపూడి నాట్యాచార్యులలో పెద్దవారైన చింతా కృష్ణమూర్తిగారికి ఆయా దరువులకు అవసరమైన కొనుగోలు శబ్దాలు చెప్పడానికి కాంట్రాక్టు ఇచ్చాం. ఈ నాటకపు రికార్డింగు కూడా బందావారు తీసుకుని, కూచిపూడి నాట్యాచార్యుల బృందాన్ని సమావేశపరచి రంగస్థల ప్రదర్శనకి ఏర్పాటులను గురించి చర్చించారు ఇదంతా జరిగింది 1960 అక్టోబరు నుంచి 1962 లోపల.

నా సంగీతంలో కృ.శా. రచించిన కొలువైతివా రంగశాయి, ఔరా ఔరౌరా, చేకొనవయ్యా రంగయ్య, వెడలేరా వయ్యారులూ, "పని లేని" కందార్థం, వెడలేనిదే దాసరి సాని వేషముతో దేవదేవి. వద్దువద్దు సుమా కాస్త ఒద్దికగా మసలుమా, వానలోన తడవుండీ తడిసేవూ కాబోలు, అనే దరువులూ, రామప్రియ, మోహన, ఆనందభైరవి, కేదారగౌళ, దర్బారు, సైంధవి, వరాళి, చలనాట రాగాలలో దరువుల్లో ఏ రెండు మూడింటినైనా తన ఆటలో వేదాంతం శర్మగారు

(కృష్ణమాచార్లుగారి విప్రనారాయణలో) చేర్చుకోడానికి కారణం. వారికి నా సంగీతంపైన గల అపారమైన అనురాగమే!

పాశ్చాత్య వాద్యాలతో కూడిన వాద్యబృందాల సహకారంతో తయారయిన సినిమా సంగీతాన్ని కూడా కేస్కర్‌గారు చాలా చిన్న చూపు చూశారు మొత్తం సంగీత కార్యక్రమాలలో వారానికి వినిపించే మొత్తం సమయంలో సినిమా సంగీతానికి వినియోగించే సమయాన్ని బాగా తగ్గించేశారు

ఆ దెబ్బతో, ప్రతి రాష్ట్రంలోను ఆలిండియా రేడియో కేంద్రాలను వినే శ్రోతల సంఖ్య శూన్యానికి దిగువగా పడిపోయింది. అదే అదను తీసుకొని, రేడియో సిలోను బొంబాయిలోని సినిమా కంపెనీల ఛేంబర్‌తో ఒప్పందాలు చేసుకొని, అమీన్ సాయనీ వంటి (కాంపియర్స్) కార్యక్రమ నిర్వాహకుల ద్వారా ఆకర్షణీయమైన సినీమా పాటల రికార్డింగులను టేపులపై చేయించి, కొలంబోలో వెయ్యి కిలోవాట్ల శక్తిగలప్రసార యంత్రంపైని ఇండియా ఉపఖండం అంతటినీ ద్వీపకల్పం అంటే దక్షిణ ఇండియా దక్కనూ నాద తరంగాలతో జయించి ఉత్తర ఇండియా దాకా చొచ్చుకుపోగల ప్రసారాలతో రేడియో సిలోను భారత శ్రోతల రేడియో ప్రసార సమయాన్ని ప్రతి గ్రామంలోను కొల్లగొట్టుకుంది. పొద్దుటి నుంచి రాత్రి దాకా అదే పనిగా ప్రసారాలు!

అంటే ఆల్ ఇండియా రేడియో శ్రోతల సంఖ్య పడిపోయి, ఇండియాలో ప్రతి గ్రామంలోను రేడియో సిలోను శ్రోతల సంఖ్య ఆకాశమంత ఎత్తుకు పెరిగి పోయిందన్నమాట.

తగ్గించి వేసిన సినీమా సంగీతానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రాలలోని ప్రతి ప్రధాన రేడియో కేంద్రంలోను శాస్త్రీయ సంగీత ప్రయోక్తలనే కాక, లలిత లేక సుగమ సంగీత ప్రయోక్తలను నియోగించి ప్రతిభాషలోను, ప్రసిద్ధ కవుల కవితా గేయాలకు రాయల్టీ ఇచ్చి వాటికి ఆకర్షణీయమైన వరుసలు పెట్టించి, సినిమా సంగీతానికి దీటు వచ్చేలాగ తయారు చెయ్యాలన్నారు. ఎ.ఐ.వి.పి. అంటే, అల్ ఇండియా వెరైటీ ప్రోగ్రాం అనే పేరుతో బొంబాయిలోను మద్రాసులోను పొద్దుటి నుంచి రాత్రి దాకా రెండు వెయ్యి కిలోవాట్ ప్రసార యంత్రాల ద్వారా వేరు వేరు భాషలలో లలిత సంగీతమూ, హవామహల్ వంటి హాస్య రూపకాలు, ప్రధానంగా హిందీ పాటలూ, మిగిలిన భాషలలో గేయాలు కదంబంగా కలుపుతూ హిందీ ప్రకటనలతో ప్రసారాలు చేశారు. ఇదే తరువాత వివిధభారతి కేంద్రాలుగా ఒక్కొక్క రాష్ట్రంలోను ఎంపిక చేసిన కేంద్రాలలో ఒక్కొక్క కిలోవాట్ ప్రసార యంత్రంపై ప్రసారం అయే ఏర్పాట్లు జరిగాయి. ఈ వివిధ భారతి ప్రసారాలలో తరువాత తరువాత ఆయా భారతీయ భాషల సినిమాలలోనూ ప్రధానంగా హిందీ సినిమాలలోనూ వుండే జనరంజకమైన పాటలు 'జనరంజని' కార్యక్రమాల ద్వారా తిరిగి చోటు చేసుకున్నాయి అప్పుడు మళ్లీ మన భారతీయ శ్రోతలు రేడియో సిలోను 'గంజాయి' వదులుకొని భారతీయమైన

'నల్లమందు'కు క్రమంగా తిరిగి అలవాటు పడ్డారు ముఖ్యంగా యువ శ్రోతలకే ఈ అలవాటు.

సంగీతంలో శాస్త్రీయ సంగీత ప్రయోక్తలనీ, లలిత సంగీత ప్రయోక్తలనీ నియోగించినట్లే సాహిత్య కార్యక్రమాలకీ, నాటక కార్యక్రమాలకీ, పాఠశాలా కార్యక్రమాలకీ కూడా ఆయా క్షేత్రాలలో కృషి చేసి ప్రసిద్ధులయినవారిని నియోగించాలన్న సంస్కరణ కూడా కేస్కర్‌గారు ప్రవేశపెట్టిందే.

విజయవాడ కేంద్రంలో శ్రీ పింగళి లక్ష్మీకాంతం, హైదరాబాద్‌లో శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి, మద్రాస్ కేంద్రంలో శ్రీ గుర్రం జాషువా, (సాహిత్య) ప్రసంగ కార్యక్రమ ప్రయోక్తలుగాను, విజయవాడలో శ్రీ బందా కనకలింగేశ్వరరావు, హైదరాబాద్‌లో శ్రీ స్థానం నరసింహారావూ నాటక ప్రయోక్తలుగాను, శ్రీ మునిమాణిక్యం నరసింహారావు హైదరాబాద్‌లోనూ, శ్రీ కందుకూరి రామభద్రరావు విజయవాడలోను పాఠశాలల కార్యక్రమ ప్రయోక్తలుగాను 1955-56 ప్రాంతంలో నియుక్తులయ్యారు.

70. అడ్‌హాక్ ఎంపికలో ఎక్జిక్యూటివ్‌లు

1972 లో నేను ఆకాశవాణి - విజయవాడ కేంద్రం నుంచి చేసిన ప్రసారానికి అంతర్జాతీయ పురస్కారం లభించినందుకు అభినందిస్తూ అప్పటికి సుమారు 30 ఏళ్లుగా నాతో సంపర్కం లేని ఒక మిత్రుడు ఆదరాభిమానాలతో వ్రాసిన ఉత్తరంలో సారాంశం ఇది

"1942 - 43 లలో మీరు మద్రాసు రేడియోలో చేరిన తొలి రోజులలో మీకు పరిచిత మిత్రుణ్ణి. మీరు 'ఆఫీసర్స్ లాడ్జి'కి వచ్చి గంటల కొద్దీ పాటలు పాడుతూ వుండేవారు. అప్పటి నుంచీ ఈ ముప్ఫయి ఏళ్లు మీరు "ప్రసార సేవ"లో నానాటికీ సాధిస్తున్న విజయాలకు సంతోషంతో గర్విస్తోంచే అభిమానులలో ఒకణ్ణి. అప్పుడు అడ్వొకేట్‌గా వుండేవాణ్ణి ఇప్పుడు సుప్రీంకోర్టులో జడ్జిగా వుంటున్నాను.

"మన ఆనాటి పరిచయాన్నీ, మైత్రినీ నిరూపించే రెండు ఘట్టాలను జ్ఞాపకం చేస్తున్నాను. ఎగ్మూర్ మ్యూజియమ్ థియేటర్‌లో ఒక సాంస్కృతిక కార్యక్రమం రాత్రి 12 గంటలూ దాటేదాకా, చూసి అక్కడి నుంచి కన్నిమారా హొటల్, రాయపేటా హైరోడ్డు అంత దూరమూ మైలాపూర్ దాకా మీరు పాటలు పాడుతూ వస్తూంటే నడుచుకుంటూ వచ్చి అర్ధరాత్రి దాటాక ఇళ్ళు చేరుకున్నాం.

1943 ఆగస్టులో మీరు రేడియోలో ఒక ఇంటర్వ్యూకి వెళ్లవలసి వుంటే చాకలి వద్ద బట్టలు

చిక్కుబడి పోవటం మూలాన కాబోలు మీరు మాలాద్రిలో ఒక మిత్రుడి షేర్వానీ ఎరువు తీసుకుని మర్నాడు ఇంటర్వ్యూకి వెళ్లారు ఆ ఇంటర్వ్యూలో ప్రోగ్రాం అసిస్టెంట్‌గా సెలక్ట్ అయినట్లుగా తరువాత తెలిసి చాలా సంతోషించాం ఈ ఉత్తరానికి మీరు జవాబు వ్రాస్తే మరీ సంతోషిస్తా అని వ్రాశారు నేను కృతజ్ఞతతో ఆయనకు వెంటనే జవాబు వ్రాశా.

ఆ ఉత్తరం వ్రాసిన మిత్రులు సుప్రీంకోర్టులో విశిష్టమైన తీర్పులకు ప్రసిద్ధి చెందిన న్యాయమూర్తి శ్రీ ఓ చిన్నపరెడ్డి అని గర్విస్తుంటాను.

1943 ఆగస్టు 15న జరిగిన ఆ అడ్‌హాక్ ఎంపికలో సుమారు 15 మంది ప్రోగ్రాంఅసిస్టెంట్లు (క్లాస్ టు గెజిటెడ్) ఎంపికయ్యారు. ఆ తరువాత ఆ పదవినే ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా మార్చారు

ఆ ఎంపికలో న్యాయమూర్తులు (నిర్ణేతలు) మద్రాసు, బొంబాయి, తిరుచ్చి కేంద్రాల డైరెక్టర్లు శ్రీ గోపాలన్, శ్రీ పరంజ్యోతి, శ్రీ జి.టి. శాస్త్రి రేడియో తరపునా, బయటి పెద్దలు సర్ ముత్తా వెంకట సుబ్బారావు, రెవరెండ్ ఫాదర్ జెరోం డి సౌజా!

ఎంపికయిన వారు 1944 జనవరి నుంచి రేడియో డైరెక్టర్ జనరల్ నుంచి ఉద్యోగ నియామక పత్రాలు అంది పనిలో ప్రవేశిస్తూ వచ్చారు వారిలో ముఖ్యులు శ్రీ ఎస్.ఎన్.శివస్వామి, శ్రీ టి.ఆర్. మురళీధరన్, శ్రీ పి. బాలగురుమూర్తి, శ్రీ యండమూరి సత్యనారాయణరావు (శ్రీవాత్సవ), ఈ వ్యాస రచయితా (రజని), శ్రీ శివరాజు వెంకట సుబ్బారావు (బుచ్చిబాబు).

కథానికా రచియతగాను, నవలా రచయితగాను బుచ్చిబాబూ, సాంవత్సరిక సాహిత్య సమాలోచనలతో, విమర్శలతో విమర్శగ్రంథ రచయితగా శ్రీ వాత్సవా, రేడియో కార్యక్రమ ప్రయోక్తలుగా ఇద్దరూ విశిష్ట ప్రశస్తి సంపాదించుకొని ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గానే పనిచేస్తూ హైదరాబాద్‌లో 1966లో బుచ్చిబాబూ. అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఢిల్లీలో శ్రీవాత్సవా 1968లోను కీర్తిశేషులయిపోయారు.

మద్రాసు, విజయవాడ, హైదరాబాద్ కేంద్రాల నుంచి, రజని సంగీతంతో శ్రీ వాత్సవా, బుచ్చిబాబు రచించిన గేయ నాటికలు ప్రసారం అయ్యేవి. లైలా మజ్నూన్, షిరీన్ ఫరహాద్, వేయిన్నొక్క రాత్రుల కథలు (షహరజాద్) శ్రీ వాత్సవ రచించిన నాటికలు రజని పంజాబీ సంగీతంతో, మధ్యప్రాచ్య సంగీతంతో ఆదునిక వాద్యాల వాద్య గోష్ఠితో సరళారావు, కమలా చంద్రబాబు, ఘంటసాల, ఓలేటి వంటి గాయనీ గాయకుల గానంతో ప్రసారం అయ్యేవి.

చివరకు మిగిలేది నవలా, ఉమర్ ఖైయాం జీవితంపై నాటకమూ బుచ్చిబాబును

అమరజీవిగా చేశాయి. ఆయన ఉమర్ ఖైయాం నాటకంలో రజనికి మరొకసారి మధ్య ప్రాచ్య సంగీత రీతులు ప్రయోగించే అవకాశం లభించింది.

1943లో జరిగిన ఎంపికలో ఎన్నికయిన ఆఫీసర్లలో శ్రీ శివస్వామి, శ్రీ మురళీధరన్, శ్రీ బాల గురుమూర్తి రజనీ అకాశాణి వివిధ కేంద్రాలలో స్టేషన్ డైరెక్టర్లుగా పదవులు నిర్వహించి (రిటైర్) కృతకృత్యులయినవారు. ఆడ్‌హాక్ ఎంపికలో అసిస్టెంట్‌లుగా ఎన్నికయి, ఎగ్జిక్యూటివ్‌లు అయి, అసిస్టెంట్ డైరెక్టర్లయి, చివరకు డైరెక్టర్‌లుగా పదవీ నిర్వహణ చేసిన వీరు షష్టిపూర్తులను దాటి, పూర్తిగా విశ్రాంతులు కాక, ఏదో ఒక సాంస్కృతిక కార్యకలాపంతో కాలక్షేపం చెయ్యాలని నిరీక్షిస్తుంటారు.

శ్రీ శివస్వామి, కన్నడంలోను, ఆంగ్లంలోను సిద్ధహస్తుడయిన రచయిత, బెంగుళూరులో ఆంగ్ల పత్రికలో "కాలం" నిర్వహిస్తూ ఉండేవాడు శ్రీ మురళీధరన్ సంగీత నాట్యాభినయాలలో దక్షుడుగా మాత్రమేకాక - ఆంగ్ల, తమిళాంధ్ర సాహిత్యాలతో సన్నిహిత సంబంధాలను సప్రమాణమైన అభిరుచులతో కొనసాగిస్తుండేవారు. అత్యంత సహృదయుడు, సంపన్నుడైన సజ్జనుడు శ్రీ బాలగురుమూర్తి.

భావ తరంగ - శ్రీకరాలతో వారం వారం చదువరుల హృదయ క్షేత్రాలపై సేచనం చేసి స్నేహభావ బీజాలను పండించుకునే కృషికుడు రజని.

71. నా సినిమా వ్యాసంగం - 1

నా యువమిత్రుడు భట్టొకసారి అడిగాడు నన్ను "రజనిగారూ, మీ నాటికలూ గేయాలూ నాటక మాధ్యమం కోసం రాశారు? రేడియోలో లాగా అతుక్కుపోకుండా సినీమాతో సంపర్కం ఎందుకు దూరంగా ఉంటూ వచ్చింది?" అని.

నా సాహిత్యరసభావప్రకటనకు ఊతగా నాకు చిన్ననాటి నుంచి అప్రయత్నంగా అవలీలగా లభించిన ప్రక్రియ, పాట. ఆ పాట ప్రక్రియ చాలా బలీయం కావడం వల్ల నాలోని నాటకీయతా ప్రదర్శనోత్సాహం కూడా గేయనాటకరూపాన్ని అవలంబించింది. ప్రత్యక్షరంలో ప్రతీ పదంలో గేయత్వాన్ని, నాటకీయతనీ ప్రదర్శించడమే నా లక్ష్యం కావడం చేత - నా ప్రదర్శనమాధ్యమం రంగస్థలమా, రేడియోనా అనేప్రశ్న నన్ను ఎదుర్కోలేదు. ఇది పై ప్రశ్నలో మొదటి భాగానికి జవాబు.

ప్రశ్నలోని రెండవ భాగానికి తోడు మరొక అభిమాన ఆప్తమిత్రుడు శ్రీ వి.ఎ.కె. "రజనిగారూ, సినిమా సేవలో మీ కృషి ఫలితం చాలా అజ్ఞాతంగానో, ప్రచ్ఛన్నంగానో, గుప్తనామాలతోనో పరకాయ (నామ) ప్రవేశాల చాటునో మరుగు పడిపోయినట్లు తెలుస్తోంది. ఈ అజ్ఞాతసంతానాన్ని మీరు 'మమ' కారంతో నాదని మీ వ్రాతలలో ప్రకటించవలసిన 'వయస్సు' మీకు వచ్చిందనుకుంటాను సాధ్యమయినంత త్వరగా ఆ పని చేస్తారా" అని అడిగారు.

అందుకని, ఈ ఒక "భావతరంగము"గా నా సినిమా వ్యాసంగ శీర్షికతో 'ఫ్లాష్ బాక్' "రజనీభావతరంగాలు"లో చేసేను. దానిని మళ్ళీ ఇక్కడ వ్రాస్తున్నాను.

1941 ఫిబ్రవరిలో నా 'చండీదాసు' నాటకం రేడియోలో ప్రసారం అయ్యాక, నా రెండో సంగీతనాటిక 'గ్రీష్మ రుతువు' - సాంప్రదాయికమైన (కర్ణాటక) సంగీతంలో చేశాను. మద్రాసు రేడియో అధికారులు నన్ను నిలయవిద్వాంసుడుగా చేర్చుకోడానికి చర్చలు జరిపారు. అవి ఒక కొలిక్కి రాలేదు. ఈ లోగా అప్పటికే 'ద్రౌపది మాన సంరక్షణానికి' (బళ్ళారి రాఘవ దుర్యోధనుడుగా నటించినది) దర్శకత్వం చేసిన కీ॥శే॥ శ్రీ నిడుమోలు జగన్నాథ్ మాకుటుంబ సన్నిహితమిత్రుడు - తాను తీస్తున్న 'తారుమారు - భలే పెళ్ళి' అనే రెండు హాస్య, సాంఘిక చిత్రాలలో నా పాటలనీ, సంగీతాన్నీ వినియోగించుకున్నారు. సినిమాతో నా తొలి సంపర్కం. అదే 'తారుమారు'లో ఒక జోలపాట 'జో అచ్యుతానంద జోజో ముకుందా లాలి పరమానంద రామ గోవిందా' అనే సాంప్రదాయికగేయాన్ని మా ఆవిడ శ్రీమతి బాలాంత్రపు సుభద్రాదేవి చేత, శ్రీమతి గాడేపల్లి సుందరీశంకరం (దేవులపల్లి కృష్ణ శాస్త్రిగారి పినమామగారి సతీమణి) చేత పాడించాను. 'భలే

పెళ్ళి'లో అంతర్నాటకంగా అప్పటికే తయారయి, దుర్గాబాయమ్మగారి ఆంధ్ర మహాసభ (స్త్రీల శాఖ) సాంస్కృతికోత్సవాలలో నృత్యనాటిక ప్రదర్శితమైన నా 'మేనకావిశ్వామిత్ర లో శ్రీమతి పసుమర్తి విశ్వేశ్వరమ్మగారూ, నేనూ పాడగా - చిత్రీకృతం అయింది ఈ నాటికనీ 1973 నుంచి శ్రీ వెంపటి చినసత్యం గారి నాట్యబృందమూ, కుమారి శోభానాయుడు నాట్యబృందము నాట్యవేదికలపై ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శనల్లో నా సంగీతం సకృత్తు మాత్రమే.

ఆ తర్వాత (1941 42) నిర్వ్యాపారిగా నిరుద్యోగిగా ఉండే నేను కొన్నాళ్లు రోహిణీ పిక్చర్సులో ఆర్థిక సలహాదారుగా ఉండే వడ్లమన్నాటి కుటుంబరావుగారి (కథానికా రచయిత) సలహా పైని హెచ్. ఎమ్. రెడ్డిగారి కొలువుకూటానికి గేయరచయితగా, సంగీత దర్శకుడుగా చేరాను ఎల్.వి. ప్రసాద్‌గారు ఒకటి రెండు ప్రధానపాత్రలను ధరిస్తూ అక్కడ పరిచయం అయారు హిందీ సినిమాలలో హిట్స్‌గా ప్రాద్యూసర్లు భావించే పాటలకు వాద్యగోష్ఠి నిర్వాహకులు శర్మా బ్రదర్స్ స్వరం వ్రాసేసుకుని వాయిస్తోంటే ఆ స్వరాలకి పాటలు వ్రాయాలి. సదాశివబ్రహ్మం అనే ఆయన చాలా చురుగ్గా రాసేవారు. ఆ పని నాకు నచ్చక మానేశాను.

1942 జూలై 1వ తేదీ నేను మద్రాసు కేంద్రంలో నిలయరచయితగా, కళాకారుడుగా చేరాక నా గీతావళి (లలిత సంగీతం) కార్యక్రమాలలో ఒకసారి 'స్వామి నీ ఆలయమున సంధ్యాదీపకలికనోయి' అనే గేయం పాడుతూ దాని నిండా మధ్య ప్రాచ్య సంగీతధోరణులు వినిపించాయి. కృష్ణశాస్త్రిగారు అది విని, హాఫీజ్ పర్షియన్ కవితలకు ఆంగ్లానువాదాలు చదివి తాను 'ఉమర్ ఖైయాం' జీవితం పైని తయారుచేసిన 'అతిథిశాల' నాటకాన్ని నా చేత సంగీతం పెట్టించి ప్రసారం చేయించారు అది 1944- 45. 'అతిథిశాల'లో నేను పాడిన మధ్య ప్రాచ్య సంగీత ధోరణులకు ఆకర్షితులై వాహినీ దర్శకులు శ్రీ బి.ఎన్.రెడ్డి మద్రాసు కేంద్ర అధికారులయిన గోపాలన్, మూర్తిగారలకు ఆ సంగీతంలోని ఆకర్షణ గురించి ప్రశంసించి. అప్పుడు తాను తీస్తున్న 'స్వర్గసీమ' చిత్రంలోకి ఒక యువకవి చేత కొత్త రకం పాటలను నూత్నసంగీతరీతులలో వినిపించాలనే తన ఆశయాన్ని ప్రకటించారు

'రీటా' హేవర్త్ నటించిన 'బ్లడ్ అండ్ శాండ్ అనే చిత్రాన్ని నాకు చూపించి. అందులోని మధ్యప్రాచ్య సంగీతధోరణిని స్ఫురింపజేసే 'పల్లవి'తో ఒక పాట తయారు చేయమన్నారు. దానినే 'ఓహో! పావురమా' భానుమతి పాడింది.

72. నా సినీమా వ్యాసంగం - 2

శ్రీమతి భానుమతి రామకృష్ణ "వ్యాంప్" పాత్రలో - హీరో (శ్రీనాగయ్య) ను ఆకర్షిస్తూ పాడిన 'ఓహెూ పావురమా', ఆమెయే - సోలోగా ప్రారంభించి, చివర స్త్రీ బృందంతో కలిసి పాడిన "ఓడ సెట్టింగ్" పాట "ఓహెూ తపోధనా సుందరా" ఇవి రెండూ అంతవరకూ సినిమాలలో రాని అపురూపపు మాటల కూర్పుతో, నా మధ్య ప్రాచ్య రాగ ధోరణులతో బాగా జనరంజకం అయి, ఒక కొత్త తరంగం అనిపించాయి. ఇవికాక - శ్రీ నాగయ్య పాడిన "హాయిసఖీ" (మోహన) గృహమే కదా స్వర్గసీమ సుఖ సందర్భంలో పాడే గేయం ఒకటీ, విషాద సందర్భంలో పాడే దొకటీను, పైగా నా గొంతులో హీరోయిన్ జయమ్మ విషాదాభినయానికి నేపథ్యంలో రేడియో పాటగా వినిపించిన "ఎవని రాకకై ఎదురు చూచెదో ఏకాకిని వొబేలా" (వకుళాభరణం) మళ్లీ మధ్య ప్రాచ్య ధోరణిగల రాగంలో పాట - వ్యవహారపు చిక్కుల వల్ల ఈ పాటలన్నిటికీ వ్యవహారపు ఒప్పందం వాహినీ వారితో మా అన్నయ్య శ్రీ నళినీ కాంతరావు కుదుర్చుకున్నారు. టైటిల్స్‌లో క్రెడిట్స్ ఆయన రచనలుగా ప్రకటించినా ఆయన తరపున పని నిర్వహించింది నేనే. నేను పాట పాడుకోకుండా వ్రాయడం అలవాటు లేదు గనుక ఈ పాటలన్నిటికీ ప్రాథమిక సంగీతం నాదే సంగీత దర్శకత్వం శ్రీ నాగయ్య ఆ పాటలకు చిలువలూ పలవలూ వాద్య రమ్యతలూ చేకూర్చారు

వాహినీ వారి "స్వర్గసీమ" లోని ఈ కొత్త ధోరణి పాటల సంగీత తరంగం వల్ల ఆకర్షితులై ఆ వెనువెంటనే సారథివారు శ్రీ ఎల్.వి. ప్రసాద్, శ్రీమతి భానుమతి రామకృష్ణలతో శ్రీ సి.ఎస్ ఆర్. అంజనేయులుతో తీసిన "గృహప్రవేశం" చిత్రం మొత్తానికి పాటలూ, సంగీతమూ నాచే తయారుచేయించడానికి మా అన్నయ్య శ్రీ నళినీ కాంతరావుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. పని నాదే క్రెడిట్స్ మా అన్నయ్య పేరుకే వచ్చాయి. ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా ఏయే సమయాలలో నా పని చూసుకోవాలో వాటికేమీ భంగం రాని విధంగా నేను సినీ స్టూడియోలో మా అన్నయ్య తరపున పనిచేస్తూ వచ్చాను "గృహప్రవేశం" చిత్రానికి నేనిచ్చిన స్వరాలతో, ముఖ్య కళాకారులకు నేర్పిన పాటలతో ఎల్ల కాలాలలోను నిర్వహించడానికి శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు మొదటిసారిగా ఎసోసియేట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా క్రెడిట్ పొందారు.

ఈ చిత్రంలో శ్రీమతి భానుమతి పాడిన "అనగనగా ఒక రాణి" అమ్మా అమ్మా (చారుకేశి రాగం), "మేలుకోవో భారత నారీ", "వెనుకాడెదేలనోయి" ఏ మగునో నా జీవితమిక ఎటుపోవునోయీ - చుక్కాని లేని నౌక" అనే పాటలూ శ్రీ ఎం.ఎస్. రామారావు, శ్రీ ఎల్.వి. ప్రసాద్ గారి హీరో పాత్రకి పాడిన "హాలాహలమెగయునో" అనే పాటా, దాని వెను వెంటనే కెమెరా మాన్ రహ్మాన్ - "ఓహెూ పావురమా" టెక్నిక్‌లో తీసి చిత్రీకరణతో రివాల్వింగ్ ప్లాట్‌ఫాం

మీద శ్రీమతి భానుమతి పాడిన 'కనవోహెూ - తెరువరీ' అనే పాటా, శ్రీ సి.ఎస్.ఆర్. ఆంజనేయులు పాడిన "జానకీ నాదేనోయి", "మైడియర్ తులసెమ్మక్కా" అనే హాస్యం కలిగించేపాటలూ, ఒక సీస పద్యమూ ఇవన్నీ నా (అజ్ఞాత) సంతానమే. ఈ "ఈ గృహప్రవేశం" చిత్రానికి కథా, సంభాషణలూ, సీనేరియా రచనా కీర్తిశేషులు శ్రీ త్రిపురనేని గోపీచంద్.

"పితకో పతికో సుతునకొ ఆ జీవితమూ విధేయతా యుగ యుగాలకు లభింపదోయిక స్వతంత్రతా!"

అని భారత నారిని గురించి గేయంలోనూ, మత మనుచు కులములనుచు ద్వేషములు పెరిగిపోయె

శాద్వల శ్యామ భూమి రక్తసంసిక్తమాయె

తెగత్రెంచెదమిక దేశపు దాస్యపు సంకెలలు

తొలగించెదమిక దారిద్ర్య కాటకాలు, రూపుమాపుదము కుల మత జాతి విబేదాలు" అని 1945 నాటి నుంచీ నేటి వరకూ మారని మన దేశ పరిస్థితులను గురించి గోపీచంద్ నాచేత అనాడే వ్రాయించిన పాటలు జ్ఞాపకం చేసుకుని ఆయనా, నేనూ హైదరాబాద్ ఆకాశవాణిలో కలిసి పనిచేసిన 1960-68 మధ్య ఆయన నిట్టూర్పుతో కూడిన సంతృప్తి వెలిబుచ్చేవాడు.

గృహ ప్రవేశం చిత్ర నిర్మాణంలో కలిసిపోయిన మామనోధర్మానికి సంతృప్తితో శ్రీ గోపీచంద్ ఆ తరువాత శోభనాచల వారికి తీయబోతున్న 'లక్ష్మమ్మ కథ' చిత్రానికి పాటలూ సంగీతమూ ఇమ్మనినన్నడిగారు. ప్రభుత్వ సమ్మతి కోసం దరఖాస్తు పెట్టుకున్న నేను ప్లూరసి అస్వస్థతకు లోనయి, మూడేసి నెలలు సెలవూ, బెడ్‌రెస్టూ తీసుకున్న సమయంలో ఆ పనిపడింది. ప్రభుత్వానికి పెట్టుకొన్న దరఖాస్తు రద్దు చేసుకోవలసి వచ్చింది. పాటలూ సంగీతంతో సహా అనారోగ్యపు పక్క మీదే తయారయిపోయేవి. కీర్తిశేషుడు శ్రీ ఘంటసాల మా ఇంటికి వచ్చి ఆ పాటలు సాహిత్యము, స్వరాలు స్వయంగా వ్రాసుకుని లక్ష్మమ్మ కథకు సంగీత దర్శకుడిగా క్రెడిట్సులో మొదటి సారి అవకాశం లభించుకోగలిగారు. ఆ పాటల రచన 'తారానాథ్' అనే నా కలం పేరుతో క్రెడిట్సు కెక్కింది. ఈ చిత్రంలో శ్రీ చదలువాడ నారాయణరావు, శ్రీమతి కృష్ణవేణి హీరో హీరోయిన్లు, పాటలు శ్రీ ఎం. ఎస్.రామారావు, శ్రీమతి కృష్ణవేణి, హాస్యపు పాటలు రేలంగి, నల్ల రామమూర్తి పాడారు. ఇదే కథతో మరో కంపెనీ వారి ఇంకొక చిత్రం శ్రీ లక్ష్మమ్మ కథ అనే పేరుతో పోటీగా ఒకే సమయాన విడుదల అయినా, ఆంధ్ర మహాజనం రెండు చిత్రాలనూ సమానంగానే ఆదరించారు. ఈ చిత్రంలోని పాటలలో లక్ష్మమ్మ అత్తింటికి మేనా సవారిలో వెడుతున్నప్పటి పాట 'చిన్ననాటి

స్వప్నసీమ కన్నయూరు విడువలేము" ఇదొకటీ కథానాయకుడు (నారాయణరావు) విలాసవతి అందానికి మరిగి రెండు రస్తాల మధ్య దీపస్తంభం కింద చతికిలబడి 'ఇటో - అటో ఎటు పొవుటో - జీవిత మార్గము చీలిపోయెనిట' అనేది - మరపురానివి.

రెండుచిత్రాల్లో నా పాటలకూ, సంగీతానికి రుచిమరిగిన శ్రీ గోపీచంద్ 'పేరంటాలు' అనే జానపద గాథా చిత్రానికి నాచేత అధికారుల అనుమతికై దరఖాస్తు పెట్టించి పాటలూ, సంగీతమూ ఇమ్మన్నారు ఈ చిత్రం పాటలలో జానపద ధోరణి ఎక్కువ. అదే సమయంలో శ్రీ వై వి.రావు (యరగుడిపాటి వరదారావు) తీస్తూండిన 'మానవతి' చిత్రానికి కూడా నేను ప్రభుత్వానుమతి తీసుకుని పాటలూ, సంగీతమూ నా పేరుతోనే యిచ్చాను. ఈ చిత్రాల పాటలు గ్రామఫోను రికార్డులలో కూడా నా పేరుతో వచ్చాయి 'పేరంటాలు' పాటలు మొదల్లకంటె మానవతి చిత్రంలోని పాటలు స్మృతిలో ముందాడుతున్నవి. పద్మినీ, నారాయణరావులకు ప్లేబ్లాక్‌గా - రావు బాలసరస్వతీదేవీ, ఎం.ఎస్.రామారావులు పాడిన 'ఓ మలయ పవనమా' అనే మలయమారుత రాగంలోని యుగళగీతమూ. 'ఓ నాసఖీ పోనా నఖీ' అనే రంజని రాగ యుగళ గీతమూ, రసాళి అనే సాంప్రదాయిక రాగంలో 'తన పంతమే తా విడువడే' అనే కథానాయిక సోలో బాలసరస్వతీదేవి పాడినదీ - గ్రామఫోన్ రికార్డుల్లో తరచు వినిపించేవి. ఈ చిత్రాల్లో నా పని రేడియో పని సమయాలకు భంగం కాకుండానే జరిగేది.

73. నా సినిమా వ్యాసంగం - 3

వాహినీ స్టూడియోల కట్టడాలు పూర్తి అవుతున్న రోజులవి. నా కన్న భావుక కవి అయిన కృష్ణశాస్త్రి గారిచేత పాటలు వ్రాయించి నా వంటి వానిచేత సంగీతం పెట్టించాలనే ఆశయం వుండేది శ్రీ బి.ఎన్. (నరసింహ) రెడ్డికి. మా ఇద్దరినీ తమ కారులో స్టూడియో భవన సముదాయానికి తీసుకువెళ్లి అవి చూపించేటప్పుడు ఒక హాల్‌లో కొత్తగా తెప్పించిన హేమండ్స్ ఆర్గన్ (పెద్ద ఎలెక్ట్రికల్ ఆర్గన్) చూపించి ఇది మీ గది. మ్యూజిక్ డైరెక్టర్ గది అన్నమాట అన్నారు. నన్ను చూసి ఆ కొత్తగా వచ్చిన ఆర్గన్ పైని ట్రయల్స్ చేయడానికి ఆకాశవాణిలోని పాశ్చాత్యసంగీత విద్వాంసుడు హేండల్ మాన్యుఆల్‌ని మాతో తీసుకెళ్లాం నన్ను గురించి శ్రీ బి.ఎస్. ఆశయం ఆచరణలోకి రాలేదు గాని, ఆ వెనువెంటనే ఆయన తీసిన మల్లీశ్వరి చిత్రానికి కృష్ణశాస్త్రి గారి పాటలకి నా మిత్రుడు శ్రీ సాలూరు రాజేశ్వరరావు చేత సంగీతం చేయించారు. ఆంధ్ర లోకం అందరితో పాటు నేనుకూడా ఆ చిత్రం పాట సంగీతానికి ఆనందించాను.

తరువాత కొన్నాళ్లకి 'బంగారుపాప' చిత్రానికి శ్రీ కృష్ణశాస్త్రిగారి పాటలూ, నా సంగీతమూ అని మొదట అన్నారు శ్రీ బి.ఎన్ ఏ కోర నోములు నోచెనో గాని, కన్నదేవకి వంతు కన్నీరై ఆయె అనే పాట శాస్త్రిగారు వ్రాసిందానికీ, తాధిమి తకధిమి తోలుబొమ్మ అని ఎస్.వి. రంగారావు పాత్రకి శ్రీ మాధవపెద్ది పాడిన బ్రహ్మంగారి తత్వానికీ సంగీతం నేనిచ్చినవే. క్రమంగా ఆ చిత్రం దినచర్యలో శ్రీ రెడ్డిగారు కొలువు కూటంలో సంగీత సలహాదారులు ఎక్కువయి నేను తటాలున తప్పుకున్నాను. ఏ క్లెయిమూ చెయ్యకుండా.

ఇలాంటిదే - శ్రీ గోపీచంద్ డైరెక్ట్ చేసిన 'ప్రియురాలు'చిత్రంలో నా సంగీత ప్రమేయం, దానిలో పాటలు వ్రాయడానికి నేనే కాక శ్రీ అనిసెట్టి సుబ్బారావును నియోగించారు. ఆయనవ్రాసిన 'అవనీ' అనే పాట సంగీతం నాదే. ఆ చిత్రంలో శ్రీమతి రావు బాలసరస్వతీదేవి నాయిక కోసం పాడిన ఉందువో మధురానగరి (ఉదయ రవిచంద్రిక), 'ఎవనిదా వేణుగీతి' (హేమవతి) రెండు నృత్యగీతాలు నా 'మధురానగరి' అనే నృత్య నాటిక లోనివి. ఆ పాటలు గ్రామోఫోన్ రికార్డులలో వొచ్చాయి. ఆ చిత్రం నుంచి కూడా తప్పుకున్నాను. దానికి శ్రీ అద్దేపల్లి రామారావు మ్యూజిక్ డైరెక్టరు.

శ్రీ కె.ఎస్. ప్రకాశరావు డైరెక్ట్ చేసి, హీరోగా నటించారనుకుంటాను. ద్రోహి అనే చిత్రంలో దానికి 'జీవితమూ దుఃఖపూరితమూ' అనేపాట నా సంగీతంలో నా రచన శ్రీ ఎం.ఎస్.రామారావు పాడారు. ఈ పాట 1940 లో మా పిఠాపురంలో ఆడించిన 'దేవదాస్' నాటకానికి నేనువ్రాసిన పాటలలోనిది. 1956 లో నేను మద్రాసు నుంచి విజయవాడకు బదిలీ అయిపోయాను. 1960 దాకా అక్కడ ఉంటూ మధ్య మధ్య అప్పుడప్పుడు మద్రాసు వెళ్లినప్పుడు శ్రీ బి.ఎన్. కబురంపించి, 'రాజమకుటం' చిత్రానికి రెండు పాటలు వ్రాయించుకున్నారు, నాచేత మధ్యప్రాచ్య సంగీత ధోరణిలో ఉన్న యుగళగీతం 'ఊరేది పేరేది' "ఊరేలా పేరేలా" అని ఘంటసాలా శ్రీమతి పి. లీల పాడిన పాటొకటీ, ఠంగనా ఠింగానా ఢిల్ల, కొంగన్న ముక్కువ జిల్లా భావగర్భితమైన మాటలతో కూడిన పాటా నేనువ్రాసినవే నా సంగీతముతోనే మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ వేణు వాటిని రికార్డు చేశారు. సినీమా పాటల పుస్తకంలో వాటి రచన మా బావగారయిన శ్రీ బుద్ధవరపు నాగరాజామాత్యుని పేరును ప్రకటించారు.

విజయవాడకు బదిలీ కాకముందే అంటే 1945-56 మధ్య మద్రాసులో కొన్ని వ్యాసంగాలను గురించి ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది.

శ్రీమతి భానుమతి, శ్రీ పి రామకృష్ణారావు దంపతులు (భరణీవారు) నేను అంటే అత్యంత ఆప్యాయతతో కుటుంబ మిత్రునిగా చాలా అభిమానం చూపేరు నా సంగీతం అన్నా వారికిష్టమే.

వారి రత్నమాల చిత్రంలో "ఏమే ఓ చిలుకా" అనే పాట రచనా సంగీతమూ నావే. వారి విప్రనారాయణ చిత్రంలో టైటిల్స్ పై 'కౌసల్యా సుప్రజారామ' శ్లోకం నా చేత చదివించారు 1953 అక్టోబర్ 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం అవతరించిన ప్రభాతవేళ మద్రాసు నుంచి - ప్రత్యేక ప్రభాత గీతావళి కార్యక్రమంలో శ్రీమతి భానుమతి నా తెలుగు తల్లి పాటా, 'స్వరం బెత్తి పాడరా సోదరా ఆంధ్రోదయ వేళా (ఘనశ్యామ సుందరా వరుస), అన్నమాచార్యుల 'విన్నపాలు వినవలె' (భూపాల), ఒక అష్టపదీగానం చేశారు విజయవాడ రిలే చేసింది. 1947 48 లో నేను ఆవిడా కలిసి, నా తెలుగు తల్లి పాటా, వెనుక పక్క వందేమాతరం పాటా - గ్రామొఫోన్ కంపెనీవారి కోరికపైన రికార్డు చేశాము.

నలభయిల చివర్లో ననుకుంటాను శ్రీమతి కన్నాంబ కడారు నాగభూషణంగార్ల రాజరాజేశ్వరి ఫిలింస్ తరపున శ్రీ ఆరుద్ర నన్ను తనతో తీసుకువెళ్ళి, వారి 'సౌదామని' చిత్రానికి ఒకటి రెండు పాటలు సంగీతంతో సహా వ్రాయించారు. అవి 'ఏవేవి' అనేది కూడా జ్ఞాపకం లేకపోవడానికి కారణం అవి నా అభిప్రాయంలో కుంతీదేవి కన్న కర్ణ సంతానం లాంటివి కావడమేఏమో!

లైలా మజ్నూ సినిమా తెలుగులో రావడానికి ముందే రేడియోలో లైలా మజ్నూ, షిరీన ఫరహాద్, సోహినీ మహివల్ వంటి సంగీత నాటకాలు ప్రసారం చేశాము. వాటిలో లైలా మజ్నూ పాటలు నేను వ్రాశాను. సంగీతం నాది, శ్రీ ఘంటసాల పాడా రా పాటలు. వాటిలో గుడారమెత్తి వేశారు కడకొంటరిగ మిగిలాను' అనే చంద్రకౌంస్ రాగం పాటా, 'ఎందు చూసినా గాని నీవు లైలా మృతి లేదు ప్రేమకంటావు' అన్న మధ్య ప్రాచ్య ధోరణి పాటా ఘంటసాల రికార్డిచ్చారు కూడా. అవి సినిమా చిత్రాల్లోనివికావు. రేడియో నాటకంలోనివి అని స్పష్ట పరచడానికి ఈ అవకాశం తీసుకుంటున్నాను.

రేడియోలో ఘంటసాల వంటి కళాకారుని చేత నేను ప్రయోగరీత్యా రచించి సంగీతం కూర్చిపాడించిన 'ఘనాఘనా గర్జింపవో వంటి మేఘరంజని రాగంలో పాట వంటివి ఎన్నో తరువాత సినిమాల అనుకరణల్లోకి పాకిపోయేవి భరణీవారి విప్రనారాయణలోని 'ఎందుకోయీ తోటమాలీ' అనే మధ్య ప్రాచ్య ధోరణి పాట గాని, 'వారీ వారీ నడుమ మురారి' పాట గాని నావి కావు. నా ధోరణిలపై అభిమానం గల గేయకర్తలూ సంగీతకర్తలూ కూర్చినవి. వారికి నేనెప్పుడూ కృతజ్ఞుడిని అలాగే ఘంటసాల పద్య పఠన ధోరణి, గీతా పఠనమూ, రేడియో కార్యక్రమాలలో నాటకాలలో రాణతేరినదే అని గర్విస్తుంటాను.

74. స్వాతంత్ర్య దినోత్సవం

"ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారత ముదయమ్మాయె నహా!
తూరుపు ఖండపు వారల తపములు కోరిక లీడేరెనహా!
దెసలల్లిన భారత స్వేచ్ఛా సూర్యుని ప్రాభాతోజ్జ్వల కాంతి
ప్రసరింపత తూరుపు వాకిలి తెరచుక ప్రేమపూరిత ప్రశాంతి!
దేశదేశముల దీన జనావళి దాస్య బంధన విముక్తి!
ద్వేషరోషములు తెగలు పగలు నశియింప జగమెల్ల శాంతి!
మ్రోయింపు జయభేరీ వాయింపుము నగారా
తేలింపుము నభోవీథిని త్రివర్ణాంచిత పతాకా!"

అది 1947వ సంవత్సరము ఆగస్టు 14, 15 అర్థరాత్రి భారతజాతి అంతా రేడియోవింటోంది. బ్రిటిష్ రాజ ప్రతినిధి ఫిలిప్ మౌంట్ బేటన్ బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌పైని తమపాలనాధికారాన్ని భారతీయ ప్రజా ప్రతినిధులకు అప్పగించుతున్నట్లు లాంఛనంగా ప్రకటిస్తూ బంగాల్‌లో హిందూ ముస్లిమ్ విద్వేషాలను శాంతి పరచడానికి పర్యటిస్తున్న మహాత్మాగాంధీ వైపు తన భావాలు ప్రసరిస్తున్నాయని వెల్లడించాడు. వెంటనే, ప్రమాణస్వీకారం చేసి జవాహర్‌లాల్ నెహ్రూ భారత భాగ్య విధాతతో భారతిజాతి పవిత్ర సమావేశ ముహూర్తమును గూర్చి జాతి జాతంతా ఉప్పొంగిపోయే (ట్రిస్ట్ విత్ డెస్టినీ) ప్రసంగం! ఆ వెంటనే సైనిక మంగళ తూర్యారావాలతో దిక్కులు మారుమ్రోగాయి. అంతవరకు ఢిల్లీ నుండి వచ్చే రిలే అపుచేసి ప్రాంతీయ కేంద్రాలు తమ నిలయాల నుంచి ఆయా ప్రాంతీయ భాషలలో సముచిత జాతీయ గేయాలను ప్రసారం చెయ్యాలి.

అవిభక్త మద్రాసు రాష్ట్రంలో అప్పటి రేడియో స్టేషన్లు మద్రాసూ, తిరుచ్చిరాపల్లీ మాత్రం. తెలుగు శ్రోతలకు మద్రాసు కేంద్రమే! తూర్యారావాలు కాగానే సుబ్రహ్మణ్య భారతి రచించిన 'ఆడువోమే పళ్ళి పాడువోమే' అనే తమిళగీతం శ్రీమతి డి.కె. పట్టమ్మాళ్ గానం చేసింది అది అయిన వెంటనే పైన ఉదహరించిన రజని తెలుగు పాటను కుమారి టంగుటూరి సూర్యకుమారి గానం చేసింది. ఈ రెండు పాటలూ 14వ తేదీ రాత్రి 9, 10 గంటల ప్రాంతాన నిలయ విద్వాంసుల తోడ్పాటుతో ఆ గాయనీ మణుల చేత పాడించి రికార్డు చేశాం. ప్రెస్టో రికార్డింగ్ అనబడే పెద్ద డిస్కులపై ఆనాడు రికార్డింగులు జరిగేవి. (లోపలి నుంచి చివరికి అంటే ఇన్‌సైడ్ ఔట్).

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని జాతి జాతంతా ఉప్పొంగిపోయే ఆ ఆనంద తరంగంలో నా గేయ రచనా, భావతరంగాలూ ప్రసారం అయాయని తలుచుకున్నప్పుడల్లా ఒళ్ళు పులకరించిపోతుంది. దీన జనావళి దాస్య బంధన విముక్తి ఎంత వరకు సాధింపగలిగామో!

75. నా ఢిల్లీ పయనం

అది 1948 వ సంవత్సరం. నాకు మొదటి సారిగా ఢిల్లీ ప్రయాణం పడింది 1944లో అయిన నాప్రోగ్రాం అసిస్టెంట్ నియామకానికి ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా ఖాయం చేయటం కోసం అభ్యర్థులలో 30 శాతం కోటా గురించి వివిధ కేంద్రాల్లో ఉన్న అప్పటి మావంటి అధికారులను రమ్మన్నారు. ఫలాన తేదీన ఢిల్లీ ప్రయాణం గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో. మా ఆవిడకీ మా నాగరాజు బావకీ పినతండ్రి శ్రీ బుద్ధవరపు మదనగోపాలరావు (మాచిన్న మావయ్య) ఖమ్మం మెట్టులో వుండే వాడు. అతనికి నిమ్మకాయలు నిలబెట్టేవరకు మీసాలు వంకర తిరిగి ఉంటాయి. పిల్లలు ఆయన్ను మీసాల తాతయ్య అనేవారు. ఢిల్లీ వెడుతున్నానుగనుక, ఖమ్మం నేనెప్పుడు రాగలనో తెలియదు గనుక మా గోపాలం మావయ్యని (జి.టి.) గ్రాండుట్రంక్ ఎక్స్‌ప్రెస్‌వచ్చే సమయానికి ఖమ్మం స్టేషన్‌కు వచ్చి కలుసుకొమ్మని వచ్చి ఆశీర్వదించమని రాశాను.

ఆవేళరాత్రి పన్నెండు ఒంటిగంట మధ్యలో ఖమ్మంలో "జి.టి." ఆగింది. మాగోపాలం మావయ్య చేతిలో నారింజపళ్ళూ, ఏపిల్సూ ఉన్న బుట్టతో నే ఉన్న ఫస్ట్ క్లాస్ పెట్టెలోకి ఎక్కాడు ఆయన నాపక్కనే కూర్చున్నాడు. ఖమ్మం నుండి కాజీ పేట వరకు రాను - పోను ఫస్ట్ క్లాస్ టికెట్ కొనుక్కొని వచ్చాడు మా మావయ్యను ఆశ్చర్యపరుద్దామనుకుంటే ఆయనే నన్ను ఆశ్చర్యపరుస్తూ అలారాను పోను టికెట్ కొనుక్కుని మరీ వచ్చాడు.

అలా (సరే) ఢిల్లీ వెళ్ళిపోయాను. ఈరచన ఆత్మకథా విభావరిని అంకితం పుచ్చుకోబోయే నాస్నేహితుడే వక్కలంక రామచంద్రరావు ఢిల్లీలో ఏదో ఓ రోడ్డులో మాచిరాజు సీతాపతి రావుగారింట్లో బస. సీతాపతిరావు గారు ఆరోజుల్లో ఐ.ఎ.ఎస్ లకు తెలుగు చెప్పేవారు! వక్కలంక రామచంద్రరావు ప్లానింగ్ కమీషన్‌లో పనిచేస్తుండేవారు. ఆలిండియా రేడియో ఢిల్లీలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ లోపుగా వక్కలంక నేను, అతని స్నేహితుడు మాచిరాజు సీతాపతి రావుగారు, క్రొవ్విడి లక్ష్మన్నగారు అంతా కలిసి కుతుబ్ మినార్, బిర్లా టెంపుల్, ఎర్రకోట మొదలైన దర్శనీయస్థలాలు తనివితీరా చూశాం. లోఢీరోడ్ కాలనీలో నాచిన్నప్పటి సహాధ్యాయుల్లో ఒకరిద్దర్ని మల్యాల కామేశ్వరరావు గారి (పిఠాపురం హైస్కూల్లో చరిత్ర అధ్యాపకులు) కొడుకులు పేర్రాజు, రమణ, పిఠాపురంలో టౌన్ హాలు వెనుక వుండే కందుకూరి అక్కిరాజుగారబ్బాయి బసవరాజు వంటి మిత్రుల్ని కలిశాను. నాడు కలిసేక మళ్ళా వార్ని కలవలేదు.

రేడియో ఇంటర్వ్యూల ఫలితాలు నేను మద్రాసు చేరేక తెలిశాయి

78. డా. ద్వారం వెంకట స్వామినాయుడుగారి షష్ఠిపూర్తి

అది 1949వ సం॥ 60 ఏళ్ళు నిండిన ప్రముఖ ఆంధ్రసంగీత విద్వాంసుడు డా. ద్వారం వెంకటస్వామి నాయుడుగారికి సన్మానం మద్రాసు విధాన పరిషత్ (అప్పర్ కౌన్సిల్) అధ్యక్షులైన శ్రీ ఆర్.బి. రామకృష్ణరాజుగారి ఆధ్వర్యంలో మద్రాసు విశ్వవిద్యాలయం సెనేటు హాలులో వారి షష్ఠిపూర్తి సన్మానోత్సవం వైభవంగా జరిగింది అధ్యక్షులైన రాజుగారి కోర్కెపైని నేను స్వయంగా "అమృత వర్షిణి" రాగంలో నీ ఆశీస్సు మరాశిచల్లుమా (మాద్వారముపై)

ఓ సరస్వతీ కళాధిదేవతా!

అనే గేయం రాసి సంగీతం కూర్చి ఘంటసాల, పి.బి. శ్రీనివాస్, సరళ, జి.యస్. వైదేహి, సీత అనసూయ మొత్తం ఆడా మగా పదిమంది చేత సన్మానగీతంగా పాడించాను.

ఆ తర్వాత శ్రీనాయుడుగారు వారి స్వస్థలమైన విజయనగరం వెళ్లారు. అక్కడ మహారాజావారి సంగీత కళాశాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నారు అప్పుడు నేను, నా భార్య సుభద్రాదేవి ప్రభుత్వం ఖర్చులపై విజయనగరం వెళ్ళాం. అక్కడ బల్లేపల్లి వారింట బస అంటే అది మా (బుద్ధవరపు) రాయసం నాగకృష్ణశర్మ బావకి మామగారి ఇల్లు ప్రఖ్యాత సినీగాయని శ్రీమతి సుశీల భర్త డి మోహనరావుగారి తండ్రిగారిల్లు.

ఆసాయంత్రం సంగీత కళాశాలలో నా సంగీత విభావరి జరిగింది. మరాఠీ, పంజాబీ, అరబ్బీ సంగీతాలతో మరియు కర్ణాటక సంగీతంలోను ఆకాలేజీలో నేను గేయాలు పాడి కచేరి చేశాను అధ్యక్షులైన ద్వారం వారు నాకు తన "ఓట్ ఆఫ్ థ్యాంక్స్"ను వయొలిన్ పై జవాబిస్తూ నే పాడిన వివిధ సంగీత రీతులలో తీయనైన అనుకరణతో నే పాడిన పాటల రాగాలు, స్వరాలు వాయించి తనకృతజ్ఞతను వ్యక్తం చేశారు. శ్రోతలతో పాటు నా హృదయం ఒళ్ళు కూడా పులకరించాయి. అట్టి "ఓట్ ఆఫ్ థాంక్స్" తో ముగించడం నాకు మరువరాని ఆనంద అనుభూతిని కలిగించింది.

77. బళ్లారి రాఘవ

బళ్లారిలో నటుడూ వకీలూ అయిన తాడిపత్రి రాఘవాచార్యులు ఈ యుగ ప్రారంభంలో ప్రసిద్ధ నాటకకర్త అయిన ధర్మవరం రామకృష్ణమాచార్యులకు మేనల్లుడు. ఆయన స్వయంగా గొప్ప నటుడు. ఇంగ్లాండ్‌లో లండన్‌లో రంగస్థలంపై నటించిన మనిషి.

నేను మద్రాసురేడియోలో లలిత సంగీతానికీ, నాటకాలకు ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్‌గా ఉండేటప్పుడు ఆయన మద్రాసులో రాయపేట ఉడ్‌లాండ్స్ హొటల్‌లో బసచేశారు ఆయన చంద్రహాస నాటకంలో (ధర్మవరం వారి రచన) దుష్టబుద్ధి అనే క్రూరుడూ, కుటిలుడూ అయిన మంత్రి రాజ కుమారుడైన చంద్రహాసుడికి విషం ఇచ్చి, చంపివెయ్యమని ఉత్తరం తనకొడుక్కి రాసి, చంద్రహాసునిచేతే తన కొడుకుకి పంపిస్తాడు. మంత్రి కూతురు పేరు విషయ. ఆ అమ్మాయి నిద్రపోయే చంద్రహాసుని జేబులో తన తండ్రి తన అన్నగారికి రాసిన ఉత్తరం చదువుతుంది. విషమునిచ్చి అనే మాటలను విషయ నిచ్చి అని, ఉద్వాసన చెప్పెయ్యి అనే మాటలను ఉద్వాహం (వివాహం) చేసి అనే పద్ధతిలో ఉత్తరంలో మార్పులు చేస్తుంది.

దుష్టబుద్ధి కొడుకు తన చెల్లెలు మార్చిన విధంగా ఉత్తరంలోని చంద్రహాసునికి మర్యాదలను వివాహగౌరవమూ చూపించడం అదంతా దుష్టబుద్ధికీ, కొడుకుకీ జరిగిన సంవాదంలో తెలుస్తుంది.

ఉడ్‌లాండ్స్‌లో కలుసుతున్న రాఘవాచార్యులు గారితో దుష్టబుద్ధికి కుమారునితో సంవాదమూ, వింజమూరి శివరామారావు రాసిన విశ్వామిత్ర నాటకంలో వసిష్ఠ, విశ్వామిత్రుల సంవాదము ఇలా రెండు పాత్రలూ నేనే పాత్రకి తగిన విధంగా గొంతు మార్చుతూ చదివాను.

రాఘవగారు ఎంతో సంతోషించి సంతృప్తితో రేడియోలో రికార్డింగ్ చేసేటప్పుడు తాను హరిశ్చంద్ర నాటకంలో కాలకౌశికుని పాత్ర నిర్వహిస్తూ నాచేత నక్షత్రక పాత్ర సంభాషణలు చదివించారు ఆయన మెచ్చుకునే విధంగా నేను ఆ పాత్ర చదవడం మరపురాని విశేషం. భ్రమర కీటన్యాయంగా పక్కనున్న మహానటుని ప్రభావం నాపైని పడి ఆవిధంగా నటింప చేసిందనుకుంటూంటాను.

78. నా సకుటుంబ మైసూరు యాత్ర

అది 1949 వసం॥ నా కుటుంబం అంటే నేను మా ఆవిడ సుభద్రా దేవి మాత్రమే అప్పటి నా కుటుంబం మైసూరు రాష్ట్రంలో విజ్ఞాన యాత్రకై వెళ్ళాం. మా బావ బుద్ధవరపు నాగరాజుకి చిన్నాన్నగారైన శ్రీబుద్ధవరపు సత్యనారాయణగారి కుమారుడు నాగకృష్ణశర్మ అతని మాతామహులైన రాయసం కృష్ణయ్యగారికి దత్తతకివ్వబడ్డాడు. అతని కాపురం తణుకులో బుద్ధవరపు నాగరాజు బార్య రాజ్యలక్ష్మి, అతను సకుటుంబంగా మైసూరుయాత్రకి వెళ్తుంటే నేను, నా భార్య సుభద్ర కూడా వారితో కలిసివెళ్ళాం. మైసూర్‌లో "అన్నయ పండితర ఛత్రం" లో బసచేశాం. అక్కడ చూడవలసిన ప్రదేశాలన్నీ చూసి కృష్ణ రాజ సాగర్, శివసముద్రం, భద్రావతి ఉక్కుకర్మాగారం శ్రీరంగ పట్నం కూడా చూసేం మా ఆవిడ పిన తల్లి అబ్బరాలుగారు కూడా మాతో వచ్చారు.

కావేరీ నదీ జలాల మధ్యన (ఆది రంగం, మధ్యరంగం, అంతరంగం) క్షీర సాగర శాయిని దర్శనం చేసుకున్నాం తర్వాత రైల్లో ఇండియా పడమటి తీరాన వెస్ట్‌కోస్ట్సాగర్, సిరిగుప్పవరకు యాత్ర వెళ్ళి అక్కడ జోగ్ జలపాతం (జెర్‌సొప్పా) చూశాం. అది 900 అడుగుల ఎత్తునుండి పడుతున్నది అది వేసవి అయినా అక్కడ వానలు పడతాయి ఈ విహారానికి మాదంపతులిద్దరికీ ప్రభుత్వం వారు ఇప్పటి లీవ్ ట్రావల్ కనసెషన్ లాగ ఖర్చులిచ్చారు.

79. లలిత సంగీత శాఖ నిర్మాణం

కేంద్ర ప్రసార శాఖ మంత్రులు మారుతూ వచ్చి అప్పటికి బి.వి. కేస్కర్‌గారు ప్రసా శాఖామాత్యులు అయ్యాక ఆయన యాజమాన్యంలో ఆయన అమలు చేసిన కొన్ని నిర్ణయాల వల్ల ఆలిండియా రేడియో శ్రోతల సంఖ్య పడిపోయింది. దీనికి తోడు సిలోన్ రేడియో భారతీయ సినిమాలు నుంచి అన్ని భాషల్లోనూ ఉన్న మంచి పాటలను అమిన్ సయానీ వంటి కార్యక్రమ నిర్వహణ అనౌన్సర్‌ల ద్వారా (అమీన్ ప్రసారం చేసి) భారతీయ శ్రోతలను వశపంచుకుంది



"ఎవరువిన్నారెవరు కన్నారు" పాడుతూ నేను నా భార్య సుభద్ర

దీనికి ప్రతిక్రియగా మరిన్ని కేస్కర్ సంస్కరణలు వచ్చాయి. వాటి ద్వారా లఘుకార్యక్రమాలు, హాస్యకార్యక్రమాలు ఆలిండియా వెరైటీ ప్రోగ్రాం (ఎఐవిపి) ద్వారా ప్రసారం చేసేవారు. దానికే అతర్వాత వివిధ భారతి అనే పేరు వచ్చింది. అలా వీటి కేంద్రాలు పెంచారు.ప్రధాన రేడియో కేంద్రాల్లో లైట్ మ్యూజిక్ యూనిట్లో లలితసంగీత శాఖ (లేక సుగమ సంగీత శాఖలు) ఏర్పాటు చేశారు.

మద్రాస్ లలిత సంగీత శాఖకు ఇన్‌ఛార్జి రజని ప్రాంతీయ భాషల్లో కవులకు గేయకవులకు గేయ సంఖ్య పరిమాణాన్ని బట్టి వారికి రాయల్టీలు ఇవ్వడం, గేయాల ఎంపిక, లేనిచోట్ల ఆయా భాషల్లో గేయకవిత్వాన్ని ప్రోత్సహించటం, నెలనెలా ప్రొడక్షన్ క్రియేటివ్ ఇన్‌ఛార్జ్ క్రియాశీల కార్యక్రమాలు గేయాల రచన, సంగీత రచన, పాటించడం రికార్డింగు వగైరాలు జరుగుతుండేవి ప్రధాన కేంద్రాల్లో ఆ విధంగా రజనికి ఇతర కార్యక్రమాల భారం తగ్గించి లలిత సంగీత నిర్వహణ

బాధ్యత పెంచారు. తరువాత రూపొందిన భక్తి రంజని ఆలోచన అప్పుడంకురించినదే. ఓలేటి వంటి వారిని సంప్రదాయ శాస్త్రీయ సంగీత నిర్వాహకులు గాను బాలమురళి, రజని, పాలగుమ్మి విశ్వనాథంలను లలిత సంగీత నిర్వాహకులుగాను నియమించారు ఉపరిపర్యవేక్షణతో రజని పని నాలుగు భాషల్లోనూ గేయాలకి సంగీతం కూర్చి రికార్డింగ్ నిర్వహించడం. ఆ విధంగా రోజులో సగం వివిధ పుస్తక భాండాగారాలు దర్శించి, సంగీత వాగ్గేయ కారుల చరిత్రలు చదివి సమాచారం సేకరించే అవకాశం కలిగింది. ఆవిధంగా తెలుగు భాషా సమితి ప్రకటించిన వాగ్గేయకారుల సంగీత చరిత్ర రాయడానికి రజనికి అవకాశం లభించింది. ఆ గ్రంథాన్ని 1955 మే నెలాఖరుకి పూర్తి చేసి పంపించాలి 500 పేజీలు టైపుప్రతి చివరి అధ్యాయాలు ఢిల్లీలో ఉండగానే పూర్తి చేసే వీలయింది. అది ట్రయినింగ్‌కు వెళ్ళిన కాలంలో మద్రాస్‌కి పూర్తయిన ప్రకరణాలను పంపించేవాణ్ణి. దాన్ని వారు మూడు ప్రతులు తయారు చేసి, రెండు ప్రతుల్ని తెలుగు భాషా సమితికి, ఒకటి నాకు ఢిల్లీకి బైండ్ చేయించి పంపించారు నేను ఢిల్లీలో ఆపార్శిల్ పోస్టుమేన్ నుంచి తీసుకుని ఢిల్లీలో ట్రయినింగ్ శాఖ అధ్యాపకులుగా వున్న టి కె జయరామయ్యర్ చేత పార్శిల్ విప్పించాను. దాసు శ్రీరాములుగారి కుమార్తె వాణీబాయి రామ్‌కి, ఎన్.ఎస్. రామచంద్రన్‌లకు చూపేను ఆవిధంగా ఇంకా అచ్చుకాని పుస్తకావిష్కరణ ఆనందాన్ని పొందాను. అది 1955 మే.

౩౦. ఆప్యాయన హితపరులు : రావు బాలసరస్వతీ దేవి, వసుంధరాదేవి

(1941 - 42) ల మధ్యనేను రాజేశ్వరరావు, బాలసరస్వతులిద్దరి చేత వాద్యగోష్టితో సహా యుగళగీతాలను పాడించాను. ఆ కార్యక్రమంలో రాజేశ్వరరావు కోపమేల రాధా దయచూపవేల నాపై

బాలసరస్వతి · మోసగాడవోయీ పలుబాసలేలచాలునోయీ

ఈ గీతం 1940 మొదటిదశకంలోనే చాలాజనరంజకమైన యుగళగీతంగా ఖ్యాతికెక్కింది

ఆ తరువాత సంగీతంలో రమ్యాలోకం అనే విశిష్ట కార్యక్రమంలో బాలసరస్వతి ప్రత్యేకంగా నా దగ్గర నేర్చుకుని పాడిన పాటలలోనివి ఈ క్రింది రెండూ

1. **"మధువని కానరావే - సఖాసఖా నీకై**
వెదకుచూ వేసరితినే సఖా సఖా!
రానేలేదో ఎందో దాగితివో!
నలుగడల చీకటాలు దారీతోచదాయె ॥"

ఇంతకంటె పెద్దదైన పాట - సరస్వతీ దేవిమీద

2. **"అగణిత శుభదాయినీ, వాణీ హేజననీ!**
వేదవినుతా రాగ మహితావాగమృతదా! శారదా!
వికల పాపా విశృత తాపా! సకల సుగతీ సాధనీ!
దేవమౌనీవందిత పదా! దివ్యలోకా వాసినీ!
వరకమలజ మనోహరిణీ కమల ముఖీ కమలాకర విహారిణీ
సిత శాంత శశి కళాహసనీ! సుకవితాకలా విలాసినీ॥
నిరుపమకరుణా కవితా, అకలుషనవరస భరితా అగణిత॥

సంగీతంలో రమ్యాలోకం అనేవి ఆ తొలినలభయిలలో ఎస్. గోపాలన్ గారు (డైరెక్టర్) అభిమానంతో స్వయంగా ప్లాన్‌చేసి, మావంటి అప్యాయన పరులచేత చేయించే ప్రత్యేక కార్యక్రమాలు.

అ తర్వాత అయన చేయించిన ఈ నవ కల్పిత కార్యక్రమాలలో వైజయంతీ మాల తల్లి

వసుంధరా దేవి (మైసూరు) పాల్గొన్నది. చంద్రశేఖరా ఈశా ఈశా... కంజదాధరా అనే శివభక్తి గేయ వరుసలో (రికార్డ్ ఉండేది పాపనాశం శివన్‌ది అనుకుంటా)

స్వప్నసీమలో తేలీ సోలీ సఫలమాయెనే నాయాశల్
సఫలమాయెనే అనే శృంగార మయమైన ప్రేమగీతిని
రజని చేత రచింపజేశారు - గోపాలన్‌గారు

ఆ తరువాత

ఏకతమ్ముగా జగతి, ఈక్షణమ్ముకై వేచి,
ఎన్ని పవలురేలో తపించినానో, కృశియించినానో స్వప్న
కనులుతెరవగా యెదురై కామదేవుడే నిలిచీ హృదయమందిరమే తెరచినాడే,
వలపించినాడే స్వప్న సీమలో తేలీసోలీ సఫలమాయెగా నాయాశల్ సఫలమాయెగా॥

అ తరువాత

ఏకతమ్ముగా జగతి, ఈ క్షణమ్ముకై వేచి,
ఎన్నిపవలు రేలో తపించినానో, కృశించినానో ॥స్వప్న॥

కనులు తెరవగా ఎదురై కామదేవుడే నిలచీ
హృదయ మందిరమే తెరచినాడే వలపించినాడే
స్వప్న సీమలో తేలీసోలీ సఫలమాయోగా నాయాశల్ ॥సఫలమాయెగా॥

ఇప్పుడు నాతోపాటు ఎనభైల వయ్యస్సులో ఏ ఒకటి రెండేళ్లో మూడునాలుగేళ్ళు మాత్రమే నాకంటె చిన్నదై యుండిన బాలసరస్వతీదేవి ఇటీవల సంగీత సన్మానాలు పొందుతూ వచ్చి నాతో పాటు ఎనభైలలో నుండగా కూడా సన్మానాలు పొందింది.

81. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు

డా॥ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు వారి సతీమణి

నా గురువుగారైన శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారితో వీరుకూడా శ్రీ చెళ్ళపిళ్ళ వారివద్ద చదువుకున్నవారు, వారి శిష్యులు, యోగాబ్యానంలో వీరు మాస్టర్ పి.వి.వి. శిష్యులు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన మా ఎం.ఏ. పరీక్షలకు వీరు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్. అవిధంగా నాకూ వీరు గురువుగారే.

వీరు ''ఎం.ఏ పరీక్షకు'' ''బయటి పరీక్షకులు''. నాయందుచాలా వాత్సల్యం ఉండేదాయనకు. అన్నమాచార్యుల పదాల పరిశోధన ప్రతి వార్షికోత్సవానికి టి.టి.డి. వారు ఆరంభించి కొనసాగించడానికి స్ఫూర్తి, కారణంవీరే. ఆయన తర్వాత ఆభారం రాళ్ళపల్లివారూ, గౌరిపెద్దివారు అనంతరం ఇటీవల వేటూరి ఆనందమూర్తి పైనపడింది.

ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చదువుకుంటున్నప్పటి ఒక జ్ఞాపకం. అప్పుడు మేము హాస్టల్‌లో ఉండేవాళ్లం. ఆ రోజుల్లో నిర్మించబడిన తిక్కవరపు రామిరెడ్డి హాల్ నేడు టి.ఎల్.ఎన్. సభాహాలుగా పిలవబడుచున్న హాలు ప్రారంభోత్సవానికి వి.సి. గారైన సి ఆర్ రెడ్డిగారు నన్ను వందేమాతరం, తెలుగుతల్లి పాటలను కోరస్‌గా కొంతమంది విద్యార్థులను కలిపి బృందముగా పాడించమన్నారు విద్యార్థులు శ్రీజనమంచి రామకృష్ణ లాంటి వారు నన్ను పలుకరించనేలేదు. ఒకరోజు సి.ఆర్ రెడ్డిగారు, విస్సా అప్పారావు గారు మా ప్రయత్నం ఎలా ఉందో చూద్దామని మా హాస్టల్‌కి వచ్చేసేరు. తోటి విద్యార్థుల సహకారం లేక పోవుటచే నేనొకగదిలో ఏడుస్తూ కూర్చున్నాను మాస్టర్ సి వి వి శిష్యులైన శ్రీ అప్పారావు గారు మాస్టర్ సి.వి.వి.ని తల్చుకుని ప్రార్థించేరు విద్యార్థుల అందరి సహకారం లభించింది. మర్నాడు సభలో బంకిం చంద్రుడు వ్రాసిన వందేమాతరం, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు వ్రాసిన ''హే భారతజననీ'' కి నేను ట్యూన్ చేయగా ఆపాటను, నేను ''పసిడీ మెరుంగుల తళతళలు'' అని తెలుగు తల్లి మీద సి.ఆర్. రెడ్డి గారి కోరిక పై రాసిన పాటను, విశ్వకవి రాసిన ''జనగణమన'' ను విద్యార్థు లందరము కలసి బృందగానం చేసేము.

82. రేడియో కేంద్రాలలో లలిత సంగీత సృష్టి

ముందుపేజీలలో కేంద్ర సమాచార ప్రసార శాఖామాత్యులు శ్రీ కేస్కర్ రేడియో కార్యక్రమాల దినసరి శాతంలో సినిమా రికార్డుల సంగీతం పైని విధించిన నిషేధం లేదా తగ్గింపు గురించి వ్రాశాను. అది 1954 ప్రాంతం.

సినిమా సంగీతం తగ్గించిన సమయాలను ఆయా రేడియో కేంద్రాలలో కొత్తగా తయారు చేసిన లలిత సంగీత కార్యక్రమాలతో నింపాలని అప్పటి కేంద్ర ప్రచార శాఖామంత్రి కేస్కర్‌గారి ఆదేశం! అందుకని ఆయా కేంద్రాలలో లలిత సంగీత ప్రయోక్తలను నియమించారు. ఆయా భాషలలో ఆధునిక గేయాలను భావగీతాలను రచించిన కవుల గేయాలను రాయల్టీ పద్ధతిపై స్వీకరించాలి లేదా కొత్తగా వ్రాయించాలి. వాటిని లలిత సంగీత ప్రయోక్తలూ ఆయా కేంద్రాలలో నియమితులైన వారి చేతా, వారి పరిధిలోని విద్వత్కళాకారుల చేతా వాటికి సంగీతం అమర్చించి, సమర్థులయిన లలిత సంగీత గాయకుల చేత రికార్డు చేయించాలి. మద్రాసు కేంద్రంలో నన్ను ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జిగా ఒక లలిత సంగీత శాఖను ఏర్పాటు చేసి, శ్రీ మల్లిక్‌ను, శ్రీ ఎ. నారాయణయ్యర్ (గోటు వాద్య విద్వాంసుడు), సిహెచ్. గోపాలశర్మ (వయొలిన్ విద్వాంసుడు), సిహెచ్ కామేశ్వరశర్మ (వీణ విద్వాంసుడు), (శర్మ బ్రదర్సు అనేవారు) సహాయకులైన సంగీత స్రష్టలుగాను, లలిత సంగీత శాఖకే పూర్తిగా కేటాయించిన నిధులతో 15, 16 మందికి తక్కువగాని వివిధ వాద్యకారుల వాద్య బృందాన్ని ఏర్పాటు చేశారు

విజయవాడ కేంద్రానికి శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణనీ, ఆ తరువాత హైదరాబాద్ ఆకాశవాణికి రాగానే శ్రీ పాలగుమ్మి విశ్వనాథాన్నీ లలిత సంగీత ప్రయోక్తలుగాను నియోగించారు

నిజానికి కేస్కర్ గారి ఆదేశం రావడానికి ఒక దశాబ్దం ముందే మద్రాసు కేంద్రంలో ఆ పేరుతో కాకపోయినా `లలిత సంగీత, సృష్టి జరుగుతూండేది. నలభయిలలో మద్రాసు కేంద్రపు డైరెక్టరుగా ఉండే శ్రీ ఎస్. గోపాలన్ సంగీతంలో రమ్యాలోకం అనీ, (ఎక్స్‌పెరిమెంట్స్ ఇన్ మ్యూజిక్) సంగీత రచనలో కొత్త ప్రయోగాలకు ఒక ప్రత్యేక కార్యక్రమం నడిపిస్తూ దానిలో, క్రియాశీలతా, జిజ్ఞాసా ఉండే కళాకారుల చేత అస్మదాదుల చేత పనిచేయించేవారు. ఆ 'రమ్యాలోకం' కార్యక్రమంలో పాల్గొన్న ఆనాటి విద్వత్కళాకారులు కొందరు శ్రీమతి వసుంధరాదేవి (శ్రీమతి వైజయంతీమాల తల్లి), శ్రీమతి పట్టమ్మాళ్, (కుమారి) టంగుటూరి సూర్యకుమారి, శ్రీమతి రావు బాలసరస్వతీదేవి, వాద్య విద్వాంసులు, శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు, శ్రీ ఈమని శంకరశాస్త్రి, శ్రీ ఎస్. బాలచందర్ ఇంకా నిలయ వాద్య గోష్ఠి.

83. భక్తి "రజని" (భక్తి రంజని)

ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి నేనే కావటం వల్ల "భక్తిరజని" అనేవారు. దాని మౌలిక ప్రారంభం మద్రాస్ కేంద్రం నుంచి శుక్రవారం రాత్రి 10 గం॥ నుంచి గం॥ 10-30 ని॥ ల దాకా బెజవాడ వచ్చేసరికి ఉదయం 6-20 నుంచీ 7 గం॥ దాకా అది మారింది ఉపశీర్షికలు అవే. తూము నరసింహదాసు, రామదాసు, ప్రయాగ రంగదాసు గారి కీర్తనలు, పరాంకుశ దాసువంటి వారి కీర్తనలుండేవి. ఈ కీర్తనలన్ని భక్తి రంజనిలో ఉదయం భక్తిరంజనికి షెడ్యూలు చేసేవారం కీర్తనలేగాక దండకాలు, వచనాలు, స్తోత్రాలు మొదలయినవి 'భక్తిరంజని' లో ఉండేవి. సూర్యదండకం, సూర్యస్తుతి, మేలుకొల్పులు అందులోనే వచ్చేవి.

కృష్ణశాస్త్రిగారు హైదరాబాద్ కేంద్రంలో సాహిత్య సలహాదారు. నన్ను తను వ్రాసే ఓయక్షగానం లో తోడ్పడ కోరారు. అదే క్షీరసాగరమథనం. అది ఎంతో బాగావచ్చిందని బందావారి ద్వారా విని, బెజవాడ స్టేషన్ డైరక్టర్ నన్ను కృష్ణశాస్త్రిగారిని బెజవాడ వచ్చి విప్రనారాయణ యక్షగానం తయారు చేసి ప్రసారం చేయమని ఆహ్వానించేరు. (ఆ విషయం "కృష్ణ రజని" ప్రకరణంలో చదువవచ్చు).

1964లో నా సంగీత నాటకాలు (18) చేర్చి విశ్వవీణ శీర్షికతో తయారు చేశాను. దానిని శ్రీ కృష్ణశాస్త్రికి అంకితమిచ్చాను దాన్ని అప్పటి ఆంధ్ర ప్రదేశ్ మంత్రి అయిన ఎస్.బి.పి పట్టాభి రామారావుగారి సౌధంలో ఒక పెద్ద హాల్లో పుస్తకావిష్కరణ అంకిత సమర్పణ ఉత్సవాలు చేయించాం.

1966 లో నా 'ఓహెూ పావురమా' పాటతో ప్రసిద్ధి కెక్కిన భానుమతికి పద్మశ్రీ అవార్డు ఇచ్చినపుడు రవీంద్ర భారతి లో సభ జరిగింది. దానికి గోపాలరెడ్డి అధ్యక్షుడు భానుమతి గోపాలరెడ్డి వేదిక ఎక్కుతోంటే 'నాకో నిముషం' టైము కావాలని కోరాను.

సభకు అధ్యక్షులయిన గోపాలరెడ్డిగారు అంగీకరించి వేదికపైకి ఆహ్వానించారు. పాతికేళ్ళ క్రితం భానుమతి ఏనా పాట ద్వారా ప్రసిద్ధి కెక్కినదో ఆ పాట జ్ఞాపకం చేస్తున్నాను సభాసదులకు.. "తనకు తానై వలచి పిలిచే తన్వి వేషముల తారాళ్వము కొనవో ఓహెూ ఓహెూహెూ భానుమతి" ఆనాటి పావురమా పాటలోని సంగతులతో పాడేను. రవీంద్ర భారతి చప్పట్లతో మారుమ్రోగింది. అప్పటి కప్పుడు కూర్చారా! అని ఆశ్చర్యపోయింది భానుమతి

నాకు హిమాలయాల్లోని డార్జిలింగ్ జిల్లాలోని కర్షియాంగ్ అనే నేపాలీ రేడియో కేంద్రానికి ఎ.ఎస్.డి. గా బదిలీ అయింది. అది ఒక రాజ కీయమయిన పదవి. 1962 లో చైనా దురాక్రమణలో ఉన్న భారతీయ ప్రాంతాలకు ఈశాన్య భారత భాషల్లో చైనావారు చేసే భారత వ్యతిరేక

ప్రచారాలున్నవి. వాటి బదులు భారతీయానుకూల ప్రచారాల కోసం అక్కడ కేంద్రాలు పెట్టారు. నేపాలీ, సిక్కిం, భూటానీ, టిబెటన్ భాషల్లో ఈ ప్రచారం సాగేది. వాటికి నన్ను (ఎ.ఎస్.డి గా) అధిపతిగా వేశారు. అకాలంలోనే మానవల్లి వారి చతుర్భాణి అనే ప్రాచీన ఏకనటాత్మక ఏకాంకికలను తెలుగులోకి ఇంగ్లీషుల్లోకి అనువాదం చేశాను. ఏకాంత సేవ అంటే దేవాలయ సంప్రదాయ శబ్దానికి "Alone with the spouse divine" అని పేరుపెట్టాను. ఈ శీర్షిక చూచి ఆచార్య కె.ఆర్. శ్రీనివాసయ్యంగార్ చాలా యునిక్‌గా వుందీ శీర్షిక - ఇక అనువాదం ఎంత బాగుంటుందో అని అభినందిస్తూ అన్నారు. దీనికి బాపుముఖ చిత్రం వినీలాకాశానికి రెండు కళ్ళు . పరమాత్మ క్రిందనర్తకి రూపంలో నమస్కరిస్తూ జీవాత్మకూడా ఈ కాలంలోనే 160 క్షేత్రయ్య పదాలను ఇంగ్లీషులోనికి అనువదించాను.

కర్స్యాంగ్ నుంచి 1969 వేసవిలో ఢిల్లీకి బదిలీ అయ్యాను అది ట్రాన్స్‌క్రిప్షన్ అండ్ ప్రోగ్రాం ఎక్స్‌చేంజి సర్వీస్ అంటే ధ్వని ముద్రణ కార్యక్రమ వినిమయ సేవ లేక ప్రధాని రాష్ట్రపతి వంటి వారి ప్రసంగపాఠాలను తర్జుమాచేసి వివిధ ప్రసార అధికారులకు రచనా ప్రతులకు వినిమయం కోసం రూపొందించి పంపించడం. ఇందులో ఆర్కైవ్స్ ఒక భాగం జాతీయ కార్యక్రమం అనే శీర్షికలో మద్దిరాల వెంకట రాయకవి (పిఠాపురం వారు) రచించిన "ఏకాంత సేవా విలాసం" - (కుక్కుటేశ్వర రాజరాజేశ్వరీ విలాసం) దీన్ని వోలేటి, నేను కలసి తయారు చేయడానికి పిఠాపురం నుంచీ ఆలయపూజారిని రప్పించి ఆయన పఠనం నుంచి రాగాలు, స్వరాలు తీసి తయారు చేశాము. అంటే స్వాతి తిరునాళ్ సంస్కృతంలోని "కుచేలోపాఖ్యానం" త్రివేంద్రం నుంచి నా సంప్రదాయిక సంగీతం ప్రసారం చేశారు. సమయానికి సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ అనారోగ్యం వల్ల రాలేకపోవడం చేత స్వాతి తిరునాళ్ ఎకాడమీ కోరికపైన నా చేత చేయించారు వైస్ ప్రెసిడెంట్ జి.పి.ఎస్. నాయర్. వేర్వేరు కాలాల్లో వరుసగా విజయవాడలోను, హైదరాబాదులోను ఎస్.డి. కేంద్ర దర్శకుడుగా పనిచేశారు.

పెద తిరుమలాచార్యుల వైరాగ్య రచన మాలికా గేయాలు కృష్ణమాచార్యుల (13వ శతాబ్దంవి) సింహగిరి నరహరి వచనాలు మృదంగముక్తాయింపుతో ఆలాపనలే వచనాలుగా వచనాలలో ఆలాపనసాగేది ఇటువంటి ప్రయోగాలకు సంతోషించిన పెద్దలు నన్ను వివిధ ఆలయాలలో సత్కరించేరు. ఆ విధంగానేను నా ఉద్యోగ కాలంలో భద్రాచలం, యాదగిరి, వేములవాడ సుప్రభాతాలను నా సంగీతంతో రికార్డు చేయించా. హైదరాబాద్ వచ్చిన సౌందర్యవల్లి గారి తండ్రిగారు ఒక భక్తుడైన అయ్యంగారు రచించిన తెలుగు రామాయణ కీర్తనలను భక్తి రంజనికి రికార్డు చేయించాను నేను, వింజమూరి వరద రాజయ్యంగారు యాదగిరి సుప్రభాతం రికార్డు చేశాం. హైదరాబాదు నుంచి వివిధ కచేరీల కార్యక్రమాలు బహిరాంగణ ప్రసారాలు (ఓ.బి.పి) అయ్యేవి.

84. ఆదర గౌరవపాత్రులు రెవరెండ్ సోల్మన్ రాజు

నేను ఆకాశవాణి విజయవాడలో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న 1956-60 సంవత్సరాల మధ్య భక్తి రంజని కార్యక్రమంలోకి చేర్చుకొంటూ వచ్చిన వివిధ రకాలైన భక్తి కీర్తనలలో క్రైస్తవ భజన కీర్తనలు ఒక అంశం. అంతేకాదు, బైబిలులోని 'చెడిపోయిన కొడుకు' (prodigal son) వంటి కథలను రూపకాలుగా ప్రసారంచేసే వాడిని.

రెవరెండ్ సోల్మన్ రాజు అప్పుడు (1971 76) విజయవాడలో సువార్తవాణి అనే క్రైస్తవ భక్తి ప్రచార ప్రసార కేంద్రానికి డైరెక్టర్‌గా ఉండేవారు. అయన తన సంస్థ కోసం చేసిన కొన్ని కార్యక్రమాలలో కొన్ని మన భక్తి రంజని కార్యక్రమాలకోసం ఇస్తే నేను ఆకాశవాణి కోసం చేసిన అటువంటి కీర్తనలను సువార్తవాణి ప్రసారాలకై ఉభయసంస్థలూ పరస్పరం ఆదాన్ ప్రదాన్ చేసుకొనేవి.

నేను 1984లో బర్మింగ్‌హాం వెళ్లాను. అలాగే రెవరెండ్ సోల్మన్ రాజు భక్తి ప్రసంగ ప్రసారాలకోసం ఉపాధ్యాయత్వంకోసం ఇంగ్లాండ్ వెళ్లి కొన్ని సంవత్సరాలు పనిచేసి వర్ణలేపనాది కళా బోధన కోసం పనిచేసేవారు

85. ఆకాశవాణిలో మా పింగళి మాస్టారు

'సాహిత్య చరితలో జంట కవుల పంట
ఆంధ్రికి ప్రత్యేకమైనదంట
అధునికాంధ్రాన అదికవుల జంట
తిరుపతి వేంకటేశ్వరుల దంట,
మలికైతరీతుల తొలి పంట వేంకట
పార్వతీశ్వర కవిద్వయము దంట,
తొలకరి కైతల మలి పంట పింగళి
కాటూరి కవియుగ్మకమ్ము దంట
ఒక్క కవుల జంట నొకరికి పుత్రుడు
నొక్క జంటలోని యొకరి శిష్యు
డగుట రెండు జంటలందున మిగిలిన
తండ్రి, గురుని, భక్తి దలతునెపుడు'

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధ్యక్షతలో రిటైరయి, విజయవాడ ఆకాశవాణిలో సాహిత్య కార్యక్రమ ప్రయోక్తగా ఉంటూండిన మా గురువుగారు పింగళి లక్ష్మీకాంతం గారికి 1967 జనవరిలో, నూజివీడులో అయన శిష్యబృందం చేసిన సన్మానంలో నేను రచించి చదివిన పద్యాలలో ఒకటి అది.

అది ఒక చిత్రమైన అనుభవం. వాల్తేరు నుంచి సెలవులకో - ఆ తరువాత రిటైరయాకో మద్రాసులో తమ భావమరదుల మోచర్ల వారింట్లో ఉంటూ వస్తున్న పింగళి మాస్టార్ని, ఆకాశవాణిలో ప్రయోక్తగా చేరమని ప్రోత్సహించడానికి, మద్రాసు రేడియో అధికారులు వారి ప్రియశిష్యుల్లో ఒక్కణ్ణైన నన్ను రాయబారం పంపారు. అది బి.వి. కేస్కర్ గారి సంస్కరణ ప్రయోగం. సాహిత్యమూ, సంగీతము వంటి అయా క్షేత్రాలలో అశేషకృషి చేసిన సమర్థులూ, విఖ్యాతలు అయిన వారిని, రేడియోలలో అయా శాఖలకి ప్రయోక్తలుగా నియమించడం ఆ ప్రయోగం.

రేడియోలో అప్పటికీ ప్రొగ్రాం ఎగ్జిక్యూటివ్‌లే ఆయా శాఖలకి నియంతలుగా కార్యక్రమాల కల్పనా, పరిపాలనా, నిర్వహణలు నెరవేరుస్తూ ఉండేవారం. ఈ కొత్త ప్రయోగం రేడియోలో అప్పటికీ ఉండి పనిచేస్తున్న వారిలోను, క్రొత్తగా చేరబోయే ప్రయోక్తలలోను కూడా పరస్పర ఈర్ష్యలకు, తమ తమ యోజనలోను, నిర్వహణలోను రెండవవారు తెలిసో తెలియకో ప్రతిష్టంభన కలిగిస్తారేమో అనే భయాందోళనలు కలగకపోలేదు.

నాటకప్రయోక్త అయిన బందావారితో కొన్నాళ్లు, సాహిత్య ప్రయోక్త పింగళివారితో కొన్నాళ్లు వారి వారి శాఖల నిర్వహణలో నా వంటి ఎగ్జిక్యూటివ్ సహకారం ఏర్పాటు కావడం చేత, విజయవాడ వంటి కేంద్రంలో కార్యక్రమ కల్పనలోను, నిర్వహణలోను మృదువుగా సాగిపోయి, రాణింపు హెచ్చడానికి తోడ్పడిందని సగర్వంగా చెప్పుకోవచ్చు. మా గురువు గారు తన ఆత్మలహరిలో వ్రాసికొన్నట్లుగా....

"అధికారము మన్నించెద
నధికారిని గుణము బట్టి యారాధింతున్
అధము డగునేని యాతని
పథమునకున్ తొలగి నిలుతు పాముకు వలెన్".

సంస్కృత కార్యక్రమాల నిర్వహణలో పింగళి వారు పెద్ద పెద్ద పండితులను కూడా బ్రాడ్ కాస్టింగ్ మాధ్యమానికి, వారు ఏ విధంగా తమ ప్రసంగాలను మలచుకోవాలో చెప్పి ఒప్పించేవారు. సంస్కృతనాటకాలలో కాళిదాసు, భవభూతి, భాసుడు, విశాఖదత్తుడు, భట్ట నారాయణుడు వంటి వారి ప్రసిద్ధరచనలను, రేడియో మాధ్యమానికి అనుగుణంగా, సంస్కృత సంభాషణలను తేలిక పరచి అనుసరణలను తయారుచేసేవారు. నాటకీయ శాఖానటులలో తెలుగులో బాగా చేసేవారిని సంస్కృతనాటకాలకు పిలిపించి, వారి సంస్కృత సంవాద సామర్థ్యమూ, నాటకీయోచ్చారణా, రసావేశ వాచికాభినయాలు స్పష్టంగా ప్రసారంలో వెలువడడానికి, ఒక్కొక్కరికీ సంస్కృతపాఠం చెప్పినట్లు ఒద్దికలు (రిహార్సల్స్) దిద్ది తీర్చేవారు.

86. వేంకట పార్వతీశ్వర కవులలో పార్వతీశంగారి స్వర్గయాత్ర (1955)

తన జంటకవియైన వోలేటి పార్వతీశంగారు స్వర్గస్థులైనపుడు మా నాన్న వేంకట రావుగారు తన సంతాపం ఈవిధంగా వెలిబుచ్చారు.

పోయిరమ్మని చెప్పుబోను, నీకడ నుండి
  ఓయి రమ్మని పిల్చుచుంటివేమి?
ఒంటిగాస్వర్గాన నుండుటయునుగూడ
  నొల్లక నను బిల్చుచుంటివేమొ!
వ్రాయుచునున్న రామాయణం బిటువీడి
  యేమ వచ్చిన లోకమేమి యనును?
రావుగంగాధర రామాజ్ఞ విడనాడి
  నడుమనేవచ్చుట న్యాయ మయ్య?

నాదుజీవిత యుద్ధకాండము ముగించి
చెంతకేవస్తుబావ! నేనింతలోనె
కల్పకారామ సుందరకాండ మూది
హాయిగా బాడికొనుచుండు మంతదాక!

అని వీడ్కోలుచెప్పి, ఒక్కమాటు ఆత్మావలోకముచేసుకున్నారు.

చేయిత్రిప్పితివీవు, వాయివిప్పితినేను
  పదములోభావంబు పొదలుదాక!
హెచ్చి పాడితివీవు, మెచ్చియాడితినేను
  తలపులోరాగంబు మొలుచుదాక
సంతగించితివీవు, చెంతజేరితినేను
  పట్టులో తాళంబు తట్టుదాక
హంకరించితి నీ, వహంకరించితినేను
  సుకృతిలో గతి తల నూపుదాక

ఇరువురెడముగా నున్నప్పుడీవిలాస
మిరువులేకమై యున్నప్పుడింతయేల?

అందునిందున తేజమెందైనలేదె?
భరతకావ్యకళావేశ! పార్వతీశ!

అనుచూ పరియాచకమాడి, యీకిందివిధముగా తనకుతాను ఆశ్వాసము చెప్పుకొన్నారు

నన్నయ్యగతిగూర్చి నాడవింతియెకాదు,
తిక్కన్నయని నన్ను దేర్చినావు
చోడుని మతి గొనియాడి తింతియెకాదు,
సోమన్నయని నన్ను జూచినావు
పోతన్నవలె పాడఖూనితింతియెకాదు,
శ్రీనాథుడని నన్ను జెప్పినావు
పెద్దన్న కైవడి దిద్ది తింతియెకాదు,
సూరన్నయని నన్ను జీరినావు

భట్టుపోలిక లయతోడ బాడినావు
చేమకూరెంతరుచియని చెప్పినావు
ఎన్నియేండ్లగె మన యేబదేండ్లలోనె
ప్రథిత కవితాకళావేశ పార్వతీశ

'పెద్దబావ' యని ప్రియమార, కరవుదీర సంభావించారు పార్వతీశంగారిని వేంకటరావుగారు.

1904లో, కల్పలతా పారితోషికము నందు కొన్నాక వేంకట రావుగారు పార్వతీశంగారూ ఒకరికొకరు పరిచితులయారు.

1909 లో, తణుకులో ఏర్పడింది. వేంకటపార్వతీశ్వరకవుల జంటే. ఆ సంవత్సరమే 'అనుపమ' అనే ఆధునిక పద్యకావ్యం విరచించారు అదేవారి "చిత్రకథా సుధాలహరి".

87. శ్రీశ్రీ రేడియో నాటికలు

'మరో ప్రపంచం, గవేషణ, అనంతరయాత్ర, విదూషకుడి ఆత్మహత్య, బలి గుమాస్తా కల, చెప్పని సందేశం, శిరస్సు చెప్పిన రహస్యం మొదలైన 15 నాటకాలు శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మానసంఘం వారు ప్రకటించిన వచనవిభాగం (రెండో సంపుటం)లో వున్నాయి. వీటిలో 14 రేడియో నాటికలుగానే రాశారు శ్రీశ్రీ. అన్నీ మద్రాసు కేంద్రం నుంచే ప్రసారం అయ్యాయి. వాటిలో ఏడెనిమిదికి పైగా నేను నాటక శాఖ నిర్వహించే ఎగ్జిక్యూటివ్‌గా, ముందుగా రచయిత సమ్మతి పొంది, రెండు మూడు నెలల ముందుగానే ప్లాన్ చేసి షెడ్యూలు చేసి తగిన నేపథ్య సంగీతంతో ప్రసారం చేసినవే.

'మరో ప్రపంచం' గేయం నేను కాకినాడ కాలేజీలో ఇంటర్ చదువుతున్న రోజులలోనే సాంస్కృతిక కార్యక్రమాలలో, కృష్ణశాస్త్రిగారి హయాంలో అనసూయా సీతలు పాడే వరసలో బృందగానాలుగా పాడేవారం. రేడియో నాటికలో 'కనుపాప' (ఆకుపచ్చని) గాజు బంతిలా వుంటుంది. అది ప్రధానపాత్ర. వృద్ధకంఠాలూ, యువకంఠాలూ బృందగానాలు రూపాయణాపైసలు లేని లోకంలో ఊపిరి సలపని మనుష్యులు. నీరయితే నిమ్నానికి ప్రవహిస్తుంది. కాని, ధనం మాత్రం ఉన్నత క్షేత్రాలకి తప్ప ఇంకో చోటికి పోదు ధనస్వాముల వారి హయాంలో ప్రజల బాధలు గుణకారం జరిగినంత జోరుగా బ్యాంకుల్లో అంకెలు పెరిగిపోతాయి!

'కనుపాప' అంటే భావి మానవుడు -24 వ శతాబ్దపు విశేషాలిలాగ చెపుతాడు! "సమష్టి బాధ్యతతో వ్యక్తిత్వం హరించుకు పోదు. సమగ్ర సమాజజీవితంలో వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుంది.... మేము గోళాకారపు గాజు గృహాల్లో జీవిస్తాం. భూమి ఆకారంతో విశ్వం ఆకారంతో మా శరీరాలనీ, నివాసాలనీ సమన్వయించుకున్నాం. ఏ క్షణంలో ఎక్కడ ఎవరేం చేస్తున్నదీ తెలుస్తూనే ఉంటుంది".

'గవేషణ' నాటకంలో యమదూతలు పొరపాటున భూలోకం నుంచి ఆయువు ఇంకా మూడని వ్యక్తి ప్రాణం తీసుకువెళతారు. తీరా అదిపొరపాటని తెలిసి ధర్మదేవత ఆజ్ఞ చొప్పున ఆ ప్రాణాన్ని నీ శరీరంలోకి వెళ్ళిపో అని వదిలేస్తే, ఆ లోపున భూలోకంలో ఆ వ్యక్తి దేహం దహనం అయిపోయి. దొరికిన ప్రతి పక్షి, కప్ప, గబ్బిలమూ వంటి మృతశరీరాల్లోనూ, ఆ ఆత్మ చొరబడబోయి, తృప్తికలక్క, ధర్మదేవత దర్శనం కోసం పాకులాడటమూ, ఆ తరువాత ప్రసవించబోయే తల్లి గర్భంలోని మృతశిశువు దేహంలో ప్రవేశిస్తాడు.

ఈ నాటికలన్నింటిలోను కాలాంతర స్థలాంతరపరివర్తనలలో శ్రీశ్రీ కల్పనాశక్తి ఎంతో

అభూతపూర్వమైన చమత్కారం కలిగిస్తుంది. అంతేకాదు, అవి సమకాలిక మానవ జీవితం పైని తిరుగులేని వ్యాఖ్యలు!

'అనంతరయాత్ర' జీవితానంతరం - ఆత్మ అంటూ వుంటే దాని పరిభ్రమణమూ, యాత్ర - ఎలా వుంటాయన్నఊహ.

"కాలం అంతా ఒకటే గాని, అందరికీ ఒకటే కాదు. జీవిస్తున్న వారి కాలం వేరు, మరణించిన వారి కాలం వేరు. గర్భంలో వున్న శిశువుదొక కాలం. ఇంకా గర్భస్థం కాని జీవిదింకో కాలం స్టీమరులోనో, విమానంలోనో ప్రయాణం చేస్తున్నవాడికీ, నిద్రపోయి కలలు కంటున్నవాడికీ, మతిపోయిన వాడికీ, వైరాగ్యనైరాశ్యాల వల్ల కాషాయం ధరించినవాడికీ కాలం ఒకే విధంగా గడవదు".

ఒక రైలు ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు ఆ రైలులోని ఒక బోగీలో ఇద్దరు స్త్రీలు, ఒక తత్త్వశాస్త్రాధ్యాపకుడూ, వీరి సంభాషణ - అందరి వాచీలూ సాయంత్రం ఆరు గంటలకి ఆగిపోతాయి. ఆశ్చర్యపడే లోగానే రైలు ప్రమాదానికి గురౌతుంది. వార్తలు వినేచోట, జనం మాట్లాడుకునే మాటలూ, సానుభూతి సభలో శత్రు మిత్రుల మాటలూ, తర్వాత పుట్టబోయే పిల్లల ఆత్మల మాటలూ - ఇవన్నీ వింటూ రియాక్ట్ అయ్యే తత్త్వశాస్త్రజ్ఞుడి మాటలలో కాలం గురించి మనకి తెలిసున్న నిబంధనలన్నీ సడలిపోయి వినిపిస్తాయి.

"ఒక స్థలమే ఒక కాలంలో స్వర్గంలా కనపడుతుంది. అదే ఇంకొక సమయంలో నరకమైపోతుంది.... నరకం అంటే అశాంతి. స్వర్గం అనగా ప్రశాంతి" పోతన గారి భాగవతంలోని బలివామనుల ఘట్టానికి అటూ ఇటూ నరకం అంటే ఇదీ, స్వర్గం అంటే ఆదీ అని మనస్సులకి అందిస్తాడు శ్రీశ్రీ మధ్య మానవలోకం కళ్ళకి కడుతుంది. - బలి అనే రేడియో నాటిక స్వర్గంలో దేవేంద్రభోగం అంటే ఇదీ ఇంద్రుని మాటల్లో! "దేవగురువుల్ని ఆలోచనామందిరానికి తీసికెళ్ళు, మేం మొదట నందనవనానికీ, తరువాత శయ్యామందిరానికీ రా అమ్మాయీ!" దానశూరుడైన బలితో ఇంద్రుడి కాంట్రాక్టు.

'గుమాస్తా కల'లో సామాన్య మానవుడూ, గుమాస్తా అయిన కోనేటిరావు, జీవితంలో స్మరించదగ్గ సంఘటనలేవీ లేనివాడు. సాహిత్య రంగంలోనాయకత్వం లేనివాడు. పత్రికలలో పేరు కనబడని అల్పజీవి. నిజమైన జీవితం అతనికి ఒక స్వప్నం అతను కనే కలలు - యుద్ధంలో కెప్టెన్‌గా - సినిమాలో హీరోగా అలా కలలుకంటుంటే కోనేటి నిద్రలో కోడి కూస్తుంది.

'ఏ దేశ చరిత్రచూసినా ఏమున్నది' అనే గేయం ఆధారంగా కల్పించిన రూపం 'చరిత్ర

చెప్పని రహస్యం'. అందులో ఒక విచిత్రమైన యంత్రం ద్వారా చరిత్రలో భూతకాలసంఘటనలను తిరిగి శాబ్దికంగా వినిపించే శాస్త్రజ్ఞుడు వస్తాడు. కృష్ణరాయల దర్బారులో గండపెండేర గౌరవం పొందడానికి ముందు పెద్దనగారు వినిపించిన 'పూతమెరుంగులు" పద్యం పెద్ద ఉత్పలమాలిక, నా చేత పాడించి ఆనందించారు శ్రీశ్రీ.

కైలాసం అనే శిల్పి చెక్కిన శిరస్సు చెప్పిన రహస్యం ఏమిటి? "ప్రతి కొత్త ఊహ ఒక గొప్ప శిలువ ఇక ముందు బతుకు ఇవాళే బతుకుతారు వీళ్ళు. నిన్నటి కళ్ల వీళ్ళ మీద నిప్పులు చెరుగుతాయి. బతికున్నంతకాలం చంపి, చచ్చిన తరువాత శిలావిగ్రహాలు స్థాపిస్తారు" అని.

88. "గోరాశాస్త్రి విశిష్ట 'కలం' కారిత్వం"

ఏడెనిమిదేళ్ళ క్రితం పతాక శీర్షికలతో పైకెగిరిన అతని సంపాదకీయాలు అస్థాన (ఎస్టాబ్లిష్‌మెంట్) అధినేతలు భక్తి శ్రద్ధలతో పరిశీలించవలసిన ప్రాముఖ్యాన్నీ సాధికారతనూ సంపాదించుకున్నాయి. అతని రాజకీయార్థిక భావాలు అభ్యుదయగాములూ, ప్రగతికాములే గాని వామపక్ష నిర్ధూమధామరేవంతుడు కాడతడు, దక్షిణావర్త పరాపర్త నిరోధకుడూ కాడు, అతని భావనకు, రచనకు ఆనాడు యింతటి యుక్తాయుక్త విచక్షణతో కూడిన సమ్యక్ సంతులన శీలం ఎలావచ్చిందో ఆశ్చర్యం వేస్తుంది.

అప్పటికి ఇంచుమించు ఏభైయేళ్ళ క్రితం అతనూ నేనూ కాకినాడలో పిఠాపురం రాజా కళాశాలలో ఇంటర్‌మీడియట్‌లో సహపాఠులం. అప్పటికే ఆరడుగులు దాటిన పొడవూ, మంచి రంగూ, స్ఫురద్రూపం, ఆకర్షణీయమైన దుస్తులు వేసుకొనేవాడు. ఇంగ్లీషు, తెలుగు క్లాసులలో అతడు వ్రాసిన కాంపోజిషన్ మోడల్లాగా చదివి వినిపించేవారు లెక్చరర్లు. నాచేత తెగ పాడించేవాడు మా స్టడీసెషన్సులో, ఇంటర్ పరీక్షలకి ఆ తరువాత నేను ఎమ్.ఏ చదవడానికి వాల్తేర్ వెళ్ళిపోయాను. అతడు ఏ పత్రికలలోనో అచ్చయిన కథల ద్వారా, స్కెచ్‌ల ద్వారా బెంగాల్ నాగపూర్ రైల్వేలో రైల్వే ఉద్యోగిగా చేరినట్లు తెలుసుకున్నా.

ఆనాటి అతని కథల్లోను, స్కెచ్చెస్‌లోను 'శ్రీమతి' అని ఒక పాత్ర తారసిల్లుతుంది. సైగల్, జమున, నటించిన జిందగీలోని "శ్రీమతి జోకు భీభీం తుంహెూ' జ్ఞాపకం వస్తుంది.

1940 లో తిరిగి తిరిగి అతను కాకినాడలో కలిశాడు. ఎమ్.ఏ. పట్టం తీసుకున్న నేను

ఆంధ్ర ప్రచారిణీలో పనిచేస్తూ, చండీదాసు వగైరా సంగీత నాటికలూ, కల్చర్ అండ్ అనార్కీ అనే పూషా (విప్లవ కవిత)లూ నేను వ్రాసిన వాటిని కాకినాడ కళింగల్లో పడవల మీదికి షికార్ పోయి నాచేత పాడించేవాడు.

ఇక్కడి నుంచి వరుసగా మాంటేజి మార్పులు : అది ఆనందవాణి ఆఫీసు మహంకాళి శ్రీరామమూర్తి అనే ఒక ప్రజ్ఞాశీలి. తీక్ష్ణ ఆలోచనాపరుడూ అయిన ఒకాయన - ఆనందవాణి మేనేజి చేస్తుంటే గోరాశాస్త్రి సగం పనిపైగా చూస్తుండేవాడు. వినాయకుడి వీణ - ఆ తరువాత స్వతంత్రలో రావడానికి ముందు ఆనందవాణిలోనే వచ్చిందనుకుంటా అదే మేడలో పక్క పక్కల వినోదిని అనే వారపత్రికో టాంటాం అనే మరో టేబ్లోయిడ్ పత్రికా అదే (నాయుడుగారి) మేనేజిమెంట్‌లో వచ్చేవి రేడియో కేంద్రంలో ఉద్యోగంలో జీతం బేరం కుదరక నేను కొన్నాళ్ళు ఆ ఆఫీసులో పని చేశాను.

గోరాశాస్త్రి విశిష్ట వ్యక్తిత్వం పూర్తిగా రూపొందినది ఖాసా సుబ్బారావుగారి 'స్వతంత్ర' వారపత్రికలో అక్కడుండగానే స్వతంత్ర ఇంగ్లీషు వారపత్రికలోను, తెలుగు వారపత్రికలోను కూడా గోరాశాస్త్రి వ్యాసాలు ఎన్నో పడడమే కాక, ఎందరో యువ రచయితలకి వ్యక్తిత్వాన్నిచ్చాడు.

ఈ మధ్యలో 1942 జూలై నుంచి నేను మద్రాసు రేడియోలో రచయితగా చేరడం, 1944 నుంచీ కార్యక్రమ నిర్వాహకుడిగా రూపొందడం జరిగిపోయాయి.

ఈ కాలంలోనే కార్యక్రమ నిర్వాహకుడుగా నేను నాటకాలను ప్లాన్ చేయడం, శీర్షికలూ, ఇతివృత్తాలూ ఇచ్చి ఆయా రచయితల చేత వ్రాయించడమూ అలా రాయించిన రేడియో నాటకాలలో నేను సగర్వంగా చెప్పుకోదగ్గవి - శ్రీశ్రీ నాటకాలలో దాదాపు పదీ - గోరాశాస్త్రి నాటికలలో ఆశ ఖరీదు అణా, మార్గసంధి మొదలైన ఏడెనిమిది నాటికలు.

ఈ మధ్య దూరదర్శన్లలో ప్రసారం చేస్తున్నట్లుగా నలభైలలో మద్రాసు నుంచి సీరియల్ నాటకాలు వ్రాయించి ప్రసారం చేసేవాళ్ళం వారానికి ఒక రంగం చొప్పున రెండు మూడు మాసాలు గాని, నాలుగు మాసాలు గాని కొనసాగే సీరియళ్ళు ఫేమిలీ సీరియల్స్‌గాని, సోప్ ఆపెరాస్ అనీ వీటికి పాశ్చాత్య రేడియో ప్రసారాలలో పేర్లు! అంటే అక్కడ రేడియో ప్రసార కేంద్రాల మేనేజిమెంట్ అడ్వర్‌టైజర్స్ తమ తమ సోప్స్ కోసమో మరో వ్యాపారవస్తువు ప్రకటనల కోసమో ప్రారంభించి, సీరియల్సూ, ఇతర కార్యక్రమాలు ప్రసారం చేసేవారు.

గోరాశాస్త్రి ఆ రోజుల్లో 'సెలవుల్లో' అని ఒక సీరియల్‌నూ 'ఆనంద నిలయం' అనే ఒక సీరియల్‌ను వ్రాశాడు అవి ఒక్కొక్కటి రెండు మూడు మాసాలకు తక్కువ కాకుండా ప్రసారం

అయి బాగా ఆంధ్రశ్రోతల మన్ననకు పాత్రమయాయి. ఇవి రెండు సీరియల్సూ, కూడా టీవీలో ఆ మధ్య వచ్చిన 'యేజోహై జిందగీ' లాగా వారం వారమూ శ్రోతలను ఆకట్టుకొని చివరి దాకా ఖులాసాగా చిల్లోబుల్లోమని ఇంటిల్లపాదీ శ్రోతలనీ ఆనందంలో ముంచెత్తే నాటికలు.

'ఆశ ఖరీదు అణా' మొదలైన నాటకాలు అలాగ కాదు - చార్లి చాప్లిన్ హాస్య చిత్రాలలోలాగ వ్యక్తి జీవితంలో పొందే అపజయాలను, సాంఘిక అసమానతలనూ హేళనాపూర్వకమైన విమర్శ, వైఫల్యాల వల్ల కలిగే దిగులుపాటూ సమ్మేళనం చేసి చిత్రించిన నాటికలు 'ఆశ ఖరీదు అణా' హైదరాబాద్‌లో ఎ ఆర్.కృష్ణ నటబృందం నటించగా ఒకసారి చూశాను.

గోరాశాస్త్రితో కలిసే మా మిత్రబృందం అదే ఊరయినా రాత్రిళ్ళ సగం రాత్రి దాటిపోయేదాకానో తెల్లవారేదాకానో కబుర్లతో, పాటలతో గడిపేసి, అర్థరాత్రి వేసైడ్ టీషాప్ దాకా వెళ్ళి, రోడ్‌మీద బాల్చీతో అమ్మేవాడి టీ కొని తాగిన అనుభవానికి కొంత కథా, జీవిత దృక్పథ విమర్శా జోడించిన ఇతివృత్తం అది. దగాపడిన తమ్ముళ్ల హృదయవేదన గోరాశాస్త్రి 'కలం' కారిత్వంలో అలాంటి రసవంతమైన నాటికలు వెలువడ్డాయి.

ఏడెనిమిదేళ్ళ క్రితం నేను తిరుపతిలో అంతవరకు చేస్తున్న పని వదలివేసి హైదరాబాదు వచ్చాను జూలై, ఆగస్టుల్లో అనుకుంటాను. అంతకుముందు నేను తనకి ఉత్తరాలు వ్రాయగా వ్రాయగా వేంకటపార్వతీశ్వ కవుల ఏకాంతసేవకి నా ఇంగ్లీషు అనువాదానికి గోరా ఆంగ్లంలో పీఠిక వ్రాసి పంపాడు. ఆ పుస్తకం అచ్చు అయినది కాని హైదరాబాద్‌లో రచయితలూ, పత్రికా భ్రాతృవర్గమూ **కీర్తిశేషుడైన 'గోరా' కు నివాళులర్పించే సభకి పిలిచారు నన్ను.**

స్వోపజ్ఞతో, స్వయంకృషితో నిరంతరాధ్యయనంలో లోకవృత్త నిత్యపారదర్శకతతో **విశితమైన సంపాదకలేఖినీ ఖడ్గాన్ని ధరించిన 'గోరా' అస్థానపతితుడు కాదు** - స్వస్థ సేనాని

89. ఢిల్లీ నుంచి మద్రాసు ట్రాన్స్‌మిటర్ ప్రసారాలు

(ASIS - Additional South Indian Service)

అది 1942 జూలై తరువాత, నేను జూలై 1వ తేదీన ఆలిండియా రేడియో (అప్పటికింకా ఆకాశవాణి కాదు) మద్రాసు కేంద్రంలో రచయితగా, కళాకారుడుగా చేరాను.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభించి మూడేళ్లయింది మన దేశంలో బ్రిటిషు పరిపాలన నిరంకుశంగా సాగుతున్న రోజులు జర్మనీ, ఇటలీ, జపానులు అక్షరాజ్య కూటంగా ప్రపంచం అంతటా ఫాసిజం నెలకొల్పే అడకత్తెర వ్యూహంలో అటు యూరప్పులో జర్మనీ, ఆఫ్రికాలో ఇటలీ, ఇటు ఆసియాలో జపాను దేశం తరువాత దేశాన్ని దురాక్రమణ కావిస్తున్నాయి. బ్రిటను, అమెరికా, రష్యాలు అక్షరాజ్య కూటానికి వ్యతిరేకంగా ఆయా రంగాలలో యుద్ధం కొనసాగిస్తూ భారతదేశంలో కూడా సైన్యాల్ని రిక్రూట్ చేస్తున్న రోజులు. 1942 మొదటి 3, 4 మాసాలలో మద్రాసు రేడియోలో కొత్తగా చేరిన నేను కూడా మిగిలిన సిబ్బందితో పాటు విమాన దాడి హెచ్చరిక రావడంతోనే బ్లాక్ అవుట్ చీకటిలో ఎ.ఆర్.పి. షెల్టర్‌లలో దాక్కుంటూండేవాడిని.

అప్పుడు 'సురక్ష' లేక, భద్రత (సెక్యూరిటీ) కోసం పది కిలోవాట్ల మద్రాసు షార్ట్‌వేవ్ ప్రసార యంత్రాన్ని ఢిల్లీకి పంపించేసి, ఎడిషనల్ సౌత్ ఇండియన్ సర్వీస్ అనే పేర ఢిల్లీ నుంచి తెలుగు, తమిళ కార్యక్రమాలు ప్రసారం చేసేవారు.

1945లో ప్రపంచ యుద్ధం పూర్తయేదాకా ఈ ప్రసారాలు ఢిల్లీ నుండి కొనసాగాయి. ఈ సర్వీస్ ఒక ఎసిస్టెంట్ స్టేషన్ డైరక్టర్ (సహాయ కేంద్ర నిదేశకుడు) అజమాయిషీలో నడిచేది తెలుగు, తమిళ భాషలలో కార్యక్రమాలను ప్లాన్ చేసి, రచనలు, నాటకాలు, ప్రసంగాలు పాటలు తయారుచేసి ప్రసారం చెయ్యడానికి నిలయ కళాకారులూ, వాద్యకారులూ, తమిళమూ, తెలుగు తెలిసిన అనౌన్సర్లూ, రచయితలూ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లూ పనిచేసేవారు. ఆ రెండు మూడేళ్లలో తెలుగు కార్యక్రమాలను తయారుచేసి విశిష్టత సంపాదించిన కొందరు ప్రముఖుల సేవను స్మరించడం చాలా అవసరం.

శక్తిమంతమైన ప్రసార యంత్రం ఢిల్లీ వెళ్లిపోయింది. మద్రాసు నుంచి తెలుగు కోసమని మేం ప్రసారం చేసే కార్యక్రమాలు అంతకంటే దుర్బలమైన ప్రసార యంత్రం ద్వారా వెలువడి ఆంధ్ర ప్రాంతాలలోని శ్రోతలకు ఆ కార్యక్రమాలు కలిగించే తృప్తి కన్నా, ఢిల్లీ నుంచి వెలువడిన ప్రసారాలు ఎక్కువ సంతృప్తిని ఇస్తూండేవని ఆనాటి శ్రోతల ఉత్తరాల ద్వారా గాని, పత్రికలలోని అభిప్రాయవేదికల ద్వారాగాని తెలుస్తూండేది.

ఎ.ఎస్ ఐ ఎస్. అనే ఈ ఎడిసనల్ సౌతిండియన్ సర్వీసుకు సహాయ కేంద్ర నిదేశకులుగా స్మరణీయ కార్యక్రమాలకు కారకులైన అధికారులలో డాక్టర్ అయ్యగారి వీరభద్రరావు ఎనభై ఏళ్లు దాటి ఈ వ్యాసం వ్రాసే నాటికి (జూన్ 1989) ఇంకా సజీవులై వున్నారు. అప్పటి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌ల్లో చెప్పుకోతగినవారు కీ.శే యండమూరి సత్యనారాయణరావు. ఇప్పుడు కెనడాలోని ఇండియన్ ఎంబసీలో ఎస్.కె.కన్నమ్మ!

ఈ సర్వీస్‌కు నాటకాలు వ్రాసి, సర్వీస్ కార్యక్రమ ప్రసారాలకు అనౌన్సర్‌గా పనిచేసి అనాటి తెలుగు శ్రోతల అదరాభిమానాలను చూరగొన్న నిలయ రచయితా, కళాకారుడూ బుద్ధవరపు నాగరాజామాత్యుడు. బెంగుళూరు ఆంధ్రప్రభ దినపత్రిక సహాయ సంపాదకుడుగా పనిచేసి 1971 లో రిటైర్ అయ్యారు. అతడు రజని సోదరియైన అనూరాధ భర్త రజని భార్యయైన సుభద్రకు అన్నగారు.

ఈ సర్వీస్‌లో ప్రసారం అయిన తెలుగు నాటకాల్లో ఎక్కువ సంఖ్యలో నాగరాజామాత్యుని రచనలే. అప్పుడప్పుడు యండమూరి సత్యనారాయణరావు రచనలూ, డాక్టర్ అయ్యగారి రచనలూ కూడా ప్రసారం అయ్యేవి. ఢిల్లీలో ఈ తెలుగు నాటకాలలో పాల్గొనే తెలుగు కళాకారులు ఆనాడు వుండేవారా అని ప్రశ్న గలగవచ్చు. ఢిల్లీలో వార్తా ప్రసార విభాగంలోను, ఇతర శాఖలలోను ఇతర ప్రభుత్వ కార్యాలయాలలోను పనిచేసే ఔత్సాహికులు ఆ నాటకాలలో పాల్గొనేవారు. వారిలో కొందరి పేరులు, కపిల కాశీపతి, కలపటం రామగోపాలరావు, ప్రన్యాల రంగనాథరావు, మామిళ్ళపల్లి వీణు మొదలయిన వారు పురుష పాత్రలకీ, స్త్రీ పాత్రలకి మా చెల్లెలు అనూరాధా (శ్రీమతి నాగరాజా), విశ్వనాథ అచ్యుతదేవరాయల శ్రీమతి కమలా, ఇంకా అలమేలు మంగాదేవీ, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి పాల్గొనేవారు.

నాగరాజామాత్యుడు అనాడు వ్రాసి ప్రసారం చేసిననాటికలలో తెలుగు శ్రోతలను ఉర్రూత లూగించిన 'నారాయణా సీతయ్యా' అనే ఇద్దరు స్నేహితుల ముఖ్య పాత్రలతో సాగిన సాంఘిక హాస్య నాటికలు. వీటిలో అంగ్ల రచయితలైన బెర్నార్డ్‌షా, వోడ్‌హవుస్‌ల సంవాదాత్మక హాస్యమూ, సంఘటనలలో ఇమిడిన హాస్యమూ ఆనాడు మన శ్రోతలకి ఎంతో ఆదరపాత్రమైనాయి. ఆ నాటకాలు సీరియల్స్ కావు గాని, అవే పాత్రలలో కూడిన సంఘటనలను కూర్చి వ్రాసినవి పుష్పబాణ విలాసము, రాధామాధవమూ, మీసాల పక్షులూ, రసరాట్టు అనేవి వీటిలో రెండు మూడు నాటకాలు ఢిల్లీలోను, మద్రాసులోను, ఆంధ్రదేశంలోను కళాశాలలలోను యువకులు రంగస్థలంపైని కూడా ప్రదర్శించేవారు.

ఆ రోజులలో 'అమాత్యుడు' వ్రాసి ప్రసారం చేసిన పౌరాణిక, చారిత్రక నాటకాలలో

చెప్పుకోతగినవి, దక్షాధ్వరధ్వంసమూ, నరకాసురుని పునరాగమనమూ, విశ్వనాథ నాయకుడూను! దక్షాధ్వర ధ్వంసంలో డాక్టర్ అయ్యగారి వీరభద్రరావుగారు దక్షుడూ, నరకాసురుని పునరాగమనంలో నరకాసురుని పాత్రా ఆయనవే. ఈ పౌరాణిక పాత్రల నిరూపణలో ఏదో ఒక కొత్తదనం చూపడానికి ప్రయత్నించారు రచయిత ఆ పద్ధతి శ్రోతలకు ఆకర్షణీయం అనిపించేది

అయ్యగారి వీరభద్రరావు గారికి గురజాడ వారి కన్యాశుల్కం ఎంతో యిష్టం. ఆ నాటకంలో స్వయంగా లుబ్ధావధాన్లు పాత్ర నిర్వహించేవారు. ఆనాటి ఢిల్లీ ఆంధ్రులలో ఈ వ్యాసంలో ముందుగా చెప్పిన ప్రముఖులు తలో వేషం వేసి, ఢిల్లీలో కన్యాశుల్కం నాటకం ప్రదర్శించారు. కపిల కాశీపతి గిరీశం, మామిళ్ళపల్లి వేణు వెంకటేశం, అయ్యగారి రావు లుబ్ధావధాన్లు, కలపటం రామగోపాలరావు రామప్పంతులూ, క్రొవ్విడి లక్ష్మన్న అగ్నిహోత్రావధాన్లూ, ఎస్.కె.కన్నమ్మ మధురవాణీ, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మీ బుచ్చెమ్మా - అనాటి వేషాలతో, సెట్టింగులతో ఒకటి రెండు ఛాయా చిత్రాలు అయ్యగారి ఇంటిలో ఆల్బంలో కనబడుతూండేవి.

మన రేడియో ప్రసార చరిత్రలో ఈ ఎ.ఎస్.ఐ.ఎస్. సర్వీసు పాత్ర కుతూహల కారియైన ఇంటర్లూడ్.

90. ఆనాటి పిఠాపురం మహారాజా

'పిఠాపురం సంస్థానము కవి, పండిత పోషణ అనే పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని, దాని రచయిత్రి డాక్టర్ కమలా అనార్కలీ నేను రాజమండ్రిలో నున్నప్పుడు మా బస వెతుక్కుంటూ వచ్చి ఆదరాభిమానాలతో నాకందజేశారు.

పుటలు తిరగేశాను. 'సంస్థానాధిపతుల రచనలు, వారికి అంకితం చేయబడిన రచనలు, ఆస్థాన కవి పండితుల రచనలు, ఆస్థాన కవులు కాకపోయినా సంస్థానంలో నివసించిన కవుల రచనలు అని రచయిత్రి చేసిన నాలుగు విభాగాలను చిట్టచివరి దానిలో శ్రీ వేంకట పార్వతీశ్వర కవుల (మా నాన్నామామయ్యల) రచనలలో వారు ఆస్థాన కవులు కాకపోయినా మహారాజాకు, యువరాజాకు అంకితం ఇచ్చిన కృతుల సంక్షిప్త సమీక్షను కూడా తన సిద్ధాంత వ్యాసంలో చేర్చడం నాకూ జంటకవుల అభిమానులకూ ఎంతో సంతోషదాయకం.

కుమారి అనార్కలీ (ఏకాంత సేవను వీరు మహారాజా వారికి కృతిసేయుచు సూర్యునితో అభేదము చెప్పుట గమనార్హము. అని ఏకాంత సేవ సమీక్షలో ఇంతవరకూ ఎవరికీ తెలియని, అనుకోని విషయం ఉద్ఘాటిస్తూ, ఆ పద్యకావ్యంలోని నాందీ పద్యాన్నీ ఉద్ఘాటించారు.

"శ్రీ విలాసంబుతో చిద్విలాసమున
కర్థతాత్పర్య సమాశ్లేషమయ్యె,
సుకవి గీతములతో శ్రుతిగీతములకు
షడ్జపంచమనాద సమ్మేళమయ్యె,
....నిరుపమానానూననిత్య కల్యాణ
శోభామయంబయ్యె సూర్యాభ్యుదయము!"

ఒక విదుషీమణి తన సిద్ధాంత వ్యాసంలో ఆ విధంగా నిర్ధారించాక ఆ విషయాన్ని కాదనడం ఎవరికైనా కష్టసాధ్యమే కాని కవుల అంతే వాసినైన నేను చెప్పేమాట ఇదే ఏకాంత సేవ పద్య కావ్యాన్ని పిఠాపురం మహారాజా అయిన రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు గారికి కృతి చేసినట్టుగాని అంకితం ఇచ్చినట్లుగాని, ఇంత వరకూ ఎక్కడా, ఎవరూ అనలేదు.

1922లో ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయం 'పాకెట్ ఎడిషన్‌గా కాకినాడ నుంచి వెలువడజేసిన మొదటి ప్రచురణలో కాని, 1936 లో కాకినాడ నుంచే వెలువడిన రెండవ కూర్పు (డెమ్మీ సైజు) లో కాని కవుల మాటలలోగాని, ప్రచురణకర్తల పలుకులలోగాని, పెద్దాడ రామస్వామి గారి

ఆంగ్ల పీఠికలోగాని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి తెలుగు పీఠికలోగాని ఈ విషయం లేదని నా మనవి. అటువంటిదేమీ జరగలేదని నిర్ధారణగా ప్రకటిస్తున్నాను.

మహారాజా వారి ఆర్థిక సహాయం 1913-15 ఆ ప్రాంతంలో ఆంధ్ర ప్రచారిణీకి నిడదవోలులో ఉన్నప్పుడే అప్పటి పిఠాపురం దివానైన మొక్కపాటి సుబ్బారాయుడుగారి సౌహార్దం ద్వారా అంది ఆంధ్ర ప్రచారిణీ ముద్రాక్షరశాలను నెలకొల్పడానికి సహాయపడింది. (సుబ్బారాయుడుగారు బ్యారిష్టర్ పార్వతీశం వ్రాసిన నరసింహశాస్త్రిగారి అన్న).

1922 లో రాజమండ్రినీ, అద్దేపల్లి లక్ష్మణస్వామి గారినీ వదిలిపెట్టి ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయముతో సహా వేంకట పార్వతీశ్వర కవులు కాకినాడకు మకాం మార్చారు. అప్పుడే సూర్యారావు బహద్దూర్‌కు మహారాజా బిరుదం లభించింది. 1922లోనే కాకినాడ నుంచి వెంకట పార్వతీశ్వర కవులు మహారాజాభినందనము అనే చిన్ని కవితా పుస్తకము వెలువరించారు. దీనికి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తొలి పలుకు వ్రాస్తూ, 'మహారాజాగారు మా యిలవేల్పు. మన మహారాజు సాధారణ నాథుల కన్నమిన్న. ఆ వసంతుని గూర్చి గానము! కోకిలలు గాయకులు! మోడు మ్రాకులు కూడా చిగుర్చకుండునా" అన్నారు.

ఆ 1922 లోనే బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారికి షష్ట్యబ్ది పూర్తి అయింది ఆ సందర్భంలో వేంకటపార్వతీశ్వర కవులు నాయుడు గారికి 'రత్నహారము' అనే 60 మంజరీ ద్విపదల పద్యహారం కానుక ఇచ్చారు.

1920లో రాజమండ్రలో ఉండగా వెలువడిన 'మాతృమందిరం' నవలలో వేరువేరు ప్రకరణాలకు పైన ఉటంకించిన పద్య ఖండికలలో ఏకాంత సేవ పద్యకావ్యంలో రెండవ సగం అంతా సిద్ధం అయి ఉంది. కృష్ణశాస్త్రిగారి అక్కగారు ప్రకటిస్తూండిన అనసూయ మాసపత్రికలో సీరియల్‌గా అచ్చు అయింది. ఈ లోపున అయి ఉండాలి. 1921 లో సామర్లకోటలో భీమేశ్వరాలయంలో దానిని పూర్తిచేసి, 1922 లో కాకినాడ రాగానే ప్రకటించారు.

ఆ రోజులలో పిఠాపురం కోటలో పండిత వర్గంలో ఒక బలీయమైన వర్గం ఏకాంత సేవకు ప్రతికక్షులు. ఈ పద్య కావ్యం భావకవిత్వానికి నాంది అనే అపప్రథకు ఆ వర్గమే ప్రచారం కలిగించి. మహారాజా చెవి కొరుకుతూండేవారని వినికిడి. మహారాణీగారు, యువరాజా, వేంకటరత్నం నాయుడు గార్లకు మాత్రం ఏకాంతసేవ అంటే 'బైబిలు' హిమ్స్ ఆఫ్ సోల్మన్ లాగా గీతాంజలిగాను పిఠాపురం, కాకినాడలలో బ్రహ్మ సమాజ మందిర ప్రార్థన సమావేశాలలో ఏకాంత సేవలోని భక్తిగీతాలను పాడినా, వినినా నాయుడుగారు, రామస్వామిగారు మొదలైన పెద్దలు రుద్ధకంఠాలతో కన్నీళ్లు కార్చేవారు. మహారాజా మాత్రం తటస్థులు.

మరో ఇరవైయైదేళ్ల తరువాత 1947-48 ప్రాంతం. మద్రాసు అడయార్లో 'గులాబి' పిఠాపురం మహారాజా బంగళాలో ఆంధ్రమహిళా సభ బాలికా బృందం నృత్యనాటికలను ప్రదర్శిస్తున్నారు. ఆ నాటకాలలో అప్పటికి రేడియోలో నిలదొక్కుకున్న రజని సంగీత నాటకాలలో మేనకా విశ్వామిత్ర, సుభద్రార్జునీయం, మధురానగరీ గాథ నాట్యాచార్య కుల్కర్ణి శ్రీనివాస్, అవార్యాసామ్రాజ్యం రమణరావుల దర్శకత్వంలో ప్రదర్శించారు. నాటకాల మధ్య విరామ సమయంలో చండీదాసు, శతపత్ర సుందరి, దివ్యజ్యోతి మొదలైన తన నాటకాల నుంచి గేయాలను రజని గానం చేశాడు పక్క వాద్యాలున్నాయి. ఆ గానం అయాక, మహారాజా వేదికపైకి వచ్చారు నాట్యాచార్యుల పరిచయాలు, నర్తకీమణుల పరిచయాలూ అయాక గాయక నేపథ్యానికి నన్ను మిస్టర్ రజనీకాంతరావు ఆఫ్ ఆల్ ఇండియా రేడియో అని పరిచయం చేశారు. ఆ వెంటనే నాకూ మహారాజాకూ జరిగిన సంభాషణ నేనెన్నటికీ మరువలేను.

మహారాజా : డూయు కం ఫ్రం బెంగాల్ (మీరు బెంగాల్ నుండి వచ్చారా?)

నేను : లేదండీ తెలుగు వాణ్ణేనండీ.

మహారాజా : ఏజిల్లా ఏవూరు మీది?

నేను : తూర్పు గోదావరి, పిఠాపురమేనండి.

మహారాజా : మా పిఠాపురమే! పిఠాపురంలో ఎవరబ్బాయి మీరు?

నేను : బాలాంత్రపువేంకటరావుగారి అబ్బాయి నండీ. వేంకట పార్వతీశ్వరకవులలో వారు.

మహారాజా : మీరు పాడిన పాటలెవరు వ్రాశారు? కవనం చాలా బాగుంది ఎక్కడ చదివారు?

నేను : నేనే వ్రాశానండీ, కాకినాడ కాలేజీలో చదివానండి, ఇంటర్.
ఆంధ్ర యూనివర్శిటీలో ఎం.ఎ చదివానండీ

మహారాజా : తమ్మన్నశాస్త్రిగారి కుమారుడి దగ్గర మీరు చదివారా?

నేను : కృష్ణశాస్త్రిగారండీ వారు మా గురువులేనండి.

మహారాజా : మీ కవిత్వం బాగా అర్థం అవుతుందీ మీరు వారిలా భావకవిత్వం వ్రాయరా? మీ నాన్నగారు పార్వతీశంగారూ వాళ్లు నిర్దుష్టంగా వ్రాస్తారు బాగా అర్థం అవుద్ది.

నేను : చిత్తం. నాది గేయ కవిత్వం అండి.

ఆచార్య కులకర్ణి మీరు దర్శించిన నృత్యనాటకాలు, తాను పాడిన పాటలూ ఆయన రచించినవేనండి.

మహారాజా : (ఐయామ్ సో మచ్ ప్లీజ్డ్ విత్ యువర్ పొయట్రీ అండ్ మ్యూజిక్). మీరు సంగీతం ఎక్కడ నేర్చుకున్నారు? మీ కవిత్వం సంగీతమూ నాకెంతో సంతోషం కలిగించాయి.

నేను : సంగమేశ్వర శాస్త్రిగారి శిష్యులు మండ కృష్ణమూర్తిగారు మా గురువులండీ

మహారాజా : చాలా సంతోషం! కరపవారి కాలవపక్కని కాదూ మీ ఇల్లు పిఠాపురంలో మా సెక్రటరీ నాగరాజుగారు వేంకట్రావుగారి అల్లుడు ఆయన ఢిల్లీ ఆల్ ఇండియా రేడియోలో వున్నారు కదా!

నేను : చిత్తం. ఇప్పుడాయన ఆంధ్రప్రభలో వున్నారండీ

మహారాజా : వేరీ హేపీ! వెరి హేపీ! మే గాడ్ బ్లస్ యూ.

నరసరావుపేటలో కోన వేంకటరాయశర్మగారి కార్యదర్శిత్వములో ఆంధ్ర సారస్వత పరిషత్తు కవిరాజహంస బిరుదముతో గౌరవించినదీ వోలేటి పార్వతీశముగారొక్కరినే కాదనీ శ్రీ వేంకట పార్వతీశ్వర కవులిద్దరినీ అని సిద్ధాంత వ్యాస రచయిత్రి (కమలా అనార్కలి) గమనించవలసి వుంటుంది. మరిన్నీ

"తరుణ శృంగార మాధవుడవునీవు!
వరనందనోద్యాన వనలక్ష్మి నేను" - వేంకట పార్వతీశ్వరుల ఏకాంత సేవ

"తరుణ శృంగార మధురమాధవుడవీవు
కలికిపాటల కోయిల కొలము మాది" - కృష్ణశాస్త్రి కృష్ణపక్షం

వెంకట పార్వతీశ్వర కవుల మార్గదర్శిత్వాన్ని మెచ్చుకుంటూ, ఈ మహా కవులు నా గవాక్షాలను కొన్నింటిని తెరిచారని కృష్ణ శాస్త్రిగారన్న మాటలకు పై పద్యాలు ఉదాహరణలు కావు! పై ద్విపద నాయకుడైన పరమాత్మను గురించి నాయిక అన్నమాటలు. కింది తేటగీతి పాదాలు - మహారాజాను గురించి శాస్త్రిగారి మాటలు!

91. ఆనాటి పిఠాపురం యువరాజా

కొన్ని వందల సంవత్సరాల నుంచీ ప్రసిద్ధి పొంది కొన్ని ఎకరాల క్షేత్రం పైని అడయారులో (మదరాసు) యాత్రికులకు కుతూహలాన్ని రేకెత్తిస్తూ వచ్చిన మహావటవృక్షం ఈ మధ్యనే వీచిన తుపాను గాలికి భూమిలో ఏళ్లతరబడి నిలదొక్కుకున్న వేళ్లపాదును పెకల్చుకొని నేలకూలిపోయింది. అయితే ప్రతిభాశాలురైన ఇంజనీర్లూ, వృక్షశాస్త్రజ్ఞులూ సహకరించి "తాటాపూటం' చేసి ఆ చెట్టును పునఃప్రతిష్ఠ చేశారని వార్తలలో విన్నాము.

'ఇమ్మనుజేశ్వరాధములు' అనీ, 'రాజులు రాజులా భువి' - అనీ, కారే రాజులు రాజ్యముల్ గలుగవే, గర్వోన్నతిస్ జెందరే.... పేరైనంగలదే' అనీ, స్వతంత్ర శీలురైన కవీశ్వరులు గర్హించినా, మధ్య యుగపు రాజవ్యవస్థకి చెందిన ఒక్కొక్క విశిష్ట వ్యక్తి కవిరాజు అనో - సాహిత్య భోజుడనో తన ఔదార్య కార్యాలవల్లా కవి పండిత పోషణ వల్లా ఘనత వహిస్తూ వచ్చారు. అటువంటి విశిష్ట వ్యక్తి ఒకరిని గురించి స్మరించుకుందాం.

స్వతంత్ర భారతం ప్రజాస్వామిక సాంఘిక పరివర్తనా తరంగాలలో అప్పటికే క్షీణమై శిథిలమైపోతూ తుడిచిపెట్టుకుపోయిన జమీందారీ వ్యవస్థకు మాత్రం అడయార్ మర్రి చెట్టుకు ప్రాప్తించిన పునఃప్రతిష్ఠాయోగ్యత లభింపకపోవచ్చు. కాని, సాహిత్య భోజులూ, కవిరాజులూ తమ విశిష్టసారస్వతసేవ వల్ల వ్యక్తిగతంగా స్మరణ యోగ్యత కోలుపోరు.

1947 - 48 ప్రాంతంలో మద్రాసు అడయార్‌లో 'గులాబీ' బంగళా కచ్చేరీ హాలులో అనుకోకుండా ఆనాటి పిఠాపురం మహారాజాతో నాకు తటస్థించిన రెండు నిముషాల 'భేటీని గురించి స్మరించి ఆ సంవత్సరపు ఉగాది పండుగనాడు ఆ మహారాజా కుమారుడూ అప్పటి యువరాజా - అయన ఆర్వీ ఎమ్వీ రామారావు గారి మద్రాసు నివాసం 'వసంతవిహార్' కచ్చేరి హాలులో యువరాజాయే స్వయంగా ఏర్పాటు చేసిన నా సంగీత సాహిత్య 'కచ్చేరీ' గురించి వ్రాయకుండా ఉండలేకపోతున్నాను. ఇది 'మహారాజా' తో భేటీకి కొన్ని మాసాల ముందే జరిగింది.

మద్రాసు రేడియో కేంద్రం ఎగ్మూర్ మార్షల్స్ రోడ్‌లో ఉంటున్న రోజులవి కార్యక్రమ నిర్వాహకుడుగాను, కవిగా, గాయకుడిగా, నాటక రచయితగా, రేడియోలో తరచూ వినబడుతూ నేను నిలదొక్కుకున్న కాలం, లివరీ డ్రెస్సులో ఒకకారు డ్రైవర్ మా కార్యక్రమ నిర్వాహకుల గదిలోకి వచ్చి, నాకు సెల్యూట్ చేశాడు పిఠాపురం ముఖం చూడగానే గుర్తుపట్టి 'చెంచు నారాయణ' కాదూ అని అడిగి, మా గదిలో కుర్చీ చూపించి, మర్యాద చెయ్యబోయాను. "కాదుబాబు యువరాజావారి సెలవయింది. మీకు వీలుగా వుంటే, ఇప్పుడు నాతో ఒకసారి వసంతవిహార్‌కి

దయచెయ్యమన్నారు''. అతను యువరాజుగారి డ్రైవర్, పిఠాపురం హైస్కూల్‌లో వెనుక చదువుకున్నవాడు.

నేను వెళ్లాను.... రాబోతున్న ఉగాదినాడు వసంతవిహార్‌లో తన బంధుమిత్ర బృందానికి ఆనందం కలిగించడానికి ఆయన నన్ను ఆల్ ఇండియా రేడియో సహకార వాదకులతో సహారమ్మని ఆహ్వానించారు.

వీణా, వయొలిన్ విద్వాంసులు శర్మ సోదరులు, సారంగి విద్వాంసుడు అలీరజా, తబలా విద్వాంసుడు సిద్దేశ్‌కుమార్ వీరి సహాయంతో నేను అచ్‌ఖాన్, చురీదారీ పైజామా వేసుకుని, వసంతవిహార్‌కి వెళ్లాను. యువరాజా, రాజాకుమార్‌లు సతీసమేతంగా ఆహ్వానించారు. ఉయ్యూరు, గొల్లపల్లి, మీర్జాపురం జమీందారులూ, యువరాజా వారి తరానికి చెందిన బంధువులూ మిత్రులూ స్త్రీ పురుషులంతా నూటికి మించి వుంటారు శ్రోతలు.

ప్రేక్షకులందరికీ స్వాగతం చెప్పారు యువరాజా మా సంస్థానంలో ఉగాది దసరా వంటి పండుగలకు కవులను పండితులను ఆహ్వానించి, వారి విద్వత్సాహితిని కళా ప్రదర్శన చేయించి సన్మానించడం ప్రాచీనాచారం.

ఆ ఆచారాన్ని పురస్కరించుకుని, మా తరానికి గురు స్థానీయులై నాకు వ్యక్తిగతంగా బృందావనం అనే కావ్యాన్ని వివాహశుభవేళ అంకితం ఇచ్చిన ఆధునిక కవికులగురువులు, నా కోరికపై ఇప్పుడు రామాయణ రచనలో నిమగ్నులై వున్న వేంకటపార్వతీశ్వర కవులలో బాలాంత్రపు వెంకటరావుగారి కుమారుడు రజనీకాంతరావు రేడియో ద్వారా 'రజనీ'గా మనకందరకు ఆత్మీయుడవుతున్న 'రజనీ' ఈ ఉగాది నాడు మన వివిధ ఆధునిక కవుల గేయాలను, తన గేయాలను వినిపించబోతున్నాడని సభ ప్రారంభం చేశారు.

నేను నాగేయాలను, కృష్ణశాస్త్రి, నండూరి, అడివి బాపిరాజుగార్ల గేయాలను, వేంకట పార్వతీశ్వరుల ఏకాంతసేవ నుంచీ, రవీంద్రనాథ ఠాకూరు వంగ గేయాలను సభాసదుల కోరికపైని కె.ఎల్.సైగల్ హిందీ చిత్రగీతాలను గానం చేశాను. తాంబూలంతో చేర్చి నూటపదహార్లు నాకూ మిగిలిన విద్వాంసులకు కూడా ఉచిత రీతినీ, యువరాజా బహూకరించి సత్కరించారు

తండ్రి మహారాజా ఎంత గ్రాంధికవాదో యువరాజా అంతటి వ్యావహారికవాదీ, రచయితానూ 15 సంపుటాల సూర్యరాయాంధ్ర నిఘంటువు పలువురు పండితప్రకాండుల సంశోధన ద్వారా వెలువడిన గ్రంథం తెలుగు భాష ఉన్నంత కాలమూ మహారాజా పేరుకు చిరస్థాయిని కలుగజేస్తుంది.

‘వలపులు, అలపులు, తలపులూ, అనేయువరాజా రచించిన గేయ సంపుటి గురించి వ్రాస్తూ కమలానార్కలీ తన సిద్ధాంత గ్రంథంతో ప్రతి అల్ప విషయాన్ని గేయముగా వ్రాసి, కాదేదీ కవితకనర్హం అను అభ్యుదయ కవితాధోరణి నవలంబించిరి అన్నారు.

యువరాజా ఆంగ్లంలో తన రచనలను గురించి చెప్పిన మాటలలో “నా పుస్తకాలు చాల మట్టుకు మనస్తత్వ విశ్లేషకాలు, ఆత్మాశ్రయాలూ వస్త్వాశ్రయాలూ కూడాను. గంభీరమైన మానవ హృదయానుభూతులలో మంచివీ, చెడ్డవీ, అసలు పాటించనక్కరలేనివీ కూడా వుంటాయి అవి వాస్తవిక జీవితంలో నుంచి పుట్టి ఉండొచ్చు. కాల్పనికములూ కూడాను. నేను ముఖ్యంగా నాకోసమే రాస్తాను నా దిగుళ్లనూ, పొంగులనూ రచనల ద్వారా వ్యక్తం చెయ్యకుండా వుండలేను. పాఠకులు వాళ్లకిష్టమైతే వాటిని చదవొచ్చు. నా అనుభూతుల్లో పాల్గొనవొచ్చు. లేకపోతే వాళ్లయిష్టం” అన్నారు.

92. డా॥ రాధాకృష్ణన్

నేను మద్రాసు కేంద్రానికి ఉద్యోగినయి నిలబడే నాటికి రాధాకృష్ణన్‌గారు అక్కడ లేరు ఢిల్లీలో ఉండేవారు. మద్రాస్ లోని ఆయన సంతానం రుక్మిణమ్మగారు ఆమె భర్త శ్రీ కస్తూరి శేషగిరి రావు లాయరు. వారి పిల్లలు మాకుటుంబ స్నేహితులు చెన్నై మైలాపూర్‌లో పక్కపక్కనే ఉండేవారం. 1961 లో నాకు సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించేనాటికి అకాడమి అధ్యక్షులు ఆనాటి భారత ఉపాధ్యక్షులయిన డా॥ రాధాకృష్ణన్. ఆంధ్ర వాగ్గేయకారచరిత్ర రాసినందుకు ఆ అవార్డులభించింది. అప్పుడే వావిళ్ళవారు ప్రచురించిన నాగేయ సంపుటి 'శతపత్రసుందరి'ని చంకపెట్టుకుని ఢిల్లీలో ఉపరాష్ట్ర పతిగారి బసకి వెళ్లాను. మెట్లెక్కగానే నడవలోనే నడుంఎత్తుటేబిల్ మీద నడవపొడుగునా పుస్తకాలు. పుస్తకాలే దర్శన మిచ్చాయి. నడవ దాటితే నడవ అక్కడా అలాగే. మెట్లెక్కి పైకి వెడితే అక్కడా పుస్తకాలే పుస్తకాలు అక్కడినుంచి చదువుల సరస్వతీ రాధాకృష్ణన్ గదిలోకి వెళ్ళేసరికి ఆయన మంచానికి ఇరుపక్కల, ఎదుట, మళ్ళా పుస్తకాలే పుస్తకాలు ఇన్ని పుస్తకాల మధ్యవున్న ఆయన నానమస్కారం అందుకుని నాచంకలో పుస్తకం లాక్కుంటూ "ఇదేం గ్రంధం" అంటూ పల్కరించారు. దాన్ని తెరిచి చదివి రజనికి నిన్ననే అవార్డు ఇచ్చారు, నేడు ఆయన ఆపాటలూ అంటూ సొంత సంగీతంలో పాడ్డం ఆరంభిచారు! ఆయనే అలా పాడుకోడం నాకు చాలా అనందాన్నిచ్చింది ప్రచురణ చూసి ఆయన సంతోషించారు. మద్రాస్ తిరువొత్తియూర్, వావిళ్ళరామ స్వామి శాస్త్రులు ప్రకటించిన నా గేయసంపుటి - శతపత్రసుందరి

93. కేరళయాత్ర - 1, 2, 3, 4

స్వాతి తిరునాళ్ - కుచేలోపాఖ్యానం

1960-66 మధ్య నేను హైదరాబాద్‌లో ఉన్నాను. ఢిల్లీనుంచి డైరెక్టర్ జనరల్ ఆదేశం వచ్చింది. తిరువాంకూర్ వెళ్ళి దక్షిణాది కేంద్రాల్లోంచి అనువయిన కళాకారులను బుక్ చేసుకుని స్వాతి తిరునాళ్ కుచేలో పాఖ్యానం తిరువాంకూర్ కేంద్రంలో రికార్డు చేయమని ఆ ఆదేశం. అన్ని కేంద్రాలలో దాన్ని రిలే చేయవలసి వుంటుందన్నమాట. (ట్రావెన్కూర్ స్వాతి తిరునాళ్ స్మారక సంస్థ అధ్యక్షుడు ప్రొ. జి.పి.ఎస్. నాయర్) దీనిని నేను తిరువాంకూర్ కోజికోడ్ బెంగుళూరు వెళ్ళి మద్రాసు కేంద్రాల పరిధిలో పాత్రలకనుగుణమైన వారిని ఎంచుకుని కాంట్రాక్టులు పంపి ఆల్ ఇండియా రేడియో త్రివేండ్రం కేంద్రంలో రికార్డు చేసి జాతీయ కార్యక్రమంగా ఢిల్లీనుంచి పంపించే విధంగా తయారు చేయాలి.

నేను తొలి ప్రకరణాల్లో రాసినట్టే మా పినతండ్రి సూరిబాబు తిరువాంకూర్‌లో వివాహం చేసికున్నాడు. ఆ తరువాత తన తల్లిదండ్రులు పోయిన సంగతి చెప్పలేదని మావగారి మీద కోపించి వచ్చిన మా బాబాయికి వాళ్ళ అన్నగారు పెమ్మరాజువారి అమ్మాయితో ద్వితీయ వివాహం జరిపించిన వైనం కూడా తొలి ప్రకరణాల్లో ప్రస్తావించాను. నా పుట్టుకకు ఓ నెలముందు ప్రసవించిన మా అమ్మడు పిన్నినీ చంటివాణ్ణీ తీసికుని మా సూరిబాబు (చిన్నాన్న) ట్రావెన్కూర్ వెళ్ళి తన ప్రథమ భార్యను కూడా సంతృప్తి పరిచాడు. మాకు అలాగే తిరువాన్కూర్‌లో ఒక తమ్ముడు పుట్టాడు. పేరు బాలాంత్రపు రామ్మూర్తి. 1921 వ సంవత్సరం మార్చిలో మా సూరిబాబు ప్రథమ భార్య తిరువాన్‌కూర్ దివాన్‌గారి కూతురుకు కొడుకు పుట్టాడు. మూడేళ్ళ వయసుసలో అతడికి అక్షరాభ్యాసం తదితరాలు జరిపి మా సూరిబాబుకి ఉత్తరాలు రాసేవారు. ఇంటి కొచ్చేసిన ఆసూరిబాబు అలా తిరిగి త్రివేండ్రం లేక ట్రావెంకూర్ వెళ్ళనేలేదు. నాకూ ప్రసాదు అన్నయ్యకి పాఠాలు చెప్పేటప్పుడు ఆయా సందర్భాల్లో తిరువాంకూర్ విశేషాలు చెప్పేవాడాయన వాటిలో ఒకటి వీణధనమ్మాళ్ తిరువాంకూర్ సంస్థానానికి వచ్చిపాడిన క్షేత్రయ్య పదాల్నిగురించి.

నేను త్రివేండ్రం వెళ్ళాలి అధికారికంగా ఆఫీసుపనాయె నాటి కేరళ గవర్నర్ వి.వి. గిరి ఆయన కార్యదర్శిగా ఉండేది రామకృష్ణమ్మ (వింజమూరి లక్ష్మిఅక్కగారు) మా ఇంటికి వచ్చి వాళ్ళ అక్కకి గవర్నర్ ఇంట్లో కొన్ని ఇబ్బందులున్నాయి చెప్పుకోడానికి తెలుగువాళ్ళు ఎవరైనా అధికారంలో ఉన్నవాళ్ళుఉండాలని చెప్పుకొన్నది. మా సూరిబాబు భావమరదుల పేరు వింజమూరి వరదరాజయ్యంగారు వంటి సంగీత విద్వాంసులను ఎంపిక చేశారు ఆ విధంగా తిరువాంకూరులో

బాబాయిగారి కుటుంబాన్ని చూసే అవకాశం వాతావరణం ఏర్పడింది. పింగళివారు ఈ అవకాశం గురించి విని ఎంతో ఆనందించి పంపారు ట్రావెంకూర్ వెళ్ళడానికి రైలుదారి చివరితునక ద్వారా అలా అక్కడికి చేరుకున్నాను.

నేను వస్తున్నట్లు తెలిసి రైలు దగ్గరికి వచ్చిన మా సోదరుడితో నేను రజనీని అన్నాను. నేను రామ్మూర్తిని అంటూ కావలించుకున్నాడు. సోదరుడు! నా బస రామ్మూర్తి ఇంట్లోనే. ఆ ఇంట్లో హాల్లో కూర్చునే స్వాతి తిరునాళ్ కీర్తనలకు స్వరాలు కూర్చుకున్నాను అతడు నేను చేసిన సంస్కృతంపాటలు పాడుతుండేవాడు. నా సోదరుడు రామ్మూర్తి అలా పాడ్డం నాకు సంతోషాన్ని కలుగజేసిందానాడు.

జలధి సుతార మణేన హి సోహం
సరస మాలింగితో నిస్పందేహమ్
పర్యంకే విజదయితా సహితే
సముపాకలితే వసనుమలసితే ॥జలధి॥

పుదుక్కోటై కృష్ణమూర్తి కుచేలుడుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వాతి తిరునాళ్ కీర్తనలను రాగాలను శమ్మంగుడి పాడారు. ఆయన పాడిన సైంధవివంటి రాగాలను ఆతరువాత మన క్షేత్రయ్య పదాలకు, నేను తయారు చేసుకున్న యక్షగాన పదాలకు వాడేను. కరమనె నివాసంలో పూర్వీకులయిన తిరువాన్కూర్ దివాన్ బొప్పూడి నాగుమయ్యగారు, ఆయన కూతురు జానకమ్మగారూ (అంటే మాపిన్ని) కరమనె నివాసానికే తీసుకొచ్చాడు. ఆలిండియా రేడియోకి ఫోన్ చేసాము అప్పటిలో ఒక్క మైసూరు కేంద్రానికే ఆకాశవాణి అని పేరు. కళాకారులు ఎంపిక చేయడం బుక్ చేయడం పొద్దికల (రిహార్సిల్స్)కి రమ్మనటం... అంతా జరిగిపోయింది. కుచేలోపాఖ్యానం అలారికార్డు ఐపోయేలోగా నేనూ రామ్మూర్తీ అన్నదమ్ములం పద్మనాభస్వామిని దర్శించటం ప్రక్కనే ఉన్న శుచీంద్రం ఆలయంలో సప్తస్వర స్తంభాల మ్రోగింపు చక్కగా జరిగాయి. నేను తిరిగి బెజవాడ వచ్చేశాను.

కేరళయాత్ర - 2

కొట్టాయంలో ఒక పుస్తక ప్రకటన విక్రయాల కేంద్రం వారు రజతోత్సవం చేసుకుంటుంటే దానికి భారతీయ రచయితల సంఘం సభ్యుల్ని ఆహ్వానిస్తూ నన్నూ ఆహ్వానించారు

కేరళయాత్ర - 3

ఈసారి అఖిల భారతరచయితల సంఘం కేరళలోని అల్వాయ్‌లో జరిగింది అరచయితల సంస్థ సమావేశంలో ఓ ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. ఆ సంఘం అధ్యక్షుడు ఆద్య రంగాచార్య కార్యదర్శి గిరీష్‌కర్నాడ్ 'గెస్‌ది బర్డ్' సాభినయంగా రంగాచార్యతన శరీరంపైన కళ్ళూ, ముక్కూ, కాళ్ళూ, రెక్కలూ కదలిస్తూ ఒక్కొక్క పక్షిని ప్రదర్శించారు. ఆపక్షి చేష్టలు కదలికలతో, కనుచూపులతో కాలికదలికలతో పక్షిరెక్కల కదలికలు ప్రదర్శిస్తూ అయన నటిస్తోంటే సభాసదుల్లో ఎవరైనా ఆపక్షిపేరు చెప్పాలి.

ఆయన అనుకరించిన పక్షులు ఏమిటంటే రాబందు, గద్ద, కాకి, పావురం, గుడ్లగూబ, కోకిల, గోరొంక, పిచిక, భృంగరాజుపిట్ట, హంస, బాతు, కొంగ, నెమలి మొదలైనవి. ఆయన చాలా బాగా చేసేరని గుర్తించి ఆచార్యుడూ ప్రేక్షకులూ పరస్పరం అనందించిమెప్పించారు.

కేరళయాత్ర - 4

యాత్ర ఈసారి వుడ్‌లాండ్స్ హెూటల్‌లో దిగాను. స్వాతి తిరునాళ్ మహారాజా స్మారక సంఘంవారి ఏర్పాటు అది. ఈసారి స్వాతి తిరునాళ్ స్మారక మహాసభ వైస్ ప్రెసిడెంట్ నన్ను తిరునాళ్ వాగ్గేయ కార రచనాశక్తిపై ప్రసంగించాల్సిందంటూ ఆహ్వానించారు. ప్రావెస్ అఫ్ స్వాతి తిరునాళ్ అనే వ్యాసం ఇంగ్లీషులో వ్రాసుకుని వెళ్ళాను. గతంలో వెళ్ళినపుడు రామ్మూర్తి ఇంట్లోనే దిగాను స్వాతి తిరునాళ్ పాటలను నాలుగోసారి వెళ్ళిన నేను మర్చిపోయినా సోదరుడు రామ్మూర్తి మర్చిపోలేదు. సరిగదా హాయిగా పాడటం ఆనందాన్నిచ్చింది.

94. హైదరాబాదు ఆకాశవాణి నాటక ప్రయోక్త నటకావతంస స్థానం నరసింహారావుగారికి గజారోహణోత్సవం

1960-66 సం॥ల మధ్య - గవర్నర్ చంద్రారెడ్డిగారి అధ్యక్షతన రవీంద్రభారతిలో స్థానంవారికి గజారోహణోత్సవం జరిగింది హైదరాబాద్ రేడియోనిలయంలో నాటక ప్రయోక్తమాత్రం లేకుండా దేశంలో సుప్రసిద్ధుడైన స్త్రీ వేషధారియైన నటశేఖరుడు సత్యభామ, కైకేయి ఆదిగా గలప్రధాన స్త్రీ పాత్రలను బందాకనకలింగేశ్వర రావు, అద్దంకి శ్రీరామమూర్తి మున్నగు మహానటుల పక్క స్త్రీ వేషధారియై ఆయన కొన్ని దశాబ్దులు దేశంలో ఆయా నగరాలలో నటించి ప్రఖ్యాతుడైన నటశేఖర బిరుదాంకితుడు స్థానం! నేను ఆయన్ని మామయ్యా అని పిలిచేవాణ్ని. ఆయన నన్ను అల్లుడూ అని సప్రేమాదరాలతో పిలిచేవాడు.

ఆ వేళటి ఉత్సవంలో నేను ప్రసిద్ధమైన నాటకురంజి రాగంలోని ఆదితాళవర్ణంలోని అవేస్వరాలకు సాహిత్యాక్షరాలను తిరగరాసి, స్థానం వారిపై నీ ఆశీస్సులు వర్షింపుమా దేవీ సరస్వతీ అనే వర్ణాన్ని పాకాల సావిత్రీదేవి, ఎ.బి. కనకదుర్గా మున్నగు గాయనీ గాయకులచేత పాడించాను

95. గాంధీజీ జీవితంపై ధ్వని ప్రకాశిని

ఆకాశవాణి 'కర్సియాంగ్' కేంద్రంలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా రెండేళ్లు పనిచేసి, నేను సాధించగలిగిన ఘనకార్యం - అక్కడి కేంద్రకార్యక్రమ నిర్వాహకుల ప్రయోక్తల దృక్పథాన్ని ఉదారభావాలతో ఆ ప్రాంతాల జానపదగాయకుల సార్వతీయ సంగీత రీతులకూ, సామాన్య పల్లీయజనుల పల్లెపాటలకూ, ఆ రేడియో కేంద్రంలో అంత వరకూ సాగుతూ వచ్చిన శాస్త్రీయ సంగీతంతో, రవీంద్రసంగీతంతోపాటు సమాన సామాజికగౌరవం కలిగించడం!

1966మే, జూన్‌లలో కర్సియాంగ్ నుంచి నాకు ఢిల్లీ బదిలీ అయింది అదే పదవి పని చేయడం ఢిల్లీ రేడియో కేంద్రంలో కాదు. ట్రాన్స్‌క్రిప్షన్ అండ్ ప్రోగ్రాం ఎక్స్‌ఛేంజ్ సర్వీస్‌లో, దేశంలోని వివిధ రేడియోకేంద్రాలలో తయారైన మంచి మంచి సంగీత కార్యక్రమాలనూ, నాయకులా, సాహిత్యపరులా, ఉత్తమ ప్రసంగాలనూ భద్రపరిచే అర్కైవ్స్ శాఖ. వాటి నుంచి వివిధ కేంద్రాలు ఎంపిక చేసుకుని కోరుకోగా, వాటికి సరఫరా చేసే ప్రోగ్రాం ఎక్స్‌ఛేంజి శాఖ. దేశంలో వివిద ప్రాంతాలలోని వివిధ భారతి కేంద్రాలకి లలిత సంగీత, ఫిలిం సంగీత కార్యక్రమాలనూ, లఘురూపకాలనూ, ధ్వనిముద్రణయంత్రాల ద్వారా నలభై ప్రతిరూపాలకు పైగా ముద్రించి టేపులను సరపరా చేయడమూ ఇవీ పనులు నా జాతకం వ్రాసిన 'భృగునాడి' ఈ పనిని ఇలా వర్ణించింది. 'యంత్రనిక్షిప్య కార్మికాన్ నియోజ్య, ఉత్తమోత్తమ వినోదగీతానంద భావతన్మయ భాషానాద బ్రహ్మతత్త్వం ప్రసారం'.

దేశంలోని రేడియో కేంద్రాలలో ఎక్కడ పని చేస్తున్నా, పై అధికారులు పని కట్టుకుని పిలిచి బరువైన ప్రత్యేక కార్యక్రమాల బాధ్యతేదో ఒప్పగిస్తూండడం నా సర్వీసులో పరిపాటి!

అది 1969 మే నెల మొదటి వారం, ఆకాశవాణి మహానిర్దేశకుడు (డైరెక్టర్ జనరల్) పి.సి. సేన్‌గారి ఛేంబర్‌కి రమ్మని నాకు పిలుపు వచ్చింది. ప్రధానమంత్రికి ప్రత్యేక కార్యదర్శియైన శారదాప్రసాద్ అక్కడున్నారు. మే 27వ తేదీ పండిత జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతికి తీన మూర్తి భవనం ఆవరణలో ఏర్పాటు అయ్యే ప్రార్థనసమావేశంలో వేరు వేరు భాషల గాయకబృందాలతో పాటు నన్ను కూడా తెలుగు గాయకబృందానికి నాయకుడుగా తెలుగు పాటలు, ప్రార్థన గీతాలు, దేశభక్తి మానవతాగేయాలు పాడడానికి ఎంపిక చేశారు. ఢిల్లీ ఆకాశవాణి, ఇతర కార్యాలయాలలో కొన్ని తెలుగు కంఠాలను చేర్చుకుని నేను ఆ కార్యక్రమాన్ని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, మున్నగువారి సమక్షంలో నిర్వహించాను.

డైరెక్టర్ జనరల్ ఛేంబర్‌లోకి మరొకసారి నాకు పిలుపు వచ్చినపుడు అక్కడ గాంధీ సంఘ

సంస్థాపన అధ్యక్షులు డా॥ కె.ఎల్.రావు గారు ఉన్నారు. ఆసంస్థ కార్యదర్శి మాహూర్‌కర్ వున్నారు

విజయవాడ గాంధీ పర్వతం పైన నిత్యమూ ప్రదర్శిస్తూ వుండడానికి గాంధీజీ జీవితం పైని ధ్వని ప్రకాశినీ రూపకం, శబ్దరూపకం ఒకటి తయారుచెయ్యాలి. ఇంగ్లీషులో ఒకటీ, తెలుగులో ఒకటీ, గాంధీజీ జీవితసంఘటనల కథాకథనవ్యాఖ్యలతో, సంఘటనల రూపకీకృత శబ్దాత్మకదృశ్యాలతో సందర్భోచితంగా వేరువేరు భాషల గేయాలతో రికార్డు చెయ్యాలి. రచన ఇంగ్లీషు మూలం యు.ఆర్.రావు, దాని నాటకీకృతసంభాషణల రచన ఆంగ్లంలో శ్రీమతి శాంతా రంగాచారి (ఈమె ఫిల్మ్సు డివిజన్‌లోని భరత్ రంగాచార్యకు తల్లిగారు), ఆ నాటకీకరణకు తెలుగు అనువాదము నాది. రంగాచారిగారు తిరుచ్చి, మద్రాసులలో ఏ.ఎస్.డి గా ఉండేవారు ఆంగ్లరూపకానికి దర్శకుడు రమేశ్‌చంద్ర అనే అప్పటి ఢిల్లీ దూరదర్శన్ కేంద్రనిర్దేశకుడు. తెలుగు రూపకానికి దర్శకుణ్ని నేను. రెండు రూపకాలను ఢిల్లీ ఆకాశవాణి వాద్యబృందం సహకారంతో నేపథ్యగీత రచనా, నిర్వహణా నావి. ఢిల్లీలోని, బొంబాయిలోని నట బృందంతో రమేశ్‌చంద్ర ఆంగ్లరూపకాన్నీ, ఢిల్లీ వాద్యగోష్ఠితో నేను సంగీతాన్ని కూర్చి ఢిల్లీ బ్రాడ్ కాస్టింగ్ హౌస్ స్టూడియోలలో రికార్డు చెయ్యాలి. తెలుగు రూపకానికి కావలసిన నటీనటులను తెలుగు సినిమారంగం నుంచి నేను ఎంపిక చేసి కె.యల్.రావు గారు మున్నగు గాంధీ సంస్థ నిర్వాహకుల ఏర్పాటు ప్రకారం, ఆకాశవాణి మద్రాసు స్టూడియోలో నా దర్శకత్వంలో రికార్డు చెయ్యాలి.

రమేశ్‌చంద్రా, నేను పారితోషికాన్ని ఏమీ కోరకుండా ఈ గాంధీ రూపకాల నిర్వహణనూ, రికార్డింగును ప్రభుత్వసేవలో మేం చెయ్యవలసిన విధులుగా నిర్వర్తించడానికీ, నా మద్రాసు ప్రయాణానికీ, అక్కడ రికార్డింగ్ ఏర్పాటులకీ, డైరెక్టర్ జనరల్ నిర్దేశాలు జారీ చేశారు. ఆరు నెలలు పట్టింది పని పూర్తి కావడానికి.

ఆంగ్లరూపకంలో ఢిల్లీ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్ అల్కాజీ కథకపాత్రా, బొంబాయి నుంచి అనుకుంటా, జూల్ వెలానీ గాంధీజీ పాత్రా నిర్వహించారు. మిగిలిన పాత్రలు కూడా సమర్థులైనవారే నిర్వహించారు. తెలుగు రూపకంలో గాంధీజీ పాత్రకి శ్రీ చిత్తూరు నాగయ్య, బాలగాంధీ తల్లి పాత్రకి మద్రాసు రేడియో భానుమతీ, కస్తూరిబా పాత్రకి శ్రీమతి షావుకారు జానకీ, ముఖ్యకథకులుగా శ్రీ జగ్గయ్య, శ్రీ గుమ్మడి, స్వాతంత్ర్య ప్రతిజ్ఞా పఠనానికి శ్రీ ఎన్.టి. రామారావు మున్నగువారు నా అభ్యర్థన పైనీ, కె.ఎల్. రావుగారి కోరికపైనీ, గాంధీజీపై భక్తిశ్రద్ధలతో 'అమూల్యం'గా పాల్గొని తెలుగు రూపకం రికార్డింగ్‌కి తమ అమూల్యసేవలు అందజేశారు. ధ్వని ప్రసారకాంతి ప్రసారాల సమయోచిత సమ్మేళన ద్వారా ఈ విధంగా రూపకనిరూపణ చేసే కార్యక్రమాన్ని, సౌండ్ అండ్ లైట్ ప్రోగ్రాం అంటారు.

మన స్వాతంత్ర్యోద్యమంలో దేశవాసుల్ని ఉద్రూతలూగించిన తెలుగు, తమిళ, హిందీ, బెంగాలీగేయాలను ఎన్నింటినో ఈ రూపకం కోసం రికార్డు చేశాం. నా క్రియాత్మకచాతుర్యం వెల్లడి చేసే రెండు మూడు వాద్యగోష్ఠి రచనలు కూడా ఈ రూపకాలలో నేపథ్యావేశాన్ని కలిగిస్తాయి వాటిలో ఒకటి ఫెనిక్స్ అనే పక్షి మరణానంతరం పునర్జన్మ ఎత్తడాన్ని నిరూపిస్తుంది ఫెనిక్స్ అనే ఆశ్రమం (దక్షిణాఫ్రికా) ఘట్టంలో వస్తుంది.

గాంధీపర్వతం పైని పోర్‌బందర్ కోటా, బురుజులతో దుర్గమూ, దక్షిణాఫ్రికా లోని గాంధీజీ ఫెనిక్స్ ఆశ్రమమూ. సబర్మతీ ఆశ్రమమూ, సేవాగ్రాం ఆశ్రమమూ, చిన్నచిన్న కట్టడాలుగాకట్టి, వాటి లోపలా, బయటా విద్యుద్దీపాలు వెలుగుతూ, ఆరుతూ వుంటే. ఆడిటోరియంకు నాలుగు వైపులా స్టీరియో పద్ధతిని శబ్దరూపకంలోని సంభాషణలు వస్తూంటే, పాత్రలు ఎదురుగా నటిస్తున్న భ్రమగొలిపే పద్ధతిని, ఈ రూపకానికి హాలండ్ ఫిలిప్స్ కంపెనీవారు శబ్దశ్రవణ, విద్యుద్దీపచాలనాలు సన్నిహిత సంబంధం వుండేటట్లు సమకూర్చారు.

ఏటంబరో నిర్వహణ పైని బెన్‌కింగ్స్లే గాంధీజీగా తర్వాత ఇటీవల ఆంగ్ల హిందీ భాషలలో వచ్చిన సినిమా సినేరియోకూ, మా ధ్వనిరూపకానికీ సినేరియోలోనూ, శాబ్దికదృశ్యనిరూపణలోనూ చాలా పోలికలు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. వాన లేని సాయంత్రాల్లో విజయవాడ గాంధీ కొండ పైని ఈ రూపకప్రదర్శనను ఇప్పటికీ విని ఆనందించవచ్చు.

96. వోలేటి

వోలేటి వెంకటేశ్వర్లు

- 1941 ల్లో స్టాఫ్ ఆర్టిస్టుగా ఉన్నప్పుడు హైస్కూలు ప్రోగ్రాములకు సహాయకుడిగా ఉండేవాణ్ణి. ఆ ఉన్నత పాఠశాల కార్యక్రమంలో సంగీత పాఠం మాత్రం బెజవాడ నుంచి రిలేఅయ్యేది. పాటపాడి వాని వివరణ మాటల్లో చెబుతున్నది అచ్చం రజని వాయిస్‌లా ఉండేదేమిటని ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆశ్చర్యపడేవారు. నిజానికి అదంతా ఓలేటి గాత్రమహిమే. ఆనాటినించి నాకు ఓలేటితో మమైక్యం ఏర్పడిపోయింది. అయితే ఓసారి హఠాత్తుగా ఓలేటి పాటను నిలిపివేసారు. 1945 ప్రాంతంలో మద్రాస్‌కి ఆవిధంగా వచ్చేసారు. ఓలేటి. మైలాపూర్‌లో ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్ ఇంటి సమీపంలో ఉంటూ పానగల్ పార్కు వంటి ప్రాంతాల్లో కనిపించేవారు. బడేగులాం అలీఖాన్ మద్రాసులో కచ్చేరి చేస్తున్న రోజులు అవి. శ్రోతలు ఎవరో చెప్పగా ఓసారి బడేగులాం అలీఖాన్ సాహెబ్ ఓలేటిని పిలిపించుకుని కొన్నిపాటలు, భజనలు విన్నారు. ఆయనే ఓలేటిని "ఛోటేగులామాలీ ఖాన్" అని పిలిచేరు.

నేను, శ్రీ వాత్సవ మద్రాసులో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా సంగీత నాటకాల ఇన్‌ఛార్జిగా వేయినొక్క రాత్రుల కథలు (షహరజాద్‌నాటకం), లైలామజ్నూ షిరీన్ ఫర్‌హాద్ వంటి పంజాబీసంగీతపు వరసల్లో పాటలు కేజువల్ కళాకారుడిగా నేనూ రాస్తోంటే శ్రీవాత్సవ నాటకం పూర్తి చేసి ప్రొడ్యూస్ చేస్తుండేవారు. వాటిలో పాల్గొనడానికి ఓలేటి, ఘంటసాల అపుడు మద్రాస్‌లో ఉండేవారు.

1956 ప్రాంతంలో ఓలేటిని మళ్ళీ సంగీత సహాయ నిర్వాహకుడుగా విజయవాడ కేంద్రంలో నియిమించడం జరిగింది. అప్పటికి నేనూ బెజవాడకు చేరుకున్నాను. అక్కడ కూచిపూడినాటికల సుస్థిర ప్రాశస్త్యాన్ని నెలకొలిపేందుకు సంగీతం విషయంలో ఓలేటితో, సాహిత్య విషయంలో పింగళి లక్ష్మీకాంతంగారితో, ఆహార్యరంగస్థల సౌకర్యముల సముద్ధరణకు బందా కనకలింగేశ్వరరావు గారి తోనూ నేను సహకరించి ఆనందించాను.

97. మానాన్నగారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీలో విశిష్ట సభ్యత్వ ప్రదానం

అది 1967వ సంవత్సరం ఆకాశవాణి కర్సియాంగ్‌లో ఏ.ఎస్.డీ (ఉపనిర్దేశకుడుగా) ఛార్జి తీసుకున్నాక, సెలవుపెట్టి, పిఠాపురం వచ్చి, మానాన్నగారిని తీసుకుని హైదరాబాదు చేరుకున్నాను. అది 1967 వ సంవత్సరం, జనవరి ఏడవతేదీ! నేనూ మా నాన్నగారూ హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్‌లో శశాంక యింటిలో దిగాము. శశాంక భార్య హైమవతి, కుమారులు చిరంజీవులు పార్వతీశమూ, రామభద్రమూ కాలేజీ, స్కూలు చదువులు చదువుకుంటున్నారు.

సభా సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీసభ - ఆంధ్ర సారస్వత పరిషత్తు (బొగ్గులకుంట) లో జరిగింది. ఆ సమావేశానికి అధ్యక్షులు డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు, మా నాన్నగారికి విశిష్ట సభ్యత్వ పట్టప్రధాన ఉపన్యాసకులు డా॥ దివాకర్ల వెంకటావధానిగారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

విశిష్టసభ్యత్వ ప్రదాన సమావేశము

7-1-1967

శ్రీ బాలాంత్రపు వేంకటరావు గారిని గూర్చి

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి

అధ్యక్షతను

డాక్టర్ దివాకర్ల వెంకటావధానిగారు చేసిన ప్రశంస

శ్రీ బాలాంత్రపు వేంకటరావుగారు

ఇరువదవశతాబ్ది యారంభమున మధురప్రసన్నమైన కవిత్వము చేతను, పుంఖానుపుంఖముగా వెలయించిన నవలా నాటకముల చేతను ఆంధ్రలోకమున పూర్వ సారస్వత చైతన్యముచే నుజ్జ్వలతలూగించి సుగృహీత నామధేయమైన వేంకటపార్వతీశ్వర కవియుగ్మమున ప్రథములు శ్రీ బాలాంత్రపు వేంకటరావుగారు. ప్రాగ్గోదావరీ మండలము నందలి పిఠాపురమునకు సమీపమునఁగల మల్లాంలో జన్మించి (2-1-1881) సంప్రదాయసిద్ధముగా నాంధ్రగీర్వాణ

కావ్యముల నభ్యసించి, బహునవలానాటకకర్తలై, కవికులాలంకారులై, కృతిభర్తలై, ప్రభుత్వము చేతను, పండిత పరిషత్తుల చేతను, సంస్థానాధీశ్వరుల చేతను, సగౌరవముగా సత్కరింపఁబడి, ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయ సంస్థాపకులై, ఆంధ్రసారస్వతమునకును, తద్వారా ఆంధ్రప్రజానీకమునకును అపార సేవ కావించిన కవిరాజహంసలు శ్రీ బాలాంత్రపు వేంకటరావుగారు.

అధునికాంధ్రదేశమున పలువురు జంటకవు లేర్పడినను నిజముగా నా నామమున కర్హులై ఆంధ్రశారద కనవరత వరివస్యనాచరించిన వారిర్వురు ముప్వురుకంటె నెక్కువమంది లేరు. వారిలో శ్రీ తిరుపతివేంకటకవుల సరస నాసీనులు కాఁదగిన వారు శ్రీ వేంకటపార్వతీశ్వర కవులు వారిరువ్వురిలో నెవ్వరిని గూర్చియేది చెప్పినను అది యిర్వురికిని సమముగా నన్వయించునట్టిదే

వారు కావ్యములు కల్పించిరి, నవలలు వెలయించిరి. నాటకములు నిర్మించిరి, అన్నిటికన్న మిన్నగా నాంధ్రప్రచారిణీ గ్రంథనిలయమును స్థాపించి యందు శతద్వయాధిక పద్యగద్య రచనలు ప్రకటించి జనసామాన్యమున కాంధ్రసారస్వతముపై మేదురమైన యాదరము కలిగించిరి ఈ గ్రంథనిలయము ద్వారా వారొనరించిన యాంధ్రసారస్వత ప్రచారము సంతత స్మరణీయమైనది.

శ్రీ వేంకటరావుగారు రచించిన రూపకములలో ధనాభిరామసతీనంయుక్తాదులు ముఖ్యములైనవి. అవి రసపాత్రపోషణ సంవాదసౌందర్యముల కాలవాలములు. వారి పద్యకావ్యములలో ఏకాంతసేవ మొదట పేర్కొన దగినట్టిది. అది ఆంధ్రమునందలి భావకవితారీతికి శ్రీకారము చుట్టిన సరససుందర గీతికావ్యము. వారి కావ్యకుసుమ హారావళు లెంత సరసము లైనవో అంత రసప్రపూర్ణము లైనవి. బృందావన మను ప్రబంధమందును, భావసంకీర్తన మను భక్తికావ్యమందును, రత్నహార శ్రీరామ రాజనీతులందును వారి కవితాలతాంగి వింత విభ్రమములు ప్రదర్శించినది. వారి జాతీయగీతము దేశభక్తి కాలవాలము. వారు రాజభక్తియను పద్యకావ్యమును పట్టాభిషేకసమయమున పంచమ జార్జి చక్రవర్తి కంకితముచేసి ప్రభూతగౌరవసత్కారములందిరి. రసమునకు ప్రసాదగుణమునకు, ధారాశుద్ధికి తత్త్వోపదేశమునకు, పదప్రయోగలాలిత్యమునకు భావగాంభీర్యమునకు పట్టుఁగొమ్మలై వారికావ్యములు ముట్టినవారినెల్ల మైమఱపించును.

దశసహస్రపద్యప్రమితముగా నిర్వచనముగా రామాయణ మహాకావ్యమును రచించుటచే శ్రీ వేంకటరావుగారిప్పుడు విద్యావిజ్ఞానములందపర వల్మీకసంభవులై విరాజిల్లుచున్నారు.

శ్రీ వేంకటపార్వతీశ్వరకవుల నవల లాంధ్రదేశమున నాబాలగోపాల విదితములు. అందుకొన్ని

అనువాదములు, కొన్ని స్వతంత్రములు. భాషచే, భావములచే, కథాకథన కామనీయముచే, పాత్రపోషణ పాటవముచే నారోజులలో నవి ఆంధ్రప్రపంచమందగ్రగణ్యములై యలరారినవి. సురసావసుమతీవసంతములతో నారంభించిన వారి నవలా పరంపర సుమా రఱువది దెబ్బదివఱకు సాగి బహుజనపఠితమై బహుపరీక్షలకు బహువారములు పాఠ్యమై ఆంధ్రదేశము నానంద పరవశముగావించినది. స్వతంత్రములు ననూదితములు వైవిధ్యశోభితములునైన పెక్కు నవలలు రచించి ఆంధ్రమున నాజాతి సారస్వతమున కారంభమున నపారాభ్యుదయము కలిగించినవారు శ్రీ వేంకట పార్వతీశ్వరకవులే.

వేంకటపార్వతీశ్వర కవులు నవలలనేకాక పెక్కు గద్యకావ్యములను కూడ రచించియుండిరి. అందు శివపురాణమును బ్రహ్మపురాణమును గణనీయము లైనట్టివి

వారు సృష్టించిన బాలవాఙ్మయము పలువురి ప్రశంసలకు పాత్రమైనది. అరోజులలో వారు రచించిన బాలగీతావళులను పఠించని బడిపిల్లలు లేరనుట సత్యదూరముకాదు. బాలబాలికలకై వారు సరళసుందరవచనమున రచించిన రామాయణ, భారత, భాగవతములు బొమ్మలతో కూడ ముద్రితములై బహుళప్రచారము నందినవి.

వేంకటపార్వతీశ్వరకవులు కృతికర్తలేకాక కృతిభర్తలుకూడను. షష్టి పూర్త్యుత్సవ సందర్భమున పూజ్యులు శ్రీ శివశంకర స్వామివా రా జంటకవులకు తమ కృతికన్య నర్పించి యావిధముగనైన యల్లుండ్రులేని లోపము తీర్చుకొనిరి.

శ్రీ వేంకటపార్వతీశ్వరకవులు పొందిన గౌరవసత్కారము లనేకములు. సుమారు నలువది యేండ్ల క్రింద నరసారావుపేటలో నాంధ్రసారస్వతపరిషత్తు మహాసభాముఖమున వారిని కవిరాజహంసబిరుదము నొసంగి గౌరవించినది. షష్టి పూర్త్యుత్సవ సందర్భమున శ్రీ శాంతి రామమూర్తి పంతులవారి ఆధ్యక్ష్యముతో రాజమహేంద్రవర మందు జరిగిన మహాసభలో ఆంధ్రప్రజలు వారిని కవికులాలంకార బిరుదవిభ్రాజితులఁగావించిరి. ఆంధ్రదేశమందలి సంస్థానాధీశ్వరులు వారిని పలుసార్లు గౌరవపురస్సరముగా నాహ్వానించి అర్చనసత్కారము లాచరించిరి. ఆంధ్రభోజులు శ్రీ పీఠాపుర మహారాజులుంగారు వారికి ప్రతి మాసము శతరూప్యములు పారితోషకముగా నొసంగి తమ వదాన్యతకు వన్నె దిద్దుకొనిరి. కేంద్రప్రభుత్వముకూడ నట్లే శ్రీ వేంకటరావుగారికి మూడేండ్లు ప్రతిమాస శతరూప్య పారితోషకము నొసంగి తన ఔచితీపరిజ్ఞానమును ప్రకటించుకొన్నది.

శ్రీ వేంకటరావుగారు విద్యావయోవృద్ధులు. ఆధునిక కవులలో పలువురికి పరోక్ష

గురుపుంగవులు కవిరాజహంస సార్థకబిరుద విభ్రాజమానులు.

కవులేకాక కథకచక్రవర్తులు, పండితులేకాక పరతత్త్వవేత్తలు, సంప్రదాయజ్ఞులేకాక సకల నూత్నప్రక్రియా ప్రియులు. పండిత పామర బాల వృద్ధజన మనోరంజనచణ రచనా ప్రవీణులు

అధ్యక్షమహాశయా! ఏతాదృశ గుణగణభూషితులైన శ్రీ బాలాంత్రపు వేంకటరావుగారి కాంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమీ విశిష్టసభ్యత్వముతోపాటు తచ్చిహ్నమైన అమూల్యాంబర స్వర్ణపతకములను గూడ సమర్పింప వేడుకొనుచున్నాను

98. 1967 లో డార్జిలింగ్ జిల్లాలోని కర్సియాంగ్ ప్రయాణం

1967 లో నన్ను సహాయ నిర్దేశకుడుగా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చెయ్యటం

1965లో ఉత్తర సరిహద్దులో చైనా యుద్ధం జరిగిన తర్వాత అక్కడ ఉన్న వేరు వేరు ప్రాంతీయ భాషలలో (బెంగాలీ, నేపాలీ, సిక్కిమీస్, భూటానీస్, లెప్చా, (గుర్ఖా) మొదలైన ప్రజలలో చైనా పట్ల, చైనా పరిపాలన పట్ల వ్యతిరేక భావంకలిగే ప్రచారం చేయడానికే ఆయా ప్రజలు ప్రాంతీయ భాషలలో వార్తా ప్రసారమూ రాజకీయవిధానాల స్పష్ట ప్రకటనమూ చెయ్యడానికి ఏర్పాటయిన షార్ట్‌వేవ్ దూర ప్రసారమాధ్యమం - కర్సియాంగ్ రేడియో కేంద్రం దురాక్రమణచేసిన చైనా మన భారతీయ ఈశాన్య ప్రాంతాల్ని వశపరచుకొని, చేస్తున్న రాజకీయ ప్రచారాలకు జవాబుగా ఆప్రాంతాల ప్రజల భాషలలో ప్రచారం చెయ్యడానికి ఈ రేడియో కేంద్రాన్ని నెలకొల్పారు ఆ ప్రాంతానికి నన్ను అధికారిగా బదిలీ చెయ్యడం రాజకీయ ప్రయోజనం కోసం చేసిన బదిలీ అప్పుడు నేను ఆ కేంద్రంలో అధికారిగా పనిచేస్తూ అక్కడి ప్రసారకులద్వారా చెయ్యవలసిన ప్రచారం చేస్తూ అక్కడి రమ్య మనోజ్ఞ దృశ్యాలను రెండు పాటలలో నిబంధించాను అవి ఇవీ

రండి కర్సియాంగ్ ఇటె వెళ్ళాలి డార్జిలింగు
ఈ కొండ దారమున గుచ్చిన రెండు పూస లోకే రంగు!
ఏది మీటినా వినబడునోకే హిమాలయపు పాట,
లామా గుడి గంట మారు మోగు కొండ, లోయ, బాట!!
రండి!!
పొగ జిమ్ము "బొమ్మరైలు" పైని - "కొండ బండి దారి"
కుడి యెడమ మలుపులూ సుడులూ గడిచి మిన్నులూరి

ఇరు పక్కల ముంచెత్తే పొగ మంచు తెరల నడుమ
పొంగారు జీవితంపు కొండ పల్లెలు రంగారి పాడమ!!
రండి!!
అకుపచ్చ గుబురుల తేయాకు తోట మడులు,
తేకుమాకు పటాలాలు తాకెడు ఇరు గెడలు,
వలిగాలి పులకలూర, మబ్బు కౌగిలి తమిదీర,
నీరెండ మురిసి, వాన తడిసి,
యాత్రలో ఖులాస మీర! రండి!
వంగేటి వీపునంటి బరువు వేలాడేటాడు
తలకు తగిలించి తరలిపోవు "లేప్ప" కూలివాడు,
ఇదె వచ్చు దౌరఘుర్వల్ ధరియించి ఠీవిగాను
మహేంద్ర ట్రోపిపై ఖుక్రీ మెరసే గూర్ఖా జవాను!! రండి!!
తలపులో నిలుచు నవ్వు కనుల
నేపాలీ పడుచు
ముంగురుల కత్తిరించి వెనుక కురుల జారవిడుచు,
టైట్ ప్యాంటుల టీ షర్ట్ బిగించు యువకుల నిటకాంచి,
ట్విస్టింగ్ హిప్పీల ననుకరించు
ఆట పాట లానందించ !! రండి!!
ఇట చూడరండి తెల్ల గౌన్ల ఈశతత్త్వ విదుల
జెసూట్ ఫాదరుల నిర్మల మానవ సేవా నిధుల!
వినయ ధనులు, బౌద్ధ మునులు కాషాయాంబరధారులు,
శాంతమూర్తులరుగొ మంత్ర చక్రము తిప్పే సూరులు!!
రండి
మార్వారీధనికులను బిహారీ వ్యాపారులను
టిబెట్ హస్తశిల్పుల వంగీయో ద్యోగులను
అరుదైన రజనికాంతుబోలుప్రవాసికవివరుల
బ్రదుకులో విసుగుమరవజేయు సార్థక కృషివరుల గలియ॥ రండి కర్సియాంగ్॥
(1966లో అకాశవాణి కర్సియాంగ్‌కు బదిలీ అయినప్పుడు అక్కడ పాడినది)

మంచుమల పాట
(కాంచనజంఘ పర్వతప్రాంతం)

ఇది ఉంద చుట్టుకునే కొండచిలువ మడతదారి
కొండపై కొండ దాటిపోవ కొనకు చేరుఊరు! ఇది॥
లోయలోనిండి రాసులౌచు లేచే పొగమంచు
మోపుమోపులై మబ్బులన్నిదెసల మోహరించు॥ ఇది॥
సాగిపోయేటి మబ్బులందు నగము తొంగిచూచు
చల్లనౌ మంచుకొండ కొసల వెండిమెరపుతోచు ॥ ఇది॥
ఇటమంచువెన్నముద్దమేయు దిగ్గజాలదండు
ఈకాంచన జంఘకు చుట్టూ ఈకొండల పిండు॥ ఇది॥
ప్రతికొండకు తేయాకు గుబురు మరకతపు తివాసి
నభమంటు కరికరాల కోనిఫరాస్ వృక్షరాజి ॥ఇది॥
ఇరుపక్కల పొదలందు పూయునెన్ని రంగుపూలు॥
సేమంతి, సూర్యకాంతులు షివులీ, స్థలకమలాలు॥ ఇది॥
మైగగురుపొడిచి వణికించే వలిలీవలితావు
మెండయిన యెండ చెమటబొట్టులీతావునరావు ॥ఇది॥
పగలు రేయనక లోయ, కొండ, వర్ష ధారముంచు
ముసురువిడి అన్ని దెసల అల్లుకొను పొగమంచు ॥ ఇది॥
ప్రతిమ్రాకుకు ప్రతిమనిషికి చుట్టూ ఒక పెనుకప్పు
కప్పువిడిరేపు మాపు కాస్త సేపవు కనువిప్పు । ఇది॥

కర్సియాంగ్ - 2 (1967-68)
(రండి కర్సియాంగ్, కాంచన జఘుల పాటలయాక)

ఆ రెండు పాటలలో మొదటి పాటలోది - కర్సియాంగ్‌లో మొత్తం ప్రజల ఆటపాటలానందించే యౌవన వయోవిలాసస్వభావం. రెండోది కేవలం కాంచనజంఘపర్వతప్రాంతపు హిమాలయ ప్రకృతి స్వభావాన్ని చిత్రించే పాట.

కర్సియాంగ్‌కు మొదట నేనొక్కడినే వెళ్ళాను! అంటే, కుటుంబాన్ని తీసుకెళ్లలేదన్నమాట ఆ ఒంటరితనంలో ఎవరెవరో కింది ఉద్యోగులు నా చుట్టూ మూగేవారు. ఎక్కడెక్కడికో తీసుకువెళ్లేవారు.

రాజరాజేశ్వరీ హాల్ వెనుక పేటలో ఒక చిన్న ఇంజనీరు ఇల్లనుకుంటాను. అతని భార్యకు కలకత్తాలో సినీమాల్లోనటించాలని ఆశ ఉండేది. అయితే అప్పటికే ఆమెకి చుట్టుపక్కల పెద్దరద్దీ అంతా రకరకాల మత్తుపానీయాలు తాగేరంధీ నన్నూ - పుచ్చుకోమని బలవంత పెట్టేవారు.

సినీమా నాయికా పాత్రధారిణి చేతిలో రకరకాల స్వీట్సు పెట్టి రష్‌గుల్లాలూ, షోందేశ్‌లూ నన్ను ఆకర్షించడానికి నాచేత ఒక స్వీటుకొరికించి. ఆ మిగిలిన యెంగిలి సాహం తాను నమిలి మింగుతోంది.

నాకు ఆదృశ్యం ఒక్క దృశ్యనాయిక, ఆమెకు చుట్టూ పలువురు దృశ్యనాయకులుగా కనబడ్డారు ఆదృశ్యం నన్నాకర్షించడానికి బదులు వెగటు కలిగించింది. సార్, సార్, ఎసిబెన్, అని వాళ్లు నా వెంట పడ్డారు. నేను అక్కడినుంచి పారిపోయి వచ్చేసాను. తిన్నగా బజారుకివచ్చేసి, అక్కడనుంచి ఇంటిదోవపట్టాను.

"జిగివాలుచూపు నగవులతో
మగువకులుకుతో
బిగిత్రాటి వలలు పైకివిసరి
సొగసులొలుకుతూ
భ్రమయించు దురాశాభామిని
పిలుపులువిననీకు!
బిగియించి వలపుకోటతలుపు
దరియగరానీకు
ఆశానాప్రాణసఖీ ప్రభాతతారా
దగ్గరగారా మరీ దగ్గరగారా ఇంకా దగ్గరగారా॥
కడగండ్లనడుమ జడతపాదమ
మేలుకొలుపుమా
దిగులొందుహృదయ మందిరాన
దివ్వెనిలుపుమా!!
ఆశానాప్రాణసఖీ ప్రభాతతారా
పాణిగృహీతదారా, నామధురభావధారా
దగ్గరగారా, మరీదగ్గరగారా, ఇంకా దగ్గరగారా॥"

అపాట పూర్తిచేసి, వెంటనే విజయవాడలో ఉన్న మా ఆవిడ సుభద్రకి పోస్ట్ చేశాను ఇంకా ఏవేవో రాశాను.

మై గగురుపొడుచు శీతుగాలి తెరలదాడిలో నాగుండె వ్రీల నవయజేయు కలలపీడలో నన్నొడిసిపట్ట వెన్నాడు నిరాశా కామినిని నెన్నడుము విరుగతరుమవో

నామేను నిమురవో!! = ఆశా!!

దగ్గరగా రా, మరీ దగ్గరగా రా! ఇంకా దగ్గరగారా!!

ఆఫీసుకు వెడితే నా గదిలోకి వచ్చి నాకు నమస్కరించి, వీపుచూపకుండా వెనక్కు నడిచిపోయే టిబెటన్ కార్యక్రమనిర్వాహకుడు "నోనోరింపొచే"

"ముంగురులు కత్తిరించి వెనుకకురులు జారవిడుచు తలపులో నిలుచు నవ్వుకనుల నేపాలీ పడుచు"

నేపాలీ పడుచులేకారు, సిక్కిము, భూటానీ, టిబెటన్ పడుచులంతా అదేఫ్యాషన్

ఒకటి రెండు రోజులలో, మాడైరెక్టర్ సెలవు నుంచి తిరిగివచ్చి జాయిన్ అయాడు. నేను సెలవుపెట్టి, విజయవాడవెళ్లి మా ఆవిడనీ చిరంజీవులనీ కర్సియాంగ్‌కు తీసుకొచ్చేశాను

బీహార్ భూకంపబాధితుల సహాయార్థమై ఒక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించాను. అందులో జల్పైగురి నుంచి ఉత్తరబంగ సంసద్ (లోడ్) పాల్లీకళాకార్‌ల సంఘంలో నృత్యంచేసే నటీనటుల ప్రయోగానికి నాపాటకూడా తోడు చేశాను. జయదేవుడు, పద్మావతికి క్షమాపణ కోరుకుంటాడు తాను అన్యనారీ బృందం మధ్య ఆమెకు కనబడితే, ఆమె కోపగించివెళ్లి పోతుంది

"మామియంచలితావిలోక్యవృతంపధూనిచయేన
సాపరాధతయామయాపినవారితా అతిభయేన
హరిహరి హతాదరతయాసాగతా కుపితేవ॥
వదసియది కించిదపి దంతరుచికౌముదీ
హరతుదరతిమిరమతిఘోరమ్
ప్రియేచారుశీలే ప్రియేచారుశీలే
ముంచమయిమాన మనిదానం॥
నపదిమదనానలోదహతిమమమానసం

దేహి ముఖకమలమధుపానం
ప్రియేచారుశీలే ప్రియేచారుశీలే"

అదృశ్యం జయదేవుని అష్టపదులలో అత్యంత రసాన్వితమయిన ఈ గేయంతో పూర్తవుతుంది.

99. స్వామి ప్రజ్ఞానానంద

అప్పుడు డార్జీలింగ్‌లో వున్న స్వామి ప్రజ్ఞానానందతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి అయనను కలియగా బెంగాలీలో వారు రాసిన రచనలను "భారతీయ సంగీతేర్ ఇతిహాస్" "రాగ్ ఓరూప్" లలో ఏదైనా నాకు కావలసినప్పుడు నేను అనువదించుకోవచ్చని స్వామి ఆశీర్వాదపూర్వకంగా సెలవిచ్చారు.

100. మానవల్లి రామకృష్ణకవి - లీలావతీ పరిణయం

కీ.శే. శ్రీ మానవల్లి రామకృష్ణకవి

నేను 1948 లో తిరుపతివెళ్ళాను. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగార్ని కలిసేను. ఓరియంటల్ మేన్యుస్క్రిప్ట్సులైబ్రరీలో వారిపైవారు (సీనియర్) అయిన శ్రీమానవల్లి రామకృష్ణ కవిగార్ని కూడా కలిసేను. వారు లీలావతీ పరిణయం అనే ప్రాకృత గ్రంథాన్ని తెలుగు లిపిలో వ్రాస్తున్నారు. తరువాత దానినే తీసుకుని తెనిగించాను కథ శ్రీశాతవాహన చక్రవర్తికి సింహళ రాకుమారి లీలావతితో జరిగిన వివాహమును గూర్చి శాతుడనే గంధర్వుడు సింహంరూపంలో ఈ చక్రవర్తికి వాహనమవడం చేత ఇతను శాతవాహనుడయ్యాడు. సింహళరాకుమారి ప్రాకృతభాషను మాట్లాడేది. శ్రీ శాతవాహన చక్రవర్తికి మరొక భార్య కోనసీమ వాసిని. ఈమె భాష సంస్కృతము. ఈమెతో రాజు ఒక కొలనులో

జలక్రీడలాడుతూ ఆమెపై నీళ్ళను కొట్టుతుండగా ఆమె రాజన్ "మోదకైః తాడయ" అంటుంది అనగా "మా, ఉదకైః తాడయ" వద్దు, వద్దు నీళ్లతో కొట్టకు అని ఆరాజు వెంటనే మిఠాయి ఉండలను మోదకములను తెప్పించమని ఆజ్ఞాపించి వాటితో కొట్టడానికి సిద్ధపడ్డాడు. ఆరాణిగారు ఫక్కున నవ్వి నేను నీళ్ళతో కొట్టవద్దన్నాను మీకు మోదకములతో కొట్టమన్నట్లు అర్థమయిందా అని వెటకారం చేసింది. రాజువెంటనే ముఖం ముడుచుకుని వెళ్ళిపోయాడు మర్నాడు రాజసభలోనాకు చాలాతక్కువ సమయంలో సంస్కృతభాషను నేర్పగల వారున్నారా అని అడుగుతాడు. ఒకరు మూడు సంవత్సరాలు పడ్తుందంటారు. మరొకరు నేను రెండు సంవత్సరాలలో నేర్పగలనంటాడు. చివరికి ఒక పండితుడు లేచి నేను తయారు చేసిన ప్రణాళిక ప్రకారం ఆరు నెలల్లో నేర్పగలనంటాడు. ఆ సభలో గుణాఢ్యుడనే పండితుడు "ఆరు నెలల్లో నేర్పడం అసాధ్యం అలానేర్పిస్తే నేను రాజదర్బారు వదలివెడతాను సంస్కృతంలో ఏకావ్యమును వ్రాయనం"టాడు అనుకున్న ప్రకారం రాజుగారు సంస్కృత పండితుని శిక్షణలో ఆరు నెలల్లో సంస్కృతం నేర్చుకుంటారు. గుణాఢ్యుడతని ప్రతిజ్ఞ ప్రకారం రాజుగారి కొలువును సభను వదలివెళ్ళి అడవులలోకి వెళ్ళిపోతాడు. అక్కడ ప్రచారంలో నున్న పైశాచిక భాషలో లేఖినితో తన తొడనుంచి రక్తమును తీసి ఒక గ్రంథమును వ్రాస్తాడు. ఆపైశాచికభాష తెలుగు బాష అవిధంగా ఆవిర్భవించింది

సింహళరాకుమారితో జరిగిన వివాహగాథ "లీలావతీ పరిణయం".

101. మానవల్లి రామకృష్ణకవి - చతుర్భాణి

శ్రీమానవల్లి రామకృష్ణ కవిగారు 1922లో సంస్కృతం లోని ఏకనటాత్మక ఏకాంకికలను నలుగురు ప్రాచీనకవులు వ్రాసిన చతుర్భాణిని పరిష్కరించి ఈయుగా ఆగ్రంథాన్ని పాట్నాలో ప్రచురించారు. భాణము అంటే ఏకాంకిక. ఈ కథలు జరిగిన స్థలం వేశ్యావాటిక. వీటిని నేను 1967 - 68 సంవత్సరాలలో డార్జిలింగ్ వద్దగల కర్సియాంగ్ స్టేషన్ డైరెక్టర్‌గా నున్నప్పుడు తెనిగించాను.

అవి

1. వరరుచి ఉభయాభిసారిక (ప్రణయకలహాలతో విడిపోయిన ప్రేయసీ ప్రియులను వారిమిత్రుడు తన ఇంటికి పిలిచి కలిపిన సంఘటన)

2 శూద్రకుని తామరపువ్వు కానుక దీనినే విజయవాడ స్టేషన్ డైరెక్టర్‌గా నున్నప్పుడు శ్రీఆచంట జానకిరాం గారికి అంకితమిచ్చాను.

3. ఈశ్వరదత్తుని ధూర్తవిటసంవాదం. దీనిని అప్పుడు హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్‌గానున్న డా॥ బాలగురుమూర్తిగారికి అంకితమిచ్చాను ఈ మూడు నాటికలు వెనుక భారతిలో ప్రచురించబడ్డాయి.

4. సామిల్లకుని పాదతాడితకము (తలదన్నుముచ్చట)

102. ఆంధ్ర ఉద్యమం (1971)

"గురువులన్న పెద్దలన్న తిరస్కారము
నామం పెట్టక పోవడమే నమస్కారము"

నవంబరు 12, 1971లో నెహ్రూ పుట్టినరోజు జ్ఞాపకంగా ముందుగా ఆవేళ "మూలస్తంభాలు అనే పాటలతో కూడిన నాటకం రేడియో ఆవరణ రంగస్థలంపై ప్రదర్శింపజేసెను. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం జరుగుతున్న రోజులు గనుక విద్యార్థులపై, రేడియో ఉద్యోగులపై, అందరిపై ప్రభావం పడింది. నాటకం నిర్వహణ, కార్యక్రమ నిర్వహణ అన్నీ పోలీసు ఎస్కార్టు సాయంతో సాగేయి చివరికి జెండా ఉత్సవము సహితం జరగనివ్వని ఆందోళన సమయంలో రిమోటు కంట్రోలు లాగ నేను వ్యవహరించాను. అటు నాటకం మఫ్టీపోలీసుల సాయంతో ఇటు జెండా ఉత్సవం దిగ్విజయంగా నిర్వహించాము. డ్యూటీ సమయంలో ఆఫీసులోనే ఉండిపోయాం. ఉద్యమకారులు ఎగబడివచ్చి రేడియో ప్రసారాలకు అంతరాయం కలిగించాలని నన్ను ఇతర అధికారులను బెదిరించారు. అయినా కార్యక్రమం చక్కగా ఉండేలా నిర్వహించాము. ట్రాన్సిమిటర్ల దగ్గరకు కేజువల్ ఉద్యోగులను, ఇంజనీర్లను పంపి బెదిరింపులకు భయపడకుండా కార్యక్రమాల ప్రసారం సాగించేము. భోజనాలు వసతి అంతా రేడియో స్టేషనులోనే. ప్రత్యేక అధికారులు నాయి కార్యక్రమం కళ్ళారాచూసి అభినందించారు.

ఒకదశలో ఆంధ్ర ఉద్యమకారులు మాయింటికి వచ్చి టెలిఫోన్ లైన్లు తెంపి వేసారు. నేను ఢిల్లీ అధికారులను ఫోనులో హెచ్చరిస్తూనే ఉన్నా ఉద్యోగులు పనులకు హాజరుకాలేక పోవడంవలన, అక్కడ ఉన్నవారిలో ప్రయాగ రామకృష్ణని పిల్చి, పాస్ ఇచ్చి ఎనౌన్సరుగా తీసికున్నా అతనే తర్వాత అర్చివ్స్‌కి ఇన్‌ఛార్జిగా ఉండిపోయారు.

103. చలం కలం వెలుగులు (1971)

ముప్పయియేళ్ల నుంచి, రేడియోని చలమూ, చలంగారిని రేడియో ఒకరినొకరు బహిష్కరించుకున్న పరిస్థితినుంచి, నేను నా వ్యక్తిగత స్నేహభావాన్ని నా పట్ల చలంగారికి గల అవ్యాజ వాత్సల్యాన్నీ వినియోగించుకుంటూ ఆయనతో ఇంటర్వ్యూ ఒకటి రికార్డు చేసుకొస్తాననే ఆశయంతో అహ్మదాబాదునుంచి డైరెక్టర్‌గా విజయవాడకు మా డి.డి.జి. బి.కె.రావుగారు నన్ను బదిలీచేశారు 1971లో.

అంచేత నేను విజయవాడకు రాగా బదిలీ అయిన కొన్ని వారాలలోనే తిరుపతిలో జరుగుతున్న అన్నమాచార్య జయంత్యుత్సవ కచ్చేరీలను, ఉపన్యాసాలను రికార్డు చేసుకుని, ఒక యువ ఇంజనీరునీ, రికార్డరునీ కూడా తీసుకెడుతూ, తిరుపతి నుంచి మద్రాసుమీదుగా తిరువణ్ణామలై చేరుకున్నాడు. వస్తున్నాడు. మీదగ్గరికి ఆ చలంగారి ఒక కార్డు ద్వారా! ఒక ఇంటర్వ్యూ చలంగారితో తీసుకోవాలని ఉద్దేశం. ఆయన "రా". చలం అని ఒక వర్డు వ్రాశారు. ఆతిధ్యం తిరువణ్ణామలైలో చలంగారి ఆశ్రమంలోనే మర్నాటి పొద్దుటే రికార్డరు తీసుకుని ఇంజనీరుతో సహా చలంగారి బసకి వెళ్లాను. ఏమీ ముందస్తు ప్రిపరేషన్ లేదు. ప్రశ్నలతయారీ ఏమీ లేదు!

ఆయన - తన పాఠకులకు, రేడియో శ్రోతలకు తానిప్పుడు అరుణాచలం వెళ్లిపోడం గురించి ఏమీ సముజాయిషీ చెప్పకో అక్కర్లేదనీ, వెనక తను ఏమేమీ వ్రాశారో అవ్రాతలనే ఇప్పుడు మళ్లీ ఇంకా తీవ్రంగా వ్రాయవలసి ఉంటుందనీ, అప్పటికీ ఇప్పటికీ స్త్రీలను గురించి, పురుషుల విషయంలో ఏమీ మార్పురాలేదని అలాగే తన పాత్రలు శశిరేఖ, అరుణా, మైదానంలో కథానాయికా వీళ్ళంతా కూడా ఇప్పటికే తనకి ఎంతో ఇష్టమైన పాత్రలనే చెపుతారు. అలాగే తాను వ్రాసేరోజులలో ఎంత తీవ్రమైన తిరుగుబాటు ధోరణిలో వ్రాసేవారో ఇప్పటికీ అంటే అరుణాచలం వచ్చేసి అధ్యాత్మికంగా సాధన చేస్తూన్న ఈరోజులలో ఆ సమస్యలకు గురించి వ్రాస్తే, అప్పటిలాగే అంతటి తీవ్రవిమర్శ ధోరణిలో వ్రాస్తాననుకుంటాననీ చెప్పారు. అప్పటి తన రచనలలోని స్త్రీ పాత్రలన్నీ కూడా ఇప్పటికీ తన ఆప్యాయతకీ అనురాగానికీ అలంబాలవుతాయన్నారు.

నేనన్నాను. రచయితలలో చలంగారు ఇటర్నలిస్టులు అంటే తమస్సునుంచి జ్యోతిని తేవాలని కోరుకునే శాశ్వతతత్వ ధోరణికి చెందిన వారవుతారని నేను ఆయనకి జోతులు అర్పించాను.

చలంగారితో రజని ఇంటర్వ్యూ సంభాషణకాక, ఇందులో చలంగార్ని గూర్చి ఐదుగురి ప్రసంగాలూ కార్యక్రమానికి ముందూ చివర యవనికలా ప్రసారం చేసి సౌరిస్ బృందం "సౌరిస్" భక్తి కీర్తనగానం ఆకర్షణ. "సౌరిస్" శ్రీ చలంగారి పెద్ద అమ్మాయి

ఢిల్లీ తరువాత స్టేషన్ డైరెక్టర్‌గా అహమ్మదాబాద్‌లో ఓ సంవత్సరం (1970) గడిపి 1971 లో బెజవాడ బదిలీ అయినపుడు అక్కడ తెలుగువార్తలకి ముందు సాయంత్రం 7 గంIIనుండి ఒక్కొనాడు ఒక్కో విద్వాంసుడి చేత అన్నమయ్య కీర్తన ఒక్కొక్కటి పాడించి వాటికి మరింత ప్రచారం కలిగించాము. తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవాలు కవర్ చేసుకుని అక్కడినుంచి తిరువణ్ణామలై చేరి చలంతో ఓ అరగంట ఇంటర్వ్యూ చేశాను. దానికి యవనికగా 'సౌరీస్' బృందంవారి ప్రార్థన గీతాలు రికార్డు చేశాను. చలంగారి పుస్తకాల్లోని ముఖ్య పాత్రలను వారి సంవాదాలలో సంభాషణలతో ఫ్లాష్‌లుగా పాత్రధారుల చేత మాట్లాడించి రికార్డు చేశాను ముప్పాళ్ళ రంగనాయకమ్మ, విశ్వనాథ, కొడవటిగంటి కుటుంబరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి బి.వి. నరసింహారావులచే ఐదేసి నిముషాల చొప్పున చలంగారి ఒక్కో పార్శ్వాన్ని వివరించడం జరిగింది.

104. "రాగాలాపనా - వర్ణచిత్రవిలేపనా"

వినడం ద్వారా ఆనందించే కళ గాత్రంలో ప్రదర్శించే రాగాలాపన. లేక సంగీతం! చూడడం ద్వారా ఆనందించే కళ (వర్ణ) చిత్ర లేఖనం! ఇటీవల బొంబాయిలో ఒక సాంస్కృతిక వేదికపై ఒక సమావేశంలో ఒకేసారి ఏర్పాటు చేసిన ఈ కళాద్వయ ప్రదర్శనని దూరదర్శన్ జాతీయ ప్రసారాలలో మే 22వ తేదీ ఆదివారం కార్యక్రమాలలో చూపించారు.

సంగీత విద్వాంసుడు భీమసేన్ జోషి, చిత్రకారుడు ఎం.ఎఫ్. హుసేన్ ఇద్దరూ తమ తమ కళారంగాలలో అనుభవం, గాంభీర్యానికి, మేధావిత్వానికీ ప్రదర్శన పాటవానికీ ప్రసిద్ధి పొందిన వారే! వేదికా నిర్వాహకుల్లోనే ఒక కంఠం (ముఖం కనబడలేదు) ఉపోద్ఘాతం చెపుతూ, మన దేశపు ప్రాచీన సాంస్కృతిక చరిత్రలో సంగీతంలోని నాదాత్మకమైన రాగాలకు రాగరాగిణి చిత్రమాల అనే పేర. దృశ్య చిత్రీకరణ ప్రయత్నాలు జరిగిన దాఖలాలున్నాయని సూచన మాత్రంగా చెప్పారు. అంతేగాని ఒకే వేదికపైని రెండు కళలను ఒకేసారి ప్రదర్శించడంలో నిర్వాహకుల తొలి ఉద్దేశం ఏమిటో, దృశ్య కళను వింటూ దృశ్య కళాకారుడు చిత్రీకరణ సాగించారో లేక, చిత్రీకరణ పాటలో కల్పన సాగించారో వ్యాఖ్యాన కర్త తమ మాటలలో స్పష్టంగా చెప్పలేదు.

ఈ వ్యాస రచయిత (రజనీ) పదిహేనేళ్ల క్రితం విజయవాడ ఆకాశవాణి బహిరంగ వేదికపైన ఆహూతులైన ప్రేక్షకశ్రోతల ముందు ఇటువంటి కళాద్వయ ప్రదర్శన ఏర్పాటు చేసి ఉండడం

నేత బొంబాయిలో ఇటీవల జరిగిన ప్రదర్శనలో కూడా గాయకుడు చేసే రాగాలాపన వింటూ చిత్రకారుడు తనకు సద్యస్ఫూర్తిగా కలిగిన భావావేశానుసారం వర్ణాలతో చిత్రలే(ఖ)పనం చేయడమే నిర్వాహకుల ఉద్దేశం అని గ్రహించగలిగాడు.

భీమసేన జోషి హార్మోనియం తాను వాయించుకుంటూ పాడారు. తబలా పక్కవాద్యం పండిట్. హుసేన్ అదే వేదికపైని కుడి పక్కగా నిలబడి తన ముందు ఏర్పాటు చేసిన కేన్వాసుపైని పక్కనే ఉన్న టేబులుపైని కలుపుకున్నవేరు వేరు రంగులలో ముంచిన కుంచెలతో వర్ణ చిత్ర రచన సాగించారు. జోషి ముందు ఏవో రెండు రాగాలలో ఆలాపనా గత్, గానం చేసి, మూడవ భాగంలో (హిందుస్తానీ) భైరవిరాగంలో భవానీ, భవానీ అంటూ చాలా ఆవేశపూర్వకంగా కల్పనాత్మకంగా సభ్యులు ఉర్రూతలూగేట్లు తమ గానం సాగించారు హుసేన్ చిత్రరచన ఆధునిక పద్ధతిలో అమూర్తంగా, సంధ్యారాగ స్నపితమైన రౌద్ర ప్రకృతిని ప్రదర్శించింది.

మొత్తం మీద "ఏతౌట్ కామెంట్స్" అన్నట్లుగా వ్యాఖ్యారహితంగానే రెండు కళలనూ ప్రదర్శించారు. తన బొమ్మను పూర్తిచేసి హుసేన్, జోషి ఇంకా గానం చేస్తూనే ఉండగా ఆయనకు నమస్కరించి పక్కనే కూర్చున్నారు. కళా ప్రదర్శనకు వచ్చిన పెద్దలలో ఏ ఒక్కరు గానీ, ప్రధాన కళాస్రష్టలుగానీ, వేదికా నిర్వాహకులు గానీ, దూరదర్శన్ నిర్వహాకులు గానీ, ఆనాటి ప్రదర్శన విశయాలను గురించి గానీ, ఫలితాన్ని గురించి గానీ ఏమీ వ్యాఖ్యానించలేదు. అయితే ఉపోద్ఘాత వ్యాఖ్యలో వ్యాఖ్యాత మన దేశంలో అటువంటి కార్యక్రమం జరగడం అదే మొదటిసారి అని ప్రకటించాడు. అది సరికాదు.

సుమారు పదిహేనేళ్ల క్రితం నేను విజయవాడ ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్‌గా ఉంటున్నప్పుడు "మ్యూజిక్ ఇన్ కలర్స్" రంగులలో సంగీతం అనే ఆహ్వాన పత్రం అచ్చువేయించి 30, 40 మంది 'తజ్ఞులకూ' 'విజ్ఞులకూ' పంపించి, టెలిఫోను ద్వారాను, దూతల ద్వారాను ఆహ్వానాన్ని పెట్టిస్తూ వచ్చిన రసజ్ఞుల ముందు ఒకనాటి సాయంత్రం (అది చీకటి రాత్రే) 7 30 గంటలకు ప్రదర్శన ప్రారంభించాం. మా కేంద్ర ఆవరణలోని బహిరంగ వేదికపైని సంగీత విద్వాంసుడు ఓలేటి వేంకటేశ్వర్లు గానమూ అది వింటూ అప్పటి హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వైస్ ప్రిన్సిపాల్ అయిన శ్రీ విద్యాభూషణ్ చిత్ర రచన చేయడమూ ఆనాటి సదస్సులోని కార్యక్రమం. ప్రేక్షక శ్రోతల చుట్టుపక్కల గాని, వేదికపైని గాని మామూలుగా ఏర్పాటు చేసే తోరణాల విద్యుద్దీపాల వెలుగు చిమ్మడం నిషిద్ధం.

ఫ్లడ్‌లైట్ ఒకే ఒకటి గాయకుడు పాట ప్రారంభించగానే వేదికకి ఎడమప్రక్క ప్రత్యేక వేదికపైని తంబూరమాత్ర సహకారంతో పాడుతున్న గాయక విద్వాంసుని పైనీ, పై నుంచి ఆయన మీద

మాత్రమే పడుతుంది. వేదిక పైని ప్రేక్షకులకు అభిముఖంగా ఏర్పాటు చేసిన కేన్వాసూ, దా ముందఱు నిల్చున్న చిత్రకారుడూ అయన పక్కనే ఒక టేబిల్ పైని రంగుల డిషులూ, నీళ్ల వగైరా ఫ్లడ్ లైట్ ప్రేక్షకులు వైపు నుంచి సరిగ్గా కేన్వాసు మీద మాత్రమే పడుతుంది

శ్రీ వోలేటి తంబురా శ్రుతీ, సాపాసా అనుకోవడమూ, సరిగ్గా 7.30 కి మా ప్రారంభ ప్రకటన కాగానే మొదలు పెట్టారు. చిత్రకారుడు అప్పుడే రంగులు కలుపుకున్నారు. గాయకుడు (శ్రీ వోలేటి) ఒక గంటకు పైగా షణ్ముఖ ప్రియ (లేక) చామరం అనే రాగం మంద్రమధ్య తారస్థాయులలో గానం చేశారు. తానం పాడారు. చివరలో ముత్తుస్వామి దీక్షితులు కేతుగ్రహం పైని చేసిన సంస్కృత కీర్తన పాడారు. శ్రీ విద్యాభూషణ్ వర్ణ చిత్ర రచన అమూర్తం (అబ్‌స్ట్రాక్ట్) గానే సాగింది.

నాదోపాసనాత్మకంగా సాగిన రాగాలాపన వల్ల ఉత్తేజితములయిన మనోభావాలతో చిత్రకారుడు తన కేన్వాసుపైని అద్దిన వర్ణాలు గాయకుని రాగాలాపనలో మంద్రగాంభీర్యాలు వినబడినపుడు చిత్రకారుని కుంచె దట్టమైన ఊదా, బ్రౌన్ (చాకొలెట్), ఎరుపు రంగుల మేళనంతో తన మనోగగనపు టంచులలో అద్దుకుంటూ వచ్చి, గాయకుడు మధ్యస్థాయీ, దాని నుంచి తారాస్థాయీ చేరుకున్నప్పుడు మనోగగనపు కేంద్రంలో శూన్యవర్తులాకారపు పసుపు పచ్చని ఖాళీ స్థలంలో వదలివెయ్యడం గాయకుడు శ్రోతలకు కలిగించిన రసబ్రహ్మ దర్శనంతో కార్యక్రమం సఫలమయిందని చివర నేను సమన్వయ వ్యాఖ్య చేశాను.

ఆనాటికి ఇటువంటి కార్యక్రమం ఒక రేడియో కేంద్రానికి తలకి మించిన పని, అయినా రేడియో రిపోర్ట్ ప్రసారం చేశాము. దూరదర్శన్ ఆనాటి కింకా నిలదొక్కుకోలేదు అయినా, సంగీత కార్యక్రమపు నాద ప్రదర్శనని, వర్ణ చిత్రలేఖనపు దృశ్య ప్రదర్శననీ శాబ్దికంగాను, సినిమా కెమెరాతోను రికార్డుచేసి, ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కార్యదర్శి శ్రీ ఎం.ఎస్.మూర్తి దగ్గర ఈ నాటికీ (1988 జూన్) ఉన్నాయి నేనూ మరోకొందరు పెద్దలు శ్రీ పాటి బండ సుందరరావు మొదలైన వారు చేసిన ప్రసంగాలూ రికార్డు చేశాం.

105. రా. సత్యనారాయణ

ఆయన బెంగుళూరు దగ్గర చారిత్రక రాజధాని మైసూరునివాసి ఇంట్లో కన్నడము. తెలుగు మాట్లాడుతాడు ఈయన అన్నగారు చంద్రశేఖర్. ఆయన సోదరులు విశ్వేశ్వరం వైణికులు. వారితల్లిపేర 'వరలక్ష్మి సంగీతశాల ఆరంభించారు. వారి వద్దలేని సంగీత గ్రంథమంటూ లేదు. సత్యనారాయణ స్వయంగా సారంగదేవుని 'సంగీత రత్నాకరాన్ని' కన్నడం చేశారు. ఆ అధ్యాయాల్లో యోగానికి చెందిన భాగంలో ప్రాణాయామం గురించి రాస్తూ మూలాధారంనుంచీ షట్చక్రాలు... అద్యంతం కుండలినీ శక్తిని ప్రయాణింప జేసే సహస్రార చక్రం. నడినెత్తిన మాడు పట్టులో ఉంటుంది శక్తిపాతం చేయడం అనేది పతంజలి ప్రతిపాదిత సూత్రం సారంగదేవుడు తన గ్రంథంలో చెప్పినట్టుగానే సత్యనారాయణ తమ అనువాదంలో సమర్థంగా సమకూర్చారు. మరో గ్రంథంపేరు 'వీణాలక్షణ విశేష' భరతనాట్యం గూర్చి ద్వారసముద్ర రాజ్యదర్బారుల్లోని నాట్యం, నృత్యం, నృత్తం ఎలా పరిఢవిల్లాయో తన ఆంగ్లగ్రంథంలో రాశారాయన.

106. తిరుపతి వేంకటేశ్వర కళాపీఠ సారధ్యం నుండి ఆకాశవాణి, దూరదర్శన్‌లకు "ప్రొడ్యూసర్ ఎమెరిటస్"గా

నేను రేడియోలో ఇన్‌ఛార్జి పదవీవిరమణరోజు సాయంత్రం తిరుపతి నుంచీ కళాక్షేత్ర అధికారిగా ఆదేశాలు వస్తాయని టి.టి.డి అధికారి రాజగోపాలరాజు అన్నారు. కానీ ఆరు నెలల తర్వాత ఆదేశాలు వచ్చాయి. అలా కళాక్షేత్ర సారధ్యం వహించాను. 16 మంది వివిధ సామర్థ్యాలు గల కళాకారుల బృందాన్ని నియమించి వారంవారం సంగీత సభలుచేసే సంగీత గేయాలతో ప్రాచీన ప్రత్యేక రాగాల కూర్పులతో వివిధ రకాలుగా గరుడధ్వని వంటి దేశవరాళి, దేవసాళగం వంటి అపురూప అరుదయిన రాగాలతో పాటలు చేయించి పాడించాను రకరకాల అన్నమయ్య పదాలు. ఏకగాయక, యుగళగాయక, బృందగీతాలుగానూ పాడిస్తూ సభలు జరిపిస్తుండే వాడిని. అలా మూడేళ్ళు గడిచేక ఈ విద్వత్సభను ఆపించి నన్ను "డైరక్టర్ ఆఫ్ కళాక్షేత్ర" అని కలంకారీ, కొయ్యబొమ్మలకి మాత్రం అధిపతి చేసి సంగీతం నుంచి కార్యనిర్వాహకులు దూరం చేయడంతో మనస్సుకు కష్టం వేసింది. ఈ విషయాన్ని ప్రసార భారతి వారికి తెలుపగా ఆకాశవాణి దూరదర్శన్‌ల తరపున "ప్రొడ్యూసర్ ఎమెరిటస్" గా హైదరాబాద్ కార్యస్థానంగా ఢిల్లీనుంచి ఆదేశం రాగా దానిని చూపి టి.టి.డి. నుంచి హైదరాబాద్ వచ్చేసేను.

హైదరాబాద్‌లో "ప్రొడ్యూసర్ ఎమరిటస్"గా నేను ప్రణయసేతువు కులీకుతుబ్ ప్రణయ కథను విజయవాడలో "మూసీపై వలపు వంతెన" అనే చిన్న కార్యక్రమాన్ని విస్తృతించి ఓగంట నాటకంగా 1982 రూపొందించాను. హిందీ, వ్రజ, ఉరుదూ పాటలు రాసి సేకరణ కంపోజ్ చేసాను.

బెంగుళూరులో ఉన్నపుడే రాజాజీనగర్‌లో బస్సెక్కి అసెంబ్లీ వీధిలో ఉన్న ఆకాశవాణి చేరేలోగా బస్సులో నిలబడే, పాట కంపోజ్ చేసుకునే వాడిని ఊహలో అలా రెండు పాటలు అదీ కన్నడంలో తయారు చేశాను. యశోదకృష్ణుడి దుడుకు చేష్టలపై ఫిర్యాదు చేసే గోపికలను మందలిస్తూ పాడే పాటలు వెడుతూనే కళాకారులను ఆర్కెస్ట్రా పిలిచి వినిపించి వారికి నచ్చిన తర్వాత పూర్తి చేశాను. వాటిలో ఒక పాట వాణి జయరామ్ చేత పాడించాను. ఇంకోటి రాధాజయలక్ష్మి పాడారు.

107. మూసీపై వలపు వంతెన

1960 - 66 మధ్య రజని ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తుండగా ఈ నాటిక "మూసిపై వలపు వంతెన" అనే చిన్న సంగీత రూపకంగా ప్రసారం అయింది. అప్పుడు "మెలకువలో తీయకలో కలలోనీ వలపువలో" అనే పాట గుర్రపుడెక్కల చప్పుడుతో మొహమ్మద్ కులీ రాకుమారుడు గోల్కొండ నుంచి చంచలపల్లి వైపు వెడుతూండగా పాడిన పాట - "వలరాజో నెలవంకో" అని చంచలపల్లి నుంచి భాగ్యవతి పాట, ఆ తర్వాత "రాచనగరులో రుసరుసలూ, చంచలపల్లిని గుసగుసలూ చెలియను చేరగబోయే ప్రియునకు చెంగట మూసీ బుసబుసలూ" అని, మూసీ పొంగి పొర్లటం ఆ వరద తగ్గగానే

"రాహుతు అశ్వం మూర్కొంది
రమణిపైటపై జవ్వాది" అని కులీరాకుమారుడు చంచలపల్లిలో భాగ్యవతిని కలుసుకోవడం గుర్రపు సకిలింపు సంకేతం, ఆ తర్వాత నాయిక పాడిన 'జాజి సుందరి - దాక్షపందిరి' అనే గేయంతో పూర్తవుతుంది నాటకం!

కుతుబ్షాహీ సమాధులూ, ఇంకా అలాటి ఆనాటి కట్టడాలూ చూస్తూ గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో - ఢిల్లీకి రాకపోకలు చేస్తుండగా 'దక్కన్ దివ్యభూమీ' - పాట మనస్సులో పుట్టింది

హైదరాబాద్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తులో అద్దంకి గంగాధరకవి, సారంగు తమ్మయ్యల పద్యకావ్యాలు తపతీ సంవరణ, వైజయంతీ విలాసమూ చదువగా, ఢిల్లీ నుంచి శ్రీమతి వక్కలంక సరళారావు తనకుమార్తె స్వప్నసుందరి చేత ఆడించాలని, భాగ్మతీ కుతుబ్షాలకు సంబంధించిన దక్కనీ హిందీ పాటలను సేకరించియిచ్చింది. 1981-82లో ప్రొడ్యూసర్ ఎమెరిటస్‌గా 'ప్రణయ సేతువు' సంగీత నాటకం - యక్షగాన పద్ధతుల తోటీ, దక్కినీ హిందీ పాటలూ, వాటి అనువాదాల తోటీ పూర్తి చేశాను. అప్పుడు హైదరాబాద్ ఆకాశవాణి నుంచి 1981 - 82 ప్రాంతాన 'ప్రణయ సేతువు' ప్రసారం అయింది

శ్రీమతి వేదవతీ ప్రభాకర రావు - భాగ్యవతి గాను, కీ.శే. శ్రీ. జె.వీ.యస్.రావు (జొన్న విత్తుల వెంకట సుబ్బారావు) కులీ కుతుబ్షాగాను నటించారు. 'ఆయాహం మొహమ్మద్ కులీ', షాహ్ జాదాయే గోల్కొండ' అనే దక్కినీ హిందీ పాటతో కులీ రాకుమారుడు ప్రవేశం. అప్పటి హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్ కీ.శే. డా. అయ్యగారి వీరభద్రరావు - మాలిక్ ఇబ్రహీం (మల్కిభరాం), కీ.శే జి.వి సుబ్రహ్మణ్యం తెలుగు విశ్వవిద్యాలయాచార్యులు వజీర్-ఎ అజమ్ (ముఖ్యమంత్రి) హైదరాబాద్ సోదరుల్లో ఒకరయిన - శేషాచార్లు, మా మూడో అబ్బాయి బి.ఆర్. వెంకోబా పద్యాలు చదివే పాత్రలు పోషించారు.

108. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు (గోదావరి గుళ్ళు)

ఢిల్లీ నుంచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.ఎస్ మూర్తి రజని "గోదావరి" రేడియో రూపకానికి From the mountain to the sea కొండ నుంచి కడలిదాక టోక్యోనుంచి నిపోన హెూసోక్యొకై వారి బహుమతి, 30,000 ఎన్‌ల (జపాన్ వారి కరెంసీ) చెక్కు, జపనీస్ భాషలోను అంగ్లంలోనూ సైటేషన్ అందజేస్తూ బెజవాడ ఆకాశవాణి ఆవరణలో జరిపిన సభకు విశ్వనాథ వారిని ముఖ్య అతిధిగా ఆహ్వానించాము. హైదరాబాద్ డైరక్టరు టి ఆర్. మురళీధరన్ కూడా సభలో ప్రసంగించి టోకియోలోని రేడియో కేంద్రంవారు హవాయ్‌లో హనొలులుకు మన తెలుగు నాటకం పంపగావారు అక్కడ ఆపాటలు విని వారి హవాయియన్ మ్యూజిక్‌వలె వుందని ఆనందిస్తూ ప్రశంసించారని తెలిపారు ఢిల్లీ, టోక్యోల్లోని ఆంగ్ల, ఫ్రెంచి, జాపనీయ రిపోర్టర్‌లు ఎంతో అభినందిస్తూ రాశారు. ఈ సందర్భాన్ని స్మరిస్తూ నా పాట విశ్వనాథవారి కిన్నెరసాని, బాపిరాజుపాటలూ "ఉప్పొంగి పోయింది", "కోయపడుచు" పాటా రామదాసుభజన కీర్తనా

పడవవాళ్ళపాటా, శ్రీనాథుడి గోదావరిని ఆహ్వానించేపద్యాలూ, తనవీ అన్నీ కలిసిరజని గోదావరి గాధను నాటకంగా వీనులవిందుగా కంపోజు చేయించి జపాన్ పంపగా అక్కడ ప్రశంసలుగాక తనకు పంపిన బహుమతి డబ్బు ఎంచక్క జేబులో వేసుకోకుండా రజని హుందాగా ప్రవర్తిస్తూ ఆనాడు గోదావరి పాత్రధారిణి శారదాశ్రీనివాస్ పాటలకు నామాటలు పాటలూ పల్కిన పిల్లలూ తబలిస్టు, శర్మా తంబురా ఆర్టిస్టుతో సహా సహకారం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా చిన్న పెద్దా గాత్రం ఇచ్చిన వారికి అందరికీ బహుమతి డబ్బు లెక్కలు వేయించి పంచిపెట్టాడు మనరజనిలాగ ఈ రోజుల్లో తన కిచ్చిన బహుమతిని పదిమందికీ పంచిపెట్టేవారు ఎవరున్నారు? చెప్పండంటూ విశ్వనాథ ఆశీర్వదిస్తూ ప్రసంగించారు "అన్ని హక్కులు తనవే అయిన అధికారి, రచయితా, సంగీతదాతా, దర్శకుడూ మనరజని" అని విశ్వనాథ అన్నారు.

అలాగే ఢిల్లీ, మద్రాస్‌ల నుంచీ ఆరోజుల్లో వచ్చే 'వాణి' రేడియో కార్యక్రమాల పత్రికను నేను తెలుగులో విజయవాడ నుంచి సరఫరా చెయ్యడం ఆరంభించాను. ఆ పత్రిక తొలిసంచిక మీద విజయవాడ మేరీమాత కొండా, కృష్ణాబరాజ్ తదితర స్థానిక ఫోటోలతో రూపొందించాను ఆన్తరిక ప్రారంభోత్సవానికి కూడా శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారే ముఖ్య అతిధిగా వచ్చి చక్కని ప్రసంగం చేసి ఆనందాన్నిచ్చేరు. 'రామాయణ కల్పవృక్షం' వచ్చిన సందర్భంలో నేను 'విశ్వనాథసప్తతి'ని 'విశ్వనాధ కవితావాహిని' ఒకటి ఆయన రచనతో వాక్కు ఇతరుల ప్రశంసలు కలిపి రూపకం తయారు చేశాను. గతంలో కృష్ణశాస్త్రి రుతురంగ శాలవలె అందుకు శ్రోతల అభినందన మరువలేనిది.



ఫోటో ఎడమ నుండి : 2. రజని, 3. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు, 4. ఎస్.ఎస్. మూర్తి, డెప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎ.ఐ.ఆర్, న్యూఢిల్లీ, 5. టి.ఆర్. మురళీధరన్, స్టేషన్ డైరెక్టర్, ఎ.ఐ.ఆర్, హైదరాబాద్, 6. కొంపెల్ల గోపాల్, ప్రోగ్రామ్ ఎక్జిక్యూటివ్

109. 'విశ్వనాథ' గురించి నా జ్ఞాపకాలు

1937 40ల మధ్య నేను వాల్తేరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో, పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యుడుగా ఎమ్.ఏ చదువుతున్నాను. రెండో సంవత్సరం తెలుగు విద్యార్థి సారస్వతసంఘానికి నేను అధ్యక్షుణ్ని. మా సహపాఠి, కార్యమపూడి రాజమన్నారు కార్యదర్శి. మా మరో సహపాఠి, కాకర్ల వెంకటరామనరసింహం గారు. కొందరు ఆచార్యులలోను, సాహిత్య విద్యార్థులలోను విశ్వనాథ వారికీ, పింగళి వారికీ, ఒకరంటే ఒకరికి పడదని ఒక అపోహుండేది. ఆ అపోహను తొలగించాలని పట్టుదలతో మేం, మా సాహిత్యసంఘం వార్షిక సభకి విశ్వనాథవారిని ఆహ్వానించాము. శాఖాధ్యక్షులయిన పింగళివారూ, ప్రిన్సిపాల్ విస్సా అప్పారావుగారు, వైస్ చాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డి గారూ మా ప్రతిపాదనకు నిరభ్యంతరంగా సమ్మతించారు హౌరా మెయిలులో దిగిన 'మేస్టార్ని' జటకాలో వాల్తేరు తీసుకొచ్చి, ఆచార్యుల స్టాఫ్ రూంకు తీసుకురాగానే పింగళి మేస్టారూ, విశ్వనాథ మాస్టారూ 'ఏంకాంతం', 'ఏరాసత్యం' 'వదినెలా ఉంది. పిల్లలంతా కుశలమేనా వంటి అప్యాయ సంభాషణలతో, ఆనందబాష్పాలతో పలకరించుకోవడం చూసి మురిసిపోయాం, నేనూ, మా సహపాఠులమూ, యూనివర్సిటీ సభామందిరంలోనే కాకుండా, హాస్టల్ సభాగారంలో కూడా అనాడు విశ్వనాథ కవితాగానకౌముదులు వెల్లివిరిశాయి.

1938 మే నెలలో 8వ తేదీన మద్రాసులో అప్పటి మద్రాసు రాష్ట్రపు ప్రధాని రాజాజీ మంత్రివర్గంలోని యువమంత్రి బెజవాడ గోపాలరెడ్డి గారి పెళ్ళి జరుగుతోంది. చెట్‌పట్‌లోని పచ్చయప్పాస్ కళాశాల తరగతి గదులూ, హాస్టల్ గదులూ, పెళ్ళికి వచ్చిన అతిది బృందానికి విడిది ఇచ్చారు. నవ్యసాహిత్య పరిషత్తు కవుల మహాసభా సమావేశాన్ని ఆ పెళ్ళికి ఒక హంగుగా ఏర్పాటు చేస్తూ మహాకవులను, యువకవులను ఆహ్వానించారు. అధ్యక్షులైన తల్లావజ్ఝలా, కృష్ణశాస్త్రిగారి బృందంతో పాటు నేనూ ఒక నాటకంలో పాత్రధారిగాను, యువకవిగా ఆ సభలలో పాల్గొన్నాను.

పరిషత్తులో కావ్యపఠనం చేసిన కవీశ్వరుల రచనలలో 'గోపాలోదాహరణము' విశ్వనాథ మేస్టారి విశిష్టరచన. 'ఏడాది తిరగకుండా', పాలబుగ్గల చిన్ని గోపాలరెడ్డి' అవతరించాలి అని ఆయన ఉదాహరణంలో ఒక చరణం. విశ్వనాథ మేస్టారూ, పాటిబండ మాధవశర్మగారూ కూడా పాల్గొన్న ఆ నాటి (1939-40) రేడియో నాటికలలో విశ్వనాథవారే రచించిన మృచ్ఛకటికం ఒకటి. ఆ తర్వాత నేను మద్రాసు రేడియోలో చేరి, కాలు నిలదొక్కుకుంటున్న కాలంలో - మేస్టారి 'గోదావరి' సంగీత రూపకం - దానిలోని ఆరంభగీతం - సుమారుగా ఇలా సాగుతుంది. అచ్చంగా ఇవే మాటలు కావు - ఇలాంటివే! "త్రియంబకగిరిస్ఫార చాంద్రమకుటాంచిత జటాబంధురోదార

కల్లోల వాఃపూర 'గోదావరి' మొదటి పంక్తిలో నా కల్పన కొంత చేరి ఉండొచ్చు గాని, రెండోది ఆయనదే - ఈ పాటని నేను ముత్తు స్వామి దీక్షితులు 'మాయే' అనే కీర్తనకి కూర్చిన తరంగిణి రాగంలో ట్యూన్ చేశాను. తరంగిణి రాగంలో శాస్త్రీయ ప్రౌఢతకి తోడు, హిందుస్తానీ టప్పాశైలిలోని ద్రుతగమకాలతో పాటు జంఝూటిరాగంలోని జానపదరామణీయకతతో నదీప్రవాహదృశ్యాన్ని నాదవిన్యాసమాధుర్యాన్ని శ్రవణేంద్రియం ద్వారా మనఃఫలకానికందిస్తుంది. ఇది ఏభయిలలో కృష్ణాపత్రికలో అచ్చయినట్లు జ్ఞాపకం! తరంగిణి రాగంలో చేసిన మేస్టారి పాట మళ్ళీ దొరకకపోవడం చేత, 1972 లో విజయవాడ నుంచి ప్రసారం చేసిన కొండ నుంచి కడలిదాక (గోదావరి గురించినదే) రూపకానికి - ఆరంభవాద్యగోష్ఠి సంగీతాన్ని తరంగిణి రాగంలోనే ప్రయోగించి కూర్చి, మేస్టారి కిన్నెరసాని సంగమఘట్టాన్ని వింజమూరి లక్ష్మి బృందం చేత పాడించాను.

యాభయిలలో మద్రాసు నుండి ప్రసారమై నేను నిర్వహించిన రెండు రేడియో నాటికలు విశ్వనాథవారి రచనలు ఉపనిషత్కథ నచికేతుని కథ ఒకటీ (అందులో నచికేత పాత్ర నాదే) రామాయణ కథాత్మక నాటికలు సుమిత్ర ఒకటీ, మారీచుడు ఒకటీని. 'మారీచుడు' ఇతివృత్తం ప్రసిద్ధమైన మాయలేడి కథ. సీతకోరికపై రాముడు పట్టీ తిట్టో, కొట్టో తీసుకొద్దామని తరుముకు వెళ్ళిన బంగారు లేడిని గురించి దూరంగా అడవిలోకి ఆకర్షించుకుపోతూ అది ఎన్ని రకాలుగా పరుగులెత్తిందో అన్ని సంస్కృత ఛందస్సులలో వివిధగతుల గేయాలు వ్రాశారు విశ్వనాథ అన్ని గతులకూ సరిపోయే రాగాలనూ, తాళాలనూ వాడాను

'బద్దన్న సేనాని' అనే నవలను రాస్తూ రాస్తూ, దాన్ని సీరియల్‌గా విజయవాడ కేంద్రం నుంచి తానే చదివి ప్రసారం చేశారు విశ్వనాథ. 'ఋషియైన నన్నయ రెండవ వాల్మీకి' ఇత్యాది శీర్షికలతో కవిత్రయ సాహిత్యశిల్ప విచారమును ఆ నాడు బిబిసి నుండి ప్రసారం అవుతూ ఉండే 'చాప్టర్ అండ్ వెర్స్' అనే ఫోర్త్ ఛానెల్ ప్రోగ్రాం పద్ధతిలో ప్రసారం చేశారు మేస్టారే 'ఏకవీర ఒక గంట నాటకంగాను 'వేయిపడగలు సీరియల్‌గాను ఒకటి మద్రాసు నుంచీ, రెండోది విజయవాడ నుంచీ ప్రసారం అయ్యాయి.

1971 నుంచి 76 దాకా నేను విజయవాడ ఆకాశవాణి డైరెక్టర్‌గా ఉండిన రోజులలో ఆయన ఆశీస్సులు పొందకుండా చేసిన కార్యక్రమాలు చాలా అరుదు. 1971 - 72 ప్రాంతంలో ఆయన జ్ఞానపీఠ పురస్కారగ్రహీత అయినప్పుడు 'విశ్వనాథ కవితా వాహిని' అనే ఒక గంటన్నర సాహిత్య కార్యక్రమం ప్రసారం చేశాను.

'కొండ నుంచి కడలిదాక' అని గోదావరి నదిపై నేను కూర్చి ప్రసారం చేసిన సంగీత రూపకానికి, జపాన్ రేడియో బహుమతి వచ్చినప్పుడు ఢిల్లీనుంచి వచ్చిన ఎస్.ఎన్.మూర్తిగారు అ

పురస్కారం నాకు అందించేటప్పుడు ఏర్పాటు చేసిన సభలో అధ్యక్షత వహించిన విశ్వనాథవారి ఆనందగాద్గదిక్యాలూ, ఆప్యాయపూరితమైన విసుళ్లూ, వాటితో కూడిన ఉపన్యాసం టేపు పైని నేను భద్రంగా దాచుకున్నాను అందులో అడవి బాపిరాజు గారి పాటలు రెండూ, తన (విశ్వనాథ) పాటా (కిన్నెరసాని) శ్రీనాథుడి పద్యాలు, రామదాసు కీర్తనా, పడవపాటా - ఇన్నిచేర్చానని ఎంత సంతోషించారో! "వాడి గురువెటువంటి మంచికవి, వాడి తండ్రెటువంటి మంచి కవి? బాపిబావ పాటలు నా పాటా, శ్రీనాథుడి పద్యాలు కలిపి కొట్టాడు - బహుమతి' అన్నారు

110. శ్రీ బాలాంత్రపు వెంకటరావుగారి నిర్యాణం

అది 1971వ సంవత్సరం. మా తండ్రిగారు విజయవాడలో మాతో ఉన్నారు. చెన్నై మా అన్నయ్య నళినీ వద్దకు వెళ్ళాలనుకున్నారు. శ్రీకొప్పరపు సుబ్బారావుగారి భార్యా శ్రీమతి సరోజిని గారు చెన్నైవెడుతూంటే వారితోడుగా మద్రాసు పంపించేము చెన్నైలో మా అన్నయ్య ఇంట్లో ఉంటూండగా ఒక రోజున Father had a stroke, start immediately అని టెలిగ్రాం వచ్చింది. stroke అంటే Paralystic stroke నేను బయలుదేరి వెళ్ళేను వారిని రాయపేట ఆస్పత్రిలో చేర్చేము. నేను అన్నయ్య ఒకరి తరువాత ఒకరు ఎప్పుడూ కనిపెట్టుకుని ఉంటున్నాం. సుమారు పది రోజులుగడిచాయి. నాన్నగారు కోమాలోకి వెళ్ళిపోయారు. ఆస్థితిలో కూడా వారి పాదాల కదలికలు సీసపద్య గణాల నడకతో వాయించడం గమనించాము.

అది అక్టోబరు 27వ తేదీ. ఆరోజు ఉదయాన ఆస్పత్రికి వెళ్ళేసరికి వారు పరుండేమంచం ఖాళీగా కనపడింది. నాకర్థమయింది వారు స్వర్గస్థులయారని అది ఉదయం గం 6 00 లకే జరిగింది. వారి శరీరం మార్చ్యురీకి తీసుకెళ్ళబడింది. వెంటనే వారి శరీరాన్ని ట్రిప్లికేన్‌లో మా అన్నయ్య ఇంటికి తీసుకెళ్ళాం అంత్యక్రియలకి ఏర్పాట్లుచేశాం. బంధుమిత్రులు చూసి వెళ్లాక సుమారు గం.11.00 లకి దహన సంస్కారం పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేశాము మాయింటికి ఎదురుగా శ్రీద్వారం వెంకటస్వామినాయుడు గారిల్లుంది. విజయవాడ రేడియో స్టేషన్‌లో నాకు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీరఘురాంగారు ట్రంకాల్ చేశారు. నేను వెళ్ళి మాట్లాడగా మీకు విషాద పరిస్థితిలో ఒక శుభవార్త అని చెప్పారు. అదేమంటే "కొండనుండి కడలిదాకా" ఆంగ్లంలో "From the mountain to the sea" అన్న మీ గోదావరి రూపకానికి జపాను వారు 30,000 yens (Japanese currency) International Prize ఇచ్చేరని. ఆ రూపకాన్ని టోక్యో, హవాయిల

నుండి బ్రాడ్‌కాస్ట్ చేసారని (అందలి కోయపాటలను నేను కోయయాసతో, స్వరాలతో నేర్పగా వింజమూరి లక్ష్మి పాడింది. హవాయ్ వారు వారి హవాయ్ మ్యూజిక్ వలె అపాటలు ధ్వనిస్తున్నాయని ఆనందించేరట). ఈ వార్త ఎంత సంతోషకరమయినదో మానాన్నగారి చెవిని వేద్దామని తహతహతో ద్వారం వారింటినుంచి మాయింటికి పరుగునవచ్చి వారిని ఉంచిన వసారాగదివద్దకు చేరగా అక్కడ కాళీని చూచి వారికి ఈశుభవార్తను అందించ లేక పోయానే అని భోరున ఏడ్చాను

కీర్తిశేషులైన మానాన్నగారి గురించి శ్రీ కృష్ణశాస్త్రి

నాకు ఈ మహాకవితో దాదాపు 64 సంవత్సరాల ప్రియ బంధం. రూఢమైనది అత్యంత సన్నిహితమైనదీనూ.

వీరి కవిత్వప్రభావం నా చిన్నతనంలో 1922 నుండి చాలా గాఢంగా ఏర్పడింది. వీరి పద్యకృతులే కాదు వీరినవలలు కూడా ఎంత వెర్రిగా చదివేమో! ఆనవలల్లో కథల్లోకన్నా కూడా నావంటి వారికి వానిలో వచ్చే గీతమాలికలు గేయాలు అంటే మతి పోయేది.

"గురజాడ వెనువెంట వచ్చిన వైతాళికులు వారు".

మదరాసు ఎఐఆర్ వారి శ్రద్ధాంజలి కార్యక్రమంలో చదివి వినిపించిన సందేశం.

111. పిచ్చివాళ్ళ పంచాయితీ

వాహినీ నిర్మాణం జరుగుతున్న సందర్భంలో అప్పట్లో కొత్తగా వచ్చిన "హెమన్స్ఫ్ ఆర్గాన్" అనే వాద్యం తెప్పించి ఓగదిలో పెట్టారు బి.ఎన్.రెడ్డి నన్ను పిలిచి ఆగదిలోకి తీసుకువచ్చి "ఈగది నీది"ని చెప్తూ తననినీ సంగీత దర్శకునిగా నన్ను వాహినీ సంగీత దర్శకునిగా గదిలోకి ప్రవేశపెట్టారు. ఈ స్నేహపు నులివెచ్చదనం కొంతకాలం కొనసాగిఉంటే తరువాత వచ్చిన "మల్లీశ్వరి"కి మ్యూజిక్ డైరక్టరు నయి రేడియోను విడిచి పెట్టే వాడినేమో తెలియదు. ఈలోగా ఓ పిచ్చిపని జరిగింది. నిజానికి అదేం పిచ్చిపని గాదు. కానీ నా సహొద్యోగుల్లో నాటకాలశాఖ అధిపతి బుచ్చిబాబు శివరాజు వెంకట సుబ్బారావు) నాతో కాపురముంటున్న మాబావ నాగరాజు చేత ఓ నాటకం రాయించాడు. నాటకంపేరు "పిచ్చివాళ్ళ పంచాయతి" "ప్రేమికుడు, పిచ్చివాడు, కవి ప్రవడుడు ఒకడేయనె ఒక నాటక రచయిత" అనే వాక్యం ఆధారంగా బుచ్చిబాబుగారు ఓ కవి, ఓ పిచ్చివాడు, ఒకరిద్దరు పిచ్చివాళ్ళు ప్రేమికుడు కలిసి పిచ్చి ఆసుపత్రి సూపరింటెండెంట్‌ని పిచ్చివాడనీ తాము కాదని ఆ అధికారిని "ఓం భాయ్" మోసెయ్యటం ఆనాటకం కథ. ఇందులో విసుర్లు, జోక్స్, చమక్‌లున్నాయి. ఇవి ప్రేమికులయిన కవి గురించి అతని ప్రేయసి, అమెకు ఎందరు ప్రేమికులున్నారన్న విషయం (వెటకారానికి) విని ఇదంతా నాగరాజు, రజని, కృష్ణ శాస్త్రి పై ద్వేషంతో రాసిన హేళన నాటకం అని జరుక్ శాస్త్రి ప్రచారంవల్ల సినీ, కవిలోకాల్లోని కృష్ణ శాస్త్రి అభిమాను లంతా వెంటనే రజనికి, రేడియోకి వ్యతిరేకులయ్యారు. మా పై అధికారులు నిప్పులేని మంటకు మూలంగురించి నన్ను పిలిచి అడిగారు. ఆయన నిజం విని ఒప్పుకున్నా కృష్ణశాస్త్రిని క్షమాపణ కోరటం మంచిదని, ఆయనచేత మరోనాటకం రాయించుకు రమ్మన్నారు.

నేను వెళ్ళి కృష్ణశాస్త్రి గారిని మాంబళంలోని 7, లక్ష్మణ్ చెట్టివీధి వారి ఇంట్లో కలిశాను ఆయన మౌనంగా మాట్లాడినా ఆయనపాదాలు తాకి పిచ్చివాళ్ళ పంచాయతి ఏర్పాట్లతో నాకేం సంబంధం లేదని బుచ్చిబాబు రాయించి వెళ్ళిన అనంతరం నేను కొత్తగా ఆవిభాగానికి వచ్చి ప్రసారం చేయించాను కాని మాకేమీ ఇతర సంభాషణ లేదని చెప్పాను ఆపై గోదావరి వరదపై ఏదేనా రాయమని కోరాను. 'అన్ కండిషనల్ అపాలజీ' చెప్తే కృష్ణశాస్త్రి ఒప్పుకున్నారు గానీ జరగరానిది మాత్రం నాకుజరిగిపోయింది. వాహినీ వారి మనసుమారిపోయింది. హెమన్డ్ ఆర్గాన్ గదిలో సాలూరి రాజేశ్వరరావు ప్రవేశించారు మ్యూజిక్ డైరెక్టర్‌గా, నాకూ అతను ఇష్టమయిన మిత్రుడే.

112. విశ్వనాథ కవితా వాహిని

విశ్వనాథ సత్యనారాయణగారి సాహిత్యంలో వేర్వేరు ప్రక్రియల ప్రతినిధులుగా చిన్నచిన్న అంశాల తో "విశ్వనాథ కవితావాహిని" లో వారి కుమారుని ప్రేమదీపాలు, కిన్నెరసాని పాటలు కలిసి గంటన్నరవరకు శ్రావ్యంగా సాగేలా ప్రసారం చేసాను. ఇది 1971 - 75 ల మధ్య జరిగింది అలాగే 'ఆదికావ్యావతరణం' అనే వాద్యబృంద నాటకం ప్రసారం చేసాము. ఈసందర్భంలో ఓ జ్ఞాపకం. ఓ రోజు ఒక కారుషెడ్‌లో వాద్య కారులతో రిహార్సల్ జరిగింది. రాత్రి 8 అయింది దృశ్యం వాల్మీకి సమక్షంలో క్రౌంచపక్షుల ప్రణయ కలాపం సుస్వరమేళతో ఓలేటి గొంతుతో వాద్యాలతో తయారైంది సరిగ్గా సంగీతం ముగించేసరికి కారుషెడ్డుపైకి విస్తరించుకున్న గుబురు మామిడి చెట్టు మీద పక్షులన్నీ ఒక్కసారిగా కుహూకుహూలతో స్వరమేళ ఆరంభించాయి. అదివిని వాద్యకారులు పులకరించిపోయినాకు కృతజ్ఞతలు చెబితే, తిరిగి నేనేవారి సుస్వర వాద్యాలకు కృతజ్ఞతలను తెలిపేను.

113. ఆంధ్రీ కల్యాణి

క్రీ॥పూ॥ 4వ శతాబ్దిలో ఆంధ్రజనులు భారతీయ సంగీతానికి ప్రదానము చేసిన కానుక ఆంధ్రి అనేజాతి. (ఆనాడు రాగాలను 'జాతు'లనేవారు). రాగంగా వింటే ఆ ఆంధ్రి అనేజాతి నేటి కల్యాణిలాగ వినిపిస్తుందని కనుగొని నేను ఢిల్లీ విజ్ఞాన భవన్ ఆడిటోరియంలో 11-10-1977 ఆకాశవాణి వాద్య బృందంపైని ఒక కార్యక్రమంగాత్ర గానంతో ప్రారంభించేను. అది ఆకాశవాణి అన్ని స్టేషన్లలో దేశమంతా ప్రసారమయింది. జీవితపు తొలినాళ్ళలో జి. త్యాగారాయశాస్త్రి వంటి సంప్రదాయకులు మెచ్చుకున్నారు.

మేఘరంజనిలో ఘంటసాలపాడిన 'ఘనాఘనా' గేయాన్ని ఆనాడు రాత్రి ప్రసారమైన మ్యూజికల్ రౌండప్‌లో నే చేసిన రాగాన్ని ప్రసారం చేశారు. మొత్తం కార్యక్రమం పావుగంట సేపు భరతుని కూర్పునుంచి నేటికి ఆంధ్రీ కల్యాణిగా ఆవిధంగా రూపొందించాను. 1975లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో హైదరాబాద్ ఫతేమైదాన్‌లో జరిగిన ఒక సభలో ఆంధ్రిపై ప్రసంగించి, అదే నేటి కల్యాణికి ప్రాతిపదిక అని చెప్పి ఓలేటి, బాలమురళి ఇద్దరిని పక్కన పెట్టుకుని వారిచేత పాడించాను.

ఈ రాగమును గూర్చి భరతుని నాట్యశాస్త్రం నుండి తీసినది.

షడ్జాంధ్రీ నందయంతీచ
గాంధారోదీచ్య వాతథా
చతస్రః షట్స్వరాఃజ్ఞేయాః
పంచవతేషట్ స్వరాస్మృతాః
కదాచిదౌడువితే కదాచిత్షాడవితా

శ్రీ కైలాస్ చంద్రదేవ్ బృహస్పతి రచించిన "భరత్ కా సంగీత - సిద్ధాంత" అనే గ్రంథంలోని శ్లోకమిది.

ఆంధ్రీనిరూప్యతే ఽథాస్యాం షడ్జమధ్యమధైవతాః
హీనాఃస్వరా ఇహాంశాః స్యుఃషాడవఃషడ్జవర్జితః
న్యాసోగాంధార ఏవ స్యాదాంధ్ర జాతిరుదాహృతా
భరతకోశకారుడు హరిపాల రచన

ఇక్కడ అంధ్ర - ఆంధ్రీ కాదు.

ఆంధ్ర్యామంశా నిరిగపా రిగయోర్నిధయోస్తథా।
సంగతిర్న్యాస పర్యంత మంశాను క్రమతో వ్రజేత్॥
షాడవంషడ్జలోపేన మధ్యమాదిస్తు మూర్ఛనా ।
పూర్వావత్తు కలాకాల వినియోగాః ప్రకీర్తితాః ॥
అస్యా మాంధ్ర్యాం గాంధారోన్యాసః । అంశా ఏవాపన్యాసాః । (సంగీతరత్నాకరం)

గాంధారశ్చర్షభశ్చైవ పఞ్చమో ఽథ నిషాదవాన్।
చత్వారోంఽశా భవన్త్యాంధ్ర్యా గ్రహాశ్చైతే తథైవహి॥

114. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి

సంగీత కళానిధి శ్రీ నేదునూరి కృష్ణమూర్తి ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో సంగీతం విభాగంలో ఆచార్యులుగా ఉన్నారు. 13 05-1998న విశాఖ మ్యూజిక్ అకాడమీ తరఫున వారేనన్ను రప్పించి సభ ఏర్పాటు చేసి "నాదవిద్యానిధి' అనే బిరుదుతో నన్ను సత్కరించారు. అది ప్రజ్ఞా భారతి సభ. నేను తాళ్ళపాక అన్నమాచార్య సాహిత్యానికి చేసిన ప్రచారానికి సేవకు ధన్యవాదాలు చెప్పారు సంగీతకళానిధి నేదునూరి

115. నా విదేశీ పర్యటన - ఇంగ్లాండ్

ఇంగ్లాండ్‌లో 1984 మే 28న బర్మింగ్ హామ్‌లో 59, హార్టీరోడ్‌లో వుండే డా. బాబూ రావ్ చాపరాల నుంచి ఉత్తరం వచ్చింది. అప్పటికే వాళ్ళింటికి అతిథులుగా ఆవంత్స సోమసుందర్, అరుద్ర వచ్చి వెళ్ళారు 1984 జూలై ఆగష్టు నెలల్లో ఒక పక్క బాబూరావు చాపరాల, భారతీ చావరాల అదే బర్మింగ్ హామ్‌లోని డా. జమలాపుర హరగోపాల్, డా.లక్ష్మిగార్ల ఆహ్వానాలు వచ్చాయి.

జూలై 12వ తేదీన మీనార్ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి బొంబాయి చేరి అక్కడ బాబు, శరత్ (మా అబ్బాయిలు) 14 వ తేదీన సహారాఎయిర్ పోర్టులో నన్ను సాగనంపారు అక్కడ విమానాశ్రయంలో బాబూరావు, హరగోపాల్‌లు నన్ను రిసీవ్ చేసికున్నారు. నన్ను వెల్‌కం చెప్పి కావిలించుకున్నారు. నన్ను వారూ, వారిని నేనూ గుర్తించడానికి 'రజని' అని ప్లేకార్డు పట్టుకు నుంచున్నారు.

జూలై 18వ తేదీన మిడ్‌లాండ్ ఆర్ట్ థియేటరులో లంచ్, విదేశీయుల ఆర్కెస్ట్రా సాగింది జూలై 20 న డిన్నర్ పాల్ నిశ్చల్ వారిది జరిగింది. యాస్మిన్ అనే గ్రీకు సుందరి నాట్యంచూశాను. నేను రంగస్థలవేదిక మీదే కూర్చుని ఆపాటలకి లయలు మారుస్తూ హమ్మింగ్ ఇచ్చాను. నాట్యం చేసే ఆమె తన దుపట్టాలను ఆనందంగా నాకు కప్పి సత్కరించింది. 22న స్ట్రాట్‌ఫర్డ్ ఆన్ ఎవన్ (ఎవన్ నది) ఒడ్డునగల స్ట్రాట్‌ఫర్డ్ పట్టణాన షేక్స్‌పియర్ జన్మస్థలం దర్శించాను డి. విద్యానాథ్ ఆవేళ ముఖేష్‌పాడిన హిందీపాటలు ఆలపించాడు.

అక్కడ మెమొయిర్స్ ఆఫ్ మార్కొపొలో చదివానక్కడ. 25న బాబూరావ్ 'ఎగ్జిటర్'కి తీసుకువెళ్ళాడు. డా. అప్పారావు నాగభైరవ, సుజాత, కూతురు అనిత, అబ్బాయి తమ్ముడు పరిచయం అయ్యారు అక్కడ నుంచీ తిరిగి బర్మింగ్ హామ్ చేరాము అక్కడ మ్యూజియం చూశాను. 29న హరగోపాల్ ఇంట్లో గోదావరి రూపకం. ఆదికావ్యావతరణం, శాంతిపథం, అతిథిశాల రికార్డులు వినిపించారు. ష్రూస్‌బరి అనే క్లైవు పుట్టిన ఊరు సందర్శించాను.

బాబూరావ్ కార్లో వెడుతోంటే ఎక్కడెక్కడున్న తెలుగు సోదరా పాట కంపోజ్ చేస్తూ పాడాను

అతను కారు రేడియోలో ట్యూన్ చేసిన ఏదో స్టేషన్ నుంచి వాద్య గోష్టిలో సంగీతం విన పడుతూంటే అదే సంగీత మెట్టులో నేను కారులోనే ఈ తెలుగు గేయంకంపోజ్ చేశాను.

డా॥ హరగోపాల్ ఇంట భోజన సమయంలో తెలుగుపాట పాడుతూ మాట్లాడుకున్నాం

ఎక్కడెక్కడున్న తెలుగు సోదరా

ఒక్క తెలుగు పాట గొంతులెన్నొ కలియ పాడరా ॥ఎక్క॥

ధిక్కరించి నిరంకుశత దేశహద్దులు దాటి

దిక్కు లెల్ల పిక్కటిల్లు శకారంభముచాటి

జాతి ఆంధ్రత్వముధాటి భరతధాత్రి కోటగట్టి

తెలుగు ప్రతిష్ఠ నెలకొల్పితే భళిభళి సెబాసురా ॥ఎక్క॥

అంటూ సాగింది.

ఆగష్టు 12న మిడ్‌లాండ్ థియేటరులో సమావేశం జరిగింది. అందులో నన్ను పరిచయంచేసి నా ప్రసంగాన్ని "ట్రిమెండస్"గా ఉందని అభినందించారు హరగోపాల్ మిత్రులూ.

13వ తేదీన రాత్రి ఒక కల కవితావేశం వంటి భావం వెల్లువలా వచ్చింది ఆకాశంలో నిలిచిననాకు గణపతి గోచరించడమే తడవుగా పాట పుట్టుకొచ్చింది. అదే కంపోజ్ చేశాను.

జనగణముల తుష్టికి నరవరసుర గణాధిపతి వగు

నీ సంతుష్టికి హోమమునీకె గణాధిపా

అంటూ ఇలాసాగింది

భూమండల ప్రదక్షిణగతిలో

ఈమహావిహాయస వ్యావృతిలో

ఏక్య పరిత ప్రణవాకృతిలో

సుస్వర వీతిహోత్రుడగు నీకే

గాత్ర సనాతన మంటపమ్ములో

చిత్రీకృత సర్వరంగ వల్లిక

నాభికేంద్ర ప్రజ్వలత్ కుండమున

హృదయపాత్రలో కంఠదర్వితో ॥హోమము॥

ఏకం, ద్వే, త్రీణి, చత్వారియని

భావరాగలయ భాషాయుతమౌ

శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి

అస్మత్కృత గేయాజ్యధారతో
రసనాగ్రప్రస్ఫురత్ జ్వాలలో ॥హోమము॥
అహంకార హరిత పత్ర దళములు
అవమానాశ్రు కలిత తోయమ్ములు
మొగ్గలై ఏగులు కోర్కెల పూవులు
నెగ్గిన పండెమ్ముల సత్ఫలములు ॥హోమము॥ ఇదే పాట

ఆ తర్వాత బ్లైయిట్ బ్రిడ్జి అనే గ్రాహం స్టోక్ ఆన్ ట్రెంట్ నదివద్ద వుండే డా.బి. కరుణాకర్‌రావ్ దగ్గరకు నన్ను చేర్చారు. హరగోపాల్ వర్డ్స్‌వర్త్ వంటి కవులు చేరుతుండే 'లేక్' సమావేశ ప్రాంతం సందర్శించాను అ తర్వాత లండన్‌లో కెన్సింగ్‌టన్ కోర్టులో టంగుటూరి సూర్యకుమారి దంపతులుండే చోటికి చేరాను 25న వినాయక పూజలో నేను కొత్తగా రాసిన వినాయకుడి మీద పాట పాడాను అక్కడ వినాయక మందిరంలో.

25న గ్రీన్‌విచ్‌టైమ్ అబ్జర్వేటరీ చూశాను. తిరిగి సూర్యకుమారి ఉండేచోటికి చేరాను. ఆ సమయంలో ఊపిరిపట్టునొప్పి వచ్చింది. సూర్యకుమారి భర్త కొంత సాయం చేయగా నా వీపును ఆమెకు అప్పగించారు. వెంటనే వీపుపట్టి నొక్కినాకు ఆమె ఉపశమనం కలిగించింది. దంపతులు అలానన్ను కాపాడారు.

జాన్ విలియమ్స్ కాన్సెర్ట్ రాహుల్ హాల్‌లో ఆనందించాను. తర్వాత టస్సాద్ మ్యూజియంలో మహామహుల మైనపు విగ్రహాలు చూశాను అక్కడ ప్లానెటోరియం కూడా చూశాను. ఆ సాయంత్రం లండన్ వదలి బర్మింగ్‌హామ్ చేరుకున్నాను.

ఆశ్చర్యమేమంటే ఇంగ్లాండ్ నుండి సెప్టెంబర్ 4 న హరగోపాల్, హెరాల్డ్, ఎల్విన్‌లు నన్ను అమెరికా పంపే ఏర్పాట్లలో వుండగా వీసా కార్యాలయం వారు నాకు 'వీసా' ఇవ్వడానికి అంగీకరించలేదు. అమెరికాలో రజని స్వరం కోసం ఎందరో కనిపెట్టుకువుంటే వీసా ఎలా తిరస్కరిస్తారని ఎల్విన్ అడగటంతో వారు వీసా 'హెరాల్డ్ అల్విన్' సాయంతో చివరికి అందజేశారు.

అలా టుంగుటూరి సూర్యకుమారితో సహా మిత్రులందర్ని సత్కరించి బయల్దేరి న్యూయార్క్ చేరాను. బి వెంకటేశ్వరదత్ చెందు (నాకు హితుడు, సహపాఠి) నన్ను రిసీవ్ చేసికున్నా డక్కడ. అది 5 సెప్టెంబర్ 1984.

సెప్టెంబర్ 8న మడవల్లి సాంబశివరావు దంపతులు మిత్రుల సమక్షంలో తెలుగు పాట, వాగ్గేయ కారులు అన్నమయ్య సిద్ధేంద్రకలాపం వంటివి నేరాసినవి పాడాను హర్షధ్వానాల మధ్య.

116. నా అమెరికా యాత్ర

మైళ్ళకొలది చీమల బారులాగ
కదలు గాసొలిన్ శకటాలు
ఇరువైపులన్ గుబురు చాచుకొమ్మ
లెత్తైన పైన్ల లైన్లు
నడుమ నడుమ సర్వీసు కేంద్రాలు
సుడులు తిరుగు వంతెన దార్లు
దారి సుంకపు వసూలు ద్వారాలు
హొటేళ్ళూ, మొటేళ్ళూ, బార్లూ
ఊరి నడుమను మొటేళ్ళ నివాసము
డంకిన్ డొనట్ బ్రేక్ ఫాస్టులు
దారినడుమ విశ్రాంతి స్థలాల
చెట్ల నడుమ సిమ్మెంటరుగుల పయి
కార్ ట్రంక్ ప్యాకెట్ లంచీలు!

ఈశాన్య రాష్ట్రములగల్గు మహా
నగరాల చేరు రహదార్ల
సర్వలక్ష్మియో సూర్యా బులుసో
సారథి యై విషయ వివృతి చేయగ
ఎన్నిసార్లో సూర్యాబులుసుకార్లో,
అదిత్యో, వెంకన్నయొ, రాధయొ
చక్రధారియై విక్రమింపగా
ఎన్నిసార్లో వెంకన్న దత్ కార్లో!!

గంటకు ఏబై, అరవై, డెబ్బై
మైళ్ళ వేగమున ముందుకు సాగుతు
వంతెనలూ, సొరంగాల ద్వారా
శంఖావర్త బైపాస్‌లు మీరా
దీపతతుల తోరణాల బారుల

జలాంతర నాళికా రహదారుల
బ్రేక్ ఫాస్టూ లంచ్‌లూ దారిలోన
వేరు వేరు చోటుల కానిస్తూ
చేరేవారము మహానగరాలు!
న్యూయార్క్, న్యూబ్రన్స్‌విక్, మారిస్‌టౌన్
వాషింగ్టన్, బాస్టన్, ఫిలడల్ఫియ
మహానగరాల పెనుకట్టడాల
దర్శనీయముల తిలకించాము!

నూటయేడు అంతస్థుల సౌధం
ప్రపంచ వాణిజ్యకేంద్రమూ,
ఐక్యరాజ్య సమితి భవన పుంజం
మెట్రో పాలిటన్ మ్యూజియమూ
కార్నెల్, హార్వర్డ్, యూనివర్సిటీస్
కోనింగ్ గ్లాస్ మ్యూజియం, ఫ్యాక్టరీ,
రాజధాని వాషింగ్టన్ డీ.సీ.
సెనేటుహౌస్, స్మారకస్తంభం
స్మిత్సోనియన్ అంతరిక్షకేంద్రం
నక్షత్ర వేధశాలా
అన్నిటిలోనా అద్భుతజనకం
అవిస్మరణీయ ముదాత్తానుభవ
మది, మా నయాగరా పర్యటనా
నయాగరా జలపాతంలో
తుషార మేఘావరణంలో
చందూ తాతా, సుబ్బూతాతా
అంకుల్ దత్తూ అదిత్తూ
సుధాసిసీ తన చుట్టూ ఉండగ
నీహార రమణి సందిటిలో
నీలాలాడెను, రజనీ తాత

నయాగరా జలపాతంలో
తుషార మేఘావరణంలో!!

మా యాత్రలోన మహానగరాల
అందమైన షాపింగ్ సెంటర్లు
నూర్ల కొలదిగా బారులు దీరిన
కార్లపార్క్‌లో కారును విడిచి
ప్రవేశద్వారం సమీపించగనె
తమంత తాము తెరచుకొను తలుపులు!
ఎక్కుట కొకటి దిగుటకు ఒకటీ
ఎస్కలేటర్ - సోపాన నిశ్రేణి
కిందమెట్టుపై నిలబడినంతనె
కిందిమెట్టుపోయి పోయి పైకి
పై అంతస్థుకుచేరు సాధనాల్
వివిధ వస్తువుల విక్రయశాలల
విశాల విస్తృత విపణి కేంద్రాలు
శుభ్ర వేష భూషలు, భంగిమలతో
సజీవములుగా తోచు బొమ్మలూ
బొమ్మలవలె నిల్చి పోజులిచ్చే
ప్రచార శిల్పపు సుందరాంగులు!
కొన్నవస్తువుల ప్యాకెట్స్ పేర్చి
తోసుకొనే చక్రాల ట్రాలీలు!
వివిధవస్తువుల విక్రయశాలల
విశాల విస్తృత విపణి కేంద్రాలు !!

బాస్టన్, వాషింగ్టన్, పొలిమేరల
ఫిలడల్ఫియా శివారు నందునా
విపనీ యుక్రేనియన్ చర్చిలో
పీస్ కాటవే సభాస్థలి యందు
ఎన్.ఎస్. శాస్త్రి, లక్ష్మి నరసింహం

వై.యస్. రావు, కిడాంబి రఘునాథ
అర్.కె. జొన్నాదల యాజమాన్య
మందున జరిగిన అయిదు సభలలో
మారిస్ ప్లెయిన్స్ భావరాజు గృహము
మార్లబరో దత్తుగారి హాల్లో
తెలుగు సాంస్కృతిక మిత్ర మండలికి
వినోద వికాసములు కలిగిస్తూ
విందు చేశాను పాటలు మాటలు
అందుకొంటి హర్షామోదమ్ములు!

ప్రసిద్ధ వాగ్గేయకార కృషిలో
ఆంధ్ర సంస్కృతీ చరిత్రయందలి
అవిస్మరణీయ ఘట్ట వివరణము
సోపన్యాసముగా సంప్రదాయ
సంగీతముతో సాహిత్యముతో
సరస హృదులు వికసింప వినిపించి
తదనంతరమున రజనీ విరచిత
రాగ ధోరణులు వివిధ బాణీలు
వెలార్చు గేయమ్ములు పాడినాడ!

ఓంకారాత్మక విశ్వయానము
అన్ని సభల యందు దాఖరిగేయం !!

ప్రాక్పశ్చిమాలు దక్ దక్షిణాలు
సాగుజాతీయ రహదార్ల
ఈశాన్య రాష్ట్రముల చేర్చుమహా
నగరాలకలుపు రాజ పథాల
కుడి పంక్తినో యెడమపంక్తినైన
నడిపంక్తులందొకట గాని,
నగరమ్మునుంచి నగరమ్ముపోవు

వెంకన్నదత్ బృహద్రథము!
ఇరుపంకపచ్చ గుబురాకునిండి
ఎదిగేటితోట మడులు
మరియొక్క వంక ఆకులను రాల్చి
మోడులౌమ్రాకు గెడలు

నవంబరులో "అమెరికా యాత్ర" పాట కంపొజ్ చేశాను నాటిజ్ఞాపకాలవేడిలో... స్వదేశానికి తిరుగు ప్రయాణం ఖరారయింది.

వి.ఆర్.రావు, బి.వి.దత్, సూర్య, అతడి తండ్రి సర్వలక్ష్మి నాకు "సెండాఫ్" ఇచ్చారు

నవంబర్ 11న ఉదయాన్నే తిరిగి బొంబాయిలో కాలు పెట్టాను. శరత్, బాబు, తమ్ము అంతా నన్ను రిసీవ్ చేసుకున్నారు.

117. ప్రభంజన గీతి (తుఫాను పాట)

నివాత శూన్య స్తంభం, నిష్పీడన మంథానం
ఝంఝూవాత సంరంభం, ధ్వంస విధి విధానం ॥నివాత॥

పరిభ్రామ్య మాణ రోదసీరాక్షసి నిటలాక్షం
పశుపక్షి మనుష్య సౌఖ్యహరణ జీవనాటంకం
నలు పక్కల ఒత్తిళ్ళు, నడిబొడ్డున గుడిసుళ్ళు
పలువంకల స్వార్థప్రజ పాపాల్ చిలికే కవ్వం ॥నివాత॥

వైపరీత్య నాట్యరంగ సూత్రధార వక్రదండం
స్వైరవిహార విజృంభన మరున్మేఘ ఛత్రదండం
ఉఅవడి పరువుల కరువలి, ఉరుముల మెరుముల అలజడి
పెల్లగిలిన తోట, బాట, వరదల కూలు వంతెనలు
రథ్యలు రహదారులు తెగి, రాకపోకలవరోధాల్ ॥నివాత॥
(ఆంధ్రలో తుఫాన్ మే, 1990)

118. తన 78వ ఏట అనుకోకుండా మా ఆవిడ సుభద్ర కనుమూత

1926వ సంవత్సరంలో జన్మించి, 1940 లో నేను చేపట్టిన మా ఆవిడ సుభద్ర 60, 70 ఏళ్లకు పైగా నన్ను కంటికి రెప్పలా చూసుకుంటూ రత్నమాణిక్యాలలాంటి అనుగు బిడ్డలను ఆడా, మగా (2+3) అయిదుగురిని కని, మా ఇంటికి వచ్చి పోయే బంధు మిత్రులు అందరికీ ఆతిధేయురాలై, నాయిల్లు చక్కబెట్టుకుంటూ, ప్రభుత్వోద్యోగంలోనూ, ఆ తర్వాత విశ్రాంతోద్యోగాలలోనూ నేను కదలి వర్తిస్తున్న గ్రామ పత్తన నగరాలన్నీ తానూ చేరుకుని, 1990లో 60 ఏళ్లు నిండిన మా కల్యాణయాత్రకు కృతజ్ఞతతో, తిరుపతిలో మా యిలవేలుపయిన వేంకటేశ్వర స్వామీ పద్మావతీ దేవుల కల్యాణాన్ని తిరుపతిలో తన సమక్షంలో జరిపించి, 2003 వ సంవత్సరం జూలై 15వ తేదీ (ఆషాఢ పూర్ణిమ వెళ్లిపోయిన బహుళ తదియ రోజు రాత్రి 12.30 గంటల ప్రాంతాన మా పెద్దబ్బాయి హేమచంద్ర యింట్లో ఆకస్మికంగా గుండెపోటు వచ్చి, మా పెద్ద కోడలు ప్రసూనా, పెద్దమ్మాయి రమణకుమారీ వాళ్లని దగరికి తీసుకోబోతూ, తాను వాళ్లకి దగ్గరకాబోతూ కన్ను మూసి పడిపోయింది. మా అబ్బాయి వెళ్లి డా॥ నంబియార్‌ని తీసుకొచ్చాడు. అప్పటికే, "ప్రాణం ఎగిరిపోయింది" అని చెప్పారు డాక్టరుగారు అంతంవైపు పయనం ఇలా సాగింది.

'రజని'కి సతీవియోగం అని జులై 16వ తేదీ ఆంధ్రప్రభా, ఆంధ్రజ్యోతి దినపత్రికలు వార్తను ప్రచురించాయి.

2003 జూలై 27 ఆదివారం శుద్ధీ, ఉద్యాపనా (శాంతిపాఠం)

"ఆవిడ" ఆకస్మాన్నిష్క్రమణం"

తత్తరాన కోడలినెదహత్తుకొరకొ
తడుముకొంటివి కూతుకైదండకొరకొ,
గుండె పోటుపశమింపగోరియేమొ!
కిందికి దిగజారుతూ నిన్నందనైతి
చేయిచాచి నాయెద నిన్ను చేర్పనైతి
నిలువుచూపుతో నీవటునేలవ్రాల
ఊరకే పక్కనిల్చుండి యున్న నేను
అట్టెయుండి పోయితినెట్టికట్టుబాటొ!

119. మా అన్నయ్య 'నళిని' - మహాప్రస్థానం

వేంకట పార్వతీశ్వరకవులలో ఒకరైన బాలాంతపు వేంకట్రావు గారికి, వేంకటరమణమ్మ గారికి (మా తల్లిదండ్రులు) మే 9, 1915వ సంవత్సరములో నిడదవోలు గ్రామంలో మొదటి సంతానంగా పుట్టిన నళినీ కాంతరావు మా అన్నయ్య. 1920 జనవరిలో నేను పుట్టాను. 1922లో మా చెల్లెలు అనురాధ (పాపయమ్మ) పుట్టిన తొమ్మిది రోజులకి మా అమ్మగారు పోయింది నా చిన్నతనంలో నేను మొదలు పెట్టిన చాలా వ్యాసంగాలకి మా అన్నయ్యే మార్గదర్శకుడు నేను వ్రాసి, వరుసలు కట్టి పాడే పాటలన్నింటికి అన్నయ్య మెప్పు, అప్రూవల్ కావాలి అవి ఒక పట్టాన రావు ఎందుకంటే అప్పటికే ఆయన ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యాలని ఒక పట్టు పట్టి ఒక నిశిత విమర్శకుడిగా తయారయ్యాడు. తను కూడా చాలా గీతాలు, పద్యాలు వ్రాసేవాడు కాని అవి అతనికే నచ్చేవి కావు. పెర్ఫెక్షనిస్టు. ఏ విషయంలోనూ, ఎక్కడా కాంప్రమైజ్ కాడు.

ఎఱ్ఱటి ఎరుపు, ఆరు అడుగుల పొడుగు, నిటారుగానడుస్తూ, చూపరుల నిట్టే ఆకర్షించే విగ్రహం. ప్రపంచంలో ఏదీ తను అనుకున్నట్టుగా జరగడం లేదనే అసహనం, కోపం. దానితో మొహం అంతా ఎఱ్ఱగా వెలిగిపోతూండేది తరచుగా.

ఇంతటి అహంభావుకతతో బాటు సిగ్గరి కూడా, చొరవగా నలుగురిలోకి వచ్చి భావప్రకటన చేసే స్వభావం లేదు. ఇంటికి ఎవరైనా రాగానే భుజంమీద వున్న తువ్వాలుని ముఖం మీద వేసుకుని లోపలికి వెళ్ళి పోయేవాడు. తరచూ వచ్చే త్రిపురనేని గోపీచంద్‌లాంటి స్నేహితులు "షోడో"గారు ఏరి? ఎప్పుడూ కనపడడేం? వినపడడేం? అని విసుక్కుంటూ ఉండేవారు.

ఇక నా బాల్య జ్ఞాపకాలలోకి ఎళ్తే, పిఠాపురం హైస్కూల్‌లో ప్రతి క్లాసులోనూ పైకి వెళ్లే సరికి, అక్కడి పిల్లలు, మాష్టర్లు నువ్వు నళినీ కాంతరావు తమ్ముడివా? అని అడుగుతూ ఉంటే నాకు గర్వంగా ఉండేది. ఏదైనా సబ్జెక్టులో నాకు మార్కులు తక్కువ వస్తే నళినీ కాంతరావు తమ్ముడివి, మార్కులు ఇలా వస్తే ఎలాగా? (మా అన్నయ్య అన్ని సబ్జెక్టులలో, ఆటలలో ఎప్పుడూ ఫస్టే) అని మాస్టర్లు ఎవరైనా అడిగితే, నేను అభిమానపడి, ఆ సబ్జెక్టులలో ఎక్కువ మార్కులు వచ్చేలా కృషిచేసేవాడిని. ప్రతి రోజూ వంటి మీద పట్టీలు వేసుకుని ఇంటికి వచ్చేవాడు అతను ఆడే ఆటలు అటువంటివి. చెడుగుడు, వాలీబాల్, ఫుట్‌బాల్ యిత్యాదులు నాకు ఆటల్లో ఎప్పుడూ ఇంటరెస్టు కలగలేదుగాని, అతని ఒంటినించి నిత్యం వచ్చే ఆయింట్‌మెంట్, బెంజోయిన్ వాసనలు ఇప్పటికీ నాకు జ్ఞాపకం. అర్భకుడు, దుర్బలుడు అని నన్ను దూరంగా వుంచి ఇంటి ఆటపాటలలోకి, నాకన్నా ఒకనెల పెద్దయిన మా పినతండ్రి గారి అబ్బాయి ప్రసాదం అన్నయ్యని

దగ్గర తీసేవాడు. అది నాకు ఈర్ష్యగా ఉండేది. అయితే నాటకాలలోను, సంగీత పోటీలలోను, ప్రైజులు కొట్టి, మాస్టర్లచేత, తోటి విద్యార్థుల చేత మా అన్నయ్య పేరు నిలబెడుతున్నానని అనిపించుకునేవాడిని.

నేను పిఠాపురంలో పిప్పపారం చదువుకునే రోజులలో దసరా సంగీత ఉత్సవాలని చూడడానికి మా నాన్నగారి ప్రత్యేక పర్మిషన్‌తో కాకినాడ వెళ్ళాను అప్పటికే అక్కడ పి.ఆర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న మా అన్నయ్య, లేడీస్ హాస్టల్‌లో ఉండే తన స్నేహితురాళ్ళ దగ్గరికి పంపి నా పాటలతో వాళ్ళని రంజింపచేయడం నాకిష్టమైన జ్ఞాపకాలలో ఒకటి. ఆ స్నేహితురాళ్ళు నా చేత తినిపించిన చాకోలెట్, ఫ్లేవర్డ్ బిస్కట్ల తీపిరుచులు నా నాలుకచివర ఇంకా అలానే ఉన్నాయి.

కాకినాడ పి.ఆర్. కాలేజిలో నేను ఇంటర్ చదువుతుంటే మా అన్నయ్య బి.ఎ. చదువుతుండేవాడు మేమిద్దరం జంగం దేవర వేషాలు వేసి కవికొండల వెంకట్రావు గారి "శివరాత్రి ప్రభ" పాటని కాలేజి స్టేజి మీద ప్రదర్శించాము. అచంట జానకిరాం గారి "సాగుతున్న యాత్ర"లో ఈ ఈవెంట్ గురించి చాలా వివరాలతో వ్రాసారు. అనార్కలీ నాటకంలో బి.వి. నర్సింహారావు అనార్కలి వేషం, నళినీ కాంతరావు అంబరు రాకుమారి వేషాలు వేశారు.

నన్ను ఆంధ్ర యూనివర్సిటీలో చేర్చడానికి మళ్ళీ మా అన్నయ్యే తోడుగా వైజాగ్ వచ్చారు నన్ను హాస్టల్లో చేర్పించి తను వెనక్కి వెళ్ళిపోతూంటే నేను బెంగతో బావురుమన్నాను.

అన్నయ్య మద్రాసు క్రిస్టియన్ కాలేజిలో యం.ఎ. ఇంగ్లీష్ లిటరేచర్ చదివి తరువాత లా కాలేజిలో బి.యల్. చదివే రోజులలో శ్రీమతి దుర్గాబాయమ్మగారు సహాధ్యాయిని. (తరువాత కాలంలో శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్) 1941 లో దుర్గాబాయమ్మగారితో కలిసి, అంతవరకూ అక్షర జ్ఞానంలేని మహిళలు మూడు సంవత్సరాలలో బెనారస్ మెట్రిక్ పరీక్షకి కూర్చునేలా ఒక కోర్సు, సిలబస్ తయారు చేశారు బెనారస్ మెట్రిక్ శిక్షణ పొందడానికి నెల్లూరు నుంచి బరంపురం దాకా వుంటున్న అనేక మంది ఆంధ్ర మహిళలు మద్రాస్ వచ్చి మహిళాసభలో చేరేవారు. ఆంధ్ర మహిళా సభకు అంకురార్పణ ఆ విధంగా జరిగి, ఆ తరువాత మహా వటవృక్షంలా పెరిగి పెద్దదయింది. ఆంధ్ర మహిళా సభకు ముందుగా "లిటిల్ లేడిస్ ఆఫ్ బృందావన్" పేరుతో మొదలైన చిన్న సంస్థకి, సంగీత, నృత్య రూపకాలను తయారుచేసి వాటిని పిల్లలకి నేర్పించి ప్రదర్శించడంలో అన్నయ్యదే ముఖ్యపాత్ర.

ఖాసా సుబ్బారావు గారి సంపాదకత్వంలో వెలువడిన "స్వరాజ్య" "తెలుగు స్వతంత్ర" మొదలైన పత్రికలలో పనిచేసి, జర్నలిస్టుగా "ది మెయిల్" ఇంగ్లీష్ దినపత్రికలో స్థిరపడ్డాడు ఆ

తరువాత ఎమెస్కోవారి పాకెట్ బుక్ సిరీస్‌లో సంపాదకుడిగా వ్యవహరిస్తూ మనుచరిత్ర, వసు చరిత్ర, ఆముక్తమాల్యద, క్రీడాభిరామము వంటి తెలుగు ప్రబంధాలు వెలుగులోకి రావడంలో తోడ్పడ్డాడు. బొమ్మకంటి శ్రీనివాసాచార్యులుతో కలిసి తెలుగు చాటువుల మీద సవిస్తరమైన సమాచారం సేకరించి పుస్తకరూపంలోకి తీసుకువచ్చాడు. ఓరియంట్ లాంజ్మన్స్ వారు ప్రచురించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్యానికి సంపాదకుడిగా వ్యవహరించాడు.

1935 ప్రాంతంలో పుచ్చలపల్లి సుందరయ్యగారు అండర్ గ్రౌండ్‌లో వుంటూ కాకినాడలో మా ఇంట్లో తలదాచుకోవడం జరిగింది. ఆ సమయంలో మా పెద్దనాన్నగారి కుమారుడు బాలాంత్రపు సత్యనారాయణ ప్రోద్బలంతో **"కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్" తొలి తెలుగు అనువాదం అన్నయ్య చేయడం చారిత్రాత్మక వాస్తవం. "ఆకలి మంటల మలమల లాడే అనాథలందరు లేవండోయ్"** అనే పల్లవితో మొదలయ్యే ఈ అంతర్జాతీయ సామ్యవాద గీతం ఆరుద్ర వ్రాసిన సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో ప్రముఖంగా పేర్కొనబడింది. కమ్యూనిస్టు ఉద్యమం ఆంధ్రదేశంలో అడుగిడుతున్న తొలినాళ్ళలో వారి అన్ని సభలు ఈ పాటతో మొదలయ్యేవని అప్పటి మిత్రులు చెపుతుంటారు.

పూర్ణాయుర్దాయాన్ని అనుభవించి, మా వదిన జ్యోతిష్మతి గారిని (పెద్దాడ రామస్వామి గారి కుమార్తె) రత్నమాణిక్యాల లాంటి ఐదుగురు పిల్లలని (యిద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు) కోడళ్ళని, అల్లుళ్ళని, మనుమలని, అతన్ని అహర్నిశలు ప్రేమిస్తూ, అతని మెచ్చికోళ్ళు విమర్శలకోసం ఎదురుచూస్తూ వుండే మా బోంట్లని వదిలేసి, మొన్న ఏప్రియల్ 29న మా అన్నయ్య పై లోకాలకి వెళ్ళిపోయాడు. మిత్రుడు శ్రీశ్రీ అన్నట్లు అతను చివరిదాకా "ఖద్దరూ కేకలూ" వేశాడు.

అన్నయ్య మాటల్లోనే

గుండె గుండియలోన గుబగుబలాడు వాడు - నళిని
గుండె గొంతుకలోన కొట్లాడువాడు వీడు - రజని

120. బి. నటరాజన్ (1988)

బి. నటరాజన్ నాగురించి తను 'శ్రీకృష్ణ లీలాతరంగిణి' అనే ఆంగ్ల గ్రంథంలో ప్రస్తావిస్తూ, గుంటూరులో ప్రొఫెసర్ కె.వి.కె. రావు రజనీగురించి చెప్పిన విలువైన సమాచారం కూడా అందించారు. ఈ రజనీకాంతరావుగారితో నేను అనేకసార్లు తీర్థులవారి గురించి చర్చించటం జరిగింది. ఆయన తమ విలువైన చర్చలతోపాటు నాకు తీర్థులవారు, జయదేవుడు, సిద్ధేంద్రయోగి, క్షేత్రయ్యలపై అపురూపమైన పరిశోధన సామగ్రి విశేషాంశాలు అందించారు ఆయనతో తీర్థులవారి స్వగ్రామమైన (కాజ) సందర్శించటం మరువరానిది" అని వ్రాసేరు. పాత జ్ఞాపకం అలా మాటల్లో గుర్తుచేశారు.

ఆచార్య కె వి.కె రావు మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చదివే అన్నయ్యకు ఇంగ్లీషు ఎమ్.ఏ లో సహపాఠి. సంగీత ప్రియుడు. శోభానాయుడు (నాట్యకళాగురువుకి శోభానాయుడికి మాతృ సోదరుడు. మేనమామవరుస).

121. యక్షగాన ప్రక్రియ - ఆధునిక ప్రగతి

ఒకానొక ప్రత్యేక సంచికలో (1985) యక్షగానం నిన్న నేడు అనే వ్యాసంలో రచయిత ఆచార్య శ్రీరాం భుజంగరాయశర్మ రెండు సార్లు, ఈ గ్రంథకర్త పరిశోధన ఫలితాలనూ, సాహిత్య సంగీత రచనా వ్యాసంగమునూ, ప్రశంసా పూర్వకంగా స్మరించడం ఎంతో సంతోషకారి, ఆ ప్రశంసలు ఇక్కడ స్పర్శించడం అప్రస్తుతం కాదు. శ్రీ శ్రీరాం భుజంగరాయశర్మ నాకు బాగా (10 ఏళ్ళు) జూనియరైనా తెలుగు ఆనర్స్‌లో పింగళివారి శిష్యత్వంలో నాకు సహపాఠి. కావలి లో జవహర్ భారతి కళాశాలలో తెలుగు లెక్చరర్, ఆ తర్వాత ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.

"కూచిపుడి వారి సిద్ధేంద్రుల భామాకలాప రచన అన్నమాచార్యుల కన్నా ముందు జరిగిందనీ, భామాకలాపప్రదర్శనను అన్నమాచార్యులు చూచినట్లు ఆధారాలు అన్నమాచార్య శృంగార సంకీర్తనలు రెంటిలో కనబడతున్నాయనీ బా.ర. రావు గారు (రజని) నిరూపించటం వల్ల 14వ శతాబ్దినుండి కూచిపూడివారు కలాపం అనే ప్రక్రియను చేపట్టారనీ, దానికి భిన్నంగానే యక్షగాన ప్రక్రియ సాగిందనీ తెలుస్తోంది".

కలాపం అనే ప్రక్రియకు మూలబీజం 'శ్రీగదితం' అనే దేశిజాతికి చెందిన భరతోత్తరకాలంలో (భరతమునికి తరువాతి శతాబ్దులలో) వర్థిల్లిన ఉపరూపకాలలో ఒకటి అనీ, దానికి భావప్రకాశికలో శారదాతనయుడిచ్చిన లక్షణం - భామాకలాప గొల్లకలాపాదులకు 'సొంతం'గా అతికి పోతుందని మేము ఇంతకు పూర్వం చర్చించిన అనుబంధ ప్రకరణాలలోను, 'ఆంధ్రి' - అనే శీర్షికను మధ్యయుగపు ఆంధ్రుల నృత్యసంగీత పరిణామాలను ప్రదర్శించిన ప్రకరణంలోను స్పష్టం చేశాము. ఇతివృత్తం తీర్పులో భేదమేకాని 'కలాపం' ఎక్కలగాణ, యమళగాణలలో రెండవదానినుంచి రూపొందిందన్న మాటేకాని, దానిలోని కందార్థాది దరువులూ, పద్యాలూ, సంధివచనాలూ ఉక్తి ప్రత్యుక్తకాలూ యక్షగాన పరిణామపూర్ణ స్వరూపానికి చెందిన అంగప్రక్రియలన్నిటితోటీ పూర్తిగా ఏకీభవించి యక్షగాన గేయబంధ చట్రంలో ఇమిడిపోతుంది కలాపాలలో పారిజాత కలాపం అని మరొక్కపేరు కూడా వినబడుతుందికాని, పాత్రబాహుళ్యంతో అది రానురాను యక్షగాన పూర్ణరూపంతో తులతూగేలాగే పరిణామం చెందింది. ఈ ఇతివృత్తాలూ ఈ విధమైన రూపకాలూ 'కీర్తన్' అనే రూపంలో వంగదేశం, మణిపూరులలోను అంకియానాట్యా అనే పేరుతో అస్సాం (కామరూప)లో శంకర దేవ, మాధవదేవులనే అద్వైతయోగులైన రూపకకర్తల ద్వారాను భక్తి ప్రచారం చేశాయి అని ఇదివరకటి ప్రకరణాలలో ఒకటి రెండు సార్లు చెప్పాము.

శ్రీ శర్మగారు తమ వ్యాసంలో రెండవసారి 'అస్మత్' ప్రశంస చేసినది "దేవులపల్లి కృష్ణ శాస్త్రిగారూ, బాలాంత్రపు రజనీ కాంతరావుగారూ కలిసి 1960లో 'క్షీరసాగరమథనం' వ్రాసి ఆధునిక యక్షగానప్రక్రియకు రచనాపరంగా శ్రీకారంచుట్టారు దీని సాహిత్యానికి నాట్యపరమైన రూపకల్పన చేసి వెంపటి చిన సత్యంగారు ఆధునిక యక్షగాన ప్రక్రియకు ప్రదర్శన పరంగా నాంది పలికారు. సంప్రదాయ గంధం దట్టంగా పట్టిన శాస్త్రీయరాగాల వరుసలు సమకూర్చి 'రజనీ .. గారు' దీనికి అపూర్వశ్రావ్యమైన సంగీతరక్తిని కలిగించారు".

అని ప్రకటించి ఆ తరువాత 'కృష్ణ రజనీ' మహోదయులు వేసిన మార్గంలో పయనించి నేనూ పద్మావతి శ్రీనివాసం, కల్యాణరుక్మిణీ వంటి కొన్ని ఆధునిక యక్షగానాలు రచించాను ఈ ప్రక్రియ నేడు అంతర్జాతీయ 'బాలే' ల (సంగీతనృత్యరూపకాల) స్థాయికి ఎదిగింది పాత్రలు పెదవులు కదల్చటమేకాని పాడనవసరంలేని నేపథ్యగాన 'వసతి' నర్తన. నృత్య నాట్యాల మేళవింపులోని రక్తియోగ గమనంలోని వేగంవల్ల సామాజిక హృదయాలలో ఉప్పొంగే కౌతుకం ఆధునిక యక్షగాన ప్రక్రియకు క్రొత్తరూపాన్ని కల్పించాయి. సాహిత్యంలో, సంగీతంలో, నాట్యంలో ఈ ప్రక్రియ గడి తేరింది. తెలుగువారి సకలకళా సర్వస్వమై తెలుగువారి కాల్పనికతకు నికషోపలమై తెలుగువారి రసజ్ఞతకు కాణాచిగా ప్రపంచంలోని బహుదేశాల్లో గుర్తింపు పొందింది నేడిది అన్నివిధాలా తెలుగుల కీర్తిపతాక!"

ఆధునిక యక్షగాన ప్రక్రియ కీర్తిపతాకను ఆకాశానికి ఎత్తుతూ చేసిన ప్రశంసలో 'శ్రీకారం' చుట్టిన మార్గదర్శిత్వం 'కృష్ణ రజనీ' మహోదయులదని ముక్త కంఠంతో తన వ్యాసంలోనేకాక, వేదికలపై కూడా ప్రకటిస్తూ వచ్చిన శ్రీభుజంగరాయ శర్మ సహృదయతతో సజ్జనతతో జ్యేష్ఠ సహపాఠియైన రజని పట్లా గురుస్థానీయులైన కృష్ణశాస్త్రి పట్లా గౌరవం ప్రకటించడం ముదావహం.

వెంపటి చినసత్యంగారి నృత్యదర్శకత్వంలో శ్రీ భుజంగరాయశర్మ రచించిన 'శాకుంతలం' నృత్యగేయ నాటికకు - శ్రీద్వారం భావనారాయణరావు సంగీతం సమకూర్చారు. 1972 లో చినసత్యంగారు 'రజని' 1942-43 లో రచించిన మేనకావిశ్వామిత్ర నృత్యగేయనాటికను తీసుకుని, శ్రీమతి చల్లాసంగీతంతో శర్మగారి శాకుంతలానికి పూర్వరంగంగా రెండునాటకాలను ముందు మేనకా విశ్వామిత్ర, తరువాత శాకుంతలమూ రెండింటినీ ప్రదర్శించేవారు. శర్మగారు రచించిన 'చండాలిక' అనే రవీంద్రనాథ ఠాకూర్ నృత్యనాటికకు అనుసరణగా మల్లిక్ సంగీతంతో ఒకనాటికనూ, ఆ తరువాత 'హరవిలాసము' అనే శివలీలాత్మక నృత్యనాటిక నొకదానినీకూడా వెంపటివారి బృందం ప్రదర్శిస్తూ ప్రశస్తి చేకూర్చుకున్నారు.

ఇకపైని రజని కృషిని గురించీ దాని ఫలితాలను గురించీ ఏం వ్రాసినా అదంతా ఆధునిక యక్షగాన ప్రగతి చరిత్రే అవుతుంది అందులో రజని కేవలం నిమిత్తమాత్రుడు.

"కవిబుధగురు మిత్రస్థితి
కువలయహితకరత దక్కకొను గీతాలా
పవిదగ్ధత, రజనీకాం
తువిశిష్టత గూర్చి వ్రాయుదును తుదిపుటలో!"

అని ఆంధ్రవాగ్గేయకార చరిత్ర కృత్యాదిని చేర్చిన అంకితపు పద్యాలలో చేసిన ప్రతిజ్ఞను ఈ అనుబంధ ప్రకరణాలలో చిట్టచివరనైనా పాలించగలిగాము అనే సంతృప్తికోసం 'రజని' నిత్యగేయనాటికలా యక్షగానములా రచనా ప్రదర్శనల గురించి - ఈ ఆధునిక యక్షగాన రచనా ప్రక్రియ ప్రగతిలో భాగంగా ఇక్కడ క్లుప్తంగా స్మరిస్తాం

1939 40 లలో రజని రచించిన తొలిగేయనాటిక వంగకవియైన చండీదాసుజీవితగాథ. జయదేవుని తరువాత ప్రాచ్యదేశంలో 'చండీదాస్' పదావళికి 'కీర్తన్' అనే హరిదాసినీ గాన శైలికీ అత్యంత ప్రాధాన్యం చేకూరింది. రవీంద్ర సంగీతమూ, న్యూ థియేటర్సు హిందీ చిత్రాల సంగీతదర్శకులూ గాయకులూ అయిన ఆర్ సి బోరాల్, పంకజ్ మల్లిక్, సైగల్‌ల ద్వారా ఆంధ్రయువలోకాన్ని 30, 40 దశకాలలో ప్రభావితం చేసిన బంగాలీ 'కీర్తన్' శైలిలో చండీదాసు

నాటకానికి రజని సంగీతం ధాతుమాతు సంయుక్తంగా వెలువడింది 1941 ఫిబ్రవరిలో మద్రాసు రేడియోనుంచి ప్రసారం అయిన ఈ నాటకం ఆంధ్రమహిళాసభ (మద్రాసు) రంగస్థల వేదికపై స్వామ్రాజ్యం రమణరావు నృత్యదర్శకత్వంలో నృత్యగేయనాటకంగా ప్రదర్శితమయింది. దీనిని **అధునిక నృత్యనాటకం (బ్యాలే) గా పరిగణించవచ్చు.**

శ్రీమతి దుర్గాబాయ్ (దేశ్‌ముఖ్) 1942 నుంచీ, రజని చేత కొన్ని నృత్యగేయముక్తకాలను (ప్రత్యేకగేయాలను) నృత్యగేయనాటికలను రచింపజేసి, ఆంధ్రమహిళాసభ బాలికల చేత ప్రదర్శింపజేసేవారు. ఆ విధంగా తయారయినవే **'శతపత్ర సుందరీ'** గేయమూ 'సంధ్యాదీప' గేయమూ **వీటికి కుల్‌కర్ణి శ్రీనివాస్, దేబీ ప్రసాద్ ఘటక్ అనే నృత్యదర్శకులు** నృత్యం సమకూర్చారు. **'మేనకా విశ్వామిత్ర' అవిర్భావం** 1942లో ఆంధ్ర మహిళాసభలోనే. తరువాత **'సుభద్రార్జున'** గేయ నాటికా **(చిన్నపిల్లల) వసంతోత్సవం, మధురానగరిగాథా** నృత్యనాటికాలు తయారు కావడానికి మహిళా సభా వార్షికోత్సవాలూ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రోత్సాహమూ 'కారణంబులు. ఉద్బోధకములు' ఈ నాటకాలకు కోరియోగ్రఫి రంగనాయకమ్మా కణ్ణన్, స్వామ్రాజ్యం రమణరావుగారలు.

మధురానగరిలో చల్లనమ్మబోదు అనే సాంప్రదాయిక గోపికా గీతములో గోపికోక్తులకు కృష్ణుని ప్రత్యుక్తులను చేర్చి యుగళగేయంగా కూర్చి దానిచుట్టూ దేశిరూపక పద్ధతిలో 'మధురానగరిగాథ' అనే నృత్యసంగీత నాటిక **1943లో రేడియోలోనూ ఆతర్వాత 1944లో** వెంపటి పెదసత్యంగారి **కోరియోగ్రఫీతో ఆంధ్రమహిళాసభలోను, గూడపల్లి రామబ్రహ్మంగారి సమక్షంలో సారథీ స్టూడియోస్‌లోను వెంపటి పెద సత్యంగారు కూచిపూడి నర్తకబృందం సాహాయ్యంతో** ప్రదర్శించారు. ఆనాడే రజని గళంలో కలంలో యక్షగాన రచనాంకురాలు నాటుకున్నాయి. ఈలాంటి రూపకాలలోని దేశినుడికారాలూ దేశిరాగాలమెట్లూ - కూర్చడమెలాగా అనే తపన సాటికవుల్లో కలగడానికి **కొంతకాలం పట్టినట్లుంది.**

1942-44ల మధ్య గౌతమబుద్ధుని జీవిత ఘట్టాలు ఇతివృత్తంగా రచించి 'దివ్యజ్యోతి' వచనసంభాషణలతో మాత్రాచ్ఛందస్సులలో గేయాలతో కూర్చిన అరు అంకాలనాటకంలోని మాయాదేవి స్వప్నం. **సిద్ధార్థ జననం, సిద్ధార్థుని నగరసంచారం, మహాప్రస్థాన ఘట్టాలలోని గేయాలన్నిటికి ఫక్తు కర్ణాటక సాంప్రదాయిక రాగాలతో కూర్చిన సంగీతంతో** నృత్యగేయనాటికలుగా ప్రదర్శితాలు.

1942 55 ల మధ్య కూచిపూడి మేలటూరి భాగవతమేళ బృందాల నాటకాల రేడియో ప్రసారాలలో పాల్గొని, తెలుగువారి మొదటి యక్షగానమైన సుగ్రీవ విజయాన్ని సంగీత పరచి మద్రాసులో తొలిప్రసారం చేయించీ, తెలుగువారి మహాయక్షగానమైన నారాయణ తీర్థుల

కృష్ణలీలాతరంగిణి నుండి వేరువేరు ఘట్టాలు, కృష్ణుని బాల్యలీలలూ, రాధాగోవింద, గోపీరాసవిలాసమూ, రుక్మిణీకల్యాణమూ, వేరువేరు ప్రసారాలలో మద్రాసునుంచి వెలువరించి, 1955లో ఆంధ్రవాగ్గేయకారచరిత్ర రచన చేస్తున్న సందర్భంలో యక్షగానం గురించి, మూడునాలుగు వేరువేరు ప్రకరణాలు సవివరంగా సాధికారంగా వ్రాసేసత్తువ కలిగింది రజనికి

1956లో విజయవాడకు బదిలీ అయిన రజనికి - కూచిపూడివారి నాటకాల సాహిత్యాన్ని పరిష్కరించేప్రయత్నాలు చేస్తున్న శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారితోను, సంగీతాన్నీ రాగప్రయోగాల సాంప్రదాయికతనూ పరిశీలించి నిర్దుష్టం చేయపూనుకున్న శ్రీవోలేటి వెంకటేశ్వరులుతోను సహకరించి, శ్రీ బందావారు కృషిచేస్తుండిన కూచిపూడివారి ఆహార్య, రంగప్రసాధనాది ప్రయోగాలలో ఆకర్షణీయతా, సాధికార సాంప్రదాయికతా సమన్వయ ప్రయత్నాలకూ, సిద్ధేంద్రకళా క్షేత్ర నిర్వహణ కార్యకలాపాలకూ సాక్షిభూతుడుగా - 1956 అక్టోబరు మాసం ప్రాంతంలో కూచిపూడి నాట్యబృందం దక్షిణదేశయాత్ర చేసినపుడు 'కూచిపూడి నాట్యమేళా' అనే రజని రచించిన ఆంగ్ల వ్యాసాన్ని మద్రాసు నుంచి వెలువడిన ప్రసిద్ధ ఆంగ్లదిన పత్రికలో రెండు వారాలు జైత్రయాత్రా ప్రచారభేరిగా ప్రకటించడమయింది. ఆ తరువాత కూచిపూడి బృందం ఢిల్లీలో విజయపతాక ఎగరవేసి, భారత ప్రభుత్వగౌరవ మర్యాదలు పొంది విజయవాడ తిరిగి వచ్చినపుడు రజని రచించిన "అభినందన" కూచిపూడి శైలి కందార్థదరువులో శ్రీ పసుమర్తి వేణుగోపాల శర్మ బృందం నృత్యగానాభినయాత్మకంగా ప్రదర్శించారు.

1956 60ల మధ్య ప్రతియేడూ కూచిపూడిలో జరిగే సిద్ధేంద్ర సంస్మరణ వార్షికోత్సవాలకు కూచిపూడి వెళ్లివస్తుండే రజని కంఠం నుంచి వెలువడిన మిశ్రచాపుదరువు కూచిపూడి వేదికపై ఇలా మారుమ్రోగింది.

"తద్ధణా తోంద్రిగుడు తఝ్ఝణుధీంతనా తకధీం తనా
దత్తిలాకోహల భరతులే ఎత్తిరే మరుజన్మము,
సిద్ధనారాయణ క్షేత్రయ లిద్ధరాతలి నుద్ధరింపగ॥తద్ధణా॥
ప్రకృతియనియెడు క్షేత్రమే బహుపాత్రలౌ నాయికలుగా
పరమపురుషుడు నిర్గుణుడు క్షేత్రజ్ఞుడే నాయకుడుగా
జీవునకు దేవునకు సతిపతి భావమాపాదితముగా
భాగవతనాట్యాభినయముల ప్రజలజీవన్ముక్తులౌనరుప
దత్తిలాకోహల భరతులే యెత్తి రేమరుజన్మము.
సిద్ధనారాయణ క్షేత్రయలిద్ధరాతలిముద్ధరింపగ" ॥తద్ధణా॥

1958 ప్రాంతంలో రజని రచించి విజయవాడనుంచి ప్రసారంచేసిన ఆధుని నృత్యసంగీతనాటిక 'స్వైరిణి అన్నారుననన్ను' - ఇందులో యక్షగాన ప్రక్రియరూపాలు వెదకులా కనిపిస్తుంది నాటకీయతా, నృత్యాభినయ ప్రయోజనీయతా ఉంటూ సాంప్రదాయికత ఒక గేయంలో చేతికందుతూ, మరోగేయంలో ఆధునిక రూపాన్ని అందుకుంటూ సాగుతుంది.

ఆ సంవత్సరం ప్రాంతంలోనే రజని శ్రీకాటూరి వేంకటేశ్వరరావుగారి పక్కన కూర్చుండి వేరు వేరు రీతుల దరువులా పదాలా మాత్రాచ్ఛందాలలో వేరువేరు రాగాలలో సాభినయంగా పాడుతుంటే 'శ్రీనివాస కల్యాణం' అనే యక్షగానాన్ని రచించారు. రజని సంగీతంతోనే అది తొలిసారి రేడియో ప్రసారం అయింది.

1960లో విజయవాడ నుంచి హైదరాబాదు ఆకాశవాణికి రజని బదిలీ అవడమూ అక్కడి సాహిత్య ప్రయోక్త కృష్ణశాస్త్రిగారి జతకలియడమూ జరిగింది. అంతవరకూ ఆధునిక సంగీతనాటకాల రచనకు అభ్యాస పడిన కృష్ణశాస్త్రిగారు 'కాటూరి బావగారి చేత వ్రాయించినట్లే నాచేతకూడా ఒక యక్షగానం పాడుతూ వ్రాయించు రజనీ' అని ఆయన అడిగారు 'క్షీరసాగరమథనం' ఆవిధంగా షెడ్యూలయింది రజని ఎన్ని రకాల దరువులు వరసలు పాడినా యక్షగాన పద్ధతి రచన కృష్ణశాస్త్రిగారి మనోధర్మాన్ని ప్రభావితం చెయ్యడానికి కుదరలేదు. ప్రసారపు తేదీ దగ్గర పడుతోందనగా, ముఖ్యమైన పాత్రల ప్రవేశికీదరువులూ, ముఖ్యఘట్టాల దరువులూ రజని కాగితం మీద పెట్టేసి, స్టూడియోకు కళాకారులనుపిలిపించి, వాళ్ళకి పాటలు నేర్పి ఒద్దికలూతీర్చేవేళకి, కృష్ణశాస్త్రిగారి కలానికి భరతావేశంకలిగి కొన్ని పంక్తులను కొన్ని మాటలను తనకు కావలసిన రీతిని దిద్దుబాటులు చేసి, జంటకవితగాపూర్తిచేశారు.

'అంబా హెచ్చరికా' - అనే ప్రారంభదరువులో
"శ్రీకృష్ణదాసచకోరపూర్ణిమా రజనీ కాంతోదయా దయారాశిహెచ్చరికా
అంబా హెచ్చరికా అపర్ణాహెచ్చరికా సాంబశివుని ప్రేమధనిహెచ్చరికా"

ఆ 'క్షీరసాగరమథనం' హైదరాబాదు నుంచి ప్రసారం అయి, విజయవాడ రిలే చేసింది దాని రచన రజనీ కృష్ణశాస్త్రిగార్లదీ, సంగీతం రజనిదీను! దాని రికార్డింగ్ విజయవాడ తీసుకువెళ్ళి శ్రీబందాకనకలింగేశ్వరరావు, కూచిపూడి నాట్యాచార్యులలో హేమాహేమీల చేత రంగస్థలంపై ప్రదర్శింపజేశారు. అది యక్షగానప్రక్రియ ఆధునిక ప్రగతిలో మొదటి అంజ!

రెండవఅంజ విప్రనారాయణ. ఈ యక్షగానం రచించే నాటికి కృష్ణ శాస్త్రిగారి మనోధర్మం యక్షగాన పద్ధతి దరువుల రచనకు పూర్తిగా సుముఖం అయిపోయింది. రజని సంగీతంతో కృష్ణశాస్త్రి

సాహిత్యరచనతో విజయవాడ కేంద్రం రికార్డు చేసి అన్ని కేంద్రాలూ ప్రసారంచేసిన ఈ యక్షగానంలో ప్రధాన పాత్రలు **డా. బాలమురళి విప్రనారాయణుడు, శ్రీరంగంగోపాలరత్నం దేవదేవి.** ఇందులోని దరువులు కొలువైతివా రంగశాయీ (రామప్రియ) ఔరాఔరౌరా - (మోహన) వెడలేరా ఒయ్యారులు (కేదారగౌళ) వెడలేనిదే దాసరిసాని వేషముతో దేవదేవి (సైంధవి) వానలోనతడవుండీ తడిసేవుకాబోలు (చలనాట) ఇవి శ్రోతలకు అత్యంత ఆకర్షణ పాత్రములయాయి.

ఈ నాటకాన్ని కూడా బందాగారు రికార్డింగ్ సహాయ్యంతో కూచిపూడి నాట్యాచార్యులకు అందజేశారు.

క్షీరసాగర మథనానికి లాగే విప్రనారాయణకు కూడా మొదటిలో శ్రీ వెంపటి చినసత్యం కోరియోగ్రఫీ చేశారు. ఆయన శిష్యురాండ్రలో - కుమారి రత్నపాప, శ్రీమతి శోభానాయుడు దేవదేవి పాత్ర నిర్వహణతో ఒకటిరెండు బృందాలు విప్రనారాయణ రంగప్రదర్శన చేస్తూ వచ్చాయి.

మద్రాసులో శ్రీ వెంపటి చినసత్యం స్థాపించిన కూచిపూడి అకాడమీ చిన సత్యంగారు చాలాఔచిత్యవిచార చర్చతో ఆధునికతను సమకూర్చుకొంటూ నటీనట బృందనిర్వహణా నేపథ్యగాన నిర్వహణలలో విజయాలు సాధిస్తూ ఆధునిక యక్షగాన ప్రగతికి దోహదం చేస్తున్నారు.

శ్రీ వేంపటివారి ఆశీస్సులతో ఆంధ్రదేశ రాజధానియైన హైదరాబాద్‌లో కూచిపూడి ఆర్ట్ అకాడమీ డైరెక్టర్‌గా, ప్రిన్సిపాల్‌గా నిర్వహిస్తున్న శ్రీమతి శోభానాయుడు 1984 నుంచి, రజని సాహిత్య సంగీత సహకారాలను స్వీకరిస్తూ తన నృత్య శిక్షణ ద్వారా, నాట్య ప్రదర్శనాలద్వారా యక్షగాన ప్రగతికి సేవచేస్తున్నారు.

రజని రచించిన 'మేనకా విశ్వామిత్రను' రెండు, మూడు సంవత్సరాలు రంగవేదికలపై ప్రదర్శిస్తూ వచ్చిన శ్రీమతి శోభానాయుడు 'విప్రనారాయణ'ను చేపట్టి ఆంధ్రదేశం అంతటను, ఢిల్లీ వంటి కేంద్రాలలోను ప్రదర్శనలిచ్చారు.

వెంపటివారి కోరియోగ్రఫితో 'పద్మావతీ శ్రీనివాసంలో' పద్మావతి పాత్రను నిర్వహిస్తూ వచ్చిన శోభ 1988లో తిరుమల తిరుపతి దేవస్థానంవారి కోరికపైన 'శ్రీవేంకటేశ్వర కళ్యాణ' ఇతివృత్తాన్నే **రజనిచేత మూడు గంటలకు పట్టేటంతగా 'కళ్యాణ శ్రీనివాసం' అనే యక్షగానంగారచింపజేసారు.** దీనికి సంగీతం రజనికి అష్టమిత్ర బృందానికి చెందిన సంగీత సహవ్రతి శ్రీకొచ్చెర్లకోట సూర్య ప్రకాశరావు, 1989లో సెప్టెంబర్ నుంచి అనేక ఆంధ్రప్రదేశ్ కేంద్రాలలోను, ఢిల్లీలోను శ్రీమతి శోభానాయుడు బృందం ఇప్పటికి దాదాపు 20, 25 ప్రదర్శనలదాకా ఇచ్చారు 'కళ్యాణ శ్రీనివాసంలో' ఇతివృత్తపు తీర్పులో దేవస్థాన స్థలపురాణ నిర్ణేతల అనుమతితో కొద్దిపాటి మార్పులు చేసినా,

ప్రతి ప్రదర్శనలోను. ప్రతి దృశ్యం చివరా ప్రేక్షకుల ఆనందామోదాలు వర్షపు జల్లులుగా కురుస్తున్నాయి. 1990 ఆగస్టు 4వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శితం అయింది

ఆధునిక యక్షగాన ప్రగతిని గూర్చి వెల్లడిచేస్తున్న ఈ ప్రకరణంలో యక్షగాన రచనాదక్షుడైన రచయితగా శ్రీ యన్.సి.హెచ్. కృష్ణమాచార్యులను పేర్కొని తీరాలి కృష్ణశాస్త్రిగారి 'విప్రనారాయణ' కొన్ని ప్రదర్శనలు చేసిన తర్వాత శ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మగారు వారితో అభిప్రాయ భేదాలవల్ల శ్రీ కృష్ణమాచార్యులచేత వ్రాయించారు. సాంప్రదాయక యక్షగాన రచనా ధోరణి హరికథా ధోరణి శ్రీ ఆచార్యుల వాయులీన గాత్ర విద్వత్తులకు మెరుగులు పట్టిన అదనపు సుగుణాలు.

అలాగే యక్షగాన పద్ధతి సంగీత రచనకు గానానికి అందెవెయ్యతగ్గ చెయ్యి, హారం వెయ్య తగ్గ కంఠమూ కల మరొక గణనీయకళాకారుడు ఆకాశవాణిలో రజనికి సహవ్రతి - ఇటీవల కీర్తిశేషుడయిన **శ్రీకందుల మల్లికార్జునరావు ఉరఫ్ మల్లిక్**. ఆయన సంగీతంతో రక్తికట్టిన యక్షగాన ప్రదర్శనలలో శ్రీమతి కొత్తపల్లి పద్మ బృందంవారు ప్రదర్శించే ప్రహ్లాద!

శ్రీమతి శోభానాయుడు నిర్వహిస్తున్న కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి ప్రదర్శనలకోసం యక్షగాన పద్ధతి, నృత్యరూపకాలు రజని రచించిన రెండింటిని ప్రదర్శిస్తూ వచ్చారు అవి 1. శ్రీకృష్ణః శరణం మమ - కృష్ణ జీవితగాధాత్మక సంఘటనలు. 2. విజయోస్తునారి (నారీవిజయం) మహిషాసురగాథ

122. డా॥ పి.యస్.ఆర్. అప్పారావు

నాకంటే ఎమ్మేలో జూనియర్ అయినా నా కన్నా ముందే తమ భరత నాట్యానువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నవారు డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు. తరువాత సాగిన కూచిపూడి ఆర్యనాట్య సంగీతాది చర్చలు గల సెమినార్‌లలో తరచు కలుసుకొనేవారం నాకు నచ్చే నిర్ణయాలు ఎన్నో తీసికుని నన్ను మరచి పోనీయకుండా చేశారు

123. జంతునేస్తాలు

మా తాతగారి పెరటిలో అవుని పాలేరు కాని, మా బామ్మగారు కాని పాలు పితకగానే, మళ్ళీ దూడని వదిలేసే లోపున అప్పటికి చిన్న పిల్లాడుగా ఉన్న మా పెదనాన్న గార్లలో ఒకాయన పొదుగును దూతలాగే కరుచుకుని పాలు తాగేవారని మాచిన్నతనంలో చెప్పుకునేవాళ్ళు. ఆవు ఏమీ రభస చేయకుండా తన పెయ్యని నాకినట్టే పిల్లాడిని నాకేదిట.

ఆవు పెయ్య గాని కోడెదూడ గాని చాలా ముద్దగా ఉంటాయి. మా ఇంట్లో మా చిన్నతనంలో ఒకటి రెండు సార్లు ఆవు ఈనడం, ఆ తువ్వాయికి మా నాన్నగారే స్వయంగా గోళ్లు గిల్లి తీసిపారేసి, కడిగిన తువ్వాయికి బొటనవేలు కుడిపితే, అది ఆ వేలు కుడుచుకుంటుంటే చూడడమూ, వాళ్లమ్మ దగ్గర పాలు తాగేటప్పుడు తోక నిక్కించి వొంపుగా జెండాలా ఎత్తడమూ. ఆ ఎత్తిన తోకతో పెరటిలో ఈ వైపు నుంచి ఆ వైపు చెంగుచెంగున పరుగులు పెట్టడమూ. నాకూ, నాతోటి పిల్లలకూ ఎంతో సరదాగా ఉండేది ఎదుగుతున్న గిత్తదూడ మెళ్లో మువ్వల పట్టా కట్టడం ఒక సరదా దానికి కొమ్ములు వచ్చేటప్పుడు మోర వంచి పొడవడానికి రావడం కూడా ముద్దుగా ఉండేది.

మేం పుట్టక పూర్వం ఇంట్లో లక్ష్మి అనే ఆవు ఉండేది. అది పరమటి (పడమటి) ఆవు అని చెప్పుకునేవారు. ఒంగోలు వంగడం అయి ఉండవచ్చు మంచి ఎత్తరి అన్నమాట. పెద్ద పొదుగూను, మా నాన్నగారన్నా, కుటుంబసభ్యులన్నా ఎంతో ప్రేమ కలిగి ఉండేదిట. అది పెద్దది అయిపోయిందనో ఏమో పొరుగూరి అసామీకి ఇచ్చివేస్తూ ఆ వూరికి తోలిపెట్టేశారట అయినా సరే, ఆ అవు అ ఆసామి పశువుల శాల నుంచి కన్నెతాడు తెంపుకుని ఇరవై ముప్పై మైళ్ళు నడిచి మూడు రోజులు తిరక్కుండా మళ్ళీ మా ఇంటికి తిరిగి వచ్చిందిట

మా ఊళ్ళో ఇంట్లోనూ, మా అమ్మగారింట్లోనూ పాల దిగుబడి కోసం గేదెలను పెంచడం ఉండేది ఆవు కంటె గేదె అంటే ఎందుకో నాకు అనురక్తి తక్కువగా ఉండేది కాని ఆ విరక్తిని పోగొట్టే గేదె నేస్తాన్ని మొన్నామధ్య చూశాను. నా బాల్యస్నేహితుడు ఇప్పుడు 70 ఏళ్ల బ్రహ్మచారి. లంకంత కొంప, ఒక ఎకరంపైగా వైశాల్యం ఉండే మొక్కా మోడుతోనిండిన పెద్ద దొడ్డి. అతను ఒకటి రెండుదశాబ్దాల నుండి ఒక గేదెను సాకుతున్నాడు నిజానికి ఆ గేదె అతడిని తన పాలతో సాకుతోందని చెప్పాలి. మూడేళ్ల క్రితం నేనూ, ఆ స్నేహితుడూ రెండు నెలలపాటు విదేశయాత్ర చేశాము. దానికి ముందు బ్రహ్మప్రయత్నం చేసి ఈ గేదె సంరక్షణకీ, పాలు పితికి వాడుకోడానికీ, నమ్మకమైన మనిషిని ఏర్పాటు చేసుకుని మరీ బయలుదేరాడతను. తిరిగి వచ్చాక మేమిద్దరమూ

మా మిత్రుడుండే గ్రామానికి వెళ్ళినపుడు, అతను నన్ను తన ఇంటికి తీసుకెళ్ళి పెరటి తలుపు తీశాడు. తియ్యగా దూరాన చెట్టుకింద రాటకు కట్టి రొచ్చుకు దగ్గరగా పడుకున్న గేదె, చటాలున లేచి మా మిత్రుడి వైపు మోర చాచి 'వాంయ్' అని మంద్రస్వరంతో పలకరించింది. మా మిత్రుడు, "చూశావురా నీ దగ్గర పాట పాడే కుక్క ఒకటుందని మురిసిపోతుంటావ్! విన్నావా మా గేదె పాటా?" అన్నాడు. నాకు నిజంగా అబ్బురమూ, ఆనందమూ కలిగాయి గేదె మీద నా ప్రెజుడిస్ మాయం అయిపోయింది.

124. మా జంతునేస్తం - సీజర్

ఇక మా పాట పాడే కుక్క సీజర్‌ని గురించి రాయకుండా ఎలాగ?

బెంగళూరులో నా మేన గోడలు డా॥ మహాలక్ష్మి తన స్నేహితుల ఇంట్లో అప్పుడే పుట్టిన నాలుగైదు కుక్క పిల్లలు ఉంటే వాటిలో ఒక దానిని తీసుకు వచ్చి నాకిచ్చింది. దానిని హైదరాబాద్ తీసికెళ్ళాను. అక్కడనుండి విజయవాడ, తరువాత తిరుపతి మేము ఎక్కడికి వెడితే అక్కడికి తీసికెడుతూ చివరగా రాజమండ్రి తీసుకువచ్చేము. దానిని మేముసీజర్ అని పిల్చుకునేవాళ్ళం. మేము హైదరాబాద్‌లో నున్నప్పుడు డా॥ బాలమురళీకృష్ణ రేడియోలో పాడుతూంటే మా సీజర్ మొదట బుగ్గలు ఎగరేస్తూ తరువాత నోరు తెరచిపాడేది డా॥సి. నారాయణ రెడ్డి గేయాలకు శ్రీమతి సరోజిని నాయుడు వ్రాసిన గేయాలను తెలుగు లో వ్రాయగా వాటికి నేను ట్యూన్ పెడుతోంటే తాను గళము విప్పి పాడేది.

అప్పటి ఆంధ్రప్రభ సంపాదకులైన శ్రీపొత్తూరి వెంకటేశ్వరరావు గారు మా యింటికి వచ్చి నాతో శ్రుతి కలిపి సీజరు పాడుతోంటే ఒక ఫొటో తీసుకుని ప్రభలో ప్రచురించారు. ఈ అక్షరాలు రాస్తుంటే నా మనవడిని దగ్గరికి రానీకుండా గుర్రుమని తరిమేసి, నా కాళ్ల దగ్గర నా మంచం మీద కంగారూలాగా ముంగాళ్లు, వెనక్కాళ్లు కలిపి ముడిపెట్టి ముడుచుకుని పడుకుని ఉంది

నేను రాసుకునే కాగితాలిష్టం దానికి. రాసీ రాసీ ప్యాడ్ తలగడ మీద పెట్టి అలా వెళ్ళి వచ్చేలోగా ఆ అక్షరాల మీద అప్యాయంగా నాకుతుంది మంచి డీలక్స్ బైండ్ పుస్తకం ఏదైనా చదివి అలా పక్కన పెడితే, దాని పుటలను కొంచెం అయినా నాలుకతో తడిచెయ్యకుండా ఉండలేదు. ఒకటి - రెండు వారాల క్రితం దాని పాటకి మురిసిపోయిన మా స్నేహితుడొకాయన, మరో ముగ్గురు పెద్దమనుషులతో సహా మా ఇంటికి వచ్చారు. నా మీద వారికి ఉండే ఆదరాభిమానాలతో, కొత్తవారు రాగానే ముందు భౌభౌ అంటుంది. "వాళ్లు నీ పాట వింటారు పాడమ్మా మెల్లిగా" అనేసరికి, గమకాలతో సహా మంద్రస్థాయిలో సన్నంగా ఆలాపనలు చేస్తుంది. రేడియోలో గాని, టీవీలో గానీ, బాలమురళిలాగా రసానుభవంతో స్థాయి నిలుపుతూ పాడే ఏ ఆలాపననైనా సరే, వినగానే మనం అడక్కుండానే తన గొంతు శ్రుతి కలిపి పాడటం మొదలుపెడుతుంది నేను నోటి మీద చూపుడువేలితో దానిని "నో నో నో నువ్విప్పుడు పాడకూడదు.. మమ్మల్ని ఆ పాట విననీ" అంటే అతికష్టం మీద పాడటం ఆపి తనని పాడనీకుండా చేస్తున్నారని చెప్పి గాలిలో పూరించిన దవడలు ఎగరేస్తూ అపసోపాలు పడుతుంది. దాని పాటంటే ఇష్టపడిన స్నేహితులు టెలిఫోను చేసి నాతో మాట్లాడుతుంటే, మా సీజర్ తాను పడుకుని ఉన్న సోఫా కింద నుంచి ఓ అని రాగాలాపన ఆరంభిస్తుంది. ఒకవేళ ఏ నిద్రలోనో ఉండిపోయి, దాని పాట వినిపించకపోతే టెలిఫోన్లో మాటాడే మిత్రులు, "ఏమండీ, మీ భైరవమూర్తి గారి పాట వినిపించడం లేదే!" అని అడుగుతారు. కళ్ళుమూసుకుని పూజ చేసుకుంటూంటే నా ప్రక్కనే ముంగాళ్ళు చాచుకుని పడుకునేది మాతో కలిసి జీవిస్తున్న దానికి 11 ఏళ్ళు గడిచాయి.

మా ఇంటిల్లిపాదీ అంటే దానికి ఎంతో ఇష్టం. దానిని విడిచి ఏ పక్కింటి వారికో అప్పగించి, ఒకటి - రెండు రోజుల ప్రయాణాని కన్నా మా ఇంటిల్లిపాది వెళ్లవలసి వస్తే పాపం, సీజర్ చాలా కష్టపడుతుంది. ఏడుస్తుంది. తిండి తినదు మేం తిరిగి వచ్చేదాకా!

"సీజర్ మహాభినిష్క్రమణం"

ఒక రోజు నేను ప్రార్థన చేసుకుంటూండగా నా ప్రక్కన పడుకునే సీజర్ లేచి ఇంట్లో తిరుగుతూండడం మళ్ళీ నా ప్రక్కన కూర్చోవడం చేస్తూ ప్రార్థనామందిరం ఎదుటనే ఆరోజు చివరి శ్వాసవిడిచింది. నా స్నేహితులు నాగిన్, భద్రాద్రి సీజర్‌ని తీసుకెళ్ళి గోదావరి ఒడ్డున సమాధిచేయించారు.

125. శ్రీపాద పినాకపాణి – మధురపానక పాణి



నేను వైజాగ్‌లో చదివే రోజుల్లోనే ఆంధ్రవిశ్వకళాపరిషత్‌కు పొరుగులో ఉన్న తోటల్లో, పొలాల్లో ఆంధ్ర సినీటోన్ అనే సినీకంపెనీ జయదేవ్ సినిమా తీస్తోంది. దాని పోషకులు ఓ రాజుగారు. అబ్బూరివారు మాక్లాసులో జయదేవుని గురించి చెప్పి సంగీతం జయదేవునిలా తెలిసిన వారు కావాలని రాజాగారు అడిగారని రమ్మని నన్ను తీసికుని వెళ్లారు. అక్కడకు పినాకపాణిగారు (వైజాగ్ మెడికల్ కాలేజిలో చదువుతున్నారు) వచ్చారు. అయన శాంతా ఆప్టేపాట "సునోసునో బన్‌కే ప్రాణీ బన్‌హూమై అజ్ తుమ్హారీరాణి" పాడారు రాజుగారి కోరికపై. ఆయనకోరిక పైనే నేను సైగల్ పాటలు పాడాను. కానీ కొన్నేళ్ళకు పినాకపాణి నేను మద్రాసు చేరుకుని వీణధనమ్మాళ్, బృంద, ముక్తలలో పడి అసలయిన కర్నాటక సంగీతం సిసలైన గమకాలతో పాడ్డంతో నిష్ణాతుల్లై మనగాయకులందరినీ తీర్చిదిద్దే శిఖామణి అయ్యారు. మాతోటి నేదునూరి, నూకల శ్రీరంగం గోపాలరత్నం మొదలగువారు పినాకపాణి చేత సంగీతంలో మెరుగులు పెట్టించుకున్నవారే. అందుకే ఆయన మధురపానకపాణి అనిపించుకున్నారు

దక్షిణాది కర్ణాటక సంగీత బాణిని అపోశనం పుచ్చుకుని పాణిగారు తన శిష్యులైన ఓలేటి. నేదునూరి, శ్రీరంగం గోపాలరత్నం, పద్మభూషణ్ నూకలచిన సత్యనారాయణ గార్లకి ఆ తంజావూరి బాణీని ధారాదత్తం చేశారన్నమాట.

126. వాగ్గేయకార సార్వభౌముడు – బాలమురళి

అలనాటి కర్ణాటక సామ్రాజ్య రాజధానియైన విద్యానగరంలో ప్రౌఢదేవరాయల నిండుకొలువులో ఆస్థాన విద్వాంసుడైన తిరుప్పుగళ్ ద్రావిడభాషాకీర్తన రచనాధురంధరుడైన అరుణగిరినాథడిండిమ కవిసార్వభౌమునిపై ఉద్భట విద్వద్వివాదాలలో విజయం సాధించి సంగీత సాహిత్య కవి సార్వభౌమ బిరుదమును కనకాభిషేక గౌరవమునూ పొందిన శ్రీనాథ మహాకవితో ప్రారంభించి, ఈనాటి కర్ణాటక సంగీత రాజధానియైన చెన్న నగరములో దక్షిణోత్తర భారతాల 'సంగీత సాహిత్య' వాగ్గేయకారసార్వభౌమ పీఠమును దక్కించుకున్న డా॥ బాలమురళీకృష్ణతో ఆంధ్ర దేశపు ప్రసిద్ధ పల్లవి విద్వాంసులగురించిన నావివరణమును సుసంపన్నము చేశాను.

అరుణగిరినాథుడే గౌడ డిండిమభట్టు వాళ్ళవంశం గౌడదేశంనుండి ద్రావిడ దేశానికి వలసవచ్చిన పండిత కుటుంబం. తిరుప్పుగళ్ అనే ద్రావిడ భాషా కీర్తనలను స్కంధదేవుని గూర్చి మేళతాళాలలో (సంస్కృత ఛందాల) రచించిన గడుగ్గాయియైన వాగ్గేయ కారుడు. అతనికి వాటి అన్నింటిని కరతలామలకాలు చేసికొన్న శ్రీనాథునిలాగే మన బాలమురళి ఆంధ్ర సంస్కృత ద్రావిడ కర్ణాటక భాషలలో కూడా ఇటీవలి రెండు మూడు దశాబ్దులలో పరిపక్వరచనలు చేసి భారతదేశం అంతటా ఎక్కడ ఏభాషలో గానం చేస్తే అక్కడి పండిత పామర సామాజికులంతా సమ్మోహితులౌతారో ఆరచనలలో తన వాగ్గేయ కారత్వాన్ని నిరూపించుకొంటూ ఈనాడు వాగ్గేయ కారసార్వ భౌమత్వాన్ని దక్కగొనిషష్ఠి పూర్త్యుత్సవానికి సంసిద్ధుడయాడు (1990 జూలై)

మనసాహిత్య విద్వత్కవిలోకం శ్రీనాథుణ్ణి కవిసార్వభౌముడుగానే గుర్తించింది కాని అరుణగిరినాథునిపై అతడు సాధించిన ఘనవిజయంలో అతడు సంగీతసాహిత్య సార్వభౌముడయిన విషయాన్ని గుర్తించలేదు అలాగే డా॥ బాలమురళికి సంగీత విద్వద్గురువులైన

పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి గాయక సార్వ భౌమత్వాన్ని గుర్తించిన విద్వల్లోకం ఆయన ప్రియశిష్యుడైన మురళి ఇంతింతై వటుడింతయై బ్రహ్మాండ మంతై సంస్కృతాంధ్ర ద్రావిడ కర్ణాటక భాషా వాగ్గేయ రచనలతో విద్వత్సభారంజక గానగంధర్వత్వంలో అందుకున్న విశ్వరూపాన్ని గుర్తించని వారు ఉండరనుకుంటాను.

ఒకటి రెండు ఏళ్ళ ఈమధ్య దూరదర్శిని అపురూపంగా అప్పుడుడప్పుడు ప్రసారం చేస్తూ వచ్చిన శాస్త్రీయ సంగీత కర్యక్రమాలలో ఒకసారి ఢిల్లీ కేంద్రం రాజఘాట్ శాంతి సభలో చేసిన కచేరిలోని "ఓంకారస్వరూపిణీ మదహంకారవినాశనీ" ఒక అపురూప రాగంలో మురళిచేసిన సొంత శాస్త్రీయ సంగీతరచన. అది ఒక అపూర్వరాగ విన్యాసకత సాహిత్య బంధమూ. మురళీ గానంలో విశిష్టశైలీ నిబద్ధమై సమ్మోహన మాధురులను వెదజల్లింది అంటే అతిశయోక్తి కాదు వట్టి మాటల పొగడ్తకాదు.

దూరదర్శినిలోనే 1987 లో హైదరాబాద్‌నుంచి వారం వారం ప్రసారితమైనదీ అంతకు ముందు తమిళంలో మద్రాసు దూరదర్శినిలో ధారవాహికంగా ప్రసారమైనదీను స్వరరాగ సుధ అనే సముచితమై ఆకర్షణీయమైన శీర్షిక సంగీత కార్యక్రమం ప్రసిద్ధమైన త్యాగరాజ కీర్తన పల్లవిద్వారా కర్ణాటక సంగీత ప్రియులందరికీ తమువారసత్వంగా గర్వింపదగిన కార్యక్రమాలను మురళీ స్వయంగా రూపొందించి తన వ్యాఖ్యలతో నిర్వహించడం నాకు చాలా సంతృప్తి కలిగించింది.

127. నవ్యసంగీతోద్యమం (లలిత సంగీత వికాసం)
New Wave Music

రజనీకాంతరావు మాటల్లో -

కళాప్రపూర్ణ ఎ. అనసూయాదేవి (వింజమూరి) తాను సేకరించి, స్వరకల్పనతో కూర్చిన "భావ గీతాలు" అన్న పుస్తకానికి 20-02-1980వ తేదీన రజని సంతరించిన 'మునిపలుకు'నుంచి

నళినీ కాంతరావు సేకరణ

కాకినాడలో 'బదరిక' నలభై ఏళ్లక్రితం మామయ్య అంటే మధుర గేయ మహితశిల్పి మహాకవి కృష్ణశాస్త్రి కేంద్రంగా సాహిత్య సంగీత చిత్ర లేఖ నాది లలిత కళా ప్రియంభావుకులెందరో సమకూరుతూ ఉండే సారస్వత తపోవాటిక బదరిక. ఆతపోవాటికలో తల సూపిన గేయ కవితాకుసుమాలకు సురభిళ సంగీత సౌరభ దోహదాన్ని సమకూర్చిన తోటమాలీలలో అగ్రగణ్య అనసూయ, సొదరుడు బి.వి. నరసింహారావు ఒక మాలి నేను (రజని) ఒక మాలిని, ఆ తరువాత మరో రంగంలో మల్లిక్, విశ్వనాథం, ఈమని, రాజేశ్వరరావు, పి.బి. శ్రీనివాసు మున్నగు వారు ఈ గీతికలకు ఎన్ని గొంతులో.

నవ్యసాహిత్యోద్యమంతో పాటు నలభై ఏళ్లక్రితం తల యెత్తిన నవ్యసంగీతోద్యమం ఇది. ఇది ఒక కొత్త తరంగం. అధునిక సంగీతవాహిని పరిణామచరిత్రలో శాస్త్రీయ సంగీతపు పాయను అంటీ, అంటకుండానూ సంప్రదాయపు పరిధులను అంటి వట్టక అట్టే ఉండిపోకనూ పరీవాహక్షేత్రాన్ని విస్తృతం చేసుకుంటూ ఒడ్డులను మించి పారిన కొత్త తరంగం ఇది! బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, అడవి బాపిరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి మధుర గేయకవుల సొంత బాణీలు స్థానం, బందా వంటి జ్యేష్ఠ కళావిదుల గానధోరణులూ కలిసిమెలిసి, సంగీత పట్టభద్రురాలైన అనసూయతరానికి చెందిన అస్మదాదుల విస్తృత సేద్యంలో ఈ కొత్త తరంగానికి ఒక విశిష్టమైన స్వరూపం కనబడుతుంది.

అలనాడు బదరికాశ్రమపు సారస్వత సమావేశాల్లో సభను అలంకరించి ప్రభావితం చేయగలిగిన కళావిద ప్రియంభావుకుల్లో జానపద సంగీత పితామహులైన వల్లూరి జగన్నాథరావుగారూ అనసూయా శ్రీవోలేటి వేంకటేశ్వర్లకూ శాస్త్రీయ సంగీత గురువైన మేటి సంగీత విద్వాంసుడు శ్రీ మునుగంటి వేంకటరావుగారు ప్రధానులు కావడాన్ని బట్టీ జానపదగేయ సేకరణలోను, పరిశోధనలోను అనసూయా సీతా అందె వేసిన చేతులు కావడాన్ని బట్టీ, ఈ

ఉద్యమానికి సంప్రదాయపు వెన్ను బలం ఎంత గట్టిదో, ఈ కృషి ఫలితంగా తెలుగుతనంతీపి ఎలా గూడుకట్టుకుందో తెలుస్తుంది.

సంప్రదాయపు వెన్ను బలానికి తోడు, దాని పరిధులను ఉదారంగా విస్తరించడానికి అనుకూలంగా ఆనాడు మహారాష్ట్ర రంగస్థల సంగీత ప్రభావానికి లోనయిన మన ఆంధ్రదేశ రంగస్థల గాయకుల బాణీలలోను, అప్పుడప్పుడే హిందీ టాకీ ద్వారా కలకత్తా నుంచీ, బొంబాయి నుంచీ వెలువడుతుండిన న్యూ థియేటర్స్‌వారి ఆధునిక వంగ సంగీత రీతులతో ప్రభాత్ వారి మహారాష్ట్ర సంగీత రీతులతో ఆనాటి మా యువతరం ప్రభావితం అవుతూ వచ్చింది.

'బదరిక'లో మామయ్య 'ఊర్వశీ', 'వసంతోత్సవం' తయారవుతూ ఉండిన రోజులలోనే వంగకవి చండీదాసు ఇతివృత్తంతో నా చండీదాసు గేయనాటిక తయారవుతో ఉండేది. నేను 'బదరిక'కు వెళ్లినపుడల్లా మామయ్య పాటలకు అనసూయ పెట్టిన వరుసలు విని ఆనందించడమూ,, నేను వ్రాస్తున్నవీ చేస్తున్నవి పాటలు ప్రభాకరం అన్నయ్యకూ, అనసూయ చెల్లెలికీ, మామయ్యకూ వినిపించి వారి తలవూపులతో నేనూ, నా ఎదపొంగులతో వాళ్లూ తృప్తిగా ముందుకు సాగిపోతూండేవారము..

బదరికా 'విమానాశ్రయం'లో రెక్క విప్పి పైకి ఎగసిన (టేక్-ఆఫ్ చేసిన) ఈ ఉద్యమం, రెండు మూడు ఏళ్లకే మదరాసు ఆకాశవాణి ఆవరణలోకి వ్రాలింది. అప్పుడే ముందు వ్రాసినట్లు మల్లిక్, విశ్వనాథం మొదలగువారు ఈ గీతికలకు ఎన్ని గొంతులో అనేది ఒకక్రమ పరిణామం క్రమంగా మదరాసు, విజయవాడ, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రావరణాలు ఈ ఉద్యమానికి ఆటపట్టులు అయాయి.

ఆ తరవాత, ఇన్ని ప్రభావాల తోనూ తరంగితమైన ఈనవ్య సంగీతోద్యమం రేడియో రంగంనుంచి క్రమంగా సినీమారంగానికి కూడా ఎలా ప్రాకిందో శ్రీ వి.ఎ.కె. రంగారావు వంటి ఆధునిక సంగీత చరిత్రకారులకు విశదంగా తెలుసు వారు వ్రాస్తారు.

ఆధునిక గేయ శిల్పులలో అపర పరమేష్టి మహాకవి కృష్ణశాస్త్రి ఆయన గేయాలకు సంగీతం కూర్చిన శిల్పులలో ఆద్యురాలు అనసూయ అంతేకాదు, ఆధునిక సంగీతోద్యమానికి కారకులైన ఆద్య శిల్పులలో ఆద్యురాలు అనసూయ. ఈ ఉద్యమంలో తనకు సహపాఠినై, మామయ్య గేయాలకూ, గేయనాటికలకూ తన తర్వాత తనంత ఆప్యాయ పాత్రుడైన సంగీత శిల్పిగా మామయ్య మెప్పునే పొంది, 'కృష్ణ రజని' శీర్షిక గేయరచనకు మామయ్య పూనుకోడానికి కారకుడైనా నసీ వయసులో తనను జ్యేష్ఠుణ్ణి అని నాపై గౌరవంతో, చి॥సౌ॥ అనసూయ తన సంగీత స్వరలిపి

విన్యాసానికి మునిపలుకులు వ్రాయమని కోరడం చేత, చారిత్రక దృష్టితో స్థూలంగా ఈ ఉద్యమ పరిణామాన్ని ఈ మాత్రం వివరించవలసి వచ్చింది.

ఫలించిన ఆశీస్సు.

గుండెనైతే మే మిద్దరం
పంచుకున్నాం సుమండి -
గొంతు మాత్రం వాడికే
దఖలు పడింది లెండి!
గుండె గుండియలోనె
గుబగుబ లాడు వీడు - నళిని;
'గుండె గొంతుక లోన
కొట్లాడు' వాడు - రజని
వర సంగీతమై
వరలును వాడు
వంశ దీపకుడై
వెలుగు గలాడు!
వట్టి గీతమై
వినరాను నేను -
వాడే వీడని,
వద్దు, చెప్ప కోను!
కుశలవుల మనుకోడానికి
కుదిరినవి పేరులే నండి
సహెూదరుల మైన మా
సమాచార మిదండి.
1964 - నళిని

128. సాహిత్య దృక్పథం - సారస్వతం

నేను రచయితని, జగమెరిగిన జంటకవులలో ఒకరికి కుమారుణ్ణి కావడం చేత కాకుండా వారి కవితా కుటీరంలో భావయిత్రినీ, కారయిత్రినీ, సాధయిత్రినీ నిత్యకృషితో పోషించుకున్న వాణ్ణి కావడం చేత, కవికుమారుణ్ణీ, కుమారకవినీ కూడా అయ్యానని ఈ తొంభయ్యోపడిలో ఈ మాటలు వ్రాసే సమయానికి కూడా సవినయంగా చెప్పుకోగలవాణ్ణి. ఇల్లు ఒక సాహిత్యకృషిక్షేత్రం. ఇంట్లో అన్నలూ, బావలూ, మావయ్యలూ అంతా కలం పట్టినవారే.

మా పెత్తండ్రి కొడుకు కరడు గట్టిన రాజకీయవాది మొదటిలో కార్డు హోల్డరూ, వామపక్షనిర్ధుమధామరేవంతుడూనూ, మా సొంత అన్న 50 55 ఏళ్ల క్రితమే అంతర్జాతీయ సామ్యవాద గీతాన్ని అనువదించి మొదట నాచేతే పాడించాడు.

సాహిత్యం - 'సహితస్య భావనం', అది అందరినీ కలిపేదిగానే ఉండాలి గానీ, విడదీసేదిగా వుండరాదనేది, సాహిత్యకరుని జవాబుదారీ (కమిట్‌మెంట్) సాహిత్యానికే అన్న ఆదర్శం మా నాన్నగారి వారసత్వంగా నాకు అందింది.

అయితే అది అలా స్థిరపడడానికి కొంత కాలమూ, పరిస్థితులూ, కలిసిరాక పోవడమూ, కలిసిరావడమూ, కొంత గుంజాటన పడ్డాక స్థిరమైన తోవ దొరికింది

విశ్వవిద్యాలయంలో చదువుతూండిన రెండవ దశకం చివర సంవత్సరాలలో (18, 19, 20) ఒక పక్క ఆదర్శవాదీ, సాంఘిక సంస్కారీ, విద్రోహిగా పరిగణన పొందిన చండీదాసు జీవితాన్ని సంగీతనాటకంగా వ్రాస్తున్న రోజులలోనే నేను చలం, శ్రీశ్రీ, పట్టాభి, జలసూత్రం అనాటికి వ్రాస్తున్న తిరుగుబాటు భావాలతో, విశృంఖల ఛందస్సుల్లో రచనలు చేసే ధోరణికి కొంత వరకూ లొంగాను నా భావకవితాగేయాలతో పాటు ఈ తిరుగుబాటు ధోరణిని రచనలు కూడా కొన్ని పత్రికలలో ప్రచురితమవుతూ వచ్చాయి. భావకవితాగేయాలు 'రజని' పేరుతోను, తిరుగుబాటు గేయాలు 'పూషా' పేరుతోను ప్రచురితం అయ్యాయి

సాహిత్యదృక్పథం అని ప్రారంభించిన నాటి భావతరంగ శీర్షికలో 'సారస్వతం' అని కూడా చేర్చడానికి కారణం నా ప్రథమ స్వభావం కవిత్వరచన కాగా, ద్వితీయ స్వభావం (సెకండ్ నేచర్) సంగీతం అయి స్థిరపడటం చేత, నన్నేదో భావమో, ఆవేశమో ఊపినప్పుడు ముందుగా రాగమూ, దానితో లయతో కూడిన గేయరచనా సిద్ధమవుతూ వచ్చాయి

నా గేయరచనా దక్షతా, గేయనాటికారచనా ధోరణీ, సంగీతకల్పనాశక్తీ, నన్ను అలిందియా

రేడియోవాళం ఆకర్షించి, నా 21వ ఏట, క్యాజువల్ కళాకారుడుగాను, 22వ యేట నిలయరచయితగానూ రూపొందించాయి. ఆ ఉద్యోగంలో నేను పనిచేసింది రెండేళ్లే. నా గేయరచనా ప్రయోగాలూ, తొలి సంగీత ప్రయోగాలూ అప్పుడే ప్రసారం అయ్యాయి.

'చల్లగాలిలో' - 'ఓ విభావరీ', 'కోపమేల రాధా' వంటి పాటలను రాజేశ్వరరావు పాడటం వల్ల కూడా చాలా జనరంజకత పొందాయి. నా మూలగేయరచనా, ఆయన సంగీతకల్పనా ఒకే విధమైన మనోధర్మంలో కలిసిపోయాయి.

ఆ మధ్య ఒకటి రెండు వారాలుగా టివిలో 'ఎందరో మహానుభావులు' అని తెలుగు గేయకర్తలనూ సంగీతకర్తలనూ, గాయకులనూ పేర్కొని, వారికి వందనాలర్పిస్తున్న కార్యక్రమం చూపిస్తున్నారు. ఆ కార్యక్రమంలో 'చల్లగాలిలో' పాటని స్మరించి శ్రీ రాజేశ్వరరావుకి మాత్రం ధన్యవాదాలు చెప్పి గేయరచయిత పేరు స్మరించకపోయిన కార్యక్రమకర్తల సర్వవిషయజ్ఞతను ఎలాగ మెచ్చుకోవాలో తెలియదు.

ఇంతకు ముందు ఒకసారి వ్రాశాను. మద్రాసు రేడియో నుంచి 1944 ప్రాంతంలో ప్రసారం అయిన నా సంగీత కర్యాక్రమాలలో నేను మధ్య ప్రాచ్య సంగీతాలాపనలను అవలీలగా చేసి వుండటం విని స్వర్గీయ బి.ఎన్.రెడ్డిగారు, నన్ను రేడియో స్టేషన్ నుంచి డైరెక్టర్ ద్వారా పిలిపించుకుని, తీసుకువెళ్లి - 'ఓహెూ హెూ పావురమా' తమ స్వర్గసీమ సినిమాలో శ్రీమతి భానుమతి ధరిస్తున్న పాత్ర కోసం వ్రాయించారు. దానితోపాటు ఐదారు పాటలను నేను వ్రాసినా, ప్రభుత్వపు అనుమతి ఇబ్బంది వల్ల క్రెడిట్‌లో మా అన్నయ్య రచించారని వ్రాశాను.

ఇటీవల ప్రసారం అయిన 'ఎందరో మహానుభావులు' స్పాన్సర్డ్ సీరియల్ 'ఓహెూహెూ పావురమా' శ్రీమతి భానుమతి పాడిన పాటతో ప్రారంభం అయింది. పాటకు ముందు నివాళులూ, జోతులూ, కీ.శే సముద్రాల వారికి సమర్పించారు, ఒక వ్యాఖ్యాత! ఇందులో పాల్గొన్న వ్యాఖ్యాతలంతా కవులూ, రచయితలూ, ప్లేబాక్ గాయకులూను! నా వ్యాఖ్య 'ఎందరో మహానుభావులు - అందరికీ వందనము'.

ఇప్పుడు ఈ ఆత్మ విమర్శ రావడానికి ముఖ్య కారణం - ఇదే. ఇది నా జీవితధ్యేయమనే - ఆదర్శంతో ఏభై యేళ్ళకు పైగా కొంత అజ్ఞాతంగానూ, కొంత జ్ఞాతంగానూ సినిమా పరిశ్రమల్లోను, బాగా సుజ్ఞాతంగా రేడియోలోనూ అర్పించిన తన సారస్వత (సాహిత్య సంగీత) సేవకు సమకాలికులలో ఈనాడు సొంత వాద్యగోష్ఠుల ద్వారా పరస్పరాభివందనలు వెదజల్లుకునే సమకాలికులలో గుర్తింపు పొందకపోవడం సహజమే కానీ, అదే ఆత్మవిమర్శకు అవకాశం ఇస్తోంది

ఒక గేయసాహిత్య చరిత్రకర్త - పెద్ద లావాటి గ్రంథమే - ఆధునిక గేయకవులని గురించి వ్రాస్తూ - ఎన్నో పేరులను స్మరించి, రేడియోలో కూడా కొందరు గేయకర్తలున్నారు వారి రచనలు ప్రభుత్వ ప్రచార వ్యాపకాలూ, ప్రణాళికా ప్రచారాలకుద్దేశించినవే అని ఒక్క కలం పోటుతో హతమార్చేశాడు. రేడియోలో పనిచేసి కృతకృత్యులైన వారూ, కీర్తిశేషులైన వారూ అయిన నా సహచరులందరికీ నా సహ సానుభూతి!

129. యంత్రమంత్రపూజనా, హఠయోగ సాధనా

నా 20వ ఏట, నా పెళ్ళికి ముందు మానాన్నగారు నాకు ఒడుగు (ఉపనయనం) చేసి, గాయత్రీమంత్రం ఉపదేశించారు.

గాయత్రీ జపంకొన్నేళ్ళు అనుష్ఠానంగాచేసి, 30వ ఏట ఆంధ్ర వాగ్గేయ కారచరిత్రం వ్రాసి, దానికి తెలుగు భాషా సమితి పురస్కారం పొందినపుడూ

"నా కృతికృతియేనా నీకృపలేకున్నా

ఓ వాగ్గేయ కళామయి, గాయత్రీ వేదధాత్రి"

అని వేదమాత గాయత్రికి నా పురస్కారానికి కృతజ్ఞత తెలుపుకున్నాను

ఆ తర్వాత నా 74వ ఏట అంటే 1994లో, విశాఖలో 'ప్రజ్ఞాభారతి' సంస్థ తరపున యద్దనపూడి అయ్యన్న పంతులుగారి ఆధ్వర్యవంలో జరిగిన పురస్కార సభలో కార్యదర్శి యాబలూరి లోక నాథ శర్మగారి ద్వారా 1998 సం။రం။ మే 13వ తేదీన అయ్యన్న పంతులుగారు నాకు శ్రీచక్రం శిల్పంచేసిన బంగారు ఉంగరమూ మధ్య కెంపు అంటే నవరత్నాలలో మాణిక్యం అనే పొడిని పొదిగించిన అంగుళీయకమునూ శ్రీచక్రం (Beometrical) గుంటూరు హిందూ కాలేజి, రిటయిర్డ్ వైస్ ప్రిన్సిపాల్, చిత్రపటాన్నీ శ్రీ వడ్లమూడి వేంకటేశ్వర రావుగారు ఉపన్యసించి ముద్రించిన "శ్రీచక్రదర్శనం" అనే గ్రంథాన్నీ బహూకరించారు అదే సభలో నేదునూరి కృష్ణమూర్తి 'నాదవిద్యానిధి' అనే బిరుద ప్రదానం చేశాడు నాకు.

శ్రీచక్రదర్శనము పూజనము

సన్యాసేతరులకు (అంటే గృహస్థులకు లేక సంసారులకు) బ్రహ్మమును గూర్చి

ఉపదేశింపబడిన మంత్రాద్యనుష్ఠానానికి బ్రహ్మవిద్య అనీ శ్రీవిద్య అనీ గురువులు వ్యపదేశించారు.

"సర్వశ్రుతులు ఏస్థితిని గురించి పొందగోరినదిగా బోధిస్తున్నవో, సకలోపాసనలూ దేనిని గురించి ఉద్దేశింపబడినవో, దేనిని కోరి ఎల్లరు బ్రహ్మయందు చరింపగోరుదురో అట్టిజ్ఞాన సాధన సంపత్తికి సంగ్రహరూపమయిన ఉపాసనాక్షరమే ఓం (ఓంకారము) ఈ బ్రహ్మవిద్యనే శ్రీవిద్య యందురు.

సృష్టికి పూర్వమున్నది మహాబిందువు. సృష్టికి ముందుసత్ అను పదార్థముండెను. ఇదియే చిదగ్నిగా ఉపదేశింపబడిన బ్రహ్మపదార్థము! ఇదియే మొట్టమొదటి మహా బిందువు.

This can be likened to a huge black hole with infinite gravitational force where nothing, including the electro magnetic energy can escape its influence.

"తదైకాక్షర బహుస్యాం ప్రజాయేయేతి"

మొదటి సత్ పదార్థము మహాబిందువు (blackhole) అనేకముగా నగుదును ఒకదానికంటె ఎన్నో ఎక్కువగా పుట్టుదును అని సంకల్పించినది. ఈ సంకల్పసహితబిందువే మహాకారణరూపము. అటువంటి సంకల్ప సహిత (ఈక్షత్యాత్మకమైన) మహాకారణ శక్తి యొక్క క్షేత్రరూపమునకే (Geometrical form) శ్రీచక్రమని వ్యవహారనామము. అక్షరములలో 'అ' అనువర్ణము నారాయణాత్మకము! నారాయణ దైవతమునకు బీజము 'అ'కారము (శబ్దశక్తి) అక్షరము (నాదము) నకు వాదనమునకు యంత్రము సాధకునకు దేవతాస్ఫూర్తి కలుగుజేయునది (బీజ) అక్షరము!

"సప్తాస్యాసన్ పరిధయః త్రిస్సప్తసమిధఃకృతా"

ఏడువృత్తములు కలిగి (21) ప్రధాన (సమిధః) లక్షణములు కలిగినదే ప్రప్రథమ సంకల్పాత్మక యంత్రమని శ్రాంతివాక్యము! ఈ యేడు వృత్తాల ఏర్పాటు (స్థితిని) గురించి కూడా పురుషసూక్తమే వివరించింది.

"సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్
సభూమింవిశ్వతోవృత్వా అత్యతిష్ఠ ద్దశాంగులమ్!"

ఒక బిందువునుండి ఉత్పన్నమయే వృత్తలక్షణాన్ని వర్ణిస్తుంది. ఈ ఋక్కు, 'సహస్రశీర్షా'లోని శీర్షాయనగా శిరస్థానీయబిందువు Vertex లేక పరిధి రేఖపైన గల ప్రతిబిందువూ శిరఃస్థానీయమే. అట్టి అనంతబిందువుల సముదాయమే విశ్వవృత్తపు సహస్రశీర్షకత్వము! పరిధిపై ఉన్న ప్రతిబిందువూ బిందుకేంద్రానికి సమానదూరంలో ఉండి, శీర్షత్వానికి అర్హతను పొందునది.

వృత్తమందలి ప్రతివ్యాసరేఖ దృష్ట్యా పరిధియొక్క సొష్టవమే సహస్రాక్షత్వము పాత్ అనగా పాదము లేక భుజము అనంతబహుభుజయైన (Infinite sided polygon) వృత్త పరిధి అనే లక్షణమే సహస్రపాదత్వము.

"సజాతో అత్యరిచ్యత పశ్చాద్భూమిమధోపురతః

మొదటి వృత్తంపైనే దక్షిణోత్తర పూర్వ పశ్చిమాలలో (A, B, C, D కేంద్రాలుగా)వ్యాస సామ్యత కలిగిన నాల్గు వృత్తాలు కలవని భావన. ఇప్పటికి మధ్యవృత్తంతో కలిసి, మొత్తం అయిదు సమవృత్తాలు, నాల్గుదిక్కులఖండన బిందువుల కుండా మరోక వృత్తం. అనాల్గిటినీ వెలుపల స్మరిస్తున్న బాహ్యవృత్తంతో కలిసి అన్నీ

"సప్తాస్యానన్ పరిధయః త్రిస్సప్తః సమిధః కృతాః"

1) మూలాధార చక్రము, 2)స్వాధిష్ఠాన చక్రము, 3) మణిపూరక చక్రము, 4) అనాహత చక్రము, 5) విశుద్ధి చక్రము, 6) అజ్ఞా చక్రము, 7) సహస్రార చక్రము అని యీవిధంగా మానవ శరీరంలో ఏడు చక్రాలు - వరుసగా ఆసనస్థానములో మూలాధార చక్రము ఉంటుంది. కమలం వలె ఉంటుంది. దానికి (ఆకమలానికి) నాలుగు ఆకర్షక పత్రాలుంటాయి. దీనిలో కుండలినీ శక్తి 3 1/2 చుట్టలు చుట్టుకుని ఉంటుంది. ఈ చక్రం నిర్వాత స్థలం ఈ చక్రం పృధ్వి స్వభావం కలిగి ఉంటుంది. దీనికి అధిదైవతం బ్రహ్మ, దీన్ని పరిపాలించే శక్తి ఢాకిని దీనికి ఆధారమైన శబ్దం ఢాకిని!

రెండవది స్వాధిష్ఠాన చక్రం. ఇది ఆరురేకులు కల కమలం. దీని స్వభావం జల స్వభావం! ఇక్కడ అధిదైవతం విష్ణువు. పాలించే శక్తి ఢాకిని! దీనికి ఆధారమైన శబ్దం వం! జననేంద్రియాలుండే చోట ఈ చక్రం ఉంటుంది.

తరువాతి చక్రం మూడవది మణిపూరకం. నాభి (బొడ్డు) దగ్గర ఈ చక్రం పనిచేసే చోటు ఇది పదిరేకుల కమలం. అగ్ని దీని స్వభావం! అధిద్రవతం రుద్రుడు. ఇక్కడ పనిచేసే శక్తి లాకిని ఆధారమైన శబ్దం 'రం'!

ఆపైన నాలుగో చక్రం అనాహతం! ఇక్కడి కమలానికి పదిరేకులుంటాయి. దీనిది వాయుస్వభావం! అధిదైవతం "ఈశ" ఇక్కడ పనిచేసే శక్తి కాకిని! ఇది హృదయం (గుండె) స్థానంలో ఉంటుంది. ఆధారశబ్దం 'యం'. యోగానికి ఈస్థానం గుండెకాయవంటిది.

అయిదవది విశుద్ధి చక్రము! ఈ చక్రానికి పదహారు రేకులకమలం! దీని స్వభావం ఆకాశం!

అధి దైవతం సదాశివుడు. ఇక్కడ పనిచేసే శక్తి శాకిని! ఆధారమైన శబ్దం - 'హం' ఇది గొంతుదగ్గరుంటుంది.

ఆరవది అజ్ఞాచక్రం! కనుబొమలు రెండింటికీ నడుమ నుండే సుషుమ్నానాడి ఇదిపనిచేసే చోట ఈ చక్రం ఉంటుంది. ఇది రెండు రేకుల కమలం! అదిదైవతం శంభుడు! ఇక్కడ పనిచేసే శక్తి పేరు హాకిని! ఆధారమైన శబ్దం ప్రణవం (ఓంకారం) ఇది మనస్సునకు ప్రతీక!

ఏడవది చివరిది అన్నిటికీ పైన శిఖరాన ఉండేదీ తలపైని మాడు పట్టున ఉంటుంది! సహస్రారం! వెయ్యిరేకుల కమలం! ఇది పరమశివుని నివాసస్థానము! మూలాధారం (ఆసనస్థానము)లో బయలుదేరిన కుండలినీ శక్తి ఈ సహస్రారంలోని సదాశివుని కలియడమే 'యోగా' నికి గమ్యమైన పర్యవసానము! శివశక్తుల సమ్మేళనం జరిగినపుడు దివ్యామృతం ప్రసరిస్తుంది అత్యంత రమణీయమైన సంఘటన! యోగికి ఈ సమ్మేళనంజరిగితే ఆహారపానీయాలు అవసరంలేకుండా యోగి వెయ్యేండ్లయినా ఉండగలుగుతాడు.

మూలాధారం నుంచి పైకి ప్రయాణించే కుండలినీ శక్తి పై చక్రాలు ఒక్కొక్కదానినీ చేరినపుడు యోగసాధకునికి ఎన్నెన్నో ఏవేవో (మానవ) అతీతశక్తులు స్వాధీనమవుతాయి. వాటిలో దేనివైపూ తన దృష్టిని పోనీక, సహస్రారచక్రంలో శివశక్తుల మేళనం వేపే తన ఏకాగ్రతను దృఢం చేసుకోగలిగితే స్వాధీనమయేశక్తులు సర్వోన్నతంగా ఉంటాయి నాలుగు మార్గాలున్నాయి. ఈ యోగ సాధన శిఖరం సాధించడానికి దీర్ఘమైన మార్గం మూలాధారం నుంచి వెన్నెముకద్వారా పైకి పోయేమార్గం - దీర్ఘం ప్రకృత్యతీత శక్తులెన్నో స్వాధీనం అవుతాయి. అజ్ఞాచక్రం నుంచి సహస్రారచక్రం దాకా అన్ని మార్గాలలోను తక్కువ దూరం! మూడవది - అనాహతంనుంచి సహస్రారచక్రం చేరేది. మూలాధారం నుంచి సహస్రారానికి వెన్నెముక ద్వారా కాకుండా ముందరిచక్రాలద్వారా పైకిపోయే పయనం. మూలాధారంలో వెయ్యి సూర్యుల వెలుగు కనబడుతుంది యోగికి! సాహసం దయార్ద్రతా, ప్రేమా (వాత్సల్యమూ) వినయమూ నిరాడంబరతా అవలంబించే సాధకునికి అద్భుతాధ్యాత్మిక శక్తులు స్వాధీనం అవుతాయి! ఇలా స్వాధీనమైన శక్తులను సిద్ధులు అంటారు. వాటిని గూర్చి మరిచిపోయి యోగసాధకుడు ఆత్మాపరమాత్మల సంయోగాన్నే ధ్యానంలో ఉంచుకోవాలి

శ్రీవిద్య - శ్రీచక్రం !

శివ, శివాశక్తుల మేళనం కొందరు యోగులకు శ్రీవిద్యగా గోచరిస్తుంది విశ్వప్రకృతిరూపాన్ని క్షేత్ర గణిత ప్రతిరూపమైన శ్రీచక్రంగా దర్శించి కొందరు యోగులు పూజిస్తారు

ఎవరైనా సాధకుడు గురువు కావాలంటే కుండలినీ చైతన్యం పొందాలి దానినే శక్తి పాతం అంటారు అనగా శక్తి పాతం జరగాలి. ఇది జరుగక గురువులని చెప్పుకునే వారు కుహనాగురువులే

శక్తిపాతం జరగడం అంటే శక్తి ప్రవాహంగా ఆకాశం నుండి సహస్రార చక్రంలోకి దిగిరావడమే గంగ భూమికి దిగివచ్చినంత ఉధృతంగా ఉంటుంది. సాధకుడు దానిని భరించగల భగీరథుడు కావాలి. ఆశక్తి ఉధృతానికి శరీరంలోని సున్నితభాగాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది ఏ శక్తికైనా కొంతమదింపు అవసరం. దానిని నిబద్ధం చేయగల శక్తి గురువుది. గురువు ద్వారా శిష్యుడు శక్తిని పొందినప్పుడు అవసరమైనంత మేరకు విడుదల జరుగుతుంది. శిష్యునికి ఎలాంటి ప్రమాదం ఉండదు. ఎంతటి శక్తినైనా గురువు భరించగలడు శిష్యుని ఆర్తిని బట్టి, అర్హతను బట్టి అవసరమైనంత శక్తిని గురువు విడుదల చేస్తాడు.

130. అద్భుత ప్రాణిక (యౌగిక) చికిత్స

2001 ప్రాంతాన మా పెద్ద బాబు హేమచంద్రతో కలిసి విజయవాడలో మాస్టర్ విజయకృష్ణ అనే యోగాగురువు గారి దగ్గిరకి వెళ్ళేవాడినని ముందు వ్రాశాను. ఆ మాస్టర్ విజయకృష్ణ ఈ మధ్య అంటే 2008 సం॥ అక్టోబర్ 23వ తేదీన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటి ఆర్ట్స్ కాలేజీ ఫేకల్టీక్లబ్ కల్యాణమంటపంలో మా పెద్ద మనమడు తేజా పెళ్లి అవుతుండగా సాయంత్రం 6 గం॥ల వేళ అక్కడికి వచ్చి కల్యాణమండపంలో మా మనవడికి ఇవ్వవలసిన బహుమతులిచ్చి, అక్షతలు వేసి, ఆపక్క గదిలో డ్రెస్ మార్చుకుంటున్న నన్ను కలుసుకున్నాడు. మాస్టర్ విజయకృష్ణ తనయోగాగురువుగారైన ఫిలిపైన్ దేశస్తుడూ చైనా జాతీయుడు అయిన మాస్టర్ ఛోవాకోక్సుయీ అనే ప్రాణికిచికిత్స (ఏకాగిక) వైద్యుడు రచించిన అద్భుత (పాణిక్) చికిత్స అనే అద్భుత గ్రంథాన్ని నాకు బహుకరించివెళ్ళాడు.

ఈ డాక్టర్ చోవాకోక్సుయీ (తన) చాలా చిన్న వయస్సులోనే యోగాభ్యాస సాధనతో పరిచితులైనాడు మానసిక అవస్థలూ, మార్మికత, జీవిత ప్రాణతత్త్వం (చైనీస్ ప్రాచీన వ్యావృత్తులలో ఒకటి) వంటి విషయాలతో పరిచయం అయింది. యోగులతో, యౌగిక చికిత్సకులతో, క్లైయిర్ వోయింట్లతో (మానసిక తత్త్వవేత్తలతో) సంబంధాలు కలవాడు ఈ తత్త్వ వేత్తలూ తమ గురువులయిన (అధ్యాత్మికత్వములతో) దూరాత్మ సంబంధం ఏర్పరచుకున్నవారితో కత్తుకలిపిన వాడు. మీయులింగ్ అనే గురువుద్వారా చాల అద్భుతానుభవాలు పొందినవారు ప్రాణిక చికిత్స

ఏయే చిన్నపెద్ద వ్యాధిబాధలకు చికిత్స ఏవిధంగా చెయ్యాలో వివరించిన ఈ పుస్తకాన్ని తెరిచి పెట్టుకుని చూస్తూ ఆయా వ్యాధులకు చికిత్స ఇతరులకు తనకూ కూడా చేసుకోవచ్చని చెపుతాడు, మాస్టర్ ఛోవా కోక్ సుయి!

131. డా॥ వైజయంతి తో సంభాషణ

'నాది రజనీ కవిత్వం'

వేకువజామునే దినకరుని నునులేత కిరణాలు లోకాన్ని స్పృశిస్తుండగా, 'శ్రీసూర్యనారాయణా వేదపారాయణా' అంటూ ప్రత్యేక బాణీలో ఆకాశవాణి ద్వారా శ్రోతలను పలకరించిన వైతాళికుడు బాలాంత్రపు రజనీకాంతరావు ఆయనది విలక్షణమైన స్వరం సంగీతం ద్వారా భూగోళశాస్త్ర పాఠాన్ని వీనుల విందుగా వినిపించిన ప్రతిభామూర్తి ఆయన పిపీలికాదిబ్రహ్మ పర్యంతాలను తన సంగీత నైపుణ్యంతో జనసామాన్యానికి చేరువ చేసిన సంగీతమూర్తి. తండ్రి నుంచి సాహిత్యాన్ని ఒంటబట్టించుకుని, గురువు మందా కృష్ణమూర్తి గారి నుండి సంగీతాన్ని ఔపోసన పట్టిన సరస్వతీపుత్రులు. ఘంటసాల, బాలమురళి, భానుమతి, బాలసరస్వతి, చిట్టిబాబు (వీణ) వంటివారిలోని ప్రతిభను గుర్తించి ఆయా రంగాలకు పరిచయం చేసిన సహృదయుడు. రవీంద్రుని రచనలను, సంగీతాన్ని తెలుగువారికి పరిచయం చేశారు. తెలుగు సినిమాలకు సంగీత, సాహిత్యాలను సమకూర్చారు. ఎన్నో పురస్కారాలను పొందారు సుమారు ఏడు దశాబ్దాలుగా కళాసేవ చేస్తున్న రజనీ ఇటీవల తొంభైలో అడుగుపెట్టారు ఆయనతో సంభాషణ.

మీరు రాయడం ప్రారంభించిన రోజుల్లో అభ్యుదయ, దిగంబర, విప్లవ కవిత్వ ప్రక్రియలు వచ్చాయి. మీ రచనలు ఏ ప్రక్రియలో చేశారు.

నేను ఒక ప్రక్రియ అని ఎన్నుకోలేదు నాకు ఏది నచ్చితే అదే రాశాను. అందుకే నాది రజనీ కవిత్వం. ఏదో ఒకదానికి కట్టుబడిపోయి ఉండలేదు. నాకు నచ్చిన రీతిలో రాసుకున్నాను.

మీ మొట్టమొదటి రచన ఏది?

చండీదాసు, దానికి బెంగాలీ సంగీతం చేశాను. కథకు తగ్గట్టు సంగీతంకూర్చాలే కాని ఇది బెంగాలీనా మరోటా అని అనుకోకూడదు. అందులో రసం ప్రధానంగా ఉండాలి

'కొండనుండి కడలి దాకా'కి లభించిన జపాన్ అవార్డు గురించి..

జపాన్ రేడియో వారు 'పిల్లలకి జాగ్రఫీ ఎలా బోధించాలి?' అనే అంశంపై పోటీ పెట్టారు. అందులో అన్ని ఆకాశవాణి కేంద్రాల వారు పాల్గొనాలి నేను నదీ ప్రవాహం అంశంగా తీసుకున్నాను. గోదావరి పుట్టుక నుంచి అది సముద్రంలో కలిసే వరకు ప్రవహించే మార్గాన్ని, పరిసరాలనూ స్పృశిస్తూ ఒక రూపకం చేశాను. పిల్లలు గోదావరి నది దగ్గరికి వెళ్లి అందులో తొంగి చూసి 'నువ్వు మా అమ్మవి' అంటారు అప్పుడు 'ఉప్పొంగిపోయింది గోదావరి' అంటూ బాపిబావ పాటను వాడాను అలాగే విశ్వనాథ కిన్నెరసాని పాటలు, ఇంకా 'పాపికొండల నడుమ నేను' లాంటి పాటలతో ఈ రూపకం తయారు చేశాను. దానికి ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. పారితోషికంగా 30వేల 'యెన్స్' (జపాన్ కరెన్సీ) ఇచ్చారు. ఆ డబ్బంతా ఆ రూపకంలో నటించిన వారందరికీ వారి వారి పాత్రలను బట్టి పంచాను నేను సింహభాగం తీసుకున్నాను అది చూసి కవిసామ్రాట్ ఇలా ఎవ్వరూ ఇవ్వరు. మీరు ఇచ్చారు. మావి ఉపయోగించుకున్నందుకు గాను నిజానికి మాకు ఇవ్వక్కర్లేదు. అని కళ్లనీళ్లు పెట్టుకుని నన్ను అభినందించారు.

మీకు మరపురాని ఓ సంఘటనను చెప్తారా?

ఆ అవార్డు వచ్చిన సంగతి తెలిసిన రోజును నేను ఎప్పటికీ మర్చిపోలేను ఆ రోజు పొద్దున్నే ఐదు గంటలకి నాన్నగారు గతించారు. ఆయనను వరండాలో పడుకోబెట్టాం. ఉత్తరక్రియలన్నీ పూర్తయ్యాయి. ఇంతలో ఆఫీస్ నుంచి ట్రంకాల్ వచ్చింది. 'మీకో శుభవార్త, అంతర్జాతీయ అవార్డు లభించింది' అని. వినీవినగానే నాన్నగారికి చెప్పాలని ఒక్క ఉదుటున లేచాను. అప్పుడు కాని స్ఫురించలేదు.. నేనుచెప్పినా వినడానికి నాన్నలేరన్న వాస్తవం నాన్నగారు వరండాలోనే ఉన్నారన్న భావన నాలో అంతలా జీర్ణించుకుపోయింది. అయ్యో ఇదేమిటి ఇలా పొరబడ్డాను అనుకున్నాను. చాలా బాధపడ్డాను నాకు ఇంతటి పురస్కారం లభిస్తుంటే దానిని విని సంతోషించే నాన్నగారు లేకపోవడం మనసును బాగా కలచివేసింది.

'ఆదికావ్యావతరణం' స్వరచిత్రం చేసినప్పటి అనుభవాలేమిటి?

"మానిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితమ్" అని వాల్మీకి రామాయణంలోని మొదటి శ్లోకంలో ఉన్న సంగతి గుర్తించాను ఆ అక్షరాల్లోనే స్వర్వాలున్నాయని గమనించి, స్వరాల ప్రకారం పెడితే ఉచ్చారణ సరిగ్గా రాగలదని సరియైన స్వరాలను ఊహించి పలికించాను. ఆయన మాత్రమే ఇలా పలకగలరు పదాలలో సంగీతం ఉందని మొట్టమొదట నేనే చెప్పాను క్రౌంచమిథునాలకి సంబంధించిన రిహార్సల్స్

వాద్యగోష్టితో కలిపి చెట్టుకింద చేయడం ప్రారంభించాం. రాత్రిదాకా బాగా ప్రాక్టీస్ చేశాం. ఎస్.సి.వి. కృష్ణమాచారి చేత వయొలిన్ మీద మా...సా . అంటూ స్వరాలలో పక్షుల శబ్దాలను పలికించే ప్రయత్నం చేస్తున్నాను సరిగ్గా ఆ సమయానికి చెట్టుమీది పక్షులన్నీ మేం చెప్పినట్టుగా శబ్దాలు చెయ్యడం ప్రారంభించాయి అందరికీ ఒళ్లు పులకరించింది. వారంతా నాకు నమస్కారం చెయ్యబోయారు. నేను ఆ పరబ్రహ్మకి నమస్కరించమన్నాను.

ఇది ప్రధానంగా పాశ్చాత్య పోకడ కదా? దీనిని కర్ణాటక సంగీతానికి ఎలా తీసుకువచ్చారు?

పాశ్చాత్యులకు స్వరాలు పలక్కుండా వాయిద్యాలని బట్టి మ్యూజిక్ ఉంది సెరనాడ్ అని ఓ వాద్య సంగీత రచన ఉంది. స్త్రీ పురుషులు ప్రేమలో ఓలలాడేలా చేస్తుంది. అలాంటివి ఉన్నాయే తప్ప వారికి మనలాగ అక్షరాలలో సంగీతం లేదు.

రేడియో గురించి మీ అనుభవాలు...

రేడియో డైరెక్టరుగా నాకు వచ్చిన అవకాశం దేవుడు ఇచ్చిన వరంగా భావించాను. ప్రసారమాధ్యమాలలో రేడియోకి ప్రత్యేకత తీసుకొచ్చాను. కృష్ణశాస్త్రి చేత రేడియో కోసం చాలా రాయించాను సంస్కృతపాఠం, వోలేటి చేత సంగీతశిక్షణ, ఇంకా ఈ మాసపు .... కార్యక్రమాలు భక్తిరంజని... ఇలాంటివెన్నో ప్రఖ్యాతి చెందడానికి దోహదపడ్డాను. ఉషశ్రీ ధర్మసందేహాల కార్యక్రమం ఎంత ప్రసిద్ధి చెందిందో అందరికీ తెలిసిందే. నా దగ్గర పనిచేసే వాళ్ల నుంచి నేను ఎంత రాబట్టుకోగలనో అంతా రా బట్టాను. వారికి అవార్డులు వస్తే సంబరపడ్డాను

'ఏకాంతసేవ' గురించి చెప్పండి.

ఏకాంతసేవను ఇంగ్లీషులోకి 'ఎలోన్ విత్ ద స్పౌస్ డివైన్' అని రాశాను ఆ పేరు చూసి శ్రీనివాస అయ్యంగార్ 'నువ్వు పెట్టిన పేరులోనే మూలం కంటే ఎంతో పవిత్రత ఉంది' అని అభినందించారు.

మీ ఇతర రచనల గురించి చెప్పండి

చతుర్వాణి అని ఏకాంకికలు రాశాను. అందునా ఏకనట ఏకాంకికలు ఇవి తెలుగులో, ఇంగ్లీషులో రాశాను కాని తెలుగులో మాత్రమే అచ్చు వేశాను. ఇంకా ఆంధ్రవాగ్గేయకార చరిత్ర, విశ్వవీణ, శతపత్ర సుందరి, క్షేత్రయ్య, రామదాసు (బయోగ్రఫీలు), జేజిమావయ్యపాటలు (పిల్లలకి), మువ్వగోపాలపదావళి (క్షేత్రయ్యపదాలను ఆంగ్లంలోకి తర్జుమా చేశారు), త్యాగరాజ, ఏటికి ఎదురీత, అన్నమయ్య పదాల మీద...

సంగీతరూపకాల గురించి ....

ఎన్ని చేశానో జ్ఞాపకం లేదు చివరివి రెండూ చెప్తాను ఒకటి సంగీత గంగోత్రి (సంగీతం ఎలా పుట్టింది), హాల శాతవాహన (హాలుని కథ).

మీరు చేసిన రాగాల గురించిన వివరాలు ...

దేవసాలగం చేశాను కొంచెం కనకాంగిలాగ ఉంటుంది. మూర్ఛన సరిగమపదపదనీధా పామగారీసా వలచివచ్చితి నేను వానికి గాను / చెలదమ్మి కన్నులవాడు చేతిపిల్లగ్రోవివాడు మందల పశువుల వాడు మకరాంకములవాడు / ఎందున్నాడో చెప్పరే ఏల రాదమ్మా అంటూ సాగుతుంది.

దేశవరాళి రాగం గురించి...

దేశాళి అనే రాగంలో అన్నమయ్య సుమారు రెండు వందల సంకీర్తనలు చేశాడు నేను దేశవరాళిలో చేశాను ఇవి రెండూ ఒకేలా ఉన్నాయని నల్లాన్‌చక్రవర్తుల కృష్ణమాచారి అన్నారు దీని మూర్ఛన ''పదసా నిసగరిసా నమాగరిసా సానీదాపా గారీసా'' కులుకక నడవరో కొమ్మలారా

అన్నమాచార్య గురించి నాలుగు మాటలు చెప్పండి

అన్నమయ్య ఎన్నో సంకీర్తనలు రాశాడు. ఆయనకి హ్యూమర్ ఎక్కువ కిష్టయ్య గోపికలకి ఓ ఫ్లయింగ్ కిస్ ఇచ్చాడట దాని గురించి అన్నమయ్య ''మోవుల చివురుల చిమ్ముల వేదము ఆవుల మందల ఆవేదము'' (వరాళి రాగంలో) అని రాశాడు. ఆయనంత మానవభాష రాసిన వాడు ఇంకెవరూ లేరు నేను అన్నమయ్య కీర్తనలు అరవై దాకా చేశాను గరుడ ధ్వని రాగంలో కూడా చేశాను. దేశకాల పరిస్థితులను బట్టి కవి మారతాడు అలాగే అన్ని సోషల్ ఎలిమెంట్స్‌ను జోడించి మోడర్న్‌లో అతి మోడర్న్‌గా రచించాడు అన్నమయ్య.

132. విశిష్టమైన రచనలు, సభలు, నృత్యగేయనాటికల ప్రదర్శనలు

1 పిల్లలకు వసంతోత్సవం ఆంధ్రమహిళాసభ (ఆంధ్ర మహా సభ స్త్రీల శాఖ)

2. సుభద్రార్జునీయం - కణ్ణన్ రంగనాయకి

3. మేనకావిశ్వామిత్ర - కులకర్ణి శ్రీనివాస్

4. గాంధిహిల్‌పై గాంధీజీ జీవితంపై (మద్రాసులో రికార్డు చేసిన రూపకం) విజయవాడలో ధ్వని ప్రకాశిక (Light and Sound) ప్రదర్శన (కె.ఎల్.రావు)

5 ఆంధ్ర మహిళాసభ మధురానగరీగాథ - వెంపటి పెదసత్యం రచన - సంగీతం రజని

6 పద్మావతీచరణ చారణ చక్రవర్తి కర్ణియాంగ్‌లో జయదేవుని అష్టపదులతో కూర్చిన నాటకం

7. ఆంధ్ర మహిళాసభ.

8. కుచేలోపాఖ్యానం - జాతీయ కార్యక్రమం స్వాతి తిరునాళ్ మహారాజు రచించినది సంస్కృత ఒపేరా, రజని సంగీతంతో తిరువేంద్రం నుంచి ప్రొడక్షనూ ప్రసారమూ, అన్ని స్టేషన్లూ రిలే చేశాయి.

9 క్షీరసాగరమథనం - రాఘవయ్య, చిన్నసత్యం, పెదసత్యంలతో సహా కూచిపూడి ప్రసిద్ధ నర్తకులంతా పాల్గొన్నది.

10. విప్రనారాయణ - శోభానాయుడు బృందం

11. కల్యాణ శ్రీనివాసం - యక్షగానం. (Dance Drama)

12 శ్రీకృష్ణ శరణం మమ - భగవద్గీత, కృష్ణరాయబారం

13. మహిషాసురమర్దని - శోభానాయుడు.

133. సత్కారాలు - పురస్కారాలు

1. 13 5 1998 . విజ్ఞాన భారతి పురస్కారం (నగదు బహుమతి) 'నాదవిద్యానిధి' బిరుదు శ్రీనేదునూరి ద్వారా అందుకోవడం జరిగింది.

2. 7-1-2001 : అ.జో.వి.భో. (అప్పా జోస్యుల, విష్ణు భొట్ల ఫౌండేషన్) పురస్కారం భీమవరం సమ్యక్ జీవిత పురస్కారం రూ. 75,000/- ల నగదు అవార్డు.

3. 3 2 2002 · యగళ్ళ రామకృష్ణ స్మృతి పురస్కారం. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంలో జరిగింది.

4. 6-4-2002 . ద్వా.నా శాస్త్రి అధ్యక్షతన సి.నా.రె. ముఖ్య అతథిగా వచ్చిన సభ. రజనికి సత్కారం (లలిత సంగీత సేవకు).

5. 28 8 2002 . విశాఖపట్నం ద్వారకానగర్‌లో యద్దనపూడి అయ్యన్న పంతులు శ్రీకాకుళం అంగుళీయకమూ, శ్రీచక్ర చిత్రపటమూ ప్రదానం. శ్రీమహాకామేశ్వరీ పురస్కారం. శ్రీ జగద్గురు కల్యాణానంద భారతీస్వామి ప్రతిభాపురస్కారం.

6. 1 9 2002 · తుమ్మపూడి సంజీవదేవ్ పురస్కారం. సిద్ధార్థ ఆడిటోరియం (విజయవాడ) రజనికి రూ. 5,000/- లు నగదు బహుమతి.

7. 29 11 2002 : ఆచార్య గంగప్ప పురస్కార బహుమతి గుంటూరు నగదు బహుమతి రూ 2,500/- లు.

8. 2 5 2003 . శ్రీలక్ష్మీసర్వరాయ సాహితీ పురస్కారం "రజని"కి కపిలేశ్వరపురం (తూ గో జిల్లా) నగదు బహుమతి రూ. 10,000/- (మాజీ మంత్రి శ్రీ పట్టాభిరామ రావుగారి తల్లి శ్రీమతి లక్ష్మీదేవి సర్వారాయుడు పేర పురస్కారం).

9. 5-9-2004 : విశాఖలో త్యాగరాజ ఆరాధనోత్సవ సభలో పురస్కారం త్యాగయ్య పంచరత్నాలకు వ్యాఖ్యానం చేశాడు రజని. రూ. 5,000/- నగదు బహుమాన ప్రదానం

10. 12-9-2004 : సహృదయ సాహితీమూర్తి కీ॥శే॥ దుగ్గిరాల అనంత లక్ష్మీనారాయణమూర్తి స్మారకసమితి పురస్కారం.



11 18 4-2005 . శ్రీరామనవమి పురస్కారం టివోలీ గార్డెన్స్‌లో జరిగినది. సద్గురు శ్రీ శివానందమూర్తిగారి (భీమిలి) సమక్షంలో జరిగిన సత్కార సభ పారితోషికం రూ 10,000/ లు.

12 24-12-2005 లో జంధ్యాల దక్షిణామూర్తి పురస్కారం. ఆకాశవాణి ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసిన 'సిడి' విడుదల సభ. రజనీ, వెంకోబ్‌లు పాడిన గేయాల లలిత సంగీతం విడుదల ద్వారా ఆవిష్కరణ జరిగింది.

13. 13 2-2006 "ఆంధ్ర చతుర్వాణి" ఆవిష్కరణ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ముఖ్య అతిధులుగా ఆచార్యపరిమి రామనరసింహ, ఆచార్య బేతవోలు రామ బ్రహ్మంగార్లు

14 17-2-2006 "డిస్కవరీ ఆఫ్ ఘంటసాలపై రజని సభ. ఘంటసాల ప్రాంగణం. ఘంటసాలను డిస్కవర్ చేసి రేడియో ఆఫీసరుగా మంచి రిపోర్టు ఇచ్చినందుకు రజనిని గౌరవించారు.

15. 18-2 2006 · వోలేటి ఉగాది రిలీజ్ సెలక్షన్ శ్రీ పి.ఆర్. రామ చంద్రరావు అధ్యక్షుడు శ్రీ జి.ఎస్.ఎస్. రాఘవన్ ముఖ్యవక్త.

16. 1-4-2006 : లలిత సంగీత సత్కారం రవీంద్ర భారతిలో జరిగింది. 6-4 2006 యువకళాసమితి పురస్కారం ప్రముఖ కళాకారులతో పాటు 'రజని' సంగీతానికి పురస్కారం రవీంద్రభారతిలో

17. 23 4 2006 సర్వార్థ సంక్షేమ సమితి. విశ్వయోగి శివానందుల సమక్షంలో "గాంధర్వ సార్వభౌమ" బిరుదిచ్చారు రజనికి.

18. 11-6-2006 . త్యాగరాజగాన సభలో రజనికి మాజీమంత్రి అయ్యపరెడ్డి అధ్యక్షతన సత్కారం జరిగింది.

19. 23-9-2006 : లలిత సంగీత పురస్కారం "రజనికి" అప్పాజోస్యుల విష్ణు భట్ల ఫౌండేషన్, అమెరికా వారిచే.

20. 11-10-2006 : సాలూరి రాజేశ్వరరావు పురస్కారం రాజ్ అండ్ కోటిల ఆధ్వర్యంలో సభ జరిగింది. నగదు అవార్డు : రూ. 1,116/- లు



21. 19-3-2007 : హంస జ్ఞాపికతో సత్కారం. కళారత్న హంస అవార్డు ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి అందజేసారు. రూ. 30,000/- లు నగదు అవార్డు మరియు "సైటేషన్".

22. గురుదేవులు విశ్వకవి శ్రీ రవీంద్ర నాథ్ ఠాగూర్ 150 వ జన్మదిన సందర్భంగా సంగీతనాటక అకాడమీ, నేషనల్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్, డ్యాన్స్ అండ్ డ్రామా, ది ఎపెక్స్ బాడీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ కలసి కేంద్ర ఆర్థిక, సాంస్కృతిక శాఖల అమాత్యులు శ్రీ ప్రణవ్ ముఖర్జీ గారి ఆధ్వర్యవంలో ఏర్పడి కమిటీ అంగీకారముతో దేశంలో 75 సం॥లు దాటిన ఉత్తమోత్తములైన ఒక యాభై మంది కళాకారులకు ఠాగూర్ అకాడమీ రత్న (3 లక్షల రూపాయలు) మరొక యాభై మంది కళాకారులకు ఠాగూర్ అకాడమీ పురస్కార్ (ఒక లక్ష రూపాయలు) ఇచ్చి సమ్మానించుటకు నిర్ణయించారు. ఆ సమ్మానితులలో డా॥ బాలాంత్రపు రజనీ కాంతరావు గారితో మొదలయి ఆరుగురు ఆంధ్రులు ఠాగూర్ అకాడమీ రత్న గ్రహీతలుండడం, మరొక ఐదుగురు ఆంధ్రులు ఠాగూర్ అకాడమీ పురస్కార్ గ్రహీతలవడం మనందరికీ గర్వకారణం

అపూర్వ సన్నివేశములు



తిరుమల తిరుపతి దేవస్థానం కళాపీఠం డైరక్టర్‌గా డా॥ మర్రిచెన్నారెడ్డిగార్ని ఆహ్వానిస్తున్న రజని



శ్రీమతి సుభద్ర, డా॥ రజని, శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు చివరన పి.ఎం.జి

తిరుపతి కళాపీఠం డైరక్టర్‌గా డా॥ చెన్నారెడ్డితో



1953 లో గేయసంపుటి శతపత్ర సుందరికి బహుమతి ప్రధానం. ఉన్నవ, అయ్యదేవర, గాడిచెర్ల సమక్షంలో రెండవవరుసలో ఎడమ నుండి రెండవవారు రజని

1953 లో శతపత్ర సుందరి రచనకు జరిగిన అభినందన సభలో ప్రసంగిస్తున్నది రజని.
కూర్చున్నవారు ఎడమనుండి శ్రీ మోటూరి సత్యనారాయణగారు, డా॥ గోపాలరెడ్డి గారు,
శ్రీ ఎస్. బి.పి. పట్టాభి రామారావు గారు, వెనుక శ్రీ గిడుగు సీతాపతి గారు.



"డాక్టర్" అక్కినేని, డాక్టర్ రజనికాంతరావుకు 1986లో అవార్డు అందిస్తున్న దృశ్యం
ఫోటోలో ఎడమ మొదట శ్రీ వంశీ రామరాజు

రజని, ఆచార్య ఎ. సీతారామయ్యగారు (కన్నడ రచయిత),
డా॥ విరుదురాజురామరాజుగార్లు (బెంగళూరు)

కేంద్రప్రభుత్వ ప్రసార శాఖామంత్రి గుజ్రాల్ నుండి విజయవాడ ఆకాశవాణి అవార్డు స్వీకరిస్తూ
డా॥ రజని (1974)

తిరుపతిలో అప్పటి మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గారితో రజని

రజని. ఫిల్మ్ డైరక్టర్ విశ్వనాథ్

బంధువర్గంతో మా వదినా, అన్నయ్య, హన్మంతరావు అన్నయ్యా (రెండో పెత్తల్లి కొడుకు) అతని భార్యా (మా వదిన), నేను మా ఆవిడా

అవధానం సీతారామన్ మరియు రజని

మా బంధువర్గం (కుడినుండి) మల్యాల శివరామకృష్ణ, మా చిన్నపెత్తల్లి కుమారుడు రేలంగి హనుమంతరావు, అన్నయ్య నళినీ, దుగ్గిరాల లక్ష్మీనారాయణ మూర్తి

వీణధనం మనమరాలు ప్రఖ్యాతనర్తకి బాలసరస్వతీ దేవితో (తిరుపతిలో ఫోటో)

ఎడమనుండి 2వ వారు శ్రీమతి శోభానాయుడు, చివర డా॥ రజని

బెంగళూరు ఏ.ఐ.ఆర్. స్టేషన్ డైరెక్టర్‌గా జనతా ప్రభుత్వంలో ప్రసారం శాఖ మంత్రి
శ్రీ లీలాకృష్ణ అద్వానీ విచ్చేసిన సందర్భంలో వారిని స్వాగతిస్తూ రజని

'రజనీ' కాంతులు

సహస్ర చంద్రదర్శన సౌభాగ్య సంపన్నులు, కళాప్రపూర్ణులు అయిన డాక్టర్ బాలాంత్రపు రజనీ కాంతరావుగారు ఆంధ్ర సరస్వతికి 'ఏకాంతసేవ'లందించిన జంటకవులు వేంకట పార్వతీశ్వరకవులలో ఒకరైన శ్రీ వేంకటరావుగారి కుమారులు. కవికుమారులైన వీరు జంటకవులు నిర్మించిన కవితాకుటీరంలో భావయిత్రి, కారయిత్రి, సాధయిత్రి శక్తులను ఉపాసించి సంగీత సాహిత్య నాట్య విద్యా కోవిదులయ్యారు. తామునేర్చిన విద్యలన్నింటినీ వినియోగించే సావకాశంగల 'ఆకాశవాణి' కార్యక్రమనిర్వహణ దీక్షా దక్షులయ్యారు.

తమ గీతాలతో, సంగీతంతో పిపీలికాదిబ్రహ్మ పర్యంతం ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కలిగించారు. పదకవితా పితామహుడైన అన్నమాచార్యుల కీర్తనలకు బాణీలుకూర్చిన వాణీ పుత్రులు. ఆకాశవాణిద్వారా ప్రతినిత్యం ప్రభాతవేళలో ఆ కీర్తనలకు ప్రసారప్రచార భాగ్యం కలిగించారు. అన్నమయ్య రాగస్వరూపాలేకాదు అనురాగ స్వరాలను కూడా రమణీయంగా ఆవిష్కరించిన పుంభావ సరస్వతులు.

'నాదీస్వతంత్రదేశం', అనీ, ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారతమునుదయమ్మాయెనోహో! అనీ - గుండెగొంతులోంచి భారతదేశస్వాతంత్ర్యోదయ శుభక్షణాల్లో ప్రసారంచేసిన దేశభక్తి ప్రపూరితులు.

కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందినవీరి 'ఆంధ్రవాగ్గేయకార చరిత్ర' గ్రంథం నేటికీ పరిశోధకులకు పెట్టుబడి పెడుతూనే ఉంది. శతపత్రసుందరిగేయాలూ, విశ్వవీణ రూపకాలూ, బేబిమామయ్యపాటలూ (బాలలకోసం) మువ్వగోపాలపదావళి మొదలైన గ్రంథాలు ఆంధ్రసరస్వతికి వీరు అర్పించిన అక్షర నీరాజనాలు.

సంగీతసాహిత్య నృత్య **'క్షీరసాగరమథనం'** చేసి వీరు యక్షగాన ప్రక్రియకు ఆకాశవాణిలో ప్రాణప్రతిష్ఠ చేసారు. **'ఆంధ్రికల్యాణి'** రాగాన్ని పరిశోధించిన నాదవిద్యానిధి. ఓహోహోహో! పావురమా! అంటూ పాశ్చాత్యసంగీత పద్ధతిని సినీ సంగీతంలో ప్రవేశపెట్టిన నవీన వాగ్గేయ కారులు.

'కొండనుండి కడలిదాకా' అనే గేయరూపకంలో గోదావరీ నదీమతల్లి గలగలతో జపాన్ దేశపు రేడియో పురస్కారాన్నీ ప్రసారాన్నీ సాధించిన 'గాంధర్వ సార్వభౌములు'.

విద్వత్కవితావేశంతో పోతనగారి నృసింహ ఆవిర్భావాన్ని స్తంభోద్భవగద్యను గానం చేసిన శబ్ద బ్రహ్మోపాసకులు.

మూడు పుష్కరాలకాలం ఆకాశవాణికి వివిధ వినూత్న కార్యక్రమాలు రూపొందించిన కళాస్రష్టలు. ఆకాశవాణిలో భక్తిరంజని కార్యక్రమం 'భక్తరంజని' దే. లలిత సంగీతం, గేయరూపకాలూ వీరి స్వోపజ్ఞాలే.

దేశ విదేశ పురస్కారాలెన్నెన్నో వీరి ప్రతిభామూర్తిని వరించి తరించాయి.

'బాలాలీలా వినోదిని' బాలాదేవి ఇంటిపేరై, షోడశ కళాప్రపూర్ణుడు చంద్రుని పేరింటివారై సంగీత సాహిత్యనృత్య కళా సరసచంద్రికలతో దశదిశావిశ్రాంతయశులైన డా. బాలాంత్రపురజనీ కాంతరావుగారి **'ఆత్మకథావిభావరి'** ఈ నందన నామవత్సర ఉగాది కానుకగా అందుకుంటున్న ఆంధ్రజాతి గర్విస్తున్నది.

విశేషించి విశాఖ పట్టణం ఈ గ్రంథావిష్కరణమహోత్సవాన్ని జరుపుకునే అదృష్టం దక్కినందుకు నందననామ సంవత్సరాన్ని ఆనందనందనంగా భావించి పులకరిస్తున్నది.

ఈ ఉత్తమవాగ్గేయకారుని కవితలలోని

"పసిడి మెరుంగుల తళతళలు

పసిమి వెలుంగుల మిలమిలలు"

ఆ చంద్రతారార్కంగా ఆంధ్రులపై సద్భావనా చంద్రికలు కురిపించుగాక!

శుభమ్

ఫోన్ 2735878